
# అమరజీవి

(పొట్టి శ్రీరాములు జీవిత చరిత్ర)



డా. బాదం శ్రీరాములు



## డాక్టర్ బాదం శ్రీరాములు

ఎం.ఎ., పిహెచ్.డి.

నెల్లూరు జిల్లా కనిగిరి తాలూకాలోని ఉమ్మనిపల్లెలో జన్మించిన వీరి తల్లిదండ్రులు శ్రీమతి సుబ్బమ్మ, కోటయ్యగార్లు, గుంటూరు జిల్లా సత్తెనపల్లి, నరసరావుపేటలో డిగ్రీ స్థాయి వరకు విద్యాభ్యాసం పూర్తి చేసి 1960లో నాగపూర్ నుండి ప్రభుత్వపాలనా శాస్త్రంలో మొదటి ఎం.ఎ. డిగ్రీ పొందారు. 1969లో ఆంధ్ర యూనివర్శిటి నుండి రాజనీతి శాస్త్రం పాఠ్యాంశంగా రెండవ ఎం.ఎ. పూర్తి చేసి ప్రథమశ్రేణి పొంది యూనివర్శిటీలో ప్రథములుగా నిలిచారు. 1983లో కర్ణాటక యూనివర్శిటీ, ధారవడ నుండి "పొట్టి శ్రీరాములు సాంఘిక ఆర్థిక కార్యక్రమాలు" అను గ్రంధానికి పిహెచ్.డి. పట్టాను పొందారు.

బి.ఏ. రాజనీతి శాస్త్ర విద్యార్థులకు అనేక గ్రంధాలు రచించారు. రాజనీతి శాస్త్రము, ప్రభుత్వ పాలనా శాస్త్రము, ఆధునిక ప్రభుత్వాలు, అంతర్జాతీయ సంబంధాలు, రాజనీతితత్వ విచారము, ఆధునిక భారత రాజకీయాలు వీరి రచనలలో ప్రధానమైనవి.

వీరి పిహెచ్. డి. థీసిస్ భారత ప్రభుత్వ ఆమోదంపొంది బొంబాయిలోని హిమాలయా పబ్లిషర్స్ ఆంగ్లంలో ముద్రించబడి భారత దేశంలోని అన్ని యూనివర్శిటీల, కళాశాల లైబ్రరీలను అలంకరించింది. రాష్ట్ర వైశ్య సంస్థల సమాఖ్య వంటి ఎన్నో సేవా సంస్థలనుండి సన్మానం పొందారు. ప్రఖ్యాత దిన వార పత్రికలకు ఎన్నో వ్యాసాలు వ్రాశారు.

30 సంవత్సరాలు వీరు మార్కాపురం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి కళాశాలలో రాజనీతి శాస్త్ర శాఖాధ్యక్షులుగా పని చేశారు.

# అమరజీవి



(పొట్టి శ్రీరాములు జీవిత చరిత్ర)


మూలము / రచన

**డా. బాదం శ్రీరాములు,** ఎం.ఏ., పిహెచ్.డి.





Published by

**CA BV Prasad**

S/o. Late **Dr. Badam Sriramulu**

# Amarajeevi

(Potti Sriramulu Jeevitha Charitra)

Author : **Dr. Badam Sriramulu**
Copy Right © Dr. Badam Sriramulu

Publication of Thesis : 1983
First Edition : 1992 - 1000
Second Edition : 2011 - 1000
Third Edition : 2025 -1000

Price : ₹ 90/-

Typing & Layout Design
R. Bhagya Laxmi, +91 9542247373

Published by :
**CA BV Prasad**
S/o Late **Dr. Badam Sriramulu**
Address: Lily 305, Nectar Gardens,
Madhapur, Hyderabad - 500 081,
Telangana State, India
Phone: +91-98665 93535
Email: prasadbadam@yahoo.com

For Copies :
**abhaya FOUNDATION**
Mobile: 9963002727

Printed at :
Dolphin Graphics
IDA, Uppal, Hyderabad - 500 039, TG
dolphingraphicsads@gmail.com, Ph: 8106988009



## ఇద్దరు శ్రీరాములు గార్ల మధ్య ఉన్న ఆత్మీయ బంధం, కేవలం పేర్ల సారూప్యత మాత్రమే కాకుండా, ఒక గొప్ప స్ఫూర్తిని ప్రతిబింబిస్తుంది

మహానుభావులు, అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు గారి పేరు తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోవడానికి ప్రధాన కారణం ఆయన త్యాగం, తెలుగు భాషకు, మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నిర్మాణానికి చేసిన అపార సేవ.

సత్యాగ్రహం, అహింస, మరియు త్యాగం వంటి గాంధేయ సిద్ధాంతాలను అనుసరించి, తన జీవితాన్ని తెలుగు ప్రజల శ్రేయస్సు కోసం అర్పించిన మహానుభావుడు పొట్టి శ్రీరాములు గారు.

ఆయన ఆంధ్ర ప్రజల ఆకాంక్షలకు జీవం పోసే ప్రయత్నంలో భాగంగా, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టడం, ఆ దీక్షను కేవలం వ్యక్తిగత స్థాయిలో కాకుండా, సామాజిక దృక్పథంతో కొనసాగించడం, మనకందరికీ స్ఫూర్తిదాయకం. ఆయన దీక్షలో తన ప్రాణాలను త్యాగం చేయడం ద్వారా, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం సాధించడంలో ఒక కీలక ఘట్టానికి ముద్రవేశారు.

ఈ పుస్తక రచనలో ప్రత్యేక ప్రస్తావనకు పాత్రులు కీ॥ శే॥ డా. బాదం శ్రీరాములు గారు. పొట్టి శ్రీరాములు గారి జీవితం, పోరాటం, మరియు త్యాగాన్ని లోతుగా పరిశీలించి మరియు పరిశోధించి, ఆ మహనీయుడి చరిత్రను వెలుగులోకి తేవడం వారు చేసిన అపూర్వ కృషి. ఇది కేవలం ఒక రచనా ప్రయత్నం మాత్రమే కాదు, కృతజ్ఞతతో కూడిన గౌరవ నివేదిక. ఈ ఇద్దరు శ్రీరాములు గార్ల మధ్య ఉన్న ఆత్మీయ బంధం, కేవలం పేర్ల సారూప్యత మాత్రమే కాకుండా, ఒక గొప్ప స్ఫూర్తిని ప్రతిబింబిస్తుంది.

అదే విధంగా, డా. బాదం శ్రీరాములు గారి కుమారులైన డా. బాదం రమేష్ బాబు గారు మరియు CA బాదం వెంకట ప్రసాద్ గారు ఈ పుస్తకాన్ని ప్రచురించడం, తండ్రి పట్ల కుమారుల ప్రేమను, గౌరవాన్ని, మరియు ఆత్మీయతను గుర్తుచేస్తుంది. తండ్రి త్యాగం, కృషి, మరియు స్ఫూర్తిని తదనంతర తరాలకు అందించాలన్న వారి సంకల్పం ఎంతో ప్రశంసనీయం. ఈ చర్య కుటుంబపు బంధాలను మాత్రమే కాకుండా, సమాజం పట్ల వారి బాధ్యతను కూడా ప్రతిబింబిస్తుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము శ్రీ పొట్టి శ్రీరాములు గారి త్యాగాన్ని గుర్తించి, ప్రత్యేకించి యువతలో ఆయన యొక్క గొప్పతనంపై అవగాహన పెంపొందించాలి. ఆయన స్ఫూర్తిదాయక జీవితాన్ని పాఠ్యాంశంగా పాఠశాల మరియు కళాశాలల పాఠ్యపుస్తకాల్లో చేర్చడమేగాక, ఆయన పేరు మీద పురస్కారాలను ఏర్పాటు చేసి, ప్రతి సంవత్సరం సమాజానికి సేవ చేసిన మహనీయులను గౌరవించడం వంటివి చేయాలి. ఇది యువతలో దేశభక్తిని, సమాజ సేవను, మరియు భాషా గౌరవాన్ని పెంపొందించడానికి దోహద పడుతుందని నేను ఆశిస్తున్నాను.

అమరజీవి పొట్టి శ్రీరాములు గారి జీవితం, కృషి, మరియు త్యాగం మనకెంతో గొప్ప ఆదర్శం. ఆయన వ్యక్తిత్వం, తెలుగువారికి గర్వకారణం మాత్రమే కాకుండా, భవిష్యత్ తరాలకూ ఒక మార్గదర్శకంగా నిలుస్తుంది. ప్రజాస్వామ్య విలువలు, భాషా గౌరవం, మరియు సమాజ సేవకు ఆయన చూపిన అంకితభావం తెలుగు ప్రజలకే కాదు, యావత్ భారతదేశానికి గర్వకారణం.

ఈ పుస్తకం ద్వారా పొట్టి శ్రీరాములు గారి జీవితం, కృషి, మరియు త్యాగం గురించి తెలుసుకోవడం మనందరికీ ఒక ఆధ్యాత్మిక ప్రయాణం అవుతుందని ఆశిస్తున్నాను. ఆయన జీవితం మనకు స్ఫూర్తి పంచడమే కాకుండా, సమాజం పట్ల మన బాధ్యతలను గుర్తు చేస్తుంది.

**– వి. వి. లక్ష్మీ నారాయణ,** ఐపిఎస్
పూర్వ సంయుక్త సంచాలకులు, సిబిఐ
(2025)



# సాహసానికి – త్యాగానికి మరో పేరు పొట్టి శ్రీరాములు

అమరజీవి పొట్టి శ్రీరాములు గారు భారతదేశ చరిత్రలో చెక్కు చెదరని పేరును సంపాదించిన వారిలో ఒకరు. తెలుగు భాషను గుర్తించాలన్న ఆయన సంకల్పం. భారతదేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రం ఏర్పాటు చేయడానికి మార్గం సత్యాగ్రహం అని నిర్ణయించినారు. ఆ పట్టుదలతో 1952లో ఆయన 58 రోజుల నిరాహార దీక్ష చేపట్టారు. అయితే ఆయన జీవితం, దీక్ష కారణంగా అకాల మరణానికి గురైంది. దేశ వ్యాప్తంగా స్పందనలు కలిగాయి. చివరకు 1953లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడటానికి దారి తీసింది. క్రమంగా భారత దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడటానికి మార్గం సుగమం అయింది. అమరజీవి పొట్టి శ్రీరాములు గారు ఆయన జీవితాన్ని ఎన్నో ఉన్నతాశయాలను స్థాపించడానికి వెచ్చించారు. జాతీయోద్యమంలో కూడా పాల్గొన్నారు. ఆయన త్యాగం భారతీయ సమాజంలో, సాహసానికి, అహింసా సిద్ధాంతానికి శాశ్వత గుర్తింపుగా నిలిచి ఉంది.

ఇటువంటి మహనీయుడి జీవితం గురించి అందరికి తెలియచేయాలన్న ఉద్దేశంతో డాక్టరు బాదం శ్రీరాములు గారు ఆంగ్లములో పుస్తకాన్ని ముద్రించారు. తరువాత ఆయన కుమారుడు డాక్టరు బాదం రమేష్‌గారు ఈ పుస్తకాన్ని తెలుగులో ముద్రించారు. ఇప్పుడు బాదం శ్రీరాములు గారి రెండవ కుమారుడు బి.వి. ప్రసాద్‌గారు అందరికీ అర్థమయేటట్లు ముఖ్యమైన అంశాలతో ముద్రించారు. వీరి కుటుంబానికి అమరజీవి పొట్టి శ్రీరాములు గారి మనవరాలుగా నా ధన్యవాదాలు సమర్పించు కుంటున్నాను.

**– ప్రొ. టి. రేవతి**
M.Sc., Spl Edn from Manchester University, UK
302, Nutan Residency, 5-9-22/93, Adarsh Nagar,
Near Birla Mandir, Hyderabad-500063.
Phone: 9849427441, E-mail: revathy42@yahoo.com.
(2025)



# ఈ తరం వారికి మాత్రమే కాదు... ముందు తరాల వారికి ఆయన జీవితం కార్యం ఆదర్శం కావాలి

అమరజీవి పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర నిర్మాతయే కాదు భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కృషి చేసిన మహానుభావులు. వీరి చరిత్రను, కీ॥ శే॥ Dr.బాదం శ్రీరాములు, M.A., Ph.D., అనేక సంవత్సరాలు కృషి చేసి, పరిశోధన జరిపి 1983 సంవత్సరంలో, ఆంగ్ల పరిశోధన పత్రాన్ని, కర్ణాటక విశ్వవిద్యాలయం (ధార్వాడ) కు సమర్పించి, వారి నుండి Ph.D పట్టా పొందినారు.

ఈ గ్రంథము ముంబైలో మొదటిసారి ముద్రించబడింది. ఆంగ్లములో వ్రాసిన గ్రంథాన్ని తెలుగులో అనువాదం చేసి తెలుగువారి చేతులలో కరదీపికలా మార్చాలని ప్రయత్నం చేసారు డాక్టర్ బాదం శ్రీరాములు గారు (1992). అప్పుడు, ఈ గ్రంథాన్ని అఖిలభారత వైశ్య యువజన సంఘం స్వర్ణోత్సవం సందర్భంగా, ఆనాటి ఆంధ్ర రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామాత్యులు శ్రీమాన్ కొణిజేటి రోశయ్య గారు ఆవిష్కరించారు.

తదనంతరం 2011 సంవత్సరంలో డాక్టర్ బాదం శ్రీరాములు గారి ప్రథమ పుత్రుడు డాక్టర్ రమేష్ బాధ్యత తీసుకొని ఈ పరిశోధనాత్మక గ్రంథాన్ని ద్వితీయ ముద్రణ చేసి జనసామాన్యానికి ఉచితంగా అందించే ప్రయత్నం చేశారు.

ప్రస్తుతం డాక్టర్ బాదం శ్రీరాములు గారి ద్వితీయ పుత్రుడు CA బాదం వెంకట ప్రసాద్, తండ్రిగారి మీద గౌరవంతో వారు చేసినటువంటి ఈ అద్భుత కార్యాన్ని మరింత మందికి అందించాలన్న తపనతో ప్రయత్నం చేసినారు. అంతే గాక ప్రస్తుత కాల పరిస్థితులలో దిన దినానికి దేశ ప్రజలలో మృగ్యమవుతున్న దేశభక్తి, దైవ భక్తి, మానవతా విలువలను మరొక్కసారి ప్రధానంగా తెలుగు వారందరికీ అందించాలన్న సదుద్దేశంతో సొంత వనరులనులతో పరిశోధనాత్మక గ్రంథాన్ని మూలంగా చేసుకుని కాస్త క్లుప్తంగా చేసి మళ్ళీ పుస్తకాన్ని ముద్రించే ప్రయత్నం చేసారు. ఈ పుస్తకం చదువురులకు అందరికీ తప్పక నచ్చుతుందని నమ్ముతున్నాము. పాఠకులకి కావాలి అంటే పరిశోధనాత్మక గ్రంథం కూడా డాక్టర్ బాదం శ్రీరాములు గారి కుటుంబ సభ్యుల వద్ద నుండి సేకరించుకొన వచ్చు. సాధ్యమైనంత వరకు మూల గ్రంథంలో పేర్కొనబడిన విషయాలను క్లుప్తంగా ప్రచురించడం జరిగింది.

దానివల్ల అమరజీవి జీవితము మరియు కార్యము గురించిన విషయాలకు ఎలాంటి లోపము ఉండదు అని మేము నమ్ముతున్నాము. ఈ తరం వారి పఠనాభిలాషను దృష్టిలో పెట్టుకొని పుస్తకాన్ని అమరజీవి జీవితం మరియు కార్యం కోసమై ప్రత్యేకంగా ప్రచురించడం జరిగింది.

పొట్టి శ్రీరాములు మరణమే లేని అమరజీవి. వారిని ప్రతి తెలుగు వాడు కూడా గుండెల్లో పెట్టుకుని పూజించాల్సిన త్యాగ జీవి. వారి జీవితం నిస్వార్థ సేవకు నిలువెత్తు నిదర్శనం. ఈ తరం వారికి మాత్రమే కాదు... ముందు తరాల వారికి ఆయన జీవితం కార్యం ఆదర్శం కావాలి అన్న ఆశయంతో ఈ పుస్తకాన్ని శ్రీమదాచార్యులు శ్రీ చిన్న జీయర్ స్వామి వారి కరకమలములచేత ఆవిష్కరించబడుతోంది.

ప్రార్థనలతో...
**– బాలచంద్ర**
వ్యవస్థాపకుడు
అభయ ఫౌండేషన్

27.01.2025
భాగ్యనగరం



# గాంధీ స్వాతంత్ర్యాన్ని సాధిస్తే... పొట్టి శ్రీరాములు ఆంధ్రరాష్ట్రాన్ని సాధించారు...

అమరజీవి పొట్టి శ్రీరాములు గారే లేకపోతే, ఆంధ్రరాష్ట్రం వచ్చేదా? ఇప్పటి ఆంధ్రప్రదేశ్ వుండేదా? అంతవరకు ఎందుకు? భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడి వుండేవా?

ఆశయ సాధనకు అహింసాయుతంగా, శాంతియుతంగా ఆత్మార్పణ చేసిన మహనీయులలో పొట్టి శ్రీరాములు గారు అగ్రగణ్యులు. వెర్లింగ్ స్వాతంత్ర్య సాధనకు ఆదేశ భక్తుడు మెక్స్వినీ నిరాహారవ్రతానికి ఉద్యమించి, ఆదీక్షలోనే కన్నుమూసారు. ఆనాటి బ్రిటీష్ సామ్రాజ్యవాద ప్రభుత్వం రాజకీయ ఖైదీలను మానవులుగా పరిగణించడంలేదని, అందుకు నిరసనగా బెంగాలీ దేశ భక్తుడు జతిన్ బాబు 1929లో జెయిలులో 63 రోజులు నిరాహార దీక్ష చేసి, ఆత్మాహుతి చెందారు. సంయుక్త కర్నాటక కోసం లింగన గౌడ్ 1953లో నిరశన వ్రతం చేసి, తన లక్ష్యం కోసం ఆత్మబలిదానం చేశారు.

పొట్టి శ్రీరాములు గారు ఆంధ్రరాష్ట్రం కోసం, ఆంధ్రా నాయకుల సమైఖ్యం కోసం 58 రోజులు ఆమరణ దీక్షకు వుద్యమించి, 1952 డిసెంబర్ 15వ తేదీన అమరజీవి అయినారు! మహాత్మాగాంధీ భారత స్వాతంత్ర్యాన్ని సాధించితే, పొట్టి శ్రీరాములు గారు ఆంధ్రరాష్ట్రాన్ని సాధించారు. అట్టి మహనీయుని జీవితంపై పి. హెచ్‌డి చేసిన ధన్యజీవి దివంగత బాదం శ్రీరాములు గారు. ఆయనకు కర్నాటక యూనివర్శిటీ 1983లో డాక్టరేట్ ప్రదానం చేశారు.

**– పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు**
అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్,
స్టేట్ సెంట్రల్ లైబ్రరీ ఆవరణ, అఫ్జల్‌గంజ్, హైదరాబాద్–12
(2011)

# కృతజ్ఞతలు

అఖిల భారత వైశ్య యువజన సంఘం 20 ఏప్రిల్ 1939 తేదిన హైద్రాబాద్‌లో స్వాతంత్ర్య సమరయోధుడు శ్రీ కె. సి. గుప్త గారిచే ప్రారంభించ బడినది. వైశ్యులనగా దక్షిణాదిన నివసించు ఆర్యవైశ్యులే కాదు దేశమంతా అన్ని రాష్ట్రాలలో వైశ్యులు కలరు. వారు 100 పేర్లతో పిలవబడుచున్నారు.

వైశ్యులు రాజకీయాలలో పాల్గొనుటకు ప్రోత్సహించి స్వసంఘీయులతో పాటు పౌరుల సేవ చేయుచు అన్ని రంగాలలో తోటి పౌరులతో సమానముగా ముందంజ వేసి దేశాభివృద్ధి కార్యక్రమాలలో తోడ్పడుచు దేశ సమైక్యతకు పాటు పడుటకు సిద్ధము చేయుడమే ఈ సంస్థ ముఖ్యోద్దేశము. సారస్వతమే రాబోవు తరముల వారికి ఆధారము కాబట్టి వైశ్యుల ఔన్నత్యాన్ని తెలుపు చరిత్రలు వివిధ బాషలలో 10 పుస్తకాలు ప్రచురించినాము. ఈ సంస్థకు 50 సంవత్సరాలు పూర్తి అయినందున సువర్ణోత్సవము జరుపు కొనుచున్నది. ఈ సందర్భమున అమరజీవి పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర నిర్మాతయే కాక భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడుటకు కృషి చేసిన మహానుభావుడు. వీరి చరిత్రను డాక్టరు బాదం శ్రీరాములు, యం.ఏ., పిహెచ్.డి. అనేక సంవత్సరాలు కృషి చేసి పరిశోధన జరిపి, కర్నాటక విశ్వవిద్యాలయము నుండి పిహెచ్.డి.ని పొందినారు. వీరి గ్రంథాన్ని బొంబాయిలో ఆంగ్లములో ముద్రించబడినది. ఈ గ్రంథాన్ని తెలుగు అనువాదం వారే చేసినారు. ఈ గ్రంథాన్ని 20 వేల రూపాయల వ్యవముతో అఖిల భారత వైశ్య యువజన సంఘం సువర్ణోత్సవ సందర్భమున ముద్రించినాము. ఈ గ్రంథాన్ని ముద్రించుటకు అవకాశాన్ని కలుగజేసిన డాక్టరు బాదం శ్రీరాములు గారికి, విరాళము నొసగిన దాతలకు, మరియు గ్రంథాన్ని ఆవిష్కరించుటకు అంగీకరించిన శ్రీ కొణిజేటి రోశయ్య, వైద్య ఆరోగ్య శాఖమాత్యులు గారికి అభివందనములు తెలుపుచున్నాము.

ఇట్లు

**అఖిల భారత వైశ్య యువజన సంఘం**

(1992)



# 8 సంవత్సరాలు శ్రమించాను

1983వ సంవత్సరంలో కర్ణాటక యూనివర్సిటీ, ధారవాడ వారు పిహెచ్.డి. ఆమోదించిన ఆంగ్ల థీసిస్ యొక్క స్వేచ్ఛానువాదమే ఈ గ్రంథం. పురాణపురుషుడైన శిబిచక్రవర్తి ఒక పక్షి ఆకలి తీర్చడానికి తన శరీరాన్నే కోసి ఇచ్చాడని విన్నాం. అది కేవలం నమ్మకానికి సంబంధించిన విషయం మాత్రమే. కాని పొట్టి శ్రీరాములు తన 58 రోజుల దీక్షాకాలంలో ప్రతిక్షణం తన రక్త మాంసాలను కరిగించి కోట్లాది ఆంధ్రుల శ్రేయస్సు కోసం 33 పౌండ్ల రక్త మాంసాలను (119 పౌన్లు నుండి 84 పౌన్లు తగ్గి పోయాడు) పంచి ఇవ్వడాన్ని మనతరంలోనే చూశాం. ప్రపంచ చరిత్రలోనే అరుదైన త్యాగమూర్తి శ్రీరాములు. వారి గొప్పతనాన్ని హేళన చేసిన సంఘటన నన్ను ఆయన జీవిత చరిత్ర పరిశోధనకు ప్రేరేపించింది.

8 సంవత్సరాల సుదీర్ఘకాలం శ్రమించాను. వారి బంధువులను కలిశాను. వారి స్నేహితులతో మాట్లాడాను. మహత్మాగాంధి, వినోబాభావే, రాజేంద్రప్రసాద్, కిషోర్‌లాల్, మష్రూవాలా, డి.పి రామస్వామి రెడ్డి యార్, యన్.జి. రంగా, బి.యస్. మూర్తి మొదలైన ప్రముఖులతో శ్రీరాములు జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిని సేకరించాను. ఆయన డైరీని రికార్డులను సంపాదించాను. 40 సంవత్సరాములనాటి దిన వార్త పత్రికలను సంపాదించాను. ఎన్నో ప్రదేశాలను, లైబ్రరీలను సందర్శించాను. కర్ణాటక యూనివర్సిటి ఆధికార్లను సంతృప్తి పరచాను. నా కృషి ఫలించింది. నా థీసిన్ విన్నిపెగ్ యూనివర్సిటీ (కెనడా) సోషియాలజి ప్రొఫెసర్ డి.ఎ. చెక్కిగారి ఆమోదం కూడా పొందింది. పిహెచ్.డి. లభించింది. భారత ప్రభుత్వము (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషియల్ సైన్స్ రీసర్చ్) ఆమోదించింది. బొంబాయిలోని హిమాలయ పబ్లిషింగ్ హౌస్ వారు దీనిని ముద్రించి దేశవ్యాప్తంగా విడుదల చేశారు.

ప్రేమాస్పదులైన తండ్రి బాదం కోటయ్యగారికి, తల్లి సుబ్బమ్మ గారికి, నా విద్యాభివృద్ధికి తోడ్పడిన సోదరుడు బాదం రాములుగారికి, నన్ను ప్రోత్సహించి ఆదరించి శ్రీ కన్యకాపురమేశ్వరి కళాశాల, మార్కాపురం పాలకవర్గం మరియు ఆధ్యాప మిత్రబృందానికి, ఈ గ్రంథాన్ని అందంగా ప్రచురించిన అఖిలభారత యువజన సంఘ హైదరాబాదు వారికి నా కృతజ్ఞతలు.

ఈ అమూల్య గ్రంథాన్ని ఆంధ్రులందరు చదవాలనే సదుద్దేశ్యంతో ఎంతో శ్రమకోర్చి థీసిస్‌ను ఆంధ్రీకరించడం జరిగింది. తెలుగు ప్రజలు ఈ గ్రంథాన్ని సంపూర్ణంగా చదివి నా కృషిని అభినందించగలరని ఆశిస్తున్నాను.

భవదీయ

**డా॥ బాదం శ్రీరాములు**

(1983)

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | ఒకటవ అధ్యాయం | పొట్టి శ్రీరాములు | 13 |
| 2. | రెండవ అధ్యాయం | గాంధేయవాది | 26 |
| 3. | మూడవ అధ్యాయం | దేశ సేవా కార్యం | 40 |
| 4. | నాల్గవ అధ్యాయం | హరిజన సేవా కార్యం | 52 |
| 5. | ఐదవ అధ్యాయం | హరిజన దేవాలయ ప్రవేశము | 66 |
| 6. | ఆరవ అధ్యాయం | సంఘ సేవా కార్యం | 85 |
| 7. | ఏడవ అధ్యాయం | గాంధీజీ సేవాకార్యం | 107 |
| 8. | ఎనిమిదవ అధ్యాయం | నిర్మాణాత్మక సేవాకార్యం | 114 |
| 9. | తొమ్మిదవ అధ్యాయం | ప్రత్యేకాంధ్ర సేవాకార్యం | 121 |
| 10. | పదవ అధ్యాయం | ఆంధ్రరాష్ట్ర అవతరణ | 148 |

**ఒకటవ అధ్యాయం**

# పొట్టి శ్రీరాములు



ఆంధ్ర రాష్ట్రావతరణ కోసం నిర్విరామంగా శ్రమించి ఆత్మార్పణం చేసిన త్యాగమూర్తి పొట్టి శ్రీరాములు. ఆయన సర్వాంధ్రజన హృదయాలలో అమరజీవిగా నిలిచిపోయారు. శ్రీరాములు చరిత్రకందని మహాపురుషుల్లో ఒకరు. ఆయన క్రీ॥శ॥ 1902 సెప్టెంబరు 12వ తేదీన మద్రాసు నగరం అన్నాపిళ్ళె వీధిలోని ఆర్యవైశ్య కుటుంబంలో జన్మించాడు. సర్వసాధారణ రూపురేఖలతో నిరుపేద కుటుంబంలో జన్మించిన శ్రీ రాములు మునుముందు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తాడని ఎవ్వరూ ఊహించి ఉండరు. అయినా ఆయన అందరిలాంటి సామాన్య వ్యక్తి కాదని తన జీవిత కాలంలో నిరూపించారు. ఆయన చేసిన ఆమరణ నిరశన వ్రతం వల్ల ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర సిద్ధి లభించింది. తరువాత భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయి.


ఇలా భారతదేశ రాజకీయ చిత్రపటాన్నే మార్చివేశాడు శ్రీరాములు. ఆయన రాజకీయాలకు నైతిక విలువలు అద్దినారు. మానవతావాదిగా గాంధేయవాదిగా భారతీయులకు చిరస్మరణీయుడు.

శ్రీరాములు తల్లి మహాలక్ష్మమ్మ. తండ్రి గురవయ్య. వీరు నిరుపేదలైనా ఆర్ష సంప్రదాయాన్ని పుణికి పుచ్చుకొన్న పుణ్య దంపతులు. వీరికి గురమ్మ అనే కుమార్తె, నారాయణ, శ్రీరాములు, రంగయ్య అనే కుమారులు జన్మించారు.

పొట్టి శ్రీరాములు పూర్వీకులు నెల్లూరు మండలంలోని కనిగిరి తాలూకాకు చెందిన పగమటిపల్లె అనే గ్రామానికి చెందినవారు. ఈ గ్రామం ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లాలోనికి చేర్చబడింది. శ్రీరాములు తండ్రి గురువయ్య వంశపారంపర్యంగా వస్తున్న వ్యాపారంతో కుటుంబాన్ని పోషించేవారు. ఆయన

గొప్ప విద్యావంతుడు కాదు, అయినా సహృదయుడుగా, నిజాయితీ పరుడుగా ఆ ప్రాంతంలో గుర్తింపుపొందాడు. ఆయన సాధు స్వభావం కలవాడు కనుక వ్యాపార నిర్వహణలో అనేక కష్టాలను ఎదుర్కోవలసి వచ్చింది. మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్లు 1876లో ఆంధ్రలో కరువు సంభవించింది. దీనితో గురువయ్య కుటుంబం మరీ చిక్కుల పాలయింది. ఆర్థిక స్థితి క్షీణించింది. స్వస్థలంలో వ్యాపారం కొనసాగలేదు. కుటుంబ పోషణ దుర్లభమయింది. ఈ పరిస్థితుల్లో గురవయ్య భార్య ప్రోత్సాహంతో మద్రాసు నగరానికి చేరాడు. అక్కడ జార్జిటౌన్ వున్న అన్నాపిళ్ళై వీధిలో 163 నెంబరు ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. కాయకష్టంతో జీవనయాత్ర సాగించాడు. అక్కడ శ్రీరాములు జన్మించాడు.

అమరజీవి పొట్టి శ్రీరాములు గారి జన్మించిన ఇల్లు



శ్రీరాములు తల్లి దండ్రులు తమ బిడ్డలందర్నీ సమానంగా చూసుకొనేవారు. అయినా సున్నిత స్వభావంగల శ్రీరాముల్ని విశేషానురాగంతో చూసేవారు. శ్రీరాములు చిన్నప్పటినుండి తల్లిదండ్రుల పట్ల వినయ విధేయతలు కలిగివుండే వాడు. కానీ తల్లిపట్ల ఆయనకు ప్రత్యేకాభిమానం ఏర్పడింది. అందుచేత శ్రీరాములు ఆమెదైనందిన కార్యక్రమాన్ని శ్రద్ధగా గమనించేవాడు. ఆమె కుటుంబ సభ్యుల సుఖ దుఃఖాలను సమానంగా పంచుకోగలిగిన ఆదర్శ గృహిణి. పేదల యెడ కనికరం, కర్తవ్యపాలన, ధృఢ నిశ్చయం, పరిస్థితుల సదవగాహన మున్నగు సుగుణాలవల్ల ప్రేరణ పొందాడు శ్రీరాములు, తుది శ్వాస విడిచేవరకూ తన తల్లి ఉదాత్త గుణాలను శ్రీరాములు విస్మరించలేదు.

ఆర్థిక పరిస్థితులు దిగజారడంవల్ల మహాలక్ష్మమ్మ మిక్కిలి పొదుపుగా కుటుంబాన్ని నిర్వహించేది. ఈ దుస్థితిలో ఆమె కొంతకాలం వడ్లు దంచింది. ఇరుగుపొరుగు ఇళ్ళలో చాకిరి చేసింది. దీనితో లభించిన కొద్ది ధనంతో సంసారాన్ని నెట్టుకొచ్చింది. వయోవృద్ధుడు అనారోగ్యవంతుడు అయిన భర్తను

ఆమె ఏమాత్రం ఇబ్బంది పెట్టలేదు. కుటుంబ నిర్వహణ భారాన్ని తానొక్కతే మోసింది.

గురవయ్య. మహాలక్ష్మమ్మ స్వభావాల్లో ఎంతో తేడా వుంది. గురవయ్య కుటుంబ సమస్యలను పట్టించుకొనేవాడు కాదు. "నారు పోసినవాడు నీరు పోయడా" అని అంతా భగవంతుని మీద భారం వేసేవారు.

ఒక్క మాటలో చెప్పాలంటే గురవయ్య నిరాశా జీవి. మహాలక్ష్మమ్మ ఆశా జీవి ఆమె భర్త వలె కాక కుటుంబ సమస్యలను వాస్తవ దృష్టితో పరిశీలించేది. స్వయంకృషే మానవుల భవిష్యదున్నతిని నిర్ణయిస్తుందని ఆమె ధృఢ విశ్వాసం. ఇలా భార్యభర్తల భావాల్లో వైవిధ్యం వున్నప్పటికి ఆమెకు భర్త మీద అపారమైన గౌరవం వుండేది. భర్త యిచ్చిన సలహా దూరదృష్టితో కూడి ఆచరణయోగ్యంగా వుంటే ఆమె దాన్ని వెంటనే పాటించేది. కాని దురదృష్టం వల్ల రోగగ్రస్తుడైన భర్త 1908లో మరణించడంతో భర్త సలహాలను పొందే అవకాశాన్ని ఆ నిర్భాగ్యురాలు కోల్పోయింది.

భర్త మరణాంతరం మహాలక్ష్మమ్మ తన నివాసాన్ని ఆచారప్పన్ వీధిలోని 99వ నెంబరు యింటికి మార్చింది. అక్కడ ఆమె కొద్ది మొత్తంతో కందులు కొని వాటిని తిరుగలిపై పప్పుగా విసిరి వాటిని విక్రయించగా వచ్చిన కొద్దిపాటి ఆదాయంతో కుటుంబాన్ని పోషించసాగింది. ఆ చిన్న వ్యాపారంలో కూడా ఆమె కొన్ని ఇబ్బందులు నెదుర్కొనవలసి వచ్చింది. పప్పుల ధర నిలకడగా వుండనందువల్ల ఆ వ్యాపారాన్ని చేసే వర్తకులు కొందరు దివాలా తీయసాగారు. కష్టతరం మరియు ప్రమాదభరితమైన ఆ వ్యాపారాన్ని కొనసాగించవద్దని కుమారులు మహాలక్ష్మమ్మకు సలహా యిచ్చారు. కానీ ఇతర వ్యాపారంలోనికి దిగే ఆర్థిక స్తోమతలేనందువల్ల ఆమె కష్టనష్టాలతో కూడిన ఆ వ్యాపారాన్నే సాగించవలసివచ్చింది.

కష్టతరమైన ఆ వ్యాపారంలో కూడా ఆమె విజయాన్ని సాధించింది. నీతి, నిజాయితీ, వ్యాపార నైపుణ్యం, ఖాతాదారులను మెప్పించే చాకచక్యం మున్నగు సుగుణాలవల్ల ఆమె వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విలసిల్లింది. రానురాను ఆమె పట్ల ప్రజలకు విశ్వాసం కుదిరింది. ఆ పేటలోని ప్రజలేగాక మద్రాసు నగరంలోని వివిధ కళాశాలల హాస్టళ్ల నిర్వాహకులు కూడా తమకు

కావలసిన వస్తువులను మహాలక్ష్మమ్మ వద్ద కొనుగోలు చేసేవారు.

ఆమె విద్యావంతురాలు కాకపోవడం వల్ల దైనందిన వ్యాపారపు పద్దులను జాగ్రత్తగా గుర్తించుకొని రాత్రిపూట తన కుమారులతో వ్రాయించుకొనేది.

కష్టాలన్నీ ఒకే మారు వస్తాయనే లోకోక్తి మహాలక్ష్మమ్మ పట్ల నిజమయింది. వ్యాపార నిర్వహణలో చేదోడు వాదోడుగా వుంటున్న ఆమె పెద్ద కుమారుడు నారాయణ 1917లో మరణించాడు. చిన్నతనంలో వితంతువైన నారాయణ భార్య చెంచమ్మ బాధ్యత కూడా ఆమె మీదనే పడింది. పుండుపై కారం చల్లినట్లు ఆ తరువాత కొద్ది కాలంలోనే ఆమె ఏకైక పుత్రిక గురమ్మ మరణించింది. అప్పుడు గురమ్మ కొడుకు 18 నెలల బాలుడు. ఆ పిల్లవాణ్ణి పెంచే బాధ్యత కూడా మహాలక్ష్మమ్మ మీదేపడింది.

కష్టాలన్నీ ఒకేసారి చుట్టు ముట్టాయి. అయినా ఆమె మనోస్థైర్యము కోల్పోలేదు. కర్తవ్య నిర్వహణకు ఎట్టి ఆటంకమూ కలుగ నివ్వలేదు. ఓర్పు ధృఢ నిశ్చయాలతో ఎంతటి కష్టాలనయినా ఎదుర్కొనవచ్చని ఆమెకు మొదటినుండి నమ్మకం వుంది. ఇలాంటి మానసికోన్నతతో విధవయైన తన కోడల్ని కన్నబిడ్డలా చూసుకుంది. దౌహిత్రుడైన నరసింహగుప్తాను ముద్దుగా పెంచి తల్లి లేని లోటును తీర్చగలిగింది.

**మహాలక్ష్మమ్మ క్రమశిక్షణతో కూడిన జీవితానికి అలవాటు పడింది. తన బిడ్డలను కూడా అదే మార్గంలో తీర్చిదిద్దింది. వారిని దురభ్యాసాలకు దూరంగా ఉంచగలిగింది. కష్టసుఖాలను సమానంగా చూడగలిగిన ఓర్పును వారికి నేర్పగలిగింది. తన బిడ్డలను సమాజంలో నీతిమంతులు, నిజాయితీపరులు కావాలని నిరంతరం ఆకాక్షించింది.**

మహలక్ష్మమ్మగారు కుటుంబం సనాతన భారతీయ సంప్రదాయానికి నిలయం గనుక ఆమె ఇంట్లో హిందూమతానికి, పురాణాలకూ సంబంధించిన అనేక గ్రంథాలు వుండేవి. సదాచార సంపన్నురాలైన ఆమె నిత్యం పూజలు జపాలు క్రమం తప్పక నిర్వహించేది. ముఖ్యంగా పర్వదినాల్లో పచ్చి మంచి నీళ్లయినా ముట్టక కఠిన నియమ నిష్టలతో ఉపవాసాలుండేది.

తాను తిన్నా తినకపోయిన అభాగ్యులను, అతిధులను ఆదరించి భోజనం

పెట్టేది. ఏ సమయంలో అతిథులు వచ్చినా విసుగు చెందక కన్నతల్లిలా వాళ్ళను ఆదరించేది.

ఇరుగు పొరుగు వారితో కలుపుగోలుతనంగా ప్రవర్తించేది. అప్పుడప్పుడు వారి మధ్య వచ్చే స్వల్ప వివాదాలను సునాయాసంగా పరిష్కరించేది. ఆమె ప్రవర్తన పట్ల గౌరవ భావం ఉండడంవల్ల ఆమె తీర్పులను వాళ్ళు మారుమాట్లాడక శిరసావహించే వాళ్ళు.

మహాలక్ష్మమ్మగారు మానవతా దృక్పథం ప్రశంసనీయం. "ఆత్మవత్ సర్వ భూతాని" అనే విశాల భావంతో ఆమె వ్యవహరించేదని ఈ క్రింది సంఘటన ఋజువు చేస్తోంది.

ఒకసారి ఆమె చిన్న కుమారుడు రంగయ్య జబ్బున పడ్డాడు. ఒక గుమ్మడికాయ మంత్రించి ఎదురింట్లో వేలాడదీస్తే అదే వయస్సులో వున్న ఎదురింటి పిల్లవాడికి ఈ జబ్బు సంక్రమిస్తుందని ఎవరో సలహా చెప్పారు. కుచ్చితమైన ఈ సలహా మహాలక్ష్మమ్మను ఎంతో బాధించింది. తన బిడ్డకోసం ఎదుటివారి బిడ్డను బలిచేయడం తనవల్ల కాదనీ అలాంటి ఆలోచన మహాపాతకమని ఆమె ఖండితంగా చెప్పింది. ఎదుటివారి బిడ్డను తన బిడ్డను సమాన ప్రేమతో చూడగలిగిన యిలాంటి పవిత్ర మాతృమూర్తి కడుపున పుట్టి శ్రీరాములు ధన్య జీవి అయ్యాడు.

శ్రీరాముల జీవితాన్ని ప్రభావితం చేసిన మరొక వ్యక్తి అతనికి అక్షరాభ్యాసం చేయించిన గురువు, నారాయణయ్య. ఈయన మద్రాసులోని గోవిందప్ప నాయకర్ వీధిలో వున్న బంగ్లావల్లి కుటం అనే వీధి బడిలో ఉపాధ్యాయుడు. శ్రీరాములు ఈ బళ్ళోనే విద్యాభ్యాసం ప్రారంభించాడు. శ్రీరాములు సహజంగా సిగ్గు స్వభావం కలవాడు. బళ్ళో తోటి విద్యార్థులతో స్వేచ్ఛగా మాట్లాడేవాడు కాదు. ప్రతి విషయంలోనూ బిడియం ప్రదర్శించేవాడు. ఉపాధ్యాయుడు నారాయణయ్య అజానుబాహుడు. అతణ్ణి చూస్తేనే విద్యార్థులు గడగడలాడుతూ వుండేవాళ్ళు ఆయన విద్యార్థులను చక్కగా విద్యతో తీర్చిదిద్దాలనే అభిలాష కలవాడు. అందుచేత విద్యార్థుల క్రమశిక్షణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపేవాడు. చాడీలు చెప్పేవాళ్లను, బాగా చదవని వాళ్ళను, అబద్ధాలు చెప్పేవాళ్ళను పాఠశాలకు సక్రమంగా రాని వాళ్లను ఆయన కఠినంగా శిక్షించేవాడు. అక్కడి

విద్యాభ్యాసకాలం రెండు సంవత్సరాలు.

ఈ రెండు సంవత్సరాల్లో అక్కడి విద్యార్థులకు చక్కని నైతిక ప్రవృత్తి అలవడేది. దీనితోపాటు పెద్ద బాలశిక్ష, సుమతి, కృష్ణ, దాశరధి, నారాయణ శతకాలు, అమరకోశం, బాలరామాయణం, మున్నగు గ్రంథాల్లోని పద్యాలు, శ్లోకాలు కంఠస్థమయ్యేవి.

విద్యార్థులకు సోదరభావం, ఐకమత్యం, సునిశిత బుద్ధి మొదలగు సుగుణాలు పెంపొందేవి. అహంభావం, న్యూనతాభావం మున్నగు దుర్గుణాలను దూరంచేయడానికి శ్రద్ధ తీసుకొనేవాడు నారాయణయ్య.

నారాయణయ్య తన శిష్యుడైన శ్రీరాములుకు భారత భాగవతాది గ్రంధ విషయాలను ఆసక్తికరంగా బోధించేవాడు. వేదనాభరిత జీవిత గాధలు విన్నప్పుడల్లా శ్రీరాముల నేత్రాలు అశ్రుపూరితాలయ్యేవి. లక్ష్మణుని సోదరభక్తి, కర్ణుని త్యాగనిరతి అతణ్ణి ఎంతో ఆకర్షించాయి. కర్ణుని ఆదర్శమూర్తిగా స్వీకరించాడు శ్రీరాములు. కర్ణుని జీవిత ఘట్టాలు అతడినెంతగానో ప్రభావితం చేశాయి. శ్రీరామ చంద్రునికి లక్ష్మణునిలా తాను ముందుముందు గాంధీజీకి నమ్మిన బంటుగా మారవలసి వుంటుందని గానీ, కర్ణునిలా ముక్కోటి ఆంధ్రుల శ్రేయస్సుకోసం ఆమరణ నిరసన వ్రతం ద్వారా తన అమూల్య జీవితాన్ని బలిచేయవలసి వుంటుందని గాని శ్రీరాములు ఆనాడు కలలోనైనా ఊహించి వుండడు. విధి బలీయమైంది కదా!

శ్రీరాములు తన పదోఏట అడియ్యప్పనాయకర్ వీధిలోని ప్రోగ్రెసివ్ యూనియన్ సెకండరీ స్కూలులో చేరాడు. ఆర్థిక యిబ్బందులవల్ల అతడు అంత చిన్న వయస్సులోనే శ్రీకన్యకా పరమేశ్వరీ దేవస్థానం వారి హాస్టల్లో చేరి ఉచిత భోజన సౌకర్యం పొందవలసి వచ్చింది. వేకువ జామున్నే నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకొని దైవప్రార్థన చేసుకొన్న అనంతరం శ్రద్ధగా చదువు కోవడంతో అతని దైనందిన కార్యక్రమం ప్రారంభమయ్యేది.

**ఆ రోజుల్లో చదువు మీద శ్రద్ధ లేని సోమరులైన పోకిరి విద్యార్థులు కఠినంగా శిక్ష పొందడం సర్వసాధారణం. కానీ ఏనాడు శ్రీరాములును శిక్షించే అవసరం ఉపాధ్యాయులకు కలుగలేదు. శ్రీరాములు ఉపాధ్యాయుల సలహాలను తూ... చా... తప్పక పాటించేవాడు.**

ఇలాంటి సంస్కారవంతుడైన శ్రీరాములు దుష్ట స్నేహాలకూ, దురభ్యాసాలకూ దూరంగా వుండేవాడు. గోవిందరాజులు బలరాం అనే యిద్దరు సహవ్రతులు మాత్రమే శ్రీరాములుకు ప్రాణమిత్రులుగా వుండేవాళ్లు. శ్రీరాములుకు కలుపుగోలుతనం లేకపోవడం సహజ స్వభావమైన నిగర్విగా వుండేవాడు. పరోపకారానికి పరుగులు తీసేవాడు. స్నేహితులను జీవితాంతం గుర్తుంచుకొనే శ్రీరాములు మిత్రభావాన్ని అతని సహవ్రతులు అనేక పర్యాయాలు ఇతరులతో ప్రశంసించేవారు.

ప్రోగ్రెసివ్ యూనియన్ సెకండరీ పాఠశాల్లో సెకండు ఫారం పూర్తి చేశాడు. శ్రీరాములు. తరువాత మింట్ స్ట్రీట్‌లో వున్న హిందూ థియోలాజికల్ ఉన్నత పాఠశాల్లో చేశాడు. అక్కడ మూడు సంవత్సరాలు చదివాడు. ఈ సమయములో శ్రీరాములుకు స్నేహితుల సంపద పెరిగింది. గొల్లపూడి రాధాక్రిష్ణయ్య, టి. పట్టాబి రామగుప్త కొత్త మిత్రులలో ముఖ్యమైన వాళ్ళు ఇంజనీరు పదవి నిర్వహించి భాగ్యనగరంలో విశ్రాంతి తీసుకుంటున్న శ్రీరాములు సహపాఠి కె.జి. రాజులు చిన్ననాటి తమ పాఠశాల అనుభవాలను ఇలా తెలియజేశారు.

పొట్టి శ్రీరాములు మయస్సులో చిన్న వాడయినా ప్రతిభా విశేషాల్లో సహవ్రతుల మధ్య మిన్నగా విరాజిల్లాడు. అతడు చరిత్ర, గణిత శాస్త్రాల్లో చురుకుగా వుండేవాడు. ఆంగ్లంలో వెనుకబడి వుండేవాడు. అందుచేత తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాలను కొద్దిలో పోగొట్టుకొనేవాడు. కర్తవ్య నిర్వహణలో కటువుగా వున్నప్పటికి ఇతర విషయాల్లో స్నేహితులతో చనువుగా వ్యవహరించేవాడు. శ్రీరాములు థియోలాజికల్ పాఠశాలలో చదివే రోజుల్లో యమ్.వి. దొరైస్వామి అనే ఉపాధ్యాయుడు వుండేవాడు. ఆయన ఆ పాఠశాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేవాడు. శ్రీరాములుకు ఆయనతో సాన్నిహిత్యం ఏర్పడింది. అందుచేత శ్రీరాములుకు సాంస్కృతిక కార్యక్రమాల్లో అభిరుచి ఏర్పడింది. ఆ పాఠశాలలోని "షేక్స్ పియర్ క్లబ్బు" అధ్వర్యంలో నిర్వహింపబడే నాటకాల్లో చిన్నచిన్న పాత్రలు ధరించేవాడు. పాఠశాల్లో జరిగే వక్తృత్వ పోటీల్లోనూ, బిలియార్డ్స్, క్యారమ్స్ మొదలైన ఆటల్లోనూ చురుగ్గా పాల్గొనేవాడు.

తానొకటి తలిస్తే దైవమొకటి తలచిందనే సామెత శ్రీరాములు విషయంలో అర్థవంతమైంది. దురదృష్టవశాత్తు అతడు ఫిప్తు ఫారమ్ పరీక్షల్లో కృతార్థుడు

కాలేకపోయాడు. అప్పుడు బొంబాయి నగరంలో విక్టోరియా జూబిలీ టెక్నకల్ ఇనిస్టిట్యూట్ వారు ఫిప్తు ఫారం తప్పిన విద్యార్థులను కూడా తమ సంస్థలో చేర్చుకొంటామని ప్రకటించారు. ఈ వార్త శ్రీరాములుకు ఆశాకిరణమై ఉత్తేజాన్ని కలుగజేసింది.

కుమారుణ్ణి బొంబాయి వంటి దూర ప్రాంతనికి పంపడం మహాలక్ష్మమ్మకు బాధాకరమే అయినప్పటికి తన బిడ్డ ఉజ్వల భవిష్యత్తు ఊహించి ఎంతటి త్యాగం చేయడానికైనా సిద్ధపడింది. శ్రీరాములును బొంబాయి పంపేటప్పుడు ఆమె "నాయన! నీవు ఉన్నత విద్యకోసం బొంబాయి కాదు ఎక్కడికి వెళ్ళినా నాకు సంతోషమే. నీ తండ్రి సంపాదించిన ఆస్తి పాస్తులులేవని నీవు సంకోచించ వద్దు. అష్ట కష్టాలుపడైనా నిన్ను చదివించడమే నా ధ్యేయం." అని చెప్పింది. తల్లి చెప్పిన అనురాగభరితమైన ఈ మాటలు బొంబాయిలో చదివినంతకాలం శ్రీరాములు చెవిలో మారుమ్రోగుతూ వుండేవి. కష్టపడి చదివి విద్యలో విజయం సాదించి మాతృరుణం తీర్చడమే తన జీవిత ధ్యేయంగా భావించాడు శ్రీరాములు.

బొంబాయిలోని విక్టోరియా జూబిలీ టెక్నికల్ ఇనిస్టిట్యూట్‌లో టి.బి.బి.యస్. గుప్త అనే విద్యార్థి ఉన్నాడు. అతని సహాయముతో శ్రీరాములు శానిటరీ ఇంజనీరింగు డిప్లొమా కోర్సులో సీటు సంపాదించాడు. ఆ కోర్సు నాల్గు సంవత్సరాలు చదవాలి. బొంబాయి వంటి మహానగరంలో ఎంత పొదుపుగా ఖర్చు పెట్టినప్పటికి తల్లి పంపే డబ్బు శ్రీరాములుకు చాల లేదు. అందువల్ల మద్రాసులోని శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవస్థానం ఛారిటీస్, పప్పిబెట్టి రాఘవయ్య ఛారిటీస్, అతీంధులబెట్టి ఛారిటీస్ మొదలైన ధార్మిక సంస్థల సహాయాన్ని అతడు పొందవలసివచ్చింది. బొంబాయిలోని వసతి గృహంలో వి.యమ్. పట్టాభి రామగుప్త కంచర్ల కనకరాజు, కె.గోవిందరాజులు, డి. బలరాం మొదలగు మిత్రులతో శ్రీరాములు కలిసివున్నాడు. శ్రీరాములు చదివే ఇనిస్టిట్యూట్ బొంబాయిలోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు స్థాపించారు. ఆ సంస్థలో ఆంగ్లేయులు ప్రధాన చార్యులుగా ఉండి సంస్థకు కీర్తి ప్రతిష్టలు సాధించారు. దాసన్, టర్నర్ ప్రధానోపన్యాసకులుగా వున్న రోజుల్లో క్రమశిక్షణకు నైతిక విలువలకు కళాశాల నిలయమైంది. టర్నర్ పరిపాలనాధక్షతలోనేగాక బోధనలో కూడా సమర్థుడే ఆయన ఉత్తమ విద్యార్థిని ప్రశంసించడానికిగానీ తప్పు చేసిన

విద్యార్థిని దండించడంలో గాని సంకోచించేవాడు కాదు. అందువల్లే ఆయనంటే విద్యార్థులకు భయము భక్తి వుండేవి. అదే కళాశాలలో కన్నింగ్ హామ్ అనే ఆంగ్లేయుడు పనిచేస్తున్నాడు. అతనితో శ్రీరాములుకు సాన్నిహిత్యం ఏర్పడింది. విద్యాభివృద్ధి విషయంలో అతడి సలహాలను శ్రీరాములు క్రమం తప్పక పాటించే వాడు. ఆ కళాశాలలో ఆంగ్లదేశీయులైన అధ్యాపకులు పొట్టి శ్రీరాములు "పి.యస్. గుప్త" అని ముద్దగా పిలిచేవాళ్ళు.

పొట్టి శ్రీరాముల జీవితాన్ని ప్రభావితం చేసిన మరోక మహావ్యక్తి మహాత్మాగాంధి. విద్యార్థి దశలోనే శ్రీరాములు దేశరాజకీయ పరిస్థితులను రాజకీయ నాయకుల కార్యకలాపాలను నిశితంగా పరిశీంచేవాడు. నాటి రాజకీయ నాయకులందరికంటే గాంధీజీ పట్ల ప్రత్యేక అభిమానాన్ని పెంచుకున్నాడు. గాంధీ ఆశయాలనూ సిద్ధాంతాలనూ సదవగాహన చేసుకొన్నాడు. వాటిని ఆచరణ యోగ్యం చేయడానికి హృదయ పూర్వకంగా ప్రయత్నం చేశాడు. గాంధీజీ సాహిత్యాన్ని శ్రద్ధగా చదివాడు. మహాత్ముడు నడిపిన 'యంగ్ ఇండియా' అనే ఆంగ్ల పత్రిక, నవజీవన' అనే గుజరాతీ పత్రికలను నిత్యమూ పఠించేవాడు. శ్రీరాములు బొంబాయిలో చదివే రోజుల్లో గాంధీజీ ప్రారంభించిన స్వాతంత్రోద్యమం ముమ్మరంగా కొనసాగుతూ విద్యార్థిలోకాన్ని అమితంగా ఆకర్షించింది. శ్రీరాములు కూడా చదువుకు స్వస్థి చెప్పి స్వతంత్ర సమరంలో కాలు పెట్టడానికి సిద్ధపడ్డాడు. కానీ ఆప్తబంధువులు, సన్నిహితుల సలహా మేరకు ఉద్యమంలో పాల్గొనుటకు శానిటరీ ఇంజనీరింగు డిప్లొమా కోర్సు పూర్తి చేశాడు.

శ్రీరాములు డిప్లొమా కోర్సు చివరి సంవత్సరంలో ఉన్నాడు. అప్పుడే అతని వివాహం నిశ్చయమైంది. నెల్లూరు జిల్లా దర్శి తాలూకా మారెళ్ల గ్రామవాసి గునుపూటి నరసయ్య శెట్టి శ్రీరాములు మేనమామ. ఆయన కుమార్తె సుబ్బమ్మ ఉరఫ్ సీతమ్మను శ్రీరాములు వివాహమాడాలని పట్టు పట్టాడు. సీతమ్మ సన్నగా నల్లగా సాధారణ రూపురేఖలతో వుంటుంది. ఆమె నిరక్షరాసి. అయినా సనాతన సంప్రదాయాలను పాటించడంలో శ్రద్ధవహించేది. శ్రీరాములు ఉన్నత విద్యాభ్యాసం చేస్తుండడం వల్ల ఇతరుల కన్న తల్లిదండ్రులు అధికంగా కట్నము ఇస్తామని ఆశ చూపించారు. కానీ శ్రీరాములు తల్లి అభిమతాన్ని అనుసరించాలనుకున్నాడు.

**ఆర్థికంగా చితికిపోయిన మేనమామను ఆదుకోవాలనుకున్నాడు. వరదక్షిణ ప్రమేయము లేకుండా సీతమ్మను వివాహమాడాలని నిశ్చయించాడు. పెళ్లి ఖర్చులకోసం మద్రాసులోని కలవల కన్నయ్యచెట్టి ఛారిటీస్ అనే ధార్మిక సంస్థ ఆర్థిక సహాయాన్ని అందచేయడానికి సిద్ధపడింది. తన వివాహం అతి నిరాడంబరంగా జరగాలని నిశ్చయించిన శ్రీరాములు వెంటనే ఆ ధార్మిక సంస్థ చేయదలచిన ఆర్థిక సహాయాన్ని సవినయంగా నిరాకరించాడు. అందువల్ల ఆయన వివాహం అతి నిరాడంబరంగా జరిగింది. అందువల్ల ఆయన జీవితాంతం నిరాడంబరత్వాన్ని పాటించాడు.**

1924లో శానిటరీ ఇంజనీరింగు పూర్తయింది. వెంటనే శ్రీరాములు మద్రాసు తిరిగి వచ్చాడు. అక్కడే ఉద్యోగం సంపాదించి స్థిరపడే ప్రయత్నం చేసాడు. ఆయనకు పరిచితమైన మునిసిపల్ రెవిన్యూ అధికారి వున్నాడు. ఆయనను కలిసి ఉద్యోగం ఇవ్వమని అర్థించాడు. ఆయన శ్రీరాములు పరిస్థితికి, సానుభూతి చూపించి చిన్న ఉద్యోగం ఇప్పించగలనన్నాడు. నెలకు 45 రూపాయలు జీతం. తక్కువ జీతం అయినందువల్ల ఆ ఉద్యోగం తన విద్యార్హతలకు తగనందువల్ల శ్రీరాములు మరొక ఉద్యోగం చూసుకోవాలను కున్నాడు. బొంబాయి వెళితే తన విద్యార్హతలకు తగిన ఉద్యోగం లభిస్తుందని మిత్రులు సూచిచారు. వెంటనే శ్రీరాములు బొంబాయి వెళ్లాడు. అక్కడ తన మిత్రుడు గోవిందరాజులు ఇంట్లో బస చేస్తూ ఉద్యోగ ప్రయత్నాలు చేయసాగాడు. ఒకటి రెండు నెలల్లోనే శ్రీరాములు గ్రేట్ ఇండియా పెనిన్సులర్ రైల్వేలో అసిస్టెంట్ ప్లంబర్ ఉద్యోగం లభించింది. (కొళాయి గొట్టాలు బాగుచేసే పని) ఆ సంస్థలోనే ప్లంబర్‌గా పని చేస్తున్న గోవా దేశపు క్రైస్తవుడు ససూన్ సిఫారసు పైన ఈ ఉద్యోగము లభించింది. జీతభత్యాలన్నీ కలిసి శ్రీరాములుకు నెలకు రూ. 130/- లు లభించేవి. పరేల్లోని ఆర్.కె. బిల్డింగ్స్ ఉద్యోగ కేంద్రంగా కల్యాణ్ బొంబాయి స్టేషన్‌ల మధ్య అసిస్టెంటు ప్లంబర్ శ్రీరాములు తన ఉద్యోగ విధులను ప్రారంభించాడు.

పొట్టి శ్రీరాములు విధి నిర్వాహణలో నీతి నిజాయితీలతో ప్రవర్తించేవాడు. ఉద్యోగంలో చేరిన తొలి రోజుల్లోనే నైతిక విలువలతో కూడిన జీవిత వైశిష్ట్యాన్నీ, స్వార్థపూరిత జీవిత నైపుణ్యాన్ని గురించి తోటి ఉద్యోగులతో నిరంతరం చర్చించే

వాడు. పెద్దలయెడ వినయ విధేయతలు ప్రదర్శించాలనీ, స్వచ్ఛంద జీవనం గడపాలని తహతహలాడేవాడు. ఆయన ధైర్యం, పట్టుదల, నిగ్రహశక్తి మున్నగు గుణాలు మిత్రుల ప్రశంసలు పొందేవి. విధి నిర్వహణలో ఎటువంటి వత్తుడులకూ ఆయన లొంగలేదు. శ్రీరాములు చెప్పే ప్రతి విషయము మిత్రులకు నూతనంగా, ఆకర్షణీయముగా వుండేది. శ్రీరాములు పై అధికారి ససూన్ అవినీతిపరుడు. అందుచేత అతడు నిజాయితీపరుడైన శ్రీరాములును చూసి జంకవలసివచ్చేది.

పై అధికారిలా శ్రీరాములు స్వలాభాపేక్షకు ఏ మాత్రము అవకాశమిచ్చినా వేలకువేలు సంపాదించి వుండేవాడు. పై పదవులు లభించి వుండేవి.

పొట్టి శ్రీరాములు వైవాహిక జీవితం కూడా సుఖప్రదంమైనది. కాదు. మొదటి నుండి అతడు ఎన్నో చిక్కులనూ, ఇబ్బందులను ఎదుర్కోవలసి వచ్చింది. తన భార్యను ప్రాణప్రదంగా ప్రేమించేవాడు. గృహస్థ జీవితం ఆనందదాయకం కావాలని ఆకాంక్షించేవాడు. తానొకటి తలిస్తే దైవమొకటి తలచింది. సీతమ్మకు బొంబాయి నగర వాతావరణం సరిపడలేదు. ఆమె తరుచుగా రక్త విరేచనాలతో బాధపడేది. అందుచేత శ్రీరాములు ఉద్యోగ నిర్వహణతో పాటు గృహకృత్యాలు కూడా చూడవలసివచ్చేది. ఇంగ్లీషు మందులంటే ఆమెకు సరిపడదు అందుచేత ఆమెకోరిక మేరకు శ్రీరాములు అనేక కషాయాలు కాచి యిచ్చేవాడు. ఎన్ని ఇబ్బందులు పడినప్పటికి ఆమెపట్ల ఏమాత్రం విసుగు చూపేవాడు కాదు.

శ్రీరాములులాంటి చిన్న ఉద్యోగి బొంబాయి లాంటి మహా నగరంలో జీవించడమే కష్టం పైగా తనను అపురూపంగా పెంచిన తల్లిని వృద్ధాప్యంలో ఆదుకోవడం తన ప్రధాన కర్తవ్యంగా భావించాడు. సరిగ్గా ఇదే సమయంలో శ్రీరాములు తమ్ముడు రంగయ్య డాక్టర్ కోర్సు చదువుతున్నాడు. మేనల్లుడు నరసింహగుప్త కూడా పాఠశాలకు వెళుతున్నాడు. ఈ పరిస్థితుల్లో శ్రీరాములు తన కొద్దిపాటి జీతంలోనే కొంత తల్లికి పంపవలసి వచ్చింది. భార్య అనారోగ్యంతో వున్నా తన ఖర్చులకు 80 రూపాయలు వుంచుకొని మిగతా పైకం తల్లికి పంపేవాడు. ఐనా ఆయన కష్టాలు తీరలేదు. తల్లి మహాలక్ష్మమ్మ వృద్ధాప్యం కారణంగా తరుచుగా అస్వస్థురాలయ్యేది. ఎన్ని మందులు వాడినా ప్రయోజనం కనిపించలేదు. ఆమె కొన్నాళ్ళు ఉదరకోశ వ్యాధితో బాధపడి కృశించింది. చివరకు 1928లో తన భౌతిక దేహాన్ని చాలించింది. ఆమె మరణం శ్రీరాములు

కుటుంబానికి విద్యుద్ఘాతమైంది. ఆ కుటుంబ సభ్యులు నిరాశా నిస్పృహలకు గురై నిస్సహాయులయ్యారు. ఆమె తరువాత కుటుంబానికి పెద్ద దిక్కైన శ్రీరాములు తల్లి మరణానికి బాధపడుతూనే కుటుంబ సభ్యులను ఓదార్చవలసి వచ్చింది.

మహాలక్ష్మమ్మ మరణించడంతో పప్పుధాన్యముల వ్యాపారం నిర్వహించే బాధ్యత ఆమె పెద్ద కోడలు చెంచమ్మ పై బడింది. చెంచమ్మ ఒంటరిగా ఈ వ్యాపారాన్ని నిర్వహించలేదని భావించాడు శ్రీరాములు. వెంటనే వ్యాపారాన్ని మూసివేయాలని సూచించాడు. నడుపుతున్న వ్యాపారాన్ని నిలపడం నష్ట దాయకమని, కొనసాగించడమే శ్రేష్టమనీ చెంచమ్మ వాదించింది. కొందరు ఖాతాదారులు, సన్నిహితులు వ్యాపారం సాగించడం మేలనీ అందుకు తమ సహకార ముంటుందనీ ప్రోత్సహించారు. ఒకవేళ వ్యాపారంలో ఏదైనా పొరపాటు జరిగితే అది తనతల్లి పేరు ప్రతిష్టలకు భంగకరమవుతుందని శ్రీరాములు భావించాడు. అందువల్ల ఎవరెంతచెప్పినా వ్యాపారాన్ని విరమించడానికే నిశ్చయించారు. వెంటనే నిల్వలన్నింటినీ అమ్మివేసి కొన్ని బాకీలు తీర్చే బాధ్యత తనదేనని బాకీదారు లందరినీ ఒప్పించాడు, ఐతే బాకీలన్నింటినీ ఒకేమారు తీర్చడం తనకు సాధ్యపడదనీ నెలసరి వాయిదాల ప్రకారం చెల్లించే అవకాశ మివ్వవలసిందనీ అప్పులవాళ్ళను అర్థించాడు. వాళ్ళకు శ్రీరాములు కుటుంబ సంప్రదాయము నిజాయితీ తెలుసు. అందువల్ల సహృదయతతో అంగీకరించారు. బాకీలను తీర్చే బాద్యతతో పాటు తమ్ముడ్ని డాక్టర్ కోర్సు పూర్తి చేయించే బాధ్యతను కూడా స్వీకరించాడు.

**శ్రీరాములు ఎంతో కష్టపడి కొంత కాలానికి చాలావరకు బాకీలను తీర్చగలిగాడు. ఆయన నిజాయితీని గుర్తించిన అప్పుల వాళ్ళు మిగతా కొద్ది పైకం యివ్వకపోయినా ఫరవాలేదులే అని చెప్పారు. అయినా శ్రీరాములు వాళ్ళ మాటలను అంగీకరించలేదు. తన నిత్యావసరాలను సైతం మానుకొని బాకీలన్నింటిని పూర్తిగా తీర్చివేశాడు. శ్రీరాములు తల్లి ఋణాన్ని తీర్చుకొని కుటుంబ గౌరవాన్ని కాపాడాడు.**

మహాభారతంలో కర్ణుడు అనేక శాపాలకు గురై అష్ట కష్టాలు అనుభవించాడు. అతణ్ణి ఆద్యంగా భావించిన శ్రీరాములు కూడా అలాగే కష్టపడ్డాడు గర్భవతియైన అతని భార్య సీతమ్మ దగ్గూ జ్వరాలతో బాధపడసాగింది.


శ్రీరాములు స్నేహితుడు డా॥ ఎస్.ఎస్. రావు ఆమె మలేరియా వ్యాధితో బాధపడుతున్నదనుకొని తగిన చికిత్స చేశారు. కానీ ప్రసవానంతరం ఆమెకు క్షయవ్యాధి కూడా వుందని నిర్ధారణైంది. సోమవారం ఆమె ప్రసవించిన మగబిడ్డ ఐదురోజులు మాత్రం జీవించి శుక్రవారంనాడు మరణించాడు. తరువాత సీతమ్మ ఆరోగ్యం బాగా దెబ్బతిన్నది. పుట్టింటికి వెళ్లాలని సీతమ్మ కోరింది. మద్రాసులో డా॥ పురుషోత్తమ్ గారితో వైద్య పరీక్ష చేయించారు. ఆమెకు ఊపిరితిత్తులు పూర్తిగా చెడిపోయాయని ఆమె బ్రతకడం కష్టమని డాక్టర్ చెప్పారు. వెంటనే ఆమెను పుట్టింటికి తీసుకువెళ్ళారు. జన్మస్థలమైన మారెళ్ళలోనే ఆమె 1929లో భర్తను ఏకాకిని చేసి స్వర్గస్తురాలైంది. ఇలా ఒక్క సంవత్సరంలోనే శ్రీరాములు తల్లిని భార్యా బిడ్డలను కోల్పోయాడు. తగిలిన చోటనే తగిలినట్లు ఇలా వెంటవెంట తనవారు దూరం కావటంతో ఆయన హృదయం నిరాశా, నిస్పృహలకు నిలయమైంది. అంతా క్షణికమనే వేదాంత ధోరణి అతనిలో మొదలయింది.

గాలికి వాన తోడైనట్లు ఈ కష్టాలకు తోడు పై అధికారి ససూన్ కూడా తన దుశ్చర్యలతో శ్రీరాములును బాధించసాగాడు. తనకు ఉద్యోగ సాధనకు తోడ్పడిన ససూన్ అంటే శ్రీరాములుకు మొదట్లో మిక్కిలి గౌరవముండేది. అయితే అవినీతిపరుడైన ససూన్ బద్ధకంతో దర్పం ప్రదర్శించేవాడు. నిజాయితీ పరుడైన శ్రీరాములు ససూన్ స్వార్ధపూరిత నిరంకుశత్వాన్ని భరించలేకపోయాడు. అతని అడుగులకు మడుగులు వత్త లేకపోయాడు. ససూన్ స్వార్ధపరిత్వానికీ శ్రీరాములు విశిష్ట తత్వానికీ రాజీ కుదరలేదు. ఆ స్థితి శ్రీరాములు ఉద్యోగానికే సవాలుగా పరిణమించింది.

1930వ సంవత్సరం భారత జాతీయోద్యమ చరిత్రలోనే మరపురానిది. ఈ సంవత్సరమే జాతిపిత గాంధీజీ ఉప్పు సత్యాగ్రహాన్ని ప్రారంభించాడు. ఈ ఉద్యమం కోట్లాది భారతీయుల నాకర్షించింది. సరిగ్గా ఇదే సమయంలో శ్రీరాములు వ్యక్తిగత బాధలకు లోనైయున్నాడు. జీవితం మీద విరక్తిచెంది మనశ్శాంతి కోసం పరితపించుచున్నాడు. స్వార్ధ ప్రయోజనాల నాశించి అవినీతి పరుడైనా అధికారిని సేవించి ఉద్యోగం నిలుపుకోవడమా? లేక దేశ ప్రయోజనాల కోసం స్వార్ధ త్యాగం చేసి దేశసేవ కోసం ఉద్యోగం వదులుకోవడమా? అనే సంఘర్షణ శ్రీరాములులో కలిగింది. చివరకు త్యాగమే స్వార్ధాన్ని జయించింది. వెంటనే శ్రీరాములు ఉద్యోగాన్ని వదలి దేశ సేవలో పాల్గొనడానికి నిశ్చయించుకున్నాడు..

# రెండవ అధ్యాయం

## గాంధేయవాది



ప్రసిద్ధ భారతీయ రచయిత నరేంద్రనాథగుప్త నాటి భారత జాతీయోద్యమాన్ని ఇలా విశ్లేషించాడు. గాంధీజీ నడిపిన జాతీయోద్యమ పోరాట ఫలితంగా నివురు గప్పిన నిప్పులాంటి మేధావులెందరో ఒక్కొక్కరే వెలుగులో కొచ్చారు. ప్రజ్ఞాప్రాభవం గలవాళ్ళే అనుయాయులయ్యారు. స్వతంత్ర సంగ్రామంలో దూకడానికి నడుం కట్టారు.

భారత జాతీయోద్యమాన్ని స్థూలంగా రెండు దశలుగా విభజింపవచ్చు. గాంధీజీ నాయకత్వం వహించడానికి పూర్వరంగం ప్రప్రథమ దశగాను ఆయన నేతృత్వం వహించినది రెండవ దశగాను చెప్పవచ్చు. ప్రథమ దశలో కాంగ్రెస్ నాయకులు కేవలం ఉపన్యాసాల ద్వారా అలజడి కలిగించారు. స్వరాజ్యం మా జన్మహక్కని నినాదాలు చేశారు. ప్రభుత్వ చర్యలను తీవ్రంగా విమర్శించారు. రాజ్యాంగంలో మార్పులను పరిపాలనా సంస్కరణలు కోరడం వరకే వాళ్ల ఉద్యమం పరిమితమైంది. ఈ దశలో కొంతమంది అసాధారణ వ్యక్తులు మాత్రమే కార్యరంగంలోకి దిగి కష్టాలు అనుభవించడానికి సిద్ధపడ్డారు సామాన్య ప్రజలు దేశభక్తి వున్న నాయకుల చర్యలను గమనిస్తూ ఉద్యమానికి దూరంగా వున్నారు. ఈ స్థితిగతుల్లో గాంధీజీ రంగంలోకి ప్రవేశించాడు. లేకపోతే ఈ ఉద్యమం నిశ్శబ్ధంగా వుండేది. దీనికితోడు గాంధీజీ ఆధ్యాత్మిక దృక్పధం, నిరాడంబరత్వం అకుంఠిత కార్యదీక్షతో నాయకత్వం వహించడంతో ఉద్యమం కొత్త మలుపు తిరిగింది. ఉద్యమంలో దూకడానికి ఉద్యుక్తులై వున్న ఎందరో దేశభక్తులకు గాంధీజీ నాయకత్వం ప్రేరణ కలిగించింది. ఆనాటి నుంచి జాతీయోద్యమం పటిష్టమైన పరాకాష్ట నందుకొంది. స్వాతంత్రోద్యమ బలిపీఠమెక్కడానికి తమ

సర్వస్వాన్ని సమర్పించడానికి స్త్రీ పురుష బేధం లేకుండా పోటీపడి ముందుకు వచ్చారు.

ప్రజల్లో పిరికితనం తొలగి జైళ్లంటే భయం తీరింది. ఆత్మార్పణ చేయాలనే భావం పరవళ్లు తొక్కింది. అహింసాత్మక శాంతి పథంలో తమ లక్ష్యసాధన జరుగుతుందనే ప్రగాఢ విశ్వాసం ప్రజల్లో ప్రబలింది.

గాంధీజీచేత ప్రభావితుడైన దేశభక్తుల్లో పొట్టి శ్రీరాములు అగ్రగామి. భారత జాతీయోధ్యమ చరిత్రలో 1930వ సంవత్సరం ఒక ప్రత్యేకత సాధించుకొంది. ఆ యేడే గాంధీజీ బ్రిటిష్ ప్రభుత్వమునకు వ్యతిరేకంగా ఉప్పు సత్యాగ్రహాన్ని ప్రారంభించారు. ఈ ఉద్యమం ఆంగ్ల ప్రభుత్వ దమన నీతిపై గట్టి దెబ్బ తీసింది. ధనికులతోపాటు దరిద్రులు కూడా ఉప్పు పన్ను వ్యతిరేకిస్తూ గాంధీజీ నిర్వహించిన దండి సత్యాగ్రహం "ప్రాతినిధ్యం లేనిదే పన్నులు చెల్లించరాదు" అనే చారిత్రాత్మక సిద్ధాంతానికి ప్రతీక అయింది. ఆందోళనను ఉధృతం చేసి ఆంగ్ల ప్రభుత్వాన్ని స్తంభింపచేయడం మేలని భావించాడు. గాంధీజీ వెంటనే తమతమ పదవులకు రాజీనామా చేసి సంపూర్ణ స్వరాజ్యసమరంలో పాల్గొనవలసిందని గాంధీజీ ప్రభుతోద్యోగులకు పిలుపునిచ్చాడు. ఆ పిలుపు శంఖారావమై పొట్టి శ్రీరాములు హృదయములో ప్రతిధ్వనించింది. వెంటనే అతడు గాంధీజీతో సమావేశం కావడానికి బయలుదేరారు. ఆ సమయములో దండి సత్యాగ్రహ నిమిత్తం గాంధీజీ సూరత్ నగరంలో వున్నారు. అక్కడ 1930 ఏప్రియల్ 1వ తేదిన శ్రీరాములు గాంధీజీని కలిశాడు. తన జీవిత సర్వస్వాన్ని మానవసేవలో గడిపేందుకు అనుజ్ఞ యివ్వవలసిందిగా గాంధీజీని కోరారు. అతడు చెప్పిందంతా శ్రద్ధగా విన్నాడు బాపూజీ. ప్రస్తుతానికి సబర్మతీ ఆశ్రమంలో చేరవలసిందిగా సలహాయిచ్చాడు. అది ఆత్మబలిదానం ద్వారా అమరజీవికానున్న బంధమై ఆయన జీవితాంతం కొనసాగింది.

గాంధీజీ ఉపదేశంతో ప్రభావితుడైన శ్రీరాములు బొంబాయికి తిరిగి వచ్చాడు. తన మిత్రులను సహవ్రతులను కలిశాడు. తనకు స్వతంత్ర సమరంలో ప్రవేశించాలని వుందని చెప్పాడు. ఆయన ఆప్తమిత్రులు డా॥ యస్.యస్. రావు, ఎ.కె. రావు, ఈ.యల్. నరసింహ, డి. బలరాం, కె. గోవింద రాజులు జి.యస్. సెట్టి మున్నగు వారంతా తొందరపడి ఏ నిర్ణయమూ తీసుకోవద్దని హెచ్చరించారు.

ఉజ్వల భవిష్యత్తును ప్రసాదించే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాన్ని వదలడం శ్రేయోదాయకం కాదన్నారు. పునర్వివాహం చేసుకొని గృహస్థ జీవితానికి అంకితం కావడం అన్ని విధాల శ్రేయస్కరమని నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. కానీ పొట్టి శ్రీరాములు కార్యదీక్ష ధృఢ నిశ్చయం కలవాడు. తనకు మంచిదని తోచిన ఏ పనినైనా నిస్సంకోచంగా చేసేవాడు. ఎవరెంత నిరుత్సాహపరచిన లొంగేవాడు కాడు. స్నేహితుల సలహాలను సవినయంగా తిరస్కరిస్తూ ఉద్యోగ విరమణకు సంసిద్ధుడయ్యాడు.

**ఉద్యోగ విరమణ విషయంముందుగా ప్రభుత్వానికి తెలియ జేయాలి. అలా చేయడం వల్ల పూర్తి ప్రావిడెంట్ ఫండు లభింస్తుందని మిత్రులు సలహా చెప్పారు. ప్రావిడెంట్ ఫండు రెండువేల రూపాయలు వస్తుంది. ఇలాంటి స్వల్ప ప్రయోజనాలకు లొంగేవాడు కాడు. శ్రీరాములు. కాలహరణం వల్ల కార్యదీక్షకు భంగం వాటిల్లుతుందని శ్రీరాములు భావించాడు. వెంటనే ఉద్యోగానికి రాజీనామా చేశాడు.**

ఆప్త మిత్రుడైన ఎ.కె. రావుకు ఇంటి తాళాలు అప్పజెప్పాడు. ఇంట్లో వస్తువులన్ని పేదలకు పంచి యివ్వవలసిందని కోరాడు. అప్పుడు ఆఫీసునుండి ఆయనకు రూ. 700/-లు లభించాయి. ఆ ధనంతో శ్రీరాములు 1930 ఏప్రియల్ 16వ తేదీన సమర్మతీ ఆశ్రమానికి వెళ్ళాడు.

పవిత్రమైన సబర్మతీ ఆశ్రమ వాతావరణం, ఉదాత్తమైన గాంధీజీ ఉపదేశాలు శ్రీరాములు జీవితంలో విప్లవాత్మకమైన మార్పులను తెచ్చాయి. అక్కడ ఆయన గడిపిన మూడు సంవత్సరాల కాలం అతని జీవిత గమ్యాన్నే మార్చివేసింది. గాంధీజీ సహచర్యం ఆయనకు ధైర్యస్థైర్యాలను కలిగించింది. అధర్మాన్ని ధర్మంతో జయించడం, పరిస్థితులు ప్రాబల్యానికి బానిస కాకపోవడం మొదలైన ఉత్తమ మానవతా భావాలు శ్రీరాములులో వేళ్ళూరినాయి. శ్రీరాములు అనతికాలంలోనే బాపూజీ శిష్యకోటిలో ప్రధమస్థానం సంపాదించాడు. శ్రీరామలు త్యాగమయ జీవితాన్నిచూచి గాంధీజీ ముగ్ధడయ్యాడు.

మద్రాసు నగరంలో 1946లో దక్షిణ భారత హిందీ ప్రచారసభలో రజతోత్సవాలు జరిగాయి. ఆ సభలో గాంధీజీ అధ్యక్షత వహించాడు. అప్పుడు

శ్రీరాములు సంఘసేవా కార్యక్రమంలో నెల్లూరులో వున్నాడు. తాను సాధించిన కృషిని గాంధీజీకి నివేదించడానికి మద్రాసు వచ్చాడు. సభాస్థలికి చేరుకున్నాడు. ఆయన వేషం అతినిరాడంబరంగా వుంది. 'హరిజనోద్ధరణ' అనే నినాదంగల అట్టముక్క మెళ్లో వేళాడుతుంది. నాటి సభను మోటరు సత్యనారాయణ, హరిహరశాస్త్రి ప్రభృతులు నిర్వహిస్తున్నారు.

**వాళ్లు శ్రీరాములును ఒక సామాన్య వ్యక్తిగా భావించారు. గాంధీజీని కలవాలని ఆయన అడిగితే అందుకు నిరాకరించారు గత్యంతరం లేక శ్రీరాములు సభాప్రాంగణంలో అటూ ఇటూ తిరగసాగాడు. అది గమనించిన గాంధీజీ వెంటనే శ్రీరాములును సభావేదిక వద్దకు పిలిపించుకున్నాడు.**

శ్రీరాములుకు జరిగిన అసౌకర్యానికి ఎంతో బాధపడ్డాడు.

**సభలో శ్రీరాములును గురించి ప్రసంగిస్తూ "పొట్టి శ్రీరాములు వంటి నిస్వార్థపరులైన దేశభక్తులు పదిపన్నెండు మంది నా అనుచరులుగా వుంటే స్వరాజ్యాన్ని ఏనాడో సాధించి వుండేవాణ్ణి"**

అని శ్రీరాములు పై తనకుగల ప్రగాఢ విశ్వాసాన్ని వ్యక్తం చేశాడు.

సబర్మతీ ఆశ్రమవాసులు గాంధీ గారి ఏకాదశ సూత్రప్రవర్తనా నియమావళిని విధిగా పాటించాలి. 1) సత్యం 2) అహింస 3) బ్రహ్మచర్యం 4) స్వార్జితం లేకుండడం 5) ఇంద్రియ నిగ్రహం 6) దొంగతనం చేయడకుండడం 7) నిర్భయత్వం 8) అస్పృశ్యతా నివారణ 9) స్వయంకృషిపై జీవించడం 10) సర్వమత సమానత్వం 11) స్వదేశీ వస్తువులనే వాడడం అనేవి పదకొండు నియమాలు. ఈ ఆశయాల ఆధారంగానే గాంధీజీ దేశమంతటా ఆశ్రమాలు స్థాపించాడు. అనేక కార్యక్రమాలు నిర్వహిచాడు. సబర్మతీ ఆశ్రమంలో చేరే ప్రతివ్యక్తి ఈ నియమోల్లంఘనం చేయనని ప్రయాణం చేయాలి. నియమబద్ధం గాని జీవితం లంగరులేని పడవలాంటిదని గాంధీజీ అభిప్రాయం. నియమ రహితుడైన వ్యక్తి అనుక్షణం ప్రలోభానికి గురయ్యే అవకాశం వుంది.


కఠోర నియమ పాలనవల్ల వ్యక్తి పతనాన్ని తప్పించుకొంటాడు. నియమ పాలనవల్ల మానవుల్లో ధృడనిశ్చయం, కార్యదీక్ష, సంపూర్ణ వ్యక్తిత్వం,

పెంపొందుతాయి. స్థిరత్వమే లేకుంటే భారతదేశ మనుగుడకే ముప్పు వాటిల్లేది. సూర్య చంద్రాది గ్రహాలు నియమంగా సంచరిస్తున్నాయి. గ్రహగతులును బట్టే మన పంచాంగాలు గుణించబడుతున్నాయి. సూర్య చంద్రోదయాస్త మయాలను బట్టే కాలగతిని నిర్ణయించుకొంటున్నాము. ఇలాంటి స్థిరమైన ప్రకృతి న్యాయమే మానవులకు కూడా వర్తిస్తుంది.

మానవ జీవితత్వాన్ని గురించి గాంధీజీ వ్యక్తం చేసిన అభిప్రాయాలు పొట్టి శ్రీరాములు మనస్సుపై చెరగని ముద్ర వేశాయి. గాంధీజీ స్వానుభవ వేదాంత ప్రవచనాలు శ్రీరాములుకు జీవిత సత్యాలుగా అగుపించాయి. నిరంతర సత్యాన్వేషణా, జిజ్ఞాస ఆజన్మాంత కష్ట సహిష్టుతాది గుణాల నలవరచుకొంటే సాధారణ వ్యక్తి కూడా గాంధీజీ సిద్ధాంతాలను ఆచరణయోగ్యం చేయగలడని శ్రీరాములు విశ్వసించాడు. ఈ అంశాన్ని శ్రీరాములు తన జీవిత కాలంలోనే ఋజువు చేశాడు.

## సబర్మతీ ఆశ్రమవాసులు పాటించవలసిన 11 సూత్రాల ప్రవర్తనా నియమావళిని ఆచరణయోగ్యం చేయడానికి ఈ క్రింది కార్యక్రమాలు నిర్వహింపబడేవి.

1. **ప్రార్థన :** సబర్మతీ ఆశ్రమ కార్యక్రమాలు ఉదయం సామూహిక ప్రార్థనా సమావేశంతో ప్రారంభింపబడి సాయంకాల ప్రార్థనా సమావేశంతో ముగుస్తాయి. నిత్యం ప్రాతఃకాల ప్రార్థన 4-15 ని.ల వరకు ప్రార్థన జరుగుతుంది. ఆశ్రమవాసులందరూ ఆ ప్రార్థనా సమావేశాల్లో తప్పక పాల్గొనాలి. సర్వం భగవదర్పణం చేసి ఆత్మశుద్ధి పొందడానికి ఆ ప్రార్థనా సమావేశాలు ఉత్తమ సాధనాలుగా ఉద్దేశింపబడ్డాయి.
2. **పారిశుధ్యం :** పారిశుధ్యం కోసం బయటి వ్యక్తులను నియమించడం ఆశ్రమ నియమాలకు పూర్తిగా విరుద్ధం. అందుచేత ఆశ్రమ సభ్యులే వంతుల వారిగా ఈ విధులను నిర్వహించాలి. సాధారణంగా లోతున గుంతలను త్రవ్వి మల మూత్రాదులను అందులో విసర్జించి కప్పివేస్తారు. అలా చేస్తే అది సారవంతమైన ఎరువుగా తయారవుతుంది. ఆశ్రమవాసులంతా నిర్ణీత స్థలాల్లోనే కాలకృత్యాలు తీర్చుకోవాలి. ఆశ్రమ ఆవరణాన్ని పరిశుభ్రంగా



ఉంచటానికి అన్ని వేళలా శ్రద్ధ వహించాలి.

3. **నూలు వడకటం :** ఆశ్రమంలో జరిగే ప్రధాన కార్యక్రమాల్లో నూలు వడకటం ఒకటి. ఆశ్రమవాసులంతా నూలు వడికే కార్యక్రమాన్ని దేశసేవగా భావిస్తారు. నూలు వడికే విభాగంలో ఈ క్రింది పనులు నిర్వహింప బడతాయి. 1) పత్తి నుండి విత్తనాలు వేరుచేయడం 2) దూదిని శుభ్ర పరచటం 3) నూలు వడకటం 4) బట్టలు నేయడం 5) బట్టలమీద అద్దకం వేయడం 6) రాట్నాలు, కదుళ్ళు మున్నగు పరికరాలను మరమ్మత్తు చేయడం.

4. **వ్యవసాయం :** ఖద్దరు బట్టలకు అవసరమైన పత్తిని ఉత్పత్తి చేయడం. పశుగ్రాసాన్ని సిద్ధం చేయడం ఆశ్రమవాసుల కవసరమైన పండ్లను కూరగాయలను పండించడం వ్యవసాయ విభాగంలోని ప్రధాన కార్యక్రమాలు.

5. **పాల ఉత్పత్తి :** సబర్మతీ ఆశ్రమంలో పాల ఉత్పత్తి కేంద్రం వుంది దీన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నం జరిగింది. దీని నిర్వహణకు భారత గోరక్షణ సంఘం వారి ఆర్థిక సహాయం లభించింది. ఈ కేంద్రం

గోరక్షణ సంఘం వారి ఆదేశాల మేరకు నడుచుకొనేది. అయినా యిది సబర్మతీ ఆశ్రమంలో అంతర్భాగంగా పరిగణింపబడింది.

6. **చర్మ పరిశ్రమ :** సబర్మతీ ఆశ్రమంలో ఒక చర్మ పరిశ్రమ కేంద్రం కూడా వుంది. ఇది అఖిల భారత గోసంరక్షణ సంఘ నియామావళి ననుసరించే ఏర్పాటు చేయబడింది. దీనికి అనుబంధంగా పాదరక్షోత్పత్తి కేంద్రం స్థాపించబడింది. గోరక్షణ హిందువుల పవిత్ర కర్తవ్యంగా భావింబడినప్పటికీ ఆచరణాత్మక కృషి జరగడం లేదు. పశుపోషణలో, వాటి పారిశుధ్యంలో తగినకృషి జరగనుట్లయితే పశుసంపద క్రమంగా క్షీణించి పోతుందని గాంధీజీ భావించారు. అందుచేత క్షీరోత్పత్తి కేంద్రం చర్మ పరిశ్రమ సబర్మతి ఆశ్రమంలో భాగంగా స్థాపించబడ్డాయి.

7. **జాతీయ విద్య :** జాతీయ వికాసానుగుణమైన విద్యను ఆశ్రమంలో ప్రవేశ పెట్టే ప్రయత్నం జరిగింది. మానసిక వికాసంతో పాటు శరీర సౌష్టవం పుస్తక పఠనంతో పాటు కష్టించి పని చేసే మనస్తత్వం అలవరచుకొనే అవకాశం కల్పించబడింది. ఆశ్రమ వాసుల నడవడికి సంబంధించిన ప్రతి సూక్ష్మాంశములోను అత్యంత శ్రద్ధ తీసుకోబడింది. అస్పృశ్యులైన బాలురకు ఉచితంగా విద్య నేర్పబడింది. సబర్మతీ ఆశ్రమం స్త్రీ పురుషులకు సమానావకాశాలు కల్పించడంలో శ్రద్ధ వహించింది. గుజరాతీ విద్యాపీఠం అంగీకరించిన నియమావళిని సబర్మతీ ఆశ్రమం కూడా అమలు జరిపింది.

8. **ఖాదీ పాఠశాల :** సబర్మతీ ఆశ్రమంలో ఒక సాంకేతిక పాఠశాల నెలకొల్ప బడింది. అఖిలభారత చేనేత పనివారి సంఘం దీనికి అధ్యక్షత వహించింది. ఈ పాఠశాల ఖాదీకి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని బోధిస్తుంది. ఈ పాఠశాల పాఠ్య ప్రణాళిక ఇలా వుంటుంది.

21 వారాలు నూలు వడకడం.

7 వారాలు పత్తిని శుభ్రపరచడం.

2 వారాలు పత్తి నుండి విత్తనాలు తొలగించడం.

వీటితోపాటు వడ్రంగం మొదలైన పనులు వుంటాయి. ఎన్ని కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ ఆశ్రమవాసులు నియమాలను తు.చ. తప్పక పాటించేవారు. సబర్మతీ ఆశ్రమవాసుల దైనందిన కార్యక్రమాలిలా వుండేవి.

| | | | |
|---|---|---|---|
| ఉదయం | 4-00 | గంటలకు | నిద్రలేవడం. |
| 4-15 | - | 4-45 | సామూహిక ప్రార్థన |
| 5-00 | - | 6-10 | వ్యాయామం - స్నానం |
| 6-10 | - | 6-30 | అల్పాహారం |
| 6-30 | - | 7-00 | స్త్రీల ప్రార్థనా సమావేశం |
| 7-00 | - | 10-45 | ఆశ్రమ పారిశుద్ధ్యం ఇతర కార్యక్రమాలు |
| 10-45 | - | 11-15 | మధ్యాహ్న భోజనం |
| 11-15 | - | 12-00 | విశ్రాంతి |
| 12-00 | - | 4-30 | శ్రమదానం |
| 5-30 | - | 6-30 | సాయంత్ర భోజనం |
| 6-30 | - | 7-00 | విశ్రాంతి |
| 7-00 | - | 7-30 | సామూహిక ప్రార్థన |
| 7-30 | - | 9-00 | వినోదం - విశ్రాంతి |
| | - | 9-00 | నిద్రించడం |

ఆశ్రమవాసులందరిలాగే శ్రీరాములు కూడా ఖాదీ పరిశ్రమలోని సాంకేతిక పరిజ్ఞానంలో ఆరితేరారు. ఈ విషయంలో ఆశ్రమ కార్యదర్శి నారాయణదాస్ గాంధీ ఆశ్రమవాసి మగన్లాల్ గాంధీ శ్రీరాములుకు ఎంతో తోడ్పడ్డారు. శ్రీరాములు వడ్రంగం, గోసంరక్షణ, పశు చర్మాన్ని శుభ్రపరచడం, పాదరక్షల తయారీ మున్నగు పనులు చేసేవాడు. ఈ ప్రత్యేక కార్యక్రమాలే కాకుండా వీధులు ఊడ్వడం, వీధి దీపాలు నూనెతో వెలిగించడం, రాత్రివేళ ఆశ్రమాన్ని కాపలా కాయడం వంట చేయడం, పాత్రలు శుభ్రంచేయడం, బావినీళ్ళు తోడడం, ఆశ్రమానికి కావలసిన సరుకులు కొనుక్కొని రావడం, ఆశ్రమ జమా ఖర్చులు చూడడం. మున్నగు కార్యక్రమాలను తన సహవ్రతులతో కలసి చేసేవాడు. ఆశ్రమవాసులు ధనం కన్నా కాలాన్ని విలువగా భావిస్తారు. అందుచేత ఎవరు ఎప్పుడు ఏ పని చేసింది తెలియజేసే దిన చర్యను విధిగా వ్రాయవలసి వుంటుంది. వాళ్లంతా గాంధీజీ 11 సూత్రాల నియమావళిని క్రమంగా పాటిస్తూ గ్రామోద్ధరణకు కృషి చేయవలసి వుంటుంది.

**“ప్రతి వ్యక్తి స్వార్థ త్యాగం చేసి ప్రజా సేవకు అంకితం కావాలి. ప్రతిఫల రహితమైన సంపూర్ణ త్యాగానికి సిద్ధపడాలి. ఇటువంటి వ్యక్తి మాత్రమే నిజమైన ప్రజాసేవకుడు” అని గాంధీజీ విశ్వసించేవారు.**

పొట్టి శ్రీరాములు గాంధీజీ అభిప్రాయాన్ని తు.చ. తప్పకుండా పాటించాడని ఈ క్రింది సంఘటన ఋజువు చేసింది. నెల్లూరులో హరిజనోద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టాడు. అప్పుడు వర్ణాంతర పంక్తి భోజనాలను నిర్వహించాడు. తద్వారా ప్రజల్లో చైతన్యాన్ని కలిగించాడు. వీధులవెంట తిరిగి భిక్షాటన చేశాడు. అగ్రకులాలవారు ఎంత విమర్శించినా ఎన్ని బాధలు పెట్టినా ఆయన అణుమాత్రం లెక్క పెట్టలేదు. పాకీవాళ్ళతో కలసి వాళ్ళ యిళ్ళలోనే నివసించాడు.

గాంధీజీ ప్రబోధించిన బ్రహ్మచర్యవ్రతం కూడా శ్రీరాములును మిక్కిలి ఆకర్షించింది. బ్రహ్మచర్యాన్ని గూర్చి గాంధీజీ “బ్రహ్మచారి ప్రముఖంగా జిహ్వా చాపల్యాన్ని విస్మరించాలి. కఠోర ఆహార నియమాన్ని పాటించాలి. దీనివల్ల బ్రహ్మచర్యాన్ని అనుష్ఠించడం అతి సులువు అవుతుంది. శాకాహారం బ్రహ్మచర్యాన్ని కాపాడుతుంది. అందుకే నేను శాఖాహారినయ్యాను. బ్రహ్మచారులు ఉప్పు, కారం, మసాలా లేని ఆహారం తీసుకోవాలి. ఇది నా స్వానుభవంతో గ్రహించాను. సాధ్యమైనంతవరకు ఉడికిన పదార్థాలు తినాలి. పరిమితంగా భుజించాలి”. ఆశ్రమవాసులంతా ఈ నియమాలను విధిగా పాటించవలసి వచ్చేది. ఆశ్రమంలో శాకాహారం మాత్రమే లభిస్తుంది. ఒక చిన్న కప్పు నిండా పప్పు, ఒక పొడికూర, ఒక ఆకుపూర, కొద్దిగా అన్నం వడ్డిస్తారు. పాలు, పెరుగు, నెయ్యి దొరకవు. అవి కావలసినవారు ప్రత్యేకంగా పైకం చెల్లించి తీసుకోవాలి. శ్రీరాములు చిన్నతనం నుండి శాకాహారి కనుక ఆశ్రమ నియమాల వల్ల ఇబ్బంది కలుగలేదు. పైగా ఆయన ప్రాపంచిక సుఖాలపై విరక్తి కలిగిన దశలో ఆశ్రమంలో చేరాడు. అందుచేత కఠిన నియమాలను తేలికగా పాటింపగలిగాడు.

ఆశ్రమంలో నెలసరి భోజన వ్యయాన్ని సభ్యులంతా సమానంగా భరించే వాళ్ళు. ప్రతి సభ్యునికీ నెలసరి తిండి ఖర్చు ఆరు రూపాయలకు మించేది కాదు. ఆశ్రమం ప్రతి సభ్యునికీ నెలకు 12 రూపాయలు ఇస్తుంది. భోజనానికి పోను మిగతా పైకం చిల్లర ఖర్చులకు వాడుకొనేవారు. ఇంకా మిగిలిన పైకాన్ని

తమ వద్ద గానీ బ్యాంకులో గాని దాచుకొనేవారు.

పొట్టి శ్రీరాములు ప్రధానంగా ఆశ్రమ గ్రంథాలయాన్ని నిర్వహించేవాడు. ఆయన కొంతకాలం ఆశ్రమ జమా ఖర్చులు చూసి ఆశ్రమవాసులకు నెలసరి బత్తెం యిచ్చే బాధ్యతను స్వీకరించాడు. కొందరు ఆశ్రయవాసులు నెలసరి భత్యాన్ని ముందుగానే ఖర్చుచేసుకొని అడ్వాన్సులు అడిగేవారు. కానీ శ్రీరాములు వారికి అడ్వాన్సులు ఇవ్వడానికి నిరాకరించేవాడు. అంతేకాక డబ్బును వృధాగా ఖర్చు చేయడం ఆశ్రమ నిబంధనలకే విరుద్ధం అనీ పొదుపు పాటించడం శ్రేయస్కరమనీ వారికి హితబోధలు చేసేవాడు. శ్రీరాములు నిజాయితీ తెలిసినవారు గనుక వాళ్ళ ఆయన మాటలకు బాధపడేవారు కాదు. పైగా అతని సూచనలను సహృదయముతో స్వీకరించేవారు.

శ్రీరాములు తనకు లభించే 12 రూపాయల్లో ఎక్కువ మొత్తాన్ని పొదుపు చేసి ఆశ్రమానికి చెల్లించేవాడు. మిగిలిన పైకాన్ని ఆశ్రమానికి చెల్లించవలసిన అవసరము లేదని ముందు ముందు స్వంత అవసరాలకు పనికి వస్తాయనీ ఆశ్రమ కార్యదర్శి మున్నగువారు సలహా యిచ్చారు. ఆశ్రమంలో ఎవరికైనా కష్టమువస్తే ఆశ్రమవాసులే ఆదుకొంటారనీ పైకం దాచుకోవటం అసమంజసమని శ్రీరాములు ఖండితంగా చెప్పాడు. పైగా యిది ఆశ్రమ నియమావళికే విరుద్ధమని చెప్పాడు. ఈ సందర్భములో గాంధీజీ అభిప్రాయాలను ఇలా చదివి వినిపించే వాడు.

**ఏ వ్యక్తి తన కవసరములేని ఏ వస్తువునూ సేకరించి దాచుకొనరాదు. ఉదాహరణకు కుర్చీతో పనిలేని వ్యక్తి దానిని తనవద్ద దాచుకోవడం స్వార్థం అవుతుంది. ఇది ఆశ్రమ నియమావళికి విరుద్ధం. కనుక ఈ సిద్ధాంతాన్ని సహృదయముతో అర్థం చేసికొని ఆచరించినవాడే నిజమైన నిరాడంబరజీవి.**

గాంధీజీ అహింసా సిద్ధాంతాన్ని కూడా నిర్దిష్టంగా అవగావన చేసికొన్నాడు శ్రీరాములు. ఇందుకు ఒక దృష్టాంతం వుంది. సబర్మతీ ఆశ్రమంలో ఒకసారి 2 1/2 అడుగుల పొడవుగల నాగుపాము పొట్టి శ్రీరాములు అతని మేనల్లుడు నరసింహగుప్తా నివసించే నివాసం దగ్గర తిరుగుతూ కనిపించింది. ఆశ్రమంలో కొత్తగా చేరినవాళ్ళు రాళ్లతో కొట్టగా రెండు ముక్కలైంది. వెనుకభాగం అవతల పడింది. పడగవున్న ముందుభాగం బాధతో గిలగిల కొట్టుకోసాగింది. అప్పుడు

శ్రీరాములు దాని బాధ చూడలేక తన మేనల్లుడుచేత దాన్ని చంపించాడు. కొందరు ఆశ్రమవాసులు ఇందుకు అభ్యంతరం చెప్పారు. ఒక ప్రాణిని చంపడం ఆశ్రమ నియమావళికి విరుద్ధమని నిదించారు. సాయంత్రపు సామూహిక ప్రార్థనా సమయంలో గాంధీజీ దృష్టికి తెచ్చారు. గాంధీజీ సావధానంగా విన్నాడు. అప్పుడు శ్రీరాములు అహింసా సిద్ధాంతానికి అనుగుణంగానే తానాపని చేసినట్లు చెప్పాడు. ఆ మాటలు విన్న గాంధీజీ తన వెనుకటి అనుభవాన్ని గుర్తు చేసుకొంటూ యిలా అన్నాడు. కొన్ని రోజుల క్రిందట ఆశ్రమంలోని ఒక ఆవుదూడ అనారోగ్యంతో బాధపడసాగింది. దానికి తగిన చికిత్స కూడా చేయబడింది. వైద్యుడు అది బ్రతికే అవకాశం ఏ మాత్రం లేదని చెప్పాడు. క్రమంగా దాని బాధ ఎక్కువైంది. మెడ తిప్పడానికి కూడా వీలులేక తన్నుకొనసాగింది. ఈ స్థితిలో దాన్ని చంపడమే దాని బాధ విముక్తికి మార్గంగా కనబడింది. ఆ విధంగా చేయడమే నాకు మానవత్వమని తోచింది. ఈ సంఘటనను చెప్పి గాంధీజీ శ్రీరాములును సమర్థించాడు. తన సిద్ధాంతాన్ని త్రికరణశుద్ధిగా ఆచరించే ఉత్తమ శిష్యుడని గ్రహించి సంతోషించాడు. అప్పుడు నిజమైన అహింసనుగూర్చి గాంధీజీ ప్రసంగించాడు. ఈ అంశాన్నే తరువాత 'హరిజన్' పత్రికలో "ఎవరైనా సమయోచితంగా హింసాహింసల స్వరూపాన్ని ఆత్మ సాక్షిగా నిర్ణయించుకోవాలి. ఈ వినయంలో సిగ్గుపడనవసరంలేదు. ఎవరికీ భయపడనవసరం లేదు" అని వ్రాశాడు.

సేవా భావం, త్యాగం, లక్ష్యసాధనపట్ల అచంచల దీక్ష గలవాడు పొట్టి శ్రీరాములు. నిర్భయత్వం, దేశాభిమానం అతనిలో మూర్తీభవించి ఉండేది. ధైర్యం, విజ్ఞత, సత్యవ్రతం, కఠోర దీక్ష మున్నగు సుగుణాలతో గాంధీజీని ఆకర్షించాడు శ్రీరాములు. క్రమంగా గాంధీజీ సన్నిహితుల్లో ఒకడయ్యాడు. అతని అభిప్రాయములను గాంధీజీ ఎంతో గౌరవించేవాడు. తన ఆదర్శమూర్తి గాంధీజీతో శ్రీరాములుకూడా తలచిన కార్యాన్ని ఏదో విధంగా సాధించడం ప్రధానం కాదనీ ఉత్తమ మార్గాల ద్వారానే సాధించాలనీ నమ్మేవాడు. శ్రీరాములు నిజమైన గాంధేయవాది. నిష్కళంక స్వభావి. ఎన్ని కష్టాలు వచ్చినా ఆదర్శాన్ని వదులుకొనేవాడు కాదు. కొన్నివిషయాల్లో అతని మొండి పట్టుదలను చాదస్తమని తలచి హేళన చేసేవాళ్ళు కూడా అతని నిజాయితీని శంకించేవాళ్ళు కాదు. చెప్పింది చేసి చూపించే అతని సామర్థ్యాన్ని మెచ్చుకొనేవారు. ఈ అంశాన్ని

సబర్మతీ ఆశ్రమంలో ఈ క్రింది సంఘటన ఋజువు చేసింది.


సబర్మతీ ఆశ్రమంలో వృద్ధులకూ స్త్రీలకూ ప్రత్యేక వసతి గృహాలుండేవి. అధ్యాపకులు, వృద్ధులు వారికై నిర్ణయించిన వసతి గృహాల్లో కుటుంబ సమేతంగా నివసించేవారు. యువకులు హాస్టళ్లలో వుండేవారు. స్త్రీలంతా 'ఛాత్రాలయం' అనే వసతి గృహంలో వుండేవారు. గాంధీజీ 'హృదయకుంజ్' అనే కుటీరంలో నివసించేవారు. అక్కడే ఉదయం సాయంత్రాల్లో సామూహిక ప్రార్థనలు జరిగేవి. సబర్మతీ ఆశ్రమంలో నియమబద్ధమైన జీవితం కొనసాగేది. సభ్యులంతా కులమత వర్ణవయో విచక్షణలేక ఆశ్రమ నియమాలకు కట్టుబడి వుండాలి. ఉదాహరణకు రాత్రి 9 గంటలు దాటిన తరువాత కార్యదర్శి నారాయణదాస్ గాంధీ స్త్రీ విభాగం నిర్వాహకురాలైన కుమారి ప్రేమబెహన్ కంటక్ (యమ్.ఏ.) తో చాత్రాలయంలో రాత్రి 9 గంటలు దాటిన తరువాత కూడా ఆశ్రమ వ్యవహారాలు చర్చిస్తూ గడపడం కొందరు ఆశ్రమవాసులు గమనించారు. ఇది యువకులలో ఒక చర్చనీయాంశమైంది. వారిద్దరూ సత్ ప్రవర్తన గలవాళ్ళు. ఆ విషయాన్ని పొడిగించక అంతటితో ఆపడం మంచిదని ఆశ్రమ పెద్దలలో ఒకరైన సురేంద్రజీ యువకులకు సలహాయిచ్చారు. ఆ మాటలు యువకులకు సంతృప్తి కలిగించాయి. వాళ్ళిద్దరూ నిష్కళంకమైన వ్యక్తులైనా ఆశ్రమ నియమోల్లంఘనం చేయడాన్ని శ్రీరాములు సహించలేక పోయాడు మార్గదర్శకులు కావలసిన పెద్దలే యిలా చేస్తే ఇతరులు కూడా వారిని అనుసరించే ప్రమాదముంది. అందుచేత ఈ విషయాన్ని గాంధీజీ దృష్టికి తీసుకు రావాలని శ్రీరాములు పట్టుబట్టాడు. నారాయణదాస్ గాంధీజీకి దగ్గరి బంధువు. పైగా ఆశ్రమ కార్యదర్శి. అందుచేత అతనిమీద అభియోగం మోపడానికి ఆశ్రమవాసు లెవ్వరూ ముందుకు రాలేదు. కానీ శ్రీరాములు ఎట్టి పరిస్థితుల్లోనూ తన అంతరాత్మకు వ్యతిరేకంగా ప్రవరించే వ్యక్తికాదు. ఇలాచేస్తే నారాయణదాసుకు కోపమూ, బాధా కలుగవచ్చు, అయినా ఏ మాత్రం సంకోచించక గాంధీజీకి ఫిర్యాదు చేశాడు.

ఆ రోజు సాయంత్రం ప్రార్థనా నంతరం గాంధీజీ నారాయణదాస్ గాంధీని కుమారి ప్రేమబెహన్ కంటకన్ను పిలిపించాడు. శ్రీరాములు ఫిర్యాదును గురించి ప్రశ్నించాడు. అందుకు వారు ఆశ్రమానికి సంబంధించిన కొన్ని ముఖ్యవిషయాల చర్చల్లో నిమగ్నమై ఉండటంవల్ల నిమగ్నమై ఉండటంవల్ల నిర్ణీత సమయందాటి

వుండవచ్చని దానిని తాము గమనించలేదనీ చెప్పారు. అయితే గాంధీజీ వారి సమాధానంతో తృప్తిపడలేదు. అప్పుడు బ్రహ్మచర్యం అంటే ఏమిటో ఇలా వివరించాడు.

**"కేవలం కొన్ని యాంత్రిక నియమాలను పాటించడం మాత్రమే బ్రహ్మచర్యం కాదు. మనోవాక్కాయ కర్మలను జయించి నిష్కళంక జీవితాన్ని గడపడమే నిజమైన బ్రహ్మచర్యం."**

అప్పుడు వారిని కొంచెం మందలిస్తూ గాంధీజీ "స్త్రీ పురుషులు కలసి మెలసి ఉండడాన్ని అవకాశంగా తీసుకొని ఎవ్వరూ చనువుగా ప్రవర్తించరాదు. ఆశ్రమ జీవితాన్ని నియమ బద్ధం చేయడానికి కొన్ని సూత్రాలు నిర్దేశించబడ్డాయి. అనుభవజ్ఞులైన పెద్దలు వాటిని నిర్లక్ష్యం చేస్తే మంచి చెడ్డలు తెలియని యువకులు వారి ననుసరించి చెడిపోతారు. అని అన్నాడు. ఆయన ఉదాహరణగా తన జీవితంలో జరిగిన సంఘటనను ప్రస్తావించాడు.



సబర్మతీ ఆశ్రమం స్థాపించబడ్డ క్రొత్తలో గాంధీ నిత్యం వ్యాహ్యాళికి వెళ్లేవాడు. అప్పుడు ఆయన కిరుప్రక్కలా వుండే అమ్మాయిల భుజాలపై చేతులు వేసి నడిచేవాడు. అలా చేతులు వేయడాన్ని కొందరు విమర్శించారు. వెంటనే ఆ అలవాటుకు స్వస్తి చెప్పాడు. గాంధీజీ గుర్తు చేసిన ఈ అంశం నారాయణ దాసు మనస్సు మీద పనిచేసింది. అప్పటి నుంచి నిర్ణీత సమయం దాటిన తరువాత చిత్రాలయంలో ఉండడం మానివేశాడు. ఇలా పొట్టి శ్రీరాములు ఆశించిన ప్రయోజనం సిద్ధించింది. అప్పటి నుండి శ్రీరాములంటే నారాయణదాసుకు గౌరవభావం పెరిగింది. శ్రీరాములు లాగా నారాయణదాసు కూడా శుద్ధ గాంధేయవాది కావడమే దీనికి కారణం.

మానవ జీవితంలో మార్పులు రావడం సహజం. భారత రాజకీయాలు


కొత్త మలుపు తిరిగాయి. ఇప్పుడు గాంధీజీ సాహచర్యం నుండి శ్రీరాములు విడిపోయే పరిస్థితులు సంభవించాయి. 1933వ సంవత్సరం మే 8వ తేదిన గాంధీజీ ఆత్మ పరిశుద్ధి కోసం ఎర్రవాడ జైల్లో మూడు వారాల నిరాహారదీక్ష ప్రారంభించాడు. ఆశ్రమ వాసుల్లో సేవాభావాన్ని పెంపొందించడానికి కూడా ఈ దీక్ష ఉద్దేశింపబడింది. నిరాహారదీక్ష ప్రారంభించిన తొలినాడే ప్రభుత్వం గాంధీజీని విడుదల చేసింది. అందుకు బ్రిటిష్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపాడు. తాను 1933 జనవరి నుండి కొనసాగిస్తున్న శాసనోల్లంఘనోద్యమాన్ని తాత్కాలికంగా ఆరువారాల వరకు నిలిపివేశాడు. శాంతి భద్రతలు పునరుద్ధరించ వలసిన ఆవశ్యకతను తెలుపుతూ వైస్రాయికి టెలిగ్రాము పంపాడు. గాంధీజీ ప్రతిపాదనను వైస్రాయి పూర్తిగా తిరస్కరించాడు. అందువల్ల గాంధీజీ శాసనోల్లంఘనోద్యమాన్ని తిరిగి ప్రారంభింపదలిచాడు.

గాంధీజీ తాను నివసిస్తున్న ఎర్రవాడ నుండి గుజరాత్‌లోని 'రాస్' గ్రామానికి ఆగష్టు 1వ తేదీన తన ముఖ్య సహచరులతో పెద్ద ప్రదర్శన నడపడానికి నిశ్చయించాడు. ఆనాటి రాత్రే బ్రిటిష్ ప్రభుత్వం గాంధీజీని 34 మంది సబర్మతీ ఆశ్రమ వాసులను నిర్బంధించింది. అలా నిర్బందించబడిన వారిలో పొట్టి శ్రీరాములొకడు. అహమ్మదాబాద్‌లోని అంబాలాల్ సారీ భాయ్ యింట్లో వుండగా వీరందరినీ అరెస్టు చేశారు. వాళ్లంతా సబర్మతీ జైలుకు పంపబడ్డారు. ఇలా శ్రీరాములు ప్రధమంగా జైలు జీవితాన్ని చవి చూశాడు. అతనిలో కలిగిన బాధకంటే సబర్మతీ ఆశ్రమ వియోగమే కష్టమైంది. శ్రీరాములు గాంధీజీ ప్రభావంతో నిర్భకుడు కావడం, దుర్మార్గాన్ని సన్మార్గంతో జయించడం, ప్రతికూల పరిస్థితులకు లొంగక పోవడం మొదలైన సుగుణాలు సబర్మతీ ఆశ్రమంలోనే సాధించాడు. అందుకే ఆశ్రమాన్ని వదలి వుండాలంటే ఆయనకంత బాధ కలిగింది.

* * *

## మూడవ అధ్యాయం

# దేశ సేవా కార్యం




క్రీ॥ శ॥ 1934 జనవరి 15వ తేదిన బీహార్ ఉత్తర ప్రాంతములో పెద్ద భూకంపం ఏర్పడి భీభత్సాన్ని సృష్టించింది. ఆనాడు పగలు 2 గంటల సమయంలో భూమి మూడుసార్లు తీవ్రంగా కంపించింది. భూమి బ్రద్దలు కొనసాగింది. అప్పుడు పుట్టిన భీకర శబ్దం చుట్టూ కొన్ని ఫర్లాంగుల వరకు చెవులు గింగురు మనేటట్టు వినిపించింది. ఈ భూకంపం సుమారు 77,700 చదరపు మైళ్ల విస్తీర్ణం వరకు వ్యాపించింది. దీనివల్ల 150 లక్షల మంది తీవ్రబాధకు గురి అయ్యారు. ఉత్తర బీహార్ ప్రాంతంలోని పల్లెలూ పట్టణాలూ అన్నీ నేలమట్ట మయ్యాయి. ముఖ్యంగా చాప్రా, ముజఫర్‌పూర్, చంపారన్, దర్భాంగా జిల్లాలు సర్వనాశనమయ్యాయి. భూకంపం సంభవించిన ప్రాంతములో ఒక్క యిల్లు కూడా మిగల్లేదు. అనేక చోట్ల 60 మీటర్ల పొడువు 10 మీటర్ల లోతుగల పగుళ్ళు ఏర్పడ్డాయి. భూగర్భం నుండి ఇసుక ఎగజిమ్మడం వల్ల ఎన్నో చోట్ల బావులు చెరువులు పూర్తిగా ఎండిపోయాయి. కొన్నివేల ఎకరాల పంటపొలం బీడుపడి పోయింది. దాదాపు పది లక్షల ఇళు ్ళ కూలిపోయాయి. వందల సంఖ్యలో జనం మరణించారు. లక్షల మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. సుమారు 1440 కిలోమీటర్ల రైలు మార్గం ధ్వంసమైంది. ప్రజలు గాదెల్లో గరిసెల్లో దాచుకొన్న ధాన్యం భూగర్భంలో కలిసిపోయింది ప్రజలకు అన్ని వస్త్రాలు కరువయ్యాయి. కరువు కాటకాలు వికృత రూపం ధరించాయి. పశువుల పేడలో జీర్ణంకాక మిగిలిన గింజలేరి శుభ్రపరిచి గంజి చేసుకొని ప్రాణాలు నిలుపుకొనే దుర్భర పరిస్థితి ఏర్పడింది. అనేక చోట్ల స్త్రీ పురుషుల మానరక్షణకు కూడా బట్టలు కరువయ్యాయి. కుటుంబానికి ఒకే

జత బట్టలుండి బయటికి వెళ్ళేవ్యక్తి ధరిస్తే ఇంట్లోవాళ్ళు దిగంబరులుగా ఉండవలసిన పరిస్థితి ఏర్పడింది. ఈ దుస్థితిలో తాము నివసించే గుడిసెను రెండుభాగాలుగా చేసి స్త్రీ పురుషులు విడివిడిగా ఉండవలసిన దుర్గతి పట్టింది.

ఈ భయంకర భూకంపానికి భారతీయులంతా దిగ్భ్రాంతి చెందారు. ఈ దుస్థితి నెదుర్కోవడం భారత ప్రభుత్వానికి పెద్ద సమస్య అయింది. ఇందుకు వారికి ప్రజా సహకార మవసరమయింది. ఆనాడు ప్రజా సహకారమంటే కాంగ్రెస్ పార్టీ సహకరించడమే. అందుచేత ప్రభుత్వం కాంగ్రెస్ నాయకుల సహకారాన్ని అర్థించింది. ఈ స్థితిలో జనవరి 21వ తేదీన బాబూ రాజేంద్రప్రసాద్ జైలు నుండి విముక్తుడయ్యాడు. వెంటనే ఆయన బీహర్ పరిస్థితిని పూనాలో హరిజన సేవలో నిమగ్నుడైన గాంధీజీకి తంతిద్వారా తెలిపాడు. గాంధీజీ వెంటనే భూకంప బాధితులను ఆదుకోవలసిందిగా భారతీయులందరికి విజ్ఞప్తి చేశాడు. గాంధీజీ పిలుపు నందుకొని కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో రాజేంద్ర ప్రసాద్ తోడ్పడ్డాడు.

ఈ సమయంలో పొట్టి శ్రీరాములు నాసిక్ జైల్లో వున్నాడు. గుజరాత్‌లోని రాస్ గ్రామానికి గాంధీజీ నడిపిన ప్రదర్శనలో పాల్గొన్నందుకు శ్రీరాములుకు 6 నెలలు జైలుశిక్ష విధించ బడింది. ఒక నెల సబర్మతీ జైల్లోవుంచి తరువాత నాసిక్ జైలుకు పంపబడ్డాడు. ఐదవ నెల జైలుశిక్ష అనుభవించే కాలంలో బీహర్ భూకంపం సంభవించింది. అప్పుడు కాంగ్రెస్ కార్యకర్తలందరితో బాటు



శ్రీరాములు కూడా విడుదలయ్యాడు. వెంటనే గాంధీజీ ఆదేశం మేరకు శ్రీరాములు కాంగ్రెస్ సహచరులతో కలసి బీహర్ వెళ్ళి భూకంప భాధితుల సేవలో పాల్గొన్నాడు. భారత జాతీయ కాంగ్రెస్ ఆదేశం ప్రకారం "బీహార్ భూకంప భాధితుల కేంద్ర సహాయక సంఘం" ఏర్పడింది. దీనికి అధ్యక్షుడు డా॥ రాజేంద్ర ప్రసాద్. ఈ కమిటీలో పొట్టి శ్రీరాములు ఆయన మేనల్లుడు యన్.ఆర్. గుప్తా 1934 జనవరి 29వ తేదిన సభ్యులుగా చేరారు. అప్పటికి భూకంపం సంభవించి సరిగ్గా 15

రోజులైంది. భూకంప బాధితులకు సేవ జేయడం తన జీవితంలో లభించిన మహా సదవకాశంగా భావించాడు శ్రీరాములు.

ముజఫర్ జిల్లా బెల్సంద్ డివిజన్‌లోని సీతామోరి తాలూకా ప్రజలు భూకంపం వల్ల నిరాశ్రయులయ్యారు. వీరికి సేవజేసే అవకాశం పొట్టి శ్రీరాములుకు అతని అనుచరులకు కలిగింది. అక్కడకి వెళ్ళి భూకంప దృశ్యాలు చూసిన శ్రీరాములు గుండె ద్రవించింది. బాధితులు దయనీయ గాధలు స్థానికులు చెప్పగా విని కంపించిపోయాడు. భూకంపంవల్ల భవనాలు కూలిపోయాయి. అప్పుడు పై అంతస్తు నుండి క్రింది అంతస్తుకు దిగుతున్న ఎందరో సజీవ సమాధి అయ్యారు. కులమత విచక్షణ లేకుండా బీహారులోని స్త్రీలంతా ఘోషా పద్ధతి పాటించేవాళ్ళు. ఆ భయానక వాతావరణములో ఘోషా వదలిపెట్టి ప్రాణ భయముతో వీధుల్లోకి పరుగెత్తారు. ప్రళయకాలం దాపురించిందని ప్రజలంతా భయభ్రాంతులయ్యారు. కుటుంబంలోని సభ్యులంతా ఒకరి నొకరు కౌగిలించుకొని రోదిస్తూ ఒకేసారి చావడానికి సిద్ధపడ్డారు. ఈ గాథలన్నీ విని కన్నీరు కార్చాడు శ్రీరాములు. తనకు చేతనైనంతవరకు వారిని ఆదుకొని వారి బాధలలో పాలు పంచుకోవాలని నిశ్చయించాడు.

పొట్టి శ్రీరాములుకు అతని అనుచరులకు బీహారు భూకంప బాధితుల కేంద్ర సహాయ సంఘం ఈ క్రింది పనులను అప్పగించింది.

1. భూకంపం వల్ల కలిగిన నష్టాలు అంచనా వేయడం.
2. నిరాశ్రయులకు గృహనిర్మాణం.
3. బాధితులకు ఆహార వస్త్రాలనందించడం.
4. చెడిపోయిన రోడ్లను బాగు చేయడం.
5. వంతెనల నిర్మాణం.
6. నిధుల సేకరణ, వాటి సద్వినియోగం.
7. భూకంపం వల్ల భూసారంలో వచ్చిన మార్పులకనుగుణంగా పండించ వలసిన పంటల గురించి రైతులకు వివరించడం.
8. కొన్నిచోట్ల తాత్కాలికంగా మట్టి రోడ్లను నిర్మించడం.
9. పాతర్లలో మిగిలిన ధాన్యాన్ని తగిన స్థలాల్లో దాచడం.
10. బాధితులకు ధైర్యం చెప్పి ఓదార్చడం.

బీహారు సెంట్రల్ రిలీఫ్ కమిటీ భూకంప బాధితుల సహాయార్థం సుమారు 40 లక్షల రూపాయల నిధిని సేకరించింది. కొన్ని వేల బేళ్ల వస్త్రాలు మిగతా వస్తువులు కూడా సేకరించారు. దీన్లో కొంత మొత్తం బెల్సంద్ డివిజన్‌లోని భూకంప బాధితులకు కేటాయింపబడింది. దానిని పంచే బాధ్యత శ్రీరాములు, అతని అనుచరులు స్వీకరించారు. ఈ పంపకం చేసేటప్పుడు శ్రీరాములుకు అతని అనుచరులు ఒక క్రొత్త సమస్య ఎదురుయింది.

**సంపన్న గృహస్తులైన స్త్రీ పురుషులు రిలీఫ్ కమిటీ సహాయాన్ని అందుకోవడం తమ కుటుంబ గౌరవానికి భంగకరంగా భావించారు. పాత గుడ్డలను గంజినీళ్లను స్వీకరించడానికి నిరాకరించారు. శ్రీరాములు వారి మనోభావాలను సానుభూతితో అర్థం చేసుకొన్నాడు. వారికి నెమ్మదిగా నచ్చచెప్పాడు. ఆదరణ పూర్వకమైన ఆయన మాటలతో వాళ్ళు ఉపశమనం పొంది సహాయాన్ని స్వీకరించారు.**

భూకంపంలో అస్తవ్యస్తమైన బీహారు పరిస్థితి దాదాపు నాలుగైదు నెలలకు కుదట పడింది. అక్కడ భూసార స్థితి చెరకు పంట కనువుగా వుంటుందని నిర్ణయింపబడింది. అందుచేత వేల సంఖ్యలో చెరకు గానుగలను నెలకొల్పారు. గ్రామాల్లో రైతులకు వాటిని ఉచితంగా పంపిణి చేశారు. రైతులు అధికంగా చెరకు పండించడం వల్ల బెల్లం ధర తగ్గింది. బర్రెపాలు రూపాయకు 20 శేర్లు ఆవుపాలు రూపాయకు 25 శేర్లు లభించేవి. పేదలకు కూలినాలి చేసుకొనే అవకాశం దొరికింది. ఆడవాళ్ళకు రోజుకు అర్ధణా (ఇప్పటి 3 పైసలు) మగవాళ్లకు అణా కానీ (యిప్పటి 8 పైసలు) కూలి లభించేది. ఒక అణాకు పదిశేర్ల గెనుసుగడ్డ లభించేది. చౌకగా లభించడంవల్ల ఇది పేదలకు ముఖ్య ఆహారమైంది. ఈ అలవాటువల్ల మరోక దురదృష్టం ఎదురయింది. గెనుసుగడ్డలో పోషకాహారం లోపించినందువల్ల అనేకమంది పక్షవాతం, బోదకాలు మొదలైన వ్యాధులు వచ్చాయి. అందువల్ల శ్రీరాములు అతని అనుచరులు బాధితుల సహాయక చర్యతో బాటు వారి ఆరోగ్య విషయములో కూడా శ్రద్ధ వహించవలసి వచ్చేది. బీహారు రాష్ట్రం సాధారణంగా వర్ష ఋతువుల్లో వరదలకు గురవుతుంది. అందువల్ల వర్షాకాలంలో పడవల సహాయముతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు

చేర్చడానికి శ్రీరాములు అతని అనుచరులు పాటుబడి కృతకృత్యులయ్యారు.

శ్రీరాములు బీహారు సేవా కార్యక్రమంలో దాదాపు 10 నెలలు గడిపాడు. వర్షాకాలం ముగిసే వరకు ఆయన నిద్రాహారాలకు దూరమై ప్రజాసేవ చేశాడు. బెల్సంద్ డివిజన్‌లోని వేలాది ప్రజలు శ్రీరాములు సంఘసేవా నిరతిని వేనోళ్ల కొనియాడారు. వారి హృదయాల్లో శ్రీరాములు సంఘసేవా పరాయణుడుగా నిలిచిపోయాడు. అతని సేవలను కాంగ్రెస్ అగ్రనాయకులు ప్రశంసించారు.

బీహారు రాష్ట్రములో సేవా కార్యక్రమం ముగిసింది. తరువాత శ్రీరాములు గాంధీ సిద్ధాంతాలనుగుణంగా నియమబద్ధ జీవితాన్ని గడపదలచాడు. అందుచేత ఏదైనా గాంధీ ఆశ్రమానికి వెళ్లదలచాడు. అప్పుడు రాజకోట నుండి శ్రీరాములు నారాయణదాస్ గాంధీకి కబురు పంపించాడు. అప్పుడు ఆయన సత్యాగ్రహ ఆశ్రమం స్థాపించాడు. దానిలో నివసించడానికి శ్రీరాములు ఆహ్వానించాడు. అంతకు ముందే సబర్మతీ ఆశ్రమంలో వీరిద్దరి మధ్య అనుబంధం ఏర్పడింది. ఖాదీ ప్రచారం, మద్యపాన నిశేధం, హరిజనోద్ధరణ మొదలైన సత్యాగ్రహాశ్రమ ఆశయాలు శ్రీరాములును ఆకర్షించాయి. అందుచేత వెంటనే శ్రీరాములు ఆ ఆశ్రమములో చేరాడు. అక్కడ ఆరు నెలలు మాత్రమే గడిపాడు. అక్కడ వున్నంతకాలం నారాయణదాస్‌తో బాటు సంఘసేవా కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. శ్రీరాములు నిజాయితిని గురించి నారాయణదాసుకు ముందే తెలుసు గనుక ఎంతో అభిమానించాడు.

సత్యాగ్రహాశ్రమంలో నారాయణదాస్‌తో కలసి పని చేయడం సంతృప్తి కరంగానే వుంది. కానీ ఆశ్రమ కార్యక్రమాలు శ్రీరాములు ఆశించిన స్థాయిలో లేవు. అందుచేత అవకాన్నిబట్టి ఇంతకంటే మంచి ఆశ్రమానికి వల్లభాయి పటేలు శ్రమజీవి ఆశ్రమాన్ని స్థాపించినట్లు శ్రీరాములు విన్నాడు. వెంటనే సత్యాగ్రహాశ్రమాన్ని వదలి శ్రమజీవి ఆశ్రమంలో చేరాలని సంకల్పించాడు. నారాయణదాస్ తన ఆశ్రమంలోనే ఉంచుకోవాలని ప్రయత్నించాడు. కానీ శ్రీరాములు పట్టుదలముందు నారాయణదాస్ ప్రయత్నం ఫలించలేదు. శ్రీరాములు తారవాడకు వెళ్ళేటప్పుడు “నా ఆశ్రమంలో ఏదైనా యిబ్బంది కలిగిందా?” అని నారాయణదాస్ ప్రశ్నించాడు. సత్యాగ్రహాశ్రమంలో తనకెలాంటి ఇబ్బంది కలుగలేదని ఆ కారణంగా తాను ఆశ్రమాన్ని వదిలి వెల్లడంలేదని స్వయంకృషితో

ఆదర్శంగా జీవించడం ప్రధానాశయముగాగల శ్రమజీవి ఆశ్రమం తనకు వచ్చిందని శ్రీరాములు చెప్పాడు.

రాజకోట నుండి తారవాడ వచ్చి శ్రమజీవి ఆశ్రమంలో చేరాడు పొట్టి శ్రీరాములు. కృషితో జీవించడం ఈ ఆశ్రమ ప్రధానాంశయం. సభ్యులంతా విధిగా కష్టపడి పనిచేయాలి. పనిచేయగా వచ్చిన ఆదాయముతో జీవించాలి. ప్రతి సభ్యుడు భూమిని సాగుచేసి పంటలు పండించాలి. ప్రత్తి పండించి నూలు వడికి ఖాదీ బట్టలు తయారు చేయాలి. ఈ ఆశ్రమ లక్ష్యం గాంధేయ వాదులందరినీ ఆకర్షించింది. అందువల్ల గాంధేయవాదులు దేశం నాలుగు చెరగుల నుండి ఈ ఆశ్రమాన్ని చేరుకున్నాడు. ఆశ్రమ వాసులంతా ప్రశాంత వాతావరణములో జీవించేవాళ్లు. అక్కడ పొట్టి శ్రీరాములు సుమారు (1935-36) ఒక సంవత్సరము గడిపాడు. ఆంధ్రప్రాంతం నుండి వచ్చిన శ్రీరాముల్ని నిజాయితీతో కూడిన అతని ప్రవర్తన చూచి క్రమంగా ఆశ్రమవాసులంతా ముగ్ధలయ్యారు.

శ్రీరాములు ఈ ఆశ్రమంలో కూడా ఎక్కువకాలం ఉండలేకపోయాడు. ఆశ్రమ వాతావరణంలో మార్పులు కలగడమే యిందుకు కారణం. కొందరు ఆశ్రమ వాసులు సోమరులై విశ్రాంతి తీసుకొన్నారు. ఇతరుల కష్టంతో సుఖపడడం నేర్చుకొన్నారు. ఆశ్రమ ధనాన్ని స్వంత ధనంగా దాచుకోవడం నేర్చుకొన్నరు. ఈ విషయములో పెద్దల దృష్టికి తీసుకొని వెళ్ళినా తగిన ఫలితం లభించలేదు. ఈ మార్పు శ్రీరాములుకు బాధ కలిగించింది. గాంధేయ వాదియైన శ్రీరాములు ఈ కలుషిత వాతావరణాన్ని సహించలేక పోయాడు. ఇక అక్కడ నివసించడం ఏమాత్రం సమంజసం కాదని భావించాడు.

ఈ సమయములోనే నెల్లూరు జిల్లా కావలి తాలూకా జువ్వలదిన్నె నుండి జాబు వచ్చింది. అక్కడ పంచాయితీబోర్డు వైద్యశాలలో శ్రీరాములు తమ్ముడు రంగయ్య డాక్టరుగా పని చేస్తున్నాడు. రంగయ్య వ్రాసిన ఉత్తరములో తమ మేనమామ గునుపూటి నరసయ్య అవసాన దశలో ఉన్నట్లు తెలిసింది. వెంటనే శ్రీరాములు తారవాడ వదిలి తన మేనమామగారి వూరు మారెళ్ళకు వచ్చాడు. శ్రీరాములు వచ్చిన తరువాత ఆయన మేనమామ రెండు రోజులు మాత్రమే జీవించాడు. ఆ రెండు రోజుల్లోనే శ్రీరాములు ఆయనకెంతో సేవచే సాడు.

కుడికాలుకు పెద్ద గాయమై బాధపడుతున్న మేనమామకు గాయము మాన్పడములో నిపుణుడైన స్థానిక వైద్యుని చేత చికిత్స చేయించాడు. అందుచేత గాయం నుండి కారే చీము నెత్తురువల్ల రోగికి యిబ్బంది కలుగకుండా కాలుకింద రబ్బరు పట్ట వేయించి తన తమ్ముడు డా॥ రంగయ్యతో కట్టు కట్టించాడు. ఈ విధంగా కంటికి రెప్పలా కనిపెట్టుకొని వుండి శ్రీరాములు తన మేనమామకు రాత్రింబవళ్లు సేవ చేశాడు. పొట్టి శ్రీరాములు మేనమామను బ్రతికించాలని చేసిన కృషి నిష్ప్రయోజనమైంది. శ్రీరాములు మారెళ్ల వచ్చిన రెండువరోజు రాత్రి 10 గంటలకు నరసయ్య మరణించాడు. (1937) ఆ రాత్రంతా శ్రీరాములు ఒక్కడే పంచలో ఉంచబడ్డ మామగారి శవానికి కాపలా కాశాడు. సామాన్యంగా స్మశానంలో చితి పూర్తిగా కాలకుండానే మండుతున్న కట్టెల్ని ఆర్పి తీసుకొని పోవడం జరుగుతుంది. అందుచేత శ్రీరాములు మేనమామ శవం కాలడం పూర్తి అయ్యేవరకు చితి ప్రక్కనే కనిపెట్టుకొని వున్నాడు.

మరణించిన వారికి ఆత్మశాంతి కలగడానికి బ్రహ్మణులకు దాన ధర్మాలు చేయడంలో ఆంధ్రదేశంలో వస్తున్న ఆచారం. అందుచేత నరసయ్య మరణించిన 16వ రోజు రాత్రి 9 గంటలకు చుట్టు ప్రక్కల గ్రామాల నుండి వచ్చిన దాదాపు 100 మందికి బ్రహ్మణులు సంభావన అడిగారు. వాళ్లు అడిగినంత ఇచ్చే స్తోమత శ్రీరాములు బంధువులకు లేదు. అడిగినంత అందలేదని బ్రాహ్మణులు శ్రీరాములు బంధువులను సూటి పోటి మాటలతో పీడించసాగారు. ఇరు వర్గాల మధ్య పెద్ద తగాదా ప్రారంభమైంది. అప్పుడు గాంధేయవాది అయిన శ్రీరాములు బ్రాహ్మణులు ఎంత నిందించినా ఆవేశపడ వద్దని బంధువులకు నచ్చజెప్పాడు. ఆయన మీద గౌరవముతో వాళ్లు ఓర్పు వహించారు. ఎంతో సేపు దూషించిన బ్రాహ్మణులు ప్రయోజనం లేక ఇచ్చిన దానితోనే తృప్తిపడి వెళ్ళారు. శ్రీరాములు దురాచారాలపట్ల ప్రదర్శించిన మొండివైఖరి వల్లనే బ్రాహ్మణులు నిస్సహాయులయ్యారు. ఈ సంఘటన వల్ల గ్రామ ప్రజలకెంతో మేలు జరిగింది. అప్పటినుండి బ్రాహ్మణులు సంభావనల కోసం ప్రజలను పీడించడం మానుకొన్నారు. ఇలా తరతరాల దురాచారాన్ని నిర్మూలించిన కీర్తి శ్రీరాములుకు దక్కింది.

ఆ తరువాత శ్రీరాములు ఏడు నెలలు పాటు అక్కడే వున్నాడు. ఆ సమయంలో ఆ ప్రాంత ప్రజలకు ఎన్నో రకాల సేవ చేశాడు. వాళ్ళకు నూలు

వడకడం నేర్పాడు. వారి మధ్య వున్న వివాదాలను పరిష్కరించుకోవడానికి కోర్టులకు వెళ్లవద్దని సలహా ఇచ్చాడు. ధనాన్ని కాలాన్ని వృధా చేయవద్దని ఉపదేశించాడు. అనేక సందర్భాలలో కలిగిన చిన్నచిన్న తగాదాలను తానే పరిష్కరిచాడు. మారెళ్ల ప్రాంతంలో సుమారు 50 అంబర్ చరఖాలను పంచి ప్రజలకు నూలు వడికే అలవాటు కలిగించాడు. తన మామగారి యింట్లో సోదరుని ఇంట్లో కూడా చరఖాలు ఏర్పాటు చేశాడు. ఆ రోజుల్లో శ్రీరాములు రోజుకు 8 గంటలు నూలువడికేవాడు. ఆ నూలు సాలెవాళ్లకిచ్చి తమ రెండు కుటుంబాలకు వస్త్రాలు నేయించేవాడు. మారెళ్లలో గ్రామీణ వైద్యశాల భవన నిర్మాణానికి శ్రీరాములు కృషి చేశాడు. అక్కడ చందాలు వసూలు చేసి ఆ ధనాన్ని భవన నిర్మాణానికి వినియోగించాడు. ఆయన ప్రయత్నం ప్రజలుకు, ప్రభుత్వానికి ప్రేరణ కలిగించింది. ఆయన కృషివల్ల ఆగిపోయిన భవన నిర్మాణం అచిర కాలంలో ముగిసింది. అన్ని వూళ్లలాగే ఆ వూరిలో కూలినాలి చేసుకొనే పేదప్రజలు తాగుడుకు అలవాటుపడ్డారు. శ్రీరాములు మద్యపానం వల్ల కలిగే నష్టాలను వివరించి ఆ దురభ్యాసం మాన్పించడానికి పాటు పడ్డాడు. కానీ ఆయన సలహాలను జనం పట్టించుకోలేదు. అందుచేత గాంధేయ వాదియైన శ్రీరాములు ఆ అలవాటు మాన్పించాలని పట్టుబట్టాడు. అందుకు రెండు రోజుల నిరాహారదీక్ష వహించాడు. శ్రీరాములు ప్రయత్నం వారిలో కొంత హృదయ పరివర్తన కలిగించింది. వారు తాగుడు మానివేస్తామని శ్రీరాములు ముందు ప్రమాణం చేశారు. వాళ్లలో కలిగిన పరివర్తనకు అవకాశంగా తీసుకొని ఆయన వాళ్లతో వూళ్లోని ఒక పాడుపడిన బావిని మరమ్మత్తు చేయించాడు.

ఇలా తన సేవా కార్యక్రమాలు ఒక చిన్న గ్రామానికే పరిమితం కావడం శ్రీరాములుకు బాధ కలిగించింది. ఒంటరిగా తానేమి సేవచేయగలననే నీరసభావం కూడా శ్రీరాములుకు కలిగింది. ఈ విషయాన్ని తన మేనల్లుడు యన్.ఆర్. గుప్తాగారితో తరుచుగా అనేవాడు. గాంధీజీ ఆశయాలను పూర్తిగా ఆచరించే ఏదైనా ఆశ్రమంలో చేరడం మేలని భావించాడు. ఈ సమయములో కృష్ణా జిల్లా అంగలూరులో ఎర్నేని సుబ్రహ్మణ్యం స్థాపించిన గాంధీ ఆశ్రమ విషయం శ్రీరాములుకు తెలిసింది. ఆశ్రమ స్థాపకుడు 1930లో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్న ప్రముఖ గాంధేయవాది. సబర్మతీ ఆశ్రమములో తన


సహచరుడు మల్లిఖార్జునగుప్త ఆ ఆశ్రమములో వున్నట్లు తెలిసింది. ఆయన ఆజన్మ బ్రహ్మచారి. తన ఆస్తిపాస్తులనన్నింటిని అంగలూరు గాంధీ ఆశ్రమానికి ధారపోశాడు. 1939లో శ్రీరాములు అంగలూరు గాంధీ ఆశ్రమమలో చేరాడు. అక్కడ నూలు వడకడం, మద్యపాన నిషేధం, అస్పృశ్యతా నివారణ మున్నగు ఆశ్రమ కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. అక్కడి వాతావరణం ఆయన కెంతో నచ్చింది. అందుకే కర్తవ్య నిర్వహణలో ద్విగుణీకృతోత్సాహాన్ని పొందాడు. ఆశ్రమ స్థాపకుడు సుబ్రహ్మణ్యం అప్పుడు "దరిద్ర నారాయణ" అనే వార పత్రిక నడిపేవాడు. గాంధేయ ఆశ్రమ ప్రచారం, ఆశ్రమ కార్యక్రమాల వివరణ ఆ పత్రిక వ్యాసాలు వ్రాసేవాడు. ఆ పత్రికలోని వ్యాసాలను శ్రీరాములు ఉత్సాహంగా చదివేవాడు.

అంగలూరు గాంధీ ఆశ్రమం సబర్మతీ ఆశ్రమానికి ప్రతిరూపం. శ్రీరాములు శేషజీవితాన్ని గాంధేయ మార్గంలో నడపడానికి ఈ ఆశ్రమ జీవనం ప్రేరణ కలిగించింది. అంగలూరు గాంధీ ఆశ్రమ కార్యక్రమాలకు బేధం లేదు. ఆశ్రమ వాసులంతా నూలు వడికే కార్యక్రమాన్ని జాతీయ సేవగా భావించేవారు. హరిజన బాలబాలికలకు ఆశ్రమంలో ఉచిత ప్రవేశం కల్పించబడినది. స్త్రీలపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోబడింది. ఆశ్రమ కార్యక్రమాల్లో స్త్రీ పురుషులు సమానంగా పాల్గొనేవారు. వారి శారీరక మానసిక వికాసాలకు ఆశ్రమ కార్యక్రమాలు దోహదం చేశాయి. అక్కడ పుస్తక పఠనంతోబాటు కష్టపడి పని చేసే మనస్తత్వం కూడా పెంపొందించుకొనే అవకాశం కల్పించబడింది. ఈ ఆశ్రమంలో సుమారు 1,500 పుస్తకాలు గల గ్రంథాలయమువుంది. దీన్లో తెలుగు, హిందీ గ్రంథాలు ఎక్కువగా వుండేవి. ఆశ్రమానికి అనుబంధంగా ఒక పాఠశాల కూడా నడుపబడింది. ఆశ్రమ గ్రంథాలయము ఆశ్రమ వాసులకే కాక విద్యార్థులకు కూడా మిక్కిలి ఉపయోగపడింది. ఆ పరిసర గ్రామాల అవసర దృష్ట్యా ఒక ఉచిత ఆయుర్వేద పశువైద్యశాల కూడా నడుపబడింది. ఆశ్రమం కార్యక్రమా లన్నింటిలో శ్రీరాములు చురుకుగా పాల్గొనేవాడు.

అవి క్విట్ ఇండియా ఉద్యమం జరుగుతున్న రోజులు. క్రిప్స్ రాయబారం విఫలమైంది. దేశమంతటా ఆంగ్ల ప్రభుత్వంపై అసంతృప్తి ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ఈ స్థితిలో ఆంగ్లేయులను భారత భూమినుంచి పారద్రోలడం మేలని గాంధీజీ భావించాడు. అందువల్ల 1942 జూలై 7 నుండి 14 వరకు

వార్ధాలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటి సమావేశాలు జరిగాయి. ఆంగ్లేయులను భారతదేశం నుండి తరిమి వేయడానికి శాంతియుత ఉద్యమాన్ని ప్రారంభించ వలసిన ఆవశ్యకతను గురించి గాంధీజీ ఈ సమావేశంలో నొక్కి వక్కాణించాడు. జాతీయ నాయకుల సుధీర్ఘ చర్చానంతరం క్విట్ ఇండియా తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించబడింది. దీన్ని ఆగష్టు 7వ తేదీన బొంబాయిలో జరిగిన కాంగ్రెస్ పార్టి సర్వసభ్య సమావేశం ఆగష్టు 8వ తేదీన బలపరచింది.

**బొంబాయి సమావేశంల్లో గాంధీజీ ఇలా ఉత్తేజకరంగా మాట్లాడారు. "ప్రపంచ రాజ్యాలన్ని నన్ను వ్యతిరేకించినప్పటికి, భారతీయులంతా నా నిర్ణయము తప్పని విమర్శించినప్పటికీ నేను నా నిర్ణయాన్ని మార్చుకోను. కేవలం భారతదేశ శ్రేయస్సుకోసం మాత్రమే కాక ప్రపంచ ప్రజల ఔన్నత్యంకోసం కూడా నేనీ నిర్ణయాన్ని తీసుకొన్నాను".**



జాతీయోద్యమంలో స్వేచ్ఛగా పాల్గొనే అవకాశం కాంగ్రెస్ సభ్యులందరికీ వుంటుంది. క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభమైతే రాగల పరిణామాలును దృష్టిలో ఉంచుకొని గాంధీజీ కాంగ్రెస్ కార్యకర్తలకు "కాంగ్రెస్ అగ్రనాయకులు అరెస్టు అయిన వెంటనే మిగిలిన కార్యకర్తలందరూ చావోబ్రతుకో తేల్చుకొనే పట్టుదలతో ఉద్యమములో భాగస్వాములు కావాలి. నాయకుడు లేడని నిస్పృహకు గురికారాదు. కార్యకర్తలు ఎవరి కార్యక్రమాన్ని వారే నిర్ణయించుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ హింసకు పాల్పడరాదు". అని సూచించారు.

నాటి బొంబాయి. సమావేశం ముగిసినప్పటికి రాత్రి చాలా పొద్దు పోయింది. ఆ రాత్రి 3-30 గంటలకు పోలీసులు వచ్చి గాంధీజీని కాంగ్రెస్ వర్కింగ్ కమిటి సభ్యులను వారెంటు లేకుండానే అరెస్టు చేశారు.

గాంధీజీ అరెస్టు వార్త దేశమంతటా దావానంలా వ్యాపించింది. కాంగ్రెస్ నాయకులతోబాటు దేశ ప్రజలందరిని కలవరపరచింది. బ్రిటిష్ ప్రభుత్వ నిరంకుశ చర్యను మేధావి వర్గాలతోబాటు సామాన్య ప్రజానీకం కూడా నిరసించింది. ప్రభుత్వ చర్యను వ్యతిరేకిస్తూ ప్రతి భారతీయుడు నేనంటే నేనని అరెస్టు కావడానికి ముందుకు వచ్చారు. దేశవ్యాప్తంగా నిరసనోద్యమం ఉప్పొంగింది. అరెస్టుల సంఖ్యా అధికమయింది.

అంగలూరు గాంధీజీ ఆశ్రమములో వున్న పొట్టి శ్రీరాములు గాంధీజీ అరెస్టు వార్త విని దిగ్భ్రాంతి చెందాడు. ఈ రాజకీయ పరిణామాలు ఆయనను కలవరపరిచాయి. ఈ ఉద్యమములో పాల్గొని అరెస్టు కావడం గాంధేయవాదిగా తన విధ్యుక్తధర్మంగా భావించాడు. కాంగ్రెస్ నాయకులు 1943 జనవరి 26న సంపూర్ణ స్వరాజ్యం కావాలని తీర్మానించారు. అందుచేత ఆ రోజు స్వతంత్ర దినంగా పాటింపబడింది. పొట్టి శ్రీరాములు 1943 జనవరి 26 తేదీన గుడివాడ వెళ్లి జాతీయ జెండాను ధరించి ఆంగ్ల ప్రభుత్వమునకు వ్యతిరేక నినాదాలిచ్చాడు. అందుకు ప్రభుత్వం ఆయనను అరెస్టు చేసింది. ఆయనకు న్యాయస్థానం 6 నెలలు జైలు శిక్ష విధించింది. అతన్ని కొన్ని రోజులు రాజమండ్రి జైల్లో వుంచి తరువాత బళ్లారి సెంట్రల్ జైలుకు పంపించారు. అక్కడ శ్రీరాములుకు ప్రముఖ రాజకీయవేత్త వావిలాల గోపాల కృష్ణయ్యగారితో పరిచయం ఏర్పడింది. వారిద్దరూ అక్కడ అనేక జాతీయ సమస్యలను చర్చించు కున్నారు. జైలునుండి విడుదలైన

తరువాత గాంధేయ సిద్ధాంతానుగుణంగా చెయ్యవలసిన కార్యక్రమాన్ని నిర్ణయించుకొన్నారు. జైల్లో వున్నప్పుడు పొట్టి శ్రీరాములు నిజాయితీ, సేవాభావం, గాంధేయవాదం, అహింసావ్రతం మున్నగు లక్షణాలు చూచి గోపాలకృష్ణయ్య ఎంతో మెచ్చుకొన్నాడు. పొట్టి శ్రీరాములు గాంధీజీకి నిజమైన శిష్యుడని ఆయన భావించాడు.

పొట్టి శ్రీరాములు బళ్ళారి జైలు నుండి విడుదలయ్యేనాటికి కాంగ్రెస్ అగ్రనాయకులంతా జైళ్లలో వున్నారు. ఆయనకు వెంటనే ఏ కార్యక్రమం చేపట్టాలో అర్థం కాలేదు. అందుచేత నెల్లూరు జిల్లా కావలి తాలూకా జువ్వలదిన్నె గ్రామంలో డాక్టరుగా పని చేస్తున్న తన సోదరుడు రంగయ్య దగ్గరకు వెళ్లాడు. ఏదైనా సామాజిక కార్యక్రమము చేపట్టే ఆలోచన వున్నా శ్రీరాములుకు అవకాశాలు దొరకలేదు. ఐనా పేదజనాన్ని ఉద్ధరించడానికి సిద్ధంగా వున్నాడు. జువ్వలదిన్నెలో నివసించే రోజుల్లో చుట్టుప్రక్కల గ్రామాలకు వెళ్ళి నూలు వడకవలసిన ఆవశ్యకతను గూర్చి ప్రచారం చేశాడు. అనేక గృహాల్లో అంబర్ చరఖాలను ఏర్పాటు చేశాడు. అంబర్ చరఖా వున్న ఇళ్లకు తరచుగా వెళ్లి అవి సక్రమముగా పని చేస్తున్నదీ లేనిదీ తనిఖీ చేసేవాడు. అవసరమైతే వాటిని తానే స్వయముగా బాగు చేసేవాడు. చెడిపోయిన చరఖాలను బాగుచేసే సామాగ్రిని ఒక సంచిలో వేసుకుని చంకకు తగిలించుకొని వెళుతుండేవాడు. ఆయన తల పెట్టిన కార్యక్రమాలు ఆ ప్రాంత ప్రజల్లో ఆసక్తి కలిగించాయి. క్రమంగా అతడిలో కూడా తన కర్తవ్యాన్ని సాధించగలననే ఆత్మ విశ్వాసం పెంపొందసాగింది.

* * *

## నాల్గవ అధ్యాయం

# హరిజన సేవా కార్యం



అస్పృశ్యతా నిర్మూలనకు తమ జీవితాలను అంకితం చేయవలసిన ఆవశ్యకతను గురించి గాంధీజీ తన అనుచరులందరికీ ఇలా బోధించాడు. "అస్పృశ్యత అనే సాంఘిక దురాచారం హిందూ మతంలో తరతరాలుగా వస్తున్నది. దీన్ని నిర్మూలించడం ప్రతి హిందువుయొక్క కర్తవ్యం. అస్పృశ్యులను మీ సోదరులుగా భావించాలి. వారితో కలిసిమెలిసి జీవించాలి. వారి బాధలను తొలగించడానికి ప్రయత్నించాలి. తరతరాలుగా అంధకారంలోనున్న ఆ అమాయకులను ఉద్ధరించాలి. ఈ భావాలను ఇతర హిందువులలో కూడా కలిగించాలి. ఇలాంటి అస్పృశ్యత నిర్మూలన మానవధర్మంగా భావించాలి. ఇలాంటి అస్పృశ్యత సేవలో జీవితాలు ధన్యమవుతాయని భావించాలి. ఇలా భావించిన వ్యక్తి రాజకీయ ఆర్థిక సామాజికంగా సంభవించే పరిణామాలను వెనుదీయడు. ఇటువంటివ్యక్తి భౌతిక ప్రయోజనాలను ఆశించడు. అస్పృశ్యత సేవయే మాధవసేవగా భావించండి". నిజమైన గాంధేయవాదియైన పొట్టి శ్రీరాములు గాంధీజీ ఉపదేశాన్ని ఆచరణయోగ్యం చేయడం తన జీవిత లక్ష్యంగా భావించాడు. ఈ లక్ష్యాన్ని సాధించుటకై జీవితాంతం కృషి చేశాడు.

క్విట్ ఇండియా ఉద్యమ ప్రారంభదినంగా ప్రకటించిన 1944 ఆగష్టు 9వ తేదీ సమీపిస్తున్నది. ఆనాడు జరుపవలసిన కార్యక్రమాన్ని గురించి కాంగ్రెస్ కార్యకర్తలంతా గాంధీజీని అడిగారు. కార్యకర్తలు సామూహిక ప్రదర్శనలు జరుపవలసిన అవసరంలేదని, అహింసా మార్గంలో ఎవరికి తోచినట్లు వారు చేయవచ్చునని గాంధీజీ సూచించారు. అజ్ఞాతంలో వున్న కార్యకర్తలంతా బయటికి వచ్చి పోలీసులకు లొంగిపోవాలనీ మిగిలిన కార్యకర్తలంతా 14 సూత్రాల నిర్మాణ

కార్యక్రమంలో నిమగ్నులు కావాలని గాంధీజీ ఆదేశించారు. గాంధీజీ ఆదేశం మేరకు నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టాడు. శ్రీరాములు. 1944 నుండి అతడు ఒంటరిగానే హరిజనోద్ధరణకోసం కృషి చేయసాగాడు. అందుకు గాంధీజీ ఆశీర్వాదం కూడా అభించింది. గాంధీజీ 75వ జన్మదినోత్సవమైన 1944 అక్టోబరు 2వ తేదీన పొట్టి శ్రీరాములు అస్పృశ్యతా నిర్మూలనకోసం ప్రచారాన్ని ప్రారంభించాడు. 1944 అక్టోబరు 30వ తేదీన కావలి నుండి గాంధీజీకి తన కార్యక్రమాన్ని వివరిస్తూ ఇలా జాబు వ్రాశాడు.

*కావలి*

***3-19-44***

*పూజ్య బాపూజీ, నమస్తే!*

*అంటరానితనాన్ని నిర్మూలించవలసిన ఆవశ్యకతను వివరిస్తూ నేను నిన్నటి నుండి ప్రచారం ప్రారంభించాను. నెల్లూరు జిల్లాలో ఒక తాలూకా కేంద్రమైన ఈ పట్టణంలో ఒంటరిగా నేను కార్యక్రమాన్ని చేపట్టాను. **1940**వ సంవత్సరము నుండి నేనీ ప్రాంతంలో నూలు వడికే కార్యక్రమాల పట్ల వారికెంతో సానుభూతి వుంది. ఇక్కడ మా బంధువులు కొందరు వున్నారు. ఇక్కడికి చేరువలో వున్న దిన్నె గ్రామంలో నా సోదరుడు వున్నాడు. అందుచేత నా కార్యక్రమానికి ఈ పట్టణాన్ని కేంద్రంగా చేసుకొన్నాను.*

*1) 75వ గాంధి జన్మదినం.*

*2) అంటరానితనం నశించాలి.*

*3) అంటరానితనం హిందూమతానికి మాయని మచ్చ.*

*అనే నినాదాలు వ్రాయబడ్డ అట్టను పట్టుకొని, ఈ సిద్ధాంతాలు వివరించే పాటలు పాడుతూ నిన్న వీధులవెంట తిరిగాను. హైస్కూలు గేటుముందు నిలబడి క్లాసులు ప్రారంభమయ్యే వరకూ నేను పాటలు పాడాను. ఈ కార్యక్రమాన్ని ఈరోజు కూడా కొనసాగించాను. నిన్న సాయంత్రం కొంత మంది విద్యార్థులు నాతోబాటు ప్రచారంలో పాల్గొన్నారు. ఎవరు పాల్గొనక పోయినా నేనొక్కణ్ణే ఈ కార్యక్రమాన్ని నిర్వహించదలచాను.*

*నన్ను నేను మీకు పరిచయం చేసుకొంటున్నాను. నేను **1930** నుండి **1933** వరకూ సబర్మతీ ఆశ్రమంలో గడిపాను. **1933** ఆగష్టు **1**వ తేదీన*

*యితర ఆశ్రమవాసులతో బాటు నేను కూడా జైలుకు వెళ్లాను. 1934 జనవరి నెలలో బీహారులో భూకంపం వచ్చినప్పుడు ఆశ్రమ వాసులతోబాటు నేను కూడా అక్కడి కార్యక్రమాల్లో పాల్గొన్నాను. 1934-35 సంవత్సరాలలో రాజకోట సత్యాగ్రహాశ్రమంలో వున్నాను. 1935 నుండి 1938 వరకు తారవాడ ఆశ్రమంలో వున్నాను. తరువాత కొంతకాలం కృష్ణా జిల్లా గుడివాడలో గాంధీ ఆశ్రమంలో వున్నాను. 1943లో గుడివాడలో జాతీయ జెండా ప్రదర్శించినందుకు నాకు 6 నెలలె జైలు శిక్ష విధించబడింది.*

**ప్రస్తుతం హరిజనోద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టాను. కొంతకాలం తరువాత నాకు యిప్పుడు లభిస్తున్న ప్రోత్సాహం కూడా లభించకపోవచ్చు. నా కార్యక్రమానికి పరిస్థితులు అనుకూలంగా లేవనితెలుసు. నా కార్యక్రమాన్ని హర్షించలేకపోతున్న నా బంధువులు నాకు తిండిపెట్టి ఆశ్రయము యివ్వడానికి నిరాకరించవచ్చు. ఐనా నేను నిరుత్సాహపడను. బిచ్చమెత్తయినా ప్రచారాన్ని కొనసాగిస్తాను. సమయమువస్తే నేను హరిజనులకు దేవాలయ ప్రవేశము కల్పించడానికి నిరాహారదీక్ష పూనడానికి కూడా సిద్ధపడతాను. ఇందుకు మీ ఆశీర్వాదాలు కోరుతున్నాను.**

**ఇట్లు భవదీయుడు,**
**పొట్టి శ్రీరాములు**

మహాత్మాగాంధీ వెంటనే ఈ ఉత్తరానికి సమాధానం ఇలా వ్రాశాడు.

*సేవాగ్రామం*
*5-10-44*
*ప్రియమైన శ్రీరాములుకు,*
*ప్రచారం అన్నివిధాలా కొనసాగించు. కాని నిరాహారదీక్షకు పూనుకోవద్దు.*
*నీ*
*బాపు*

1944 అక్టోబరు 10వ తేదీన గాంధీజీకి పొట్టి శ్రీరాములు ఒక లేఖ వ్రాశాడు. ఆ లేఖలో పొట్టి శ్రీరాములు తన భావాలను వ్యక్తం చేశాడు.

ఉపన్యాసాల వల్ల పత్రికల్లో వ్రాసే వ్యాసాల వల్ల హరిజనోద్ధరణ సాధ్యంకాదు. అగ్రవర్ణాల వారితో హరిజనులపట్ల సోదరభావం కలిగించడం దుస్సాధ్యంగా కనిపిస్తున్నది. ఈ సమస్యను అన్నీ తెలిసిన అగ్రవర్ణాలవాళ్ళు పట్టించుకోవడం లేదు. ఏదైనా పటిష్టమైన కార్యక్రమం చేపడితే శాంతిభద్రతల పేరుతో బ్రిటిష్ ప్రభుత్వం అనుసరిస్తున్న దమననీతి అడ్డుపడుతున్నది.

ఆంగ్ల ప్రభుత్వ విధానానికి ప్రజలు భయభ్రాంతులవుతున్నారు. అయినా నేనుమాత్రం ప్రాణాల నర్పించి అయినా లక్ష్యసాధనకు కృషిచేయాలని నిశ్చయించుకున్నాను. విస్తృత ప్రచారం ద్వారా ప్రజల్లో విప్లవాత్మకమైన మార్పు తేవాలని అందుకు తగిన ప్రోత్సాహం లభిస్తుందని నేను విశ్వసిస్తున్నాను. ప్రచారంతో లక్ష్యం సిద్ధించకపోతే ఆమరణ నిరాహారదీక్షకు కూడా పూనుకొంటాను. ప్రాణంకంటే లక్ష్యసాధనే నాకు ముఖ్యం. కానీ నాకు పత్రికల సహకారంగాని, మేధావుల ప్రోత్సాహంగాని లేదు. నా కార్యక్రమ లక్ష్యాన్ని ప్రచురించమని ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ సంపాదకులను కోరాను. వారు నా విజ్ఞప్తికి ఏమాత్రం ప్రోత్సాహం యివ్వలేదు. పైగా ఇక్కడ ఎవ్వరు హరిజనోద్ధరణ కార్యక్రమాలు చేపట్టడంలేదు. నాలాంటివాళ్ల ప్రచారానికి పోలీసులు అడ్డుపడుతున్నారు. అందుచేత ఉపన్యాసాలు చేయడం మానుకొన్నాను. కేవలం దేశభక్తి గేయాలు పాడుతూ వాటి అర్థాలు వివరిస్తూ కాలం గడుపుతున్నాను. ఖద్దరు టోపి ధరించి హరిజనోద్ధరణకు సంబంధించిన నినాదాలుగల అట్టముక్కను మెళ్లో ధరించి కాంగ్రెస్ జెండా పట్టుకొని తిరుగుతున్నాను. ఐనా ప్రజల్లో నేనాశించిన ప్రవర్తన కలగటం లేదు. నేను బ్రతికి సాధించలేని ప్రయోజనాన్ని మరణించి సాధిస్తానేమో! గత పదిహేనేళ్లు నాదేశ పర్యటనానుభవముతో ఈ నిర్ణయానికొచ్చాను. ఇలాంటి ఉత్తమాశయ సిద్ధికి ప్రాణాలర్పించడం మంచిదే గదా!

**సుదీర్ఘమైన తన లేఖకు గాంధీజీ రెండు మూడు మాటల్లో సమాధానం వ్రాయడం శ్రీరాములుకు బాధ కలిగించింది. సమాజ సేవా కార్యక్రమ విషయములో తన ఆతృతను గాంధీజీ పూర్తిగా అర్థం చేసుకోలేదని శ్రీరాములు భావించాడు.**

అక్టోబరు 21వ తేదీన శ్రీరాములు గాంధీజీకి మళ్లీ ఉత్తరం వ్రాశాడు. అందులో సారాంశం ఇలా వుంది.

"అస్పృశ్యతా నిర్మూలనకు నేను చేసిన ప్రయత్నాలు మొదట్లో పూర్తిగా విఫలమయ్యాయి. రానురాను వాటి ప్రభావం సమాజం మీద ఉండగలదని నా విశ్వాసం హరిజనోద్ధరణకు నాకు అందుబాటులో గల ఏకైక మార్గం వారికి దేవాలయ ప్రవేశం కల్పించడమే. ఇందుకు రెండే మార్గాలు కనిపిస్తున్నాయి. ఒకటి చట్టం ద్వారా దేవాలయ ప్రవేశం కల్పించడం. రెండు నిరాహారదీక్ష ద్వారా అగ్రవర్ణాలవారిలో మార్పు తేవడం. మొదటి మార్గానికి ప్రభుత్వం ఆసక్తి చూపదు. కనుక రెండవ మార్గమే శరణ్యం. కనుక నిరాహారదీక్షకు పూనుకోవడం మేలని భావిస్తున్నాను. ఇలా చేస్తే హరిజనుల్లో విశ్వాసం పెంపొందుతుంది. కనీసం ఒక వారమైనా నిరాహరదీక్షకు అనుమతిస్తారని ఆశిస్తున్నాను.

ప్రస్తుత పరిస్థితుల్లో సమర్ధవంతంగా కొనసాగించడానికి అనువైంది అస్పృశ్యతా నిర్మూలనోద్యమమే. అధిక సంఖ్యలో హరిజనులకు దేవాలయ ప్రవేశం లభింపచేస్తే అంటరానితనం నశిస్తుంది. ఇదికాక ఏ యితర పద్ధతిద్వారా ఈ దురాచారాన్ని దూరంచేయలేము. అస్పృశ్యత అంతరించినప్పుడే దేశం ఐకమత్యంతో పురోగమిస్తుంది. దీనిలో అపరిష్కృత సమస్యలెన్నో సులభ పరిష్కారాన్ని పొందుతాయి. కనుక అస్పృశ్యతను నిర్మూలించి హిందువులంతా హరిజనుల విశ్వాసాన్ని చూరగొనాలి. ఈ పని విజ్ఞప్తివల్ల, ఉపన్యాసాలవల్ల సాధ్యంకాదు.

పరిస్థితులు అనుకూలించనప్పటికీ స్థానిక రాజకీయ నాయకుల సహాయ సహకారాలు లేకపోయినప్పటికి శ్రీరాములు తను నమ్మిన సిద్ధాంతంకోసం నిర్విరామంగా కృషి చేయసాగాడు. మరలా డిశంబర్ 2వ తేదీన గాంధీజీకి శ్రీరాములు మరొక లేఖ వ్రాశాడు. దానిలో విషయము ఇలా వుంది.

"మీ ఆదేశం మేరకు నిరసన వ్రతం చేయకుండా ప్రచారం ద్వారా హరిజన దేవాలయ ప్రవేశం కోసం కృషి చేస్తున్నాను. ఈ విషయములో సహకరించ వలసిందిగా ప్రముఖ కాంగ్రెస్ నాయకులు బెజవాడ గోపాలరెడ్డిగారిని కోరారు. కాని వారి నుండి. ఎలాంటి సమాధానం లేదు. హరిజనుల దేవాలయ ప్రవేశం ద్వారా అస్పృశ్యత అంతరిస్తుందనే అంశం మీద కాంగ్రెస్ నాయకులకే నమ్మకం

లేదు. ఇటీవల నెల్లూరు జిల్లా కాంగ్రెస్ సభలో ఇదే అభిప్రాయం వ్యక్తమయింది. పైగా పత్రికా విలేఖరులు కూడా నాకు సహకరించడం లేదు. మాజీ పార్లమెంటు కార్యదర్శి హరిజన శాసన సభ్యుడు ఆంధ్ర హరిజన సేవా సంఘ కార్యదర్శి ఐన టి.యస్. మూర్తిగారు తగిన సాయం చేస్తారని వాగ్దానం చేశారు. కానీ అది అక్షరాలా వాగ్దానంగానే మిగిలిపోయింది".

పొట్టి శ్రీరాములు గాంధీజీని దైవ సమానంగా భావించేవాడు. అందుకే ఆయన ఆదేశం లేకుండా ఏపనీ చేసేవాడుకాదు. శ్రీరాములు అంత సాధారణ వ్యక్తి గాంధీజీని దర్శించాలన్నా జాబులు వ్రాసాను. గాంధీజీ నుండి సమాధానం లేదు. గాంధీజీకా ఉత్తరాలు అందాయా లేదా? అనే సందేహం శ్రీరాములుకు కలిగింది. ఈ అనుమానాన్ని వ్యక్తంచేస్తూ మళ్లీ గాంధీజీ లేఖ వ్రాశాడు. అందులో హరిజనుల దేవాలయ ప్రవేశం అవశ్యకతను గురించి మరొకమారు ప్రస్తావించాడు. ఈ అంశాన్ని గురించి గాంధీజీ ఒక పత్రికా ప్రకటన ఇస్తే మంచిదని ఆ లేఖలో పునరుద్ఘాటించాడు. ఈ లేఖకుకూడు గాంధీజీ నుండి సమాధానం లేదు. కనీసం పత్రికా ప్రకటన కూడా చేయలేదు. గాంధీజీని తన కార్యక్రమముల పట్ల ఆకర్షించడానికి నిరసన వ్రతమే సరియైన మార్గమని శ్రీరాములు భావించాడు. గాంధీజీ నుండి సమాధానం రాకపోయినా శ్రీరాములు తన కార్యములను నిలిపివేయలేదు. గాంధీజీకి కార్యక్రమ నివేదికలను పంపుతూనే వున్నాడు. తన కార్యక్రమాలు చురుకుగా సాగడం లేదని అతని బాధ. ఎన్ని కష్టాలు వచ్చినా నిరుత్సాహపడక ఒంటరిగానే సేవా కార్యక్రమాలను నిర్వహించసాగాడు.

నిరాశా నిస్పృహలకు లోనైనా 22 సంవత్సరాల వితంతువుకు 35 సంవత్సరాల వ్యక్తి ఒప్పించి పొట్టి శ్రీరాములు వారికి పునర్వివాహం జరిపించాడు. ఇంతకంటె గొప్ప సంబంధాలు వచ్చినా ఆ వ్యక్తి శ్రీరాములుపై గల గౌరవభావం వల్ల ఈ వివాహానికి అంగీకరించాడు. ఈ సందర్భములో కులాంతర విందు భోజనం ఏర్పాటు చేయబడింది. ఈ విందుకు ధనవంతులతో బాటు పేదలైన హరిజనులు కూడా ఆహ్వానింపబడ్డారు. పెళ్లికానుకగా వధువుకు ఎరవాడ చరఖాను శ్రీరాములు ఇచ్చాడు. భోజనాలు ముగిసిన తరువాత మిగులు భోజనాన్ని యానాధి వారికి యిచ్చే ఆచారం వుంది. అయినా శ్రీరాములు ఆ పని జరుగనీయలేదు. యానాదులకు కూడా అందరితో పాటు భోజనం పెట్టారు.

పొట్టి శ్రీరాముల కార్యక్రమాలను ఎందరో హర్షించారు. ఈ విషయం గాంధీజీకి తెలుపబడింది.

1945 జనవరి 27వ తేదీన శ్రీరాములు గాంధీజీకి లేఖ వ్రాశాడు. ఈ లేఖల్లో తన కార్యక్రమాల ప్రగతిని వివరించాడు. జనవరి 26వ తేదీ స్వతంత్ర దినం పండుగరోజు జాతీయ జెండా ధరించి 'హరిజనులకు దేవాలయ ప్రవేశం కల్పించాలి అనే నినాదం, గాంధీజీ నిరసన వ్రతాన్ని విరమింపచేయండి'. అనే నినాదంగల అట్టలను దాల్చి పోలీసుల చూస్తుండగానే నెల్లూరు పురవీధుల్లో తిరిగాడు. వెంటనే పోలీసులు అరెస్టు చేశారు. ఒక గంట నిర్భంధములో వుంచి విడిచిపెట్టారు. జాతీయ జెండా లేకుండా ప్రచారం చేసుకోవలసిందని చెప్పారు. అధికారుల ఆదేశాన్ని శ్రీరాములు అంగీకరించలేదు. "గత రెండు నెలల నుండి జెండా ధరించి చేస్తున్న కార్యక్రమాన్ని మీరీనాడు ఆపివేయడం సమంజసంకాదు. జెండాలేని ప్రచారం శిరసులేని మొండెం లాంటిది". అని శ్రీరాములు చేసిన వాదనను చివరకు జిల్లా పోలీస్ సూపరింటెండెంటు అంగీకరించాడు. ఆ రోజు ప్రధాన వీధుల్లో తిరగవద్దనీ ప్రజలు గుంపులు కూడతారని చెప్పిన పోలీసువారి సూచనలను అనుసరించాడు. శ్రీరాములు సాయంత్రం 3 గంటల నుండి చిన్నచిన్న వీధులలో ప్రచారం చేశాడు. నెల్లూరులో "నగరజ్యోతి" అనే చోట గోడ మీద వార్తలు వ్రాయబడుతుండేవి. వార్తలు తెలుసుకోవడానికి ప్రజలచ్చట గుమిగూడేవారు. పొట్టి శ్రీరాములు ప్రచారాన్ని ముగించుకొని అక్కడ చేరాడు. చరఖాతో నూలు వడకతూ నినాదాలు చూస్తూ దేశభక్తి గీతాలు పాడుతూ చాలా ప్రొద్దుపోయే వరకూ గడిపాడు. శ్రీరాములింత ఉత్కృష్ట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు కొంత సాయమైనా అందించనేలేదు.

హరిజనుల దేవాలయ ప్రవేశం కోసం శ్రీరాములు ఉధృత ప్రచారం చేశాడు. రంగనాయక దేవాలయములో 1944 డిశంబర్ 25వ తేదీన భజన చేయసాగారు. సనాతనులైన అగ్రజాతులు ఈ సంఘలనను సహించలేక పోయారు. వెంటనే దేవాలయ ట్రస్ట్ పోలీసు రిపోర్టు చేసి వాళ్ళను బయటికి గెంటించాడు. అప్పుడు ఒకరిద్దరికి దెబ్బలు కూడా తగిలాయి. సర్కిల్ ఇన్స్పెక్టరు దురుసుతనాన్ని భజనసంఘం ప్రతిఘటించలేదు. దెబ్బలుతిన్నా స్వయముగా దేవాలయంలో ప్రవేశించామన్న తృప్తి వాళ్లకు కలిగింది. ఈ సంఘటన నెల్లూరు పట్టణ చరిత్రలో

నూతనాధ్యాయాన్ని సృష్టించింది. అగ్రకులాలవారిపట్ల హరిజనులకు గల భయము తొలగిపోయింది. ఆశయసాధనకై ఎలాంటి కష్ట పరిస్థితినైనా ఎదుర్కోగలమన్న ఆత్మవిశ్వాసం వారిలో ఏర్పడింది. ఈ విషయము తెలిసికొన్న శ్రీరాములు తన శ్రమ క్రమేణా ఫలిస్తున్నందుకు సంతోషించాడు.

1945 ఫిబ్రవరి 6వ తేదీన వార్ధాలోని సేవాగ్రామం ఆశ్రమం నుండి గాంధీజీ పొట్టి శ్రీరాములుకు ఇలా వ్రాశాడు.

**ప్రియమైన రాములు :-**

**నీ ఊహ సరియైందే, పొరబాటువల్ల నీ జాబులు నాకు అందచేయ బడలేదు. నీవు జరిపించిన వితంతు వివాహం నాకు సంతోషాన్ని కలిగించింది. దంపతులు సుఖసంతోషాలతో జీవించాలని ఆశిస్తున్నా. నీవు చేపట్టిన కార్యక్రమాలను ఎప్పటికప్పుడు నాకు తెలియచేయగలవు. లక్ష్య సాధనలో నీ వెదుర్కొంటున్న కష్టాలు నాకు తెలుసు. అయినా ఏమాత్రం వెనుకంజ వేయొద్దు – నీ బాపు**

పొట్టి శ్రీరాములు తరువాత కొంత కాలానికి అంగలూరు గాంధీ ఆశ్రమములో జరిగే గ్రామ సేవకు శిక్షణ శిబిరాన్ని పర్యవేక్షించడానికి వెళ్లాడు. అక్కడి నుండి తన కార్యక్రమ నివేదికను గాంధీజీకి లేఖద్వారా తెలిపాడు. హరిజనులకు దేవాలయ ప్రవేశం కల్పించడము మాత్రమే తమ విధి అని దాని సారాంశం.

అగ్ర వర్ణ సమాజాన్ని పొట్టి శ్రీరాములు ఇలా విమర్శించాడు. "హిందూ సమాజంలో అగ్ర వర్ణాల్లో మేధావులైన బ్రాహ్మణులకే హరిజనుల దేవాలయ ప్రవేశం ఇష్టంలేదు. అస్పృశ్యతా నిర్మూలనను వాళ్లంగీకరించరు. అభ్యుదయ వాదులైన కొందరు బ్రాహ్మణులకిష్టమున్నా సనాతనులకు భయపడి ఏమీ చేయలేకపోతున్నారు. ప్రఖ్యాత హిందూ దేవాలయాలున్న మధుర, తిరువాన్కూరు మున్నగుచోట్ల చాలాకాలం క్రిందటే హరిజనులకు దేవాలయ ప్రవేశం లభించింది. ఆంధ్రప్రాంతంలో ప్రముఖ కాంగ్రెస్ నాయకులు సంఘసేవకులు హరిజనుల భాధలను చూసి నిర్లక్ష్యం చేస్తున్నారు. నాయకులు హిందూ ముస్లిం ఐక్యత సమస్యను ప్రస్తుతానికి ప్రక్కన బెట్టి అతి ప్రధాన సమస్య అయిన అస్పృశ్యతా నిర్మూలనకు తోడ్పడాలి. నిర్మాణాత్మకమైన ఈ కృషికి కష్టనష్టాల కోర్చి అయినా పెద్దలంతా సహకరించాలి.

పెద్ద పెద్ద దేవాలయాల్లో హరిజనులకు ప్రవేశం కల్పించినందువల్ల అనేక ఇబ్బందులున్న దృష్ట్యా ప్రభుత్వం ఈ విషయము పట్ల ఉదాసీనత చూపవచ్చు. కనుక కాంగ్రెస్ కార్యకర్తలు ఈ విషయములో చొరవ చూపాలి. ముందు చిన్న చిన్న గుళ్లల్లో హరిజనులను ప్రవేశపెట్టి తరువాత పెద్ద పెద్ద గుళ్లలో ప్రవేశ పెట్టవచ్చు. ఇది కష్టతరమైన అంశమే అయినా పల్లెలు పట్టణాల్లో ప్రచారంచేసి ప్రజల దృష్టిలో మార్పు తీసుకొని రావచ్చు. నిజాయితీపరులైన సంస్కర్తలు ఈ విషయములో చొరవ తీసుకొన్నా దీన్ని విఫలం చేయడానికి కొన్ని దుష్టశక్తులు దుష్ప్రచారం చేయవచ్చు. ఈ ప్రచారాన్ని ఆదిలోనే అంతంచేయాలి. ఇలా కార్యకర్తలందరికీ ఉపదేశించాలి. ఈ విషయములో స్థానిక నాయకులుపై ఆధార పడకూడదు. ప్రజాహిత కార్యక్రమాల్లో వాళ్లు చురుగ్గా పాల్గొనడం లేదని బాధతో ఇలా వ్రాయవలసినివస్తున్నదే కానీ వాళ్ల పై వ్యక్తిగతమైన ద్వేషభావంతో కాదు. ప్రజల్లో సరైనా ప్రచారం జరిగితే వాళ్లు ఎంతటి త్యాగానికైనా వెనుదీయరు.

నెల్లూరు పట్టణంలో ఒక వారం రోజులపాటు తన ప్రచార కార్యక్రమాన్ని తీవ్రతరం చేయాలని శ్రీరాములు సంకల్పించాడు. 1945 ఏప్రిల్ 6వ తేదీ నుండి 'జాతీయవాదం' అనే పేరుతో ఈ కార్యక్రమం ప్రారంభించారు.

పొట్టి శ్రీరాములుకు తన శక్తిసామర్థ్యాల పరిమితి తెలుసు. కనుక గాంధీజీకి ఇలా వ్రాసాడు.

**"ఒక సాధారణ సంఘ సేవకుడు తన పూర్తి సమయాన్ని వినియోగించి సంతృప్తిగా సంఘసేవ చేయలేకపోవచ్చు. కారణం జీవనోపాధికే అతడు ఎక్కువ సమయాన్ని వినియోగించవలసి ఉండడం. కానీ నేనలా చేయదలచుకోలేదు. నేను నా పూర్తి సమయాన్ని హరిజనోద్ధరణకే వినియోగిస్తాను. నేను చేసేపని మంచిదనుకొంటే ప్రజలే నాకు సాయం చేస్తారు. నా కనీస జీవితావసరాలు వాళ్లే తీరుస్తారు.**

అలా ప్రజల సానుభూతితో అస్పృశ్యతా నిర్మూలనకు ప్రయత్నిస్తాను. ప్రస్తుతానికి మీ సూచనమేరకు నిరసన వ్రతం చేయడములేదు. కానీ ఎవరో ఒకరు నిరసనవ్రతం పూననిదే అస్పృశ్యతా దురాచారం తొలగిపోదని నా విశ్వాసం.

ఉత్తర హిందూ దేశంలో అంబేద్కర్ హరిజనోద్ధరణకు ఎంతో కృషి చేశాడు. అందుకే ఆయన పేరుతో అనేక సంఘాలు ఏర్పడ్డాయి. అలాంటి సంఘం నెల్లూరులో కూడా ఒకటి వుంది. ఆ సంఘ సభ్యులకు హరిజనుల దేవాలయ ప్రవేశము ప్రధానంకాదు. ప్రభుత్వం హరిజనోద్ధరణకు ఎక్కువ నిధులు కేటాయించాలని ఉద్యోగ సౌకర్యాలు కలిగించాలని వారి వాదన. వారి ప్రధానాశయము అధికారాన్ని హస్త గతము చేసుకోవడమే గాని హరిజనోద్ధరణ కాదని పోట్టి శ్రీరాములు అభిప్రాయము. ఈ విషయాన్ని గురించి ఆయన గాంధీజీకి ఇలా వ్రాశాడు. "అంబేద్కర్ సంఘం చేసే ప్రచారం ఇలావుంది. మేము హిందువులము కాదు. దేవాలయ ప్రవేశం మాకొద్దు. హరిజనోద్ధరణకు ప్రభుత్వం నిధుల పెంచాలి. మాకు ప్రభుత్వంలో భాగస్వామ్యాలు కల్పించాలి" ఆ సంఘం అనుసరిస్తున్న విధానం హరిజనులందరికీ అపకారం చేస్తుందని నేను వాళ్లకు చెప్తాను. వాళ్ల యీ పూనికవల్ల విద్యాధికులైన కొద్దిమంది హరిజనులు మాత్రమే బాగుపడతారు. సామాన్య హరిజనులకు లాభం ఉండదు. హరిజనులకోసం క్రైస్తవ మిషనరీలు ఎంతో ధన వ్యయము చేస్తున్నాయి. అందువల్ల ఎంతమంది హరిజనులకు మేలు కలుగుతున్నది? వీళ్ల ప్రయత్నాలు కూడా అంతేగదా? పైగా ఈ సంఘంవాళ్లు సనాతన హిందువులపై హరిజనులకు ద్వేష భావము కలిగిస్తున్నారు. ఈ చెడును మొగ్గలో తుంపివేయడం మంచిది. లేకపోతే భవిష్యత్తులో హిందువులకు హరిజనులకు మధ్య సంఘర్షణలు కలుగవచ్చు. అప్పుడు వాటిని ఆపడం ఎంతో కష్టతరం. ఈ స్థితి శాంతిసాధనకే కంటక మవుతుంది. కాంగ్రెస్ వాదులంతా ఈ సమస్యను గుర్తించి పరిష్కరించడం మంచిది. ఈ విషయాన్ని నెల్లూరులో వున్న హిందూ మహాసభ, ఆర్య సమాజ్ కార్యకర్తల దృష్టికి తెచ్చాడు. వాళ్లు సానుభూతి చూపారే తప్ప ఆసక్తి ప్రదర్శించలేదు. ఈ సమస్యా పరిష్కారం కోసం మీ సలహాలు కోరుతున్నాను.

పొట్టి శ్రీరాములు మరొక అంశాన్ని కూడా ఇలా గాంధీజీ దృష్టికి తెచ్చాడు. కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తగా గుర్తింపబడిన ఒక వ్యక్తి కావలిలో తన యింట్లో ప్రొ॥ యన్. జి. రంగా గారితో కలిసి సహపంక్తి భోజనం చేయడానికి నిరాకరించాడు. ఇటువంటి చాదస్థపు కట్టుబాట్లను కాంగ్రెస్ నాయకులే అధిగమించకపోతే సామాన్య వ్యక్తుల మాటేమిటి? ఈ విషయాన్ని నేను

అనంతపురంలోని ప్రముఖ కాంగ్రెస్ కార్యకర్త కల్లూరు సుబ్బారావు గారికి, మద్రాసు రాష్ట్ర మాజీ మంత్రి బెజవాడ గోపాలరెడ్డి గారికి తెలియజేశాను. కానీ వాళ్లు దీన్ని ఏమాత్రం పట్టించుకోలేదు.

"ప్రతి తాలూకా కేంద్రంలో హరిజన సేవా సమితి స్థాపించడం మంచిదని నా అభిప్రాయము. వాటిద్వారా ప్రతి తాలూకాలోని హరిజన సమస్యలను అవగాహన చేసుకొనవచ్చును. హరిజనుల బాధలను వివరిస్తూ పాటలు రచించి ప్రచారం చేయవచ్చు. నేనీ విషయాలను ఆంధ్ర ప్రాంత హరిజన సేవా సంఘం కార్యదర్శి మాజీ పార్లమెంటు సభ్యుడు బి.యన్. మూర్తిగారికి వ్రాసి ఆయన సలహా కోరాను. ఈయన నా అభిప్రాయాలకు ఎటువంటి ప్రాధాన్యతనూ ఇవ్వలేదు.

1945 ఏప్రిల్ 9వ తేదీన గాంధీజీ పొట్టి శ్రీరాములుకు ఇలా లేఖ వ్రాశాడు.

*బొంబాయి,*
***9-4-1945***

*ప్రియమైన రాములూ!*

*అనేక సద్విషయాలున్న నీ లేఖ చాలా సుదీర్ఘంగా వుంది. నీవు చెప్పదలచిన విషయాలను క్లుప్తంగా వ్రాస్తే బాగుండేది. అస్పృశ్యత నిర్మూలించబడవలసిందే సత్య ధర్మాల ఆవశ్యకతను అందరికి బోధించవలసిందే. ఇతరులు అనుకరించినా లేకపోయినా నీ ప్రచార కార్యక్రమాన్ని నిలుపవద్దు. ఇందుకై నిరాహారదీక్ష పూనొద్దు. అయాచితంగా వచ్చినదానితో కాలం గడుపు.*

*నీ*

*బాపు*

1945 మే 14వ తేదీన మళ్లి బాపూజీకి లేఖ వ్రాశాడు శ్రీరాములు. తన ఉద్యమాన్ని ఉధృతంగా సాగించడం, నూలువడికి డబ్బును హరిజన సంక్షేమనిధికి ఇవ్వడం మున్నగు అంశాలు ఆ ఉత్తరంలో వున్నాయి. ఈ లేఖకు బాపూజీ సమాధానం వ్రాస్తూ శ్రీరాములు ప్రచార విధానాన్ని హర్షిస్తున్నానని అస్పృశ్యతా నిర్మూలనకు దేవాలయం ప్రవేశం ఒక్కటే మార్గం కాదని ఇంకా మార్గాలున్నాయని సూచించాడు.

1945 జూలై 28న శ్రీరాములు బాపూజీకి మరొక లేఖ వ్రాశాడు. ఇందులో సారాంశము ఏమిటంటే, తన ఉద్యమం యధావిధిగా కొనసాగుతున్నదని.

కులాంతర విందు భోజనాలు ఏర్పాటు చేశానని సవర్ణ హిందువులలో కొంత జాగృతి కలిగి తనకు సహకరిస్తున్నారని, హిందువులను విమర్శించే అంబేద్కర్ పార్టీ కూడా తనను అభినందిస్తున్నదని, కానీ కాంగ్రెస్ పార్టీలోని బ్రాహ్మణులే సహకరించడం లేదని ఆర్థికంగా నిలదొక్కుకున్న మేధావి వర్గాలు తన ఉద్యమానికి చేయూతనీయడం లేదని శ్రీరాములు బాపూజీకి వ్రాశాడు.

అస్పృశ్యతా నిర్మూలనకు హరిజనుల దేవాలయ ప్రవేశమొక్కటే మార్గం కాదన్న బాపూజీ భావంతో శ్రీరాములు ఏకీభవించలేదు. ఇతర మార్గాలున్నాయి అవి ఫలితాన్నివ్వలేవని గాంధీజీకి తెలుపుతూ ఈ క్రింది విషయాన్ని ఉదాహరించాడు. హిందువుల నివాస స్థలాల్లో బావులలో నీరు హరిజనులు కూడా తోడుకోవచ్చు అని ప్రభుత్వం చట్టం చేసింది. కాని హరిజనులు బావుల దగ్గరికి రానీయడము లేదు. కనుక హరిజలను దేవాలయాల్లో ప్రవేశపెట్టడమే ఏకైక మార్గమని శ్రీరాముల ధృడవిశ్వాసం. తన అభిప్రాయాన్ని సమర్థిస్తూ ఉదాహరణలను కూడా బాపూజీకి నివేదించాడు. 1932లో ఆగష్టు 17వ తేదీన మెక్డోనాల్డు మహాశయులు కుల ప్రాతిపదికపై ప్రత్యేక నియోజక వర్గాలను ఏర్పాటుచేశాడు. అందులో హరిజనులకు అవకాశం కల్పించాడు. గాంధీజీ దీన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు. దీన్ని వ్యతిరేకిస్తూ 20-10-32వ తేదీన నిరశన వ్రతం ప్రారంభించాడు. దీని ప్రధాన లక్ష్యం ఆంగ్లేయులకు ఒత్తిడి తేవడం కాదని హరిజనుల పట్ల హిందువులకు సహృదయ పరివర్తన కలిగించడానికేనని చెప్పాడు. రవీంద్రనాథ్ ఠాగూర్ గాంధీజీ ఈచర్యను హర్షించారు. గాంధీజీ లక్ష్యసాధనకు సహకరించవలసిందిగా హిందులవులకు విజ్ఞప్తి చేశాడు. క్రమానుగతంగా ప్రజల్లో మార్పువచ్చింది. అలహాబాదువంటి ప్రధాన నగరాల్లో హరిజనులకు దేవాలయ ప్రవేశం కల్పించబడింది. అగ్రవర్ణాలవారు హరిజనులను సోదరులుగా భావించసాగారు. అస్పృశ్యతా నివారణ కృషి చేస్తామని వేలాదిగా దేశభక్తులు ఎరవాడ జైల్లోవున్న బాపూజీకి లేఖలు వ్రాశారు. కొందరు ప్రముఖ రాజకీయవేత్తలు ప్రభుత్వాధికారులతో ఈ సమస్యపై చర్చలు ప్రారంభించారు. ఈ విషయములో గాంధీజీకి ప్రభుత్వానికి మధ్య జరిగే సంప్రదింపుల్లో తోడ్పడడానికి బాబూ రాజేంద్రప్రసాద్, సప్రూ మహాశయులు పూనా వెళ్లారు. సంప్రదింపులు ఫలించాయి. ప్రత్యేక నియోజక వర్గాల ఏర్పాటుకు బదులు పూనా ఒడంబడికి ఏర్పాటు అయింది. దీన్ననుసరించి రాష్ట్ర శాసనసభలో దళిత

వర్ణాలకు 147 సీట్లు కేటాయించ బడ్డాయి. సాధారణ ఎన్నికల ప్రాతిపదికగా వాళ్లకు లభించే స్థానాలకన్న ఈ సంఖ్య ఎక్కువే. ప్రాథమిక ఎన్నిక ద్వారా అధిక సంఖ్యాకుల నిర్ణయము ప్రకారమే హరిజన అభ్యర్థులు నిర్ణయించబడతారు. సెప్టెంబరు 26వ తేదీన ఈ ఒడంబడిక పూర్తి పాఠాన్ని ఒకే పర్యాయము ఢిల్లీ లండన్ నగరాల్లో ప్రకటించారు. తత్ఫలితంగా గాంధీజీ నిరాహారదీక్షను విరమించాడు. 1932 సంవత్సరములోనే జాపూజీ యింతటి గొప్ప కృషి చేశాడు. ఎందరో కాంగ్రెస్ పెద్దలు అస్పృశ్యతా నిర్మూలనకు కంకణాలు కట్టుకున్నారు. కానీ 1945 నాటికే ఆ విషయాలన్నీ మరచిపోయారు. ఈ అంశం గాంధేయవాది శ్రీరాములుకు బాధ కలిగించింది. అయినా శ్రీరాములు నిరుత్సాహపడలేదు. ఇల్లిల్లూ తిరిగి బిచ్చమెత్తాడు. హరిజనులతో పాటు చర్మకారులు మున్నగు వారిని కూడా సమావేశపరిచాడు. కులాంతర విందు భోజనాలను ఏర్పాటు చేశాడు. అంతేగాక అగ్రవర్ణాల సహకారంతో హరిజన వాడలను తరుచుగా శుభ్రం చేశాడు. అస్పృశ్యతా నిర్మూలనతోబాటు చేయవలసిన ఇతర కార్యక్రమాలను సూచించమంటూ గాంధీజీ 2-10-1945న లేఖ వ్రాశాడు.

**గాంధీజీ సలహా యిచ్చినా స్థానిక కాంగ్రెస్ నాయకులు సహకరించ లేదు. శ్రీరాములు తాను ఒంటరియైనట్లు భావించాడు. అయితే తనకున్న ప్రజా సహకారంతో తృప్తి చెందాడు. హరిజనులకు ఆర్థిక ప్రయోజనం కలిగించడం శ్రీరాములు ఆశయము. అయినా హరిజనులకు తాము హిందువులతో సమానులమనే భావం కలిగించడం కూడా ప్రధానమని ఆయన భావించాడు.**

శాసన సభకు ఎన్నికలు జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. అప్పుడైనా కాంగ్రెస్ కార్యకర్తలు హరిజనులపట్ల నిర్లక్ష్యంగానే వున్నారు. అందుకు శ్రీరాములు బాధపడ్డాడు. అందుకని గాంధీ జయంతి వారోత్సవాల సందర్భంలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త 1. కులాంతర విందుభోజనం ఏర్పాటు చేయడం, 2. హరిజన వాడలను శుభ్రపరచడం. 3. హరిజనులకు దేవాలయ ప్రవేశము కల్పించడము అనే మూడంశాల కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో పాటించేలా ఆదేశాలివ్వవలసిందని గాంధీజీ ఆర్థించాడు.

ఉత్తర భారతదేశంలో కంటె దక్షిణ భారతదేశంలో కులతత్వం ప్రబలివుందని

శ్రీరాములు నమ్మకం. 1945 జులై నెలలో పెరియార్ రామస్వామి నాయకర్ నెల్లూరు వచ్చాడు. తాను కాంగ్రెస్ నుండి వైదొలగి ప్రత్యేక ద్రావిడ ఉద్యమాన్ని ప్రారంభించబోతున్నట్లు శ్రీరాములుకు చెప్పాడు. దీనికంతటికి కులతత్వమే ప్రధాన కారణమని శ్రీరాములు భావించాడు. అంతేగాక కులాంతర పంక్తి భోజనాలను గాంధీజీ ప్రోత్సాహించడంలేదని సనాతన బ్రహ్మణ కాంగ్రెస్ సెప్టెంబరు 2న గాంధీజీకి లేఖ వ్రాశాడు. భారతదేశంలో కులతత్వము, అస్పృశ్యతలనే దురాచారాలను నిర్మూలించాలి. అలా చేస్తే పాకిస్తాన్ స్థాపనకై ముస్లింములు చేస్తున్న వేర్పాటు వాదాన్ని రూపుమాపవచ్చు. తద్వారా దేశ సమైక్యాన్ని సాధించవచ్చు. అస్పృశ్యతా నివారణకు తాను ఉడతా భక్తిగా ఏర్పాటు చేసిన కులాంతర విందు భోజనాలను సనాతన బ్రహ్మణ కాంగ్రెస్ నాయకులు మూకుమ్మడిగా బహిష్కరించారు. దీనికంతటికి కులతత్వం ప్రధాన కారణం. ఈ వాస్తవాలను గాంధీజీ దృష్టికి తేవాలన్నదే తన ప్రధానాశయము. అన్నది లేఖా సారాంశము.

పొట్టి శ్రీరాములు, చేపట్టిన ఈ ఉద్యమం ఒంటరిగా సాధ్యం గాదు. ఇందుకు ఒక సంఘాన్ని ఏర్పరచడం మంచిదని శ్రేయోభిలాషులు సలహా ఇచ్చారు. శ్రీరాములు వెంటనే నెల్లూరు పురప్రముఖులను హిందూ మహాసభ కార్యకర్తలను ఆర్యసమాజ్ కార్యకర్తలను కలిశాడు. వారి సహకారంతో "హిందూ సంఘం సంస్కరణ సమితి" అనే ధార్మిక సమితిని 9-10-1945న స్థాపించాడు. మొదట ఈ సంస్థ 298 మంది సభ్యులతో ప్రారంభించబడింది. ఈ సంస్థలో సంఘ సేవకులు, విద్యార్థులు, ప్రభుత్వోద్యోగులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, పూజ్యులు మున్నగు అన్ని తరగతులవారికి ప్రాతినిధ్యం కల్పించబడింది.

12-11-1945న శ్రీరాములు గాంధీజీకి ఒక లేఖ వ్రాశాడు.

హిందూ సంఘ సంస్కరణ సమితి ఏర్పాటు, 7-10-1945న ఆ సమితి పక్షాన ఒక కులాంతర విందు భోజనం ఏర్పాటు చేయడం, రేషనింగు అమల్లోవున్నా ఇంటింటికి బిచ్చమెత్తి తాను విందు ఏర్పాటు చేయడం - లేఖలోని సారాంశం.

హైందవ సమాజంలో తరతరాలుగా వేళ్లూనుకొని పోయిన అంటరానితన మనే సాంఘిక దురాచారాన్ని తొలగించడంలో శ్రీరాములు పూర్తిగా గాంధీజీ అడుగు జాడల్లో నడిచాడు. తుది శ్వాస విడిచే వరకూ నూటికి నూరుపాళ్లు గాంధీ అనుచరుడుగా జీవించా గాంధేయవాదుల్లో గాంధీజీ అంతటి అగ్రగణ్యుడుగా, ప్రసిద్ధి వహించాడనడంలో సందేహం లేదు.

## ఐదవ అధ్యాయం

# హరిజన దేవాలయ ప్రవేశము

**హిం**దూ సంఘ సంస్కరణ సమితి స్థాపనతో పొట్టి శ్రీరాములు సేవా కార్యక్రమాలకు పుష్టి చేకూరింది. హరిజనుల దేవాలయ ప్రవేశాన్ని గురించి ఆయన 1946 మార్చి 1న నెల్లూరు వేణుగోపాలస్వామి ఆలయమువద్ద నిరసన వ్రతం ప్రారంభించదలచాడు. దీనికి హిందూ సంస్కరణ సమితి ఆధ్వర్యం వహించదలచింది. దీనితోబాటు ఆర్యసమాజ హిందూ, మహాసభాది ధార్మిక సంస్థల ప్రోత్సాహం కూడా లభించింది. నెల్లూరు ప్రజలలో ధర్మకర్తల సంఘంలో చైతన్యం కలిగించడం ఈ ప్రయత్నపు ప్రముఖోద్దేశ్యం. దీక్షకు ముందు శ్రీరాములు పురజనుల సహకారంతో దేవాలయ ప్రవేశానికి అనుకూలంగా సంతకాల సేకరణ చేశాడు. వేణుగోపాలస్వామి ఆలయము నెల్లూరు జిల్లాలో ప్రముఖమైంది. దీనికి ప్రధాన ధర్మకర్త ఏ.సి. సుబ్బారెడ్డి గాంధీజీని మద్రాసుకు వచ్చినప్పుడు నెల్లూరుకు వచ్చి హరిజన దేవాలయ ప్రవేశాన్ని ప్రారంభించవలసిందిగా కోరాడు. ఇతర



కార్యక్రమాల ఒత్తిడివల్ల గాంధీజీ నెల్లూరు రావడానికి తన అశక్తతను తెలియపరచాడు. అందుచేత సుబ్బారెడ్డి ఈ కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేశాడు. ఈ వైఖరిని గాందేయుడు శ్రీరాములు సహించలేకపోయాడు. ఆయన వెంటనే గాంధీజీకి ఇలా తంతి పంపాడు.

"మీరు ఇక్కడికి రావడం లేదనే మిషతో ఆలయ ధర్మకర్త ఏ.సి. సుబ్బారెడ్డి హరిజన దేవాలయ ప్రవేశాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ విషయము పట్ల అధిక సంఖ్యాకులు శ్రద్ధ చూపిస్తున్నారు. ఈ దేవాలయములో హరిజనుల ప్రవేశము జరిగితే మిగతా దేవాలయముల్లో కూడా ప్రవేశము జరుగుతుంది. ఇందుకు నేను నిరసన వ్రతము ప్రారంభించదలచాను. ఇందుకు మీ ఆశీర్వాదము కోరుతున్నాను. ఇందుకు గాంధీజీ ఇలా జాబు వ్రాశాడు.

పూనా, *23-2-1946*

*ప్రియమైన శ్రీరాములూ!*

*నీ టెలిగ్రాం అందింది. నా ఆశీర్వదాలు తప్పకుండా వున్నాయి.*

ఇట్లు

*నీ బాపు*

పొట్టి శ్రీరాములు నిరాహారదీక్షను గూర్చి ఆలోచించడానికి 1946 ఫిబ్రవరి 28న ఆర్యభవనములో ప్రొఫెసర్ పి.సి. రెడ్డి అధ్యక్షతన సమావేశము జరిగింది. ఆ సదస్సుకు అన్ని సేవా సంఘాల సభ్యులు వచ్చారు. నిరాహారదీక్షకు దారితీసిన సంఘటనలన్నింటిని సమావేశము సమీక్షించింది. ధర్మకర్తల సంఘానికి ఆఖరి అవకాశం ఇవ్వాలని సమావేశము అభిప్రాయపడింది. తన్మూలంగా శ్రీరాములు నిరసన వ్రతము మార్చి 7వ తేదీన మార్చబడింది. జరిగిన నిర్ణయాన్ని మార్చడం సబబు కాదని శ్రీరాములు వాదించాడు. కానీ ఎక్కువమంది సభ్యుల నిర్ణయము కాబట్టి తుదకు అంగీకరించాడు. 7వ తారీకు ఉదయము 11 గంటలలోపల హరిజనులను దేవాలయములోకి ప్రవేశించనీయని పక్షంలో శ్రీరాములు నిరాహార దీక్షను ప్రారంభించాలి అనే తీర్మానాలను సభ ఆమోదించింది. ఈ విషయాలన్నింటినీ పొట్టి శ్రీరాములు గాంధీజీకి తెలుపుతూ లేఖ వ్రాశాడు.

ఆర్యసమాజ్ కార్యదర్శి పుత్తేటి సుబ్రహ్మణ్యాచార్యులు తీర్మానానుగుణంగా మార్చి 1వ తేదీన ధర్మకర్త ఏ.సి. సుబ్బారెడ్డిని కలిశాడు. ఆయన మేనేజరును,

కలువవలసిందని సలహా యిచ్చాడు. ఈ అంశం దేవాలయపు మేనేజర్ సి. కోటేశ్వరరావు దృష్టికి తేబడింది. దీనికి రాష్ట్ర ప్రభుత్వము అనుమతి కావాలని ప్రస్తుతము ఎలక్షన్ పనివల్ల ధర్మకర్తలకు తీరుబడిలేదనీ 3 నెలలు తరువాత వీలుంటుందని అతడు చెప్పాడు.

ఇలా ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. శ్రీరాములు నిరసన వ్రత మారంభింపక తప్పలేదు. 7-3-1946న మధ్యాహ్నం నుంచి అతను నిరాహారదీక్ష మొదలుపెట్టాడు. దీక్ష ఆలయ ప్రాంగణంలో వహించడానికి మేనేజర్ అనుమతించలేదు. పట్టాభీ, కళా వెంకట్రావు ప్రభుతులకు జిల్లా పట్టణ కాంగ్రెస్ కమిటీల అధ్యక్షులకూ ప్రముఖ పత్రికా సంపాదకులకు తెలియచేయబడింది.

1946 మార్చి 10వ తేదీన పి. సుబ్రహ్మణ్యాచార్యులు అధ్యక్షతన నెల్లూరు మూలపేటలో ఒక సమావేశము జరిగింది. వెంటనే హరిజనులను దేవాలయము లోనికి ప్రవేశపెట్టాలని ధర్మకర్తలను ఈ సమావేశము కోరింది. 1వ తేదీన శ్రీరాములు ఆలయ ధర్మకర్తల మొండివైఖరిని నిరసిస్తూ బాపూజీకి లేఖ వ్రాశాడు.

శ్రీరాములు దీక్ష ప్రారంభించి నాలుగవరోజు అయినా ధర్మకర్తల ఉద్దేశము మారలేదు. ఇందుకు ఏవో ఇబ్బందులున్నట్లు వాళ్లు అంటున్నారు. బెజవాడ గోపాలరెడ్డి స్వతంత్రభారతం అవతరిస్తుందని అప్పుడే సమస్యలన్ని చక్కబడతాయనీ అంటున్నాడు. నిరసన వ్రతాన్ని విరమించ ముంటున్నారు. శ్రీరాములు నిరాహారదీక్ష పట్లణ ప్రజలకు చర్చనీయాంశమైంది. ప్రజలకు తన మీద ఇంత సానుభూతి వుంటుందని ఆయన అనుకోలేదు. తన కృషి వ్యర్థం కాలేదని శ్రీరాములు భావిస్తున్నాడు. అలజడి లేకుండానే మధుర మీనాక్షి దేవాలయములో హరిజనులు ప్రవేశించారు. కాని ఇక్కడ ఆందోళ జరుపవలసి వచ్చింది. త్వరలో ఈ ప్రాంతములో అంటరానితనము అంతమవుతుందని అతడు భావిస్తున్నాడు. తన ఆశయసిద్ధికి బాపూజీ ఆశీస్సులు కావాలి. ఆ ప్రాంతం వారికి హిందీ తెలియదు. గనుక బాపూజీ ఆంగ్లంలో లేఖలు వ్రాయాలి ఇది లేఖ సారాంశం.

మార్చి 12వ తేదీన నెల్లూరు స్టోన్‌హౌస్ పేటలో బహిరంగసభ జరిగింది. చెంచు నరసింహారావు అధ్యక్షత వహించాడు. ఈ సమావేశము శ్రీరాములు దీక్షను బలపరచింది. వేణుగోపాలస్వామి ఆలయములోనికి హరిజనులును

ప్రవేశపెట్టాలని తీర్మానం చేసింది. ఈ విషయమై వెంటనే చర్య తీసుకోవాలని ప్రతినిధివర్గం ఒక విజ్ఞప్తిని దేవాలయ ధర్మకర్తలకు అందించింది. మార్చి 13వ తేదీన శ్రీరాములు దీక్షను విరమింపచేయ వలసిందిగా నెల్లూరు ప్రజలు బాపూజీకి టెలిగ్రాములు పంపారు. అదేరోజు కృష్ణాజిల్లా ముందనూరు వాస్తవ్యులు గోపరాజు రామచంద్రరావు ప్రయత్నించాడు. వెంటనే చర్య తీసుకోవడానికి తమకు చట్ట పరమైన అడ్డంకులు వున్నాయని ధర్మకర్తలు బాపూజీకి టెలిగ్రామ్ పంపారు. గాంధీజీ మార్చి 14వ హిందూ సంఘ సంస్కరణ సమితి కార్యదర్శికి, హరిజన విద్యార్థి వసతి గృహ మేనేజరుగారికి ఇలా తంతి పంపాడు. “హరిజనులకు దేవాలయ ప్రవేశము కల్పించడానికి చట్టపరమైన అభ్యంతరాలు ఏవీలేవు. శ్రీరాములుకు ఈ విషయము చెప్పండి”.

అదేరోజున హరిజనులకు దేవాలయ ప్రవేశాన్ని కల్పించాలని కొరుతూ పట్టణంలో హర్తాల్ నిర్వహించబడింది. ఇందులో అన్ని వర్గాల ప్రజలు చేరి విజయవంతము చేశారు. ఆ రోజు నెల్లూరులో పెద్ద ఊరేగింపు జరిగింది.

న్యాయవాది వి. పట్టాభిరామిరెడ్డి అధ్యక్షతను తిప్పరాజువారి సత్రం దగ్గర పెద్ద బహిరంగసభ జరిగింది. ప్రముఖులు ఉపన్యాసాలు చేశారు. ఒక కార్యచరణ సంఘం నియమించబడింది. అదేరోజు పట్టణ వర్తక సంఘం సమావేశమై హరిజనులకు దేవాలయ ప్రవేశము కల్పించాలని శ్రీరాములు నిరసన వ్రత విరమణ చేయాలని తీర్మానించింది.

మార్చి 15వ తేదీన గాంధీజీ బొంబాయి నుండి సుదీర్ఘ పత్రికా ప్రకటన చేశాడు. ఆ ప్రకటన పూర్తి పాఠం ఈ క్రింద ఇవ్వబడింది.

పొట్టి శ్రీరాములు చిరకాలంగా పేరు ప్రఖ్యాతుల నాశింపకుండా నెల్లూరు పట్టణంలో ప్రజాసేవ చేస్తున్న సాధారణ కాంగ్రెస్ కార్యకర్త. ఆ ప్రాంత హరిజనోద్ధరణకు ఇతరులు తోడ్పాటు లేకుండా ఒంటరిగా కృషి చేస్తున్న వ్యక్తి. ఒకప్పుడు నెల్లూరులో అస్పృశ్యతా నివారణాది సంఘ సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి ఎంతో కృషి జరుగుతుందని ఆశింపబడింది. ఈ లక్ష్యంతోనే నెల్లూరు దగ్గర ఒక ఆశ్రమం కూడా స్థాపించబడింది. కారణాంతరాలవల్ల లక్ష్యసిద్ధి కలుగలేదు. దేశభక్తితో కొండా వెంకటప్పయ్య పంతులు వార్ధక్యం ఉన్నా స్ఫూర్తినిస్తున్నారు. ఆ ప్రాంతంలోనే పొట్టి శ్రీరాములు అస్పృశ్యతా నివారణాది

సాంఘిక దురాచార నిర్మూలనకు శ్రమిస్తున్నాడు. నెల్లూరులో హరిజనులకు దేవాలయ ప్రవేశము కల్పించడానికి అతను చిరకాలంగా కృషి చేస్తున్నాడు. ఇందుకు అతడు చేసిన ఇతర ప్రయత్నాలు విఫలమయ్యాయి. లక్ష్యసాధనకు ప్రజల్లో చైతన్యం కలిగించడానికి ఆఖరి ప్రయత్నంగా నిరాహారదీక్ష వహింపవలసి వచ్చని అనుమతి కోరాడు. అతనికి వెంటనే నా అనుమతి తెలిపాను. శ్రీరాములు దీక్ష కారణంగా అ ప్రాంతంలో అలజడి బయలుదేరిందని విన్నాను. హరిజనుల దేవాలయ ప్రవేశానాకి కొన్ని చట్టపరమైన ఇబ్బందులు ఉన్నాయని, దానికి కొంత వ్యవధి కావాలనీ కనుక శ్రీరాములు దీక్షను విరమింపజేయ వలసిందనీ కొందరు మిత్రులు నన్ను కోరారు. కానీ అతనికి అలాంటి సలహా ఇవ్వడం సమంజనమని నాకు తోచలేదు. శ్రీరాములు మానవ సేవ కంకితమైన మహావ్యక్తి. అధికారుల అలక్ష్యం వల్ల, ప్రజల అజ్ఞానం వల్ల అతడు మరణించడం సహించరాని విషయము. అఖిలభారత స్థాయిలో కాకపోయినా దక్షిణ భారత స్థాయిలోనైనా విలేఖరులు అక్కడికి వెళ్లి వాస్తవాలను వెల్లడించగలరని ఆశిస్తున్నాను. హరిజనుల దేవాలయ ప్రవేశ విషయములో నేను భావించినట్లు చట్టపరమైన అవరోధం లేనట్లయితే ఆ విషయాన్ని అనవసరంగా పొడిగించి శ్రీరాములుకు ప్రాణహాని కలిగించడం సిగ్గుచేటయిన విషయము. అందుచేత పత్రికా విలేఖరులు, పెద్దలు హరిజనుల దేవాలయ ప్రవేశాన్ని వ్యతిరేకించే ధర్మకర్తలకు, అధికారులకు నచ్చజెప్పి అమూల్యమైన ఒక వ్యక్తి ప్రాణాన్ని కాపాడ గలదని ఆశిస్తున్నాను.

అదేరోజు గాంధీజీ కొండా వెంకటప్పయ్య పంతులుకు ఒక తంతి పంపాడు. అందులో ఇలా వుంది.

“హరిజనుల దేవాలయ ప్రవేశము కోసము నా సలహా ప్రకారం పొట్టి శ్రీరాములు నెల్లూరులో నిరాహారదీక్ష పూనాడు. వీలైతే మీరొక పర్యాయము. అక్కడికి వెళ్ళిరండి. మీకు వీలుకాకపోతే ఎవరినైనా పంపండి. సత్వర పరిష్కార మార్గాన్ని ఆలోచించండి. నాకు ఈ విషయములో పరస్పర విరుద్ధ వార్తలు అందుతున్నాయి. అక్కడి పరిస్థితిని గమనించి నాకు తంతిని పంపండి”.

ఈ లోగా కార్యాచరణ సంఘ సభ్యులు దేవాలయ ధర్మకర్తలను కలసి పొట్టి శ్రీరాములు కోరిక ప్రకారము వెంటనే హరిజనులకు దేవాలయ ప్రవేశము

కల్పించవలసినదని విజ్ఞప్తి చేసారు. పొట్టి శ్రీరాములుకు గాంధీజీ మద్దతు ఉన్నదనీ తెలిసిన వెంటనే ఆలయ ధర్మకర్తలు వేణుగోపాలస్వామి ఆలయములో హరిజనులను ప్రవేశపెట్టడానికి అంగీకరించారు. అయితే యిందుకు రాష్ట్ర ప్రభుత్వ అనుమతి పొందాలని చెప్పారు. మార్చి 15వ తేదీన ఉదయము పది గంటలకు దేవాలయ ధర్మకర్తలు వ్రాత పూర్వకంగా శ్రీరాములుకు తమ అంగీకారాన్ని తెలిపాడు. వెంటనే వివిధ సామాజిక సంఘాలు, కార్యకర్తలు ఏ.సి. సుబ్బారెడ్డి అధ్యక్షతన సమావేశమై శ్రీరాములు దీక్ష విజయవంతమైనందుకు అభినందించారు. అప్పుడు శ్రీరాములు వ్రాతపూర్వకంగా ఇలా ప్రకటించాడు.

"హరిజనుల దేవాలయ ప్రవేశ విషయములో ప్రజా సహకారం సంపూర్ణంగా ఉంది. ఈ అంశం నేను నిరాహారదీక్షలో వుండగా ఋజువైంది. ధర్మకర్తలు లిఖితపూర్వక అనుమతి తెలపడానికి కారణాలు: ఈ విషయంలో ఇంకా ఆలస్యం జరిగితే ప్రజలు సహించరనే భయం. నా లక్ష్యాన్ని సమర్థిస్తూ గాంధీజీ యిచ్చిన టెలిగ్రాం. త్వరలో రాబోయే ప్రజాభిప్రాయానికి కట్టుబడి ఉండడం. నా దీక్షా సమయములో మూడంశాలు గ్రహించాను. అవి 1. నా ప్రయత్నానికి ప్రజా సహకారం వుంది. 2. స్థానిక కాంగ్రెస్ నాయకులకు సంఘసేవపట్ల ఆసక్తి లేదు. 3. దేవాలయ ధర్మకర్తలు హరిజనులకు దేవాలయ ప్రవేశ కార్యక్రమాన్ని ప్రారంభించడమేగాని హరిజనులకు దేవాలయ ప్రవేశము కల్పించడానికి కాదు. వారికి ఈ విషయము ఇష్టం లేకపోయినా ప్రజల ఒత్తిడివల్ల అంగీకరించారు. నేను ప్రస్తుతానికి నిరసన వ్రతాన్ని విరమించినా అవసరమొస్తే ఈ విషయములో నిరాహారదీక్ష మళ్ళీ పూనడానికి వెనుకాడను".

శ్రీరాములు దీక్ష విరమణవార్త గాంధీజీకి తంతి ద్వారా తెలుపబడింది. హరిజనోద్ధరణకై శ్రీరాములు చేస్తున్న కృషిని, ప్రజాభీష్టంపట్ల అతను చూపుతున్న గౌరవభావానికి బాపూజీ ముగ్ధుడయ్యాడు. 16-3-1946న గాంధీజీ మరలా ఇలా పత్రిక ప్రకటన చేశారు.

శ్రీరాములు నిరసన వ్రత విరమణ వార్త తంతి ద్వారా ఈ రోజే అందింది. హరిజనోద్ధరణ విషయములో అక్కడి ప్రజలు బాధ్యత వహించినప్పుడే శ్రీరాములు దీక్ష విరమించినందుకు సంతోషిస్తున్నాను. దేవాలయ ప్రవేశము కల్పించ బడగలదని ఆశిస్తున్నాను. శ్రీరాములు దీక్షలో వున్నప్పుడు ప్రజలు చూపిన

సానుభూతికి గల నిజమైన అర్థము ఇదేనని నేను భావిస్తున్నాను".

గాంధీజీ కోరిక మేరకు 17వ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక విలేఖరి నెల్లూరు వచ్చి శ్రీరాములును కలుసుకున్నాడు. అప్పుడు శ్రీరాములు మూలపేట వేణుగోపాలస్వామి ఆలయము ప్రక్క పూరి గుడిసెలో చాపమీద కూర్చొని వున్నాడు. ఆయన అలసిపోయినట్టున్నా ముఖం ప్రశాంతంగా వుంది. విలేఖరిని చూసి శ్రీరాములు కూర్చోమని చేప్పాడు. నిరాహారదీక్షబూని విజయం సాధించినందుకు విలేఖరి శ్రీరాములును అభినందించాడు. శ్రీరాములు హీన స్వరంతో విలేఖరితో

**"తరతరాలుగా హిందూ సమాజంలో వేళ్లూనుకొన్న మూఢనమ్మకాలు తొలగిపోయే సమయము ఆసన్నమైంది. దైవారాధన విషయములో కులమత విచక్షణలేక అందరికి సమానావకాశాలు కలిగాయి. ఈ లక్ష్యాన్ని సాధించడానికి నేను నిరాహారదీక్ష పూనవలసి వచ్చింది.**

అప్పుడా విలేఖరి శ్రీరాములుతో ఇలా అన్నాడు. కాలానుగుణంగా కొత్త చట్టాలు కావలసివచ్చినా పాత చట్టాలను కూడా గౌరవించాలి. అవి సామాజిక జీవితానికి కావలసివచ్చినా పాత చట్టాలను కూడా గౌరవించాలి. అవి సామాజిక జీవితానికి పునాదుల్లాంటివి. 1926లో రూపొందిన హిందూ దేవాలయ చట్టం (హెచ్.ఆర్.ఈ) లోని 79వ నిబంధన యిలా వుంది. దేవాలయాల విషయములో లేక మతాల విషయములో, నిర్వాహకులు అనుభవించే హక్కులు, మర్యాదలు మున్నగు సంప్రదాయాలను ఈ చట్టము ఏమాత్రం భంగపరచదు. ఈ విధంగా ఈ చట్టం తరతరాలుగా అమల్లో వున్న సంప్రదాయాలకు భంగం కలిగించడానికి అంగీకరించదు. కానీ 1939లో రూపొందిన దేవాలయ ప్రవేశ చట్టము హరిజనులు దేవాలయ ప్రవేశం చేయడానికి పై చట్టాన్ని కొంత సడలించింది. ఈ చట్టంలోని మూడవ నిబంధన యిలా వుంది. దేవాలయ ప్రవేశానికి ప్రజలు అభ్యంతరం తెలుపకపోతే రాష్ట్ర ప్రభుత్వానుమతి పొంది హరిజనులకు కల్పించవచ్చు. కాబట్టి ఈ నిబంధన రెండు విషయాలను స్పష్టం చేస్తున్నది.

1) హరిజనులు దేవాలయాన్ని ప్రవేశించడానికి ప్రజలు వ్యతిరేకులు కారని ధర్మకర్తలు గుర్తించాలి.

2) రాష్ట్ర ప్రభుత్వ అనుమతి పొందిన తరువాతనే అలాంటి అవకాశాన్ని హరిజనులకు కల్పించాలి.

పొట్టి శ్రీరాములు పత్రికా విలేఖరికి ఇలా సమాధానం ఇచ్చాడు. "హరిజనులు దేవాలయ ప్రవేశానికి ప్రజాభిప్రాయము అనుకూలంగా వుంది. ధర్మకర్తలు సుముఖంగా వున్నారు. అయినప్పుడు రాష్ట్ర ప్రభుత్వానుమతి సులభంగా లభిస్తుంది. త్వరలో కాంగ్రెస్ ప్రభుత్వం రాబోతున్నది. ఇలాంటి ముఖ్యమైన విషయాల్లో ప్రజా శ్రేయస్సు దృష్ట్యా నూతన ప్రభుత్వము చట్టాన్ని సడలించడంలో పెద్ద ప్రమాదమేమీ లేదు. ఇలాంటి చిన్నచిన్న లోపాలను మన కాంగ్రెస్ ప్రభుత్వము తప్పక గౌరవిస్తుంది. ప్రజలు కోరినా కొంతమంది ధర్మకర్తలు ఆసక్తి చూపలేదు. అందుకే నేను నిరసన వ్రతం పూనవలసి వచ్చింది.

మార్చి 18వ తేదీన ప్రజలు, పత్రికలు శ్రీరాములును అడిగిన ప్రశ్నలకిలా సమాధానమిచ్చాడు. "వేణుగోపాలస్వామి దేవాలయ విషయంలో నాకు అంత పట్టుదల ఎందుకని నన్ను చాలామంది అడిగారు. దేవాలయ ప్రధాన ధర్మకర్త ఏ.సి. సుబ్బారెడ్డి ఈ ప్రాంత ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు. గాంధీజీ మద్రాసులో వున్నప్పుడు నెల్లూరువచ్చి వేణుగోపాలస్వామి దేవాలయములో హరిజనులను ప్రవేశపెట్టవలసిందని కోరగా గాంధీజీ నెల్లూరు రాలేకపోయాడు. అందుచేత సుబ్బారెడ్డి దేవాలయ ప్రవేశ విషయాన్ని గూర్చి పట్టించుకోలేదు. అందువల్ల నేను నిరాహారదీక్ష పూనుకొనవలసి వచ్చింది. కేవలం ధర్మకర్తల లిఖితపూర్వక హామీ మీద నిరాహారదీక్షను ఎందుకు మానివేశారని కొందరు నన్నడిగారు. నేను నా దీక్షను విరమించడానికి అనేక కారణాలున్నాయి. అందులో ముఖ్యమైన కారణాలు రెండు. ఒకటి మిత్రుల, శ్రేయోభిలాషులు నాపై ఒత్తిడి తేవడం. రెండవది చట్టపరమైన ఇబ్బందులను గూర్చి న్యాయవాదులు సలహా యివ్వడం. అందుచేత గాంధీజీ నా నిర్ణయాన్ని హర్షిస్తాడనే ఉద్దేశ్యంతో నిరాహారదీక్ష విరమించాను.

హరిజనుల దేవాలయ ప్రవేశం కోరుతూ పెల్లుబికిన ప్రజా చైతన్యానికి కారణం మా కృషియేనా? అని కొంతమంది నన్నడిగారు. నాకృషి మాత్రమేకాదు, హిందూ సంఘ సంస్కరణ సమితి మొదలైన ధార్మిక సంస్థల కార్మకర్తల కృషి, గాంధీజీ ఆశీస్సులు కారణమని భావిస్తున్నాను. వీరందరికి కృతజ్ఞతాభివందనాలు. నిరసన వ్రతానికి అనుమతించిన గాంధీజీకి హృదయపూర్వక ధన్యవాదాలు.

ఇంకా ఎందరో తోడ్పడ్డారు. ఆయన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మార్చి 18వ తేదీన కొండా వెంకటప్పయ్య వినయాశ్రమ స్థాపకుడు స్వామి సీతారాంను నెల్లూరుకు పంపాడు. ఆయన వచ్చి ఆలయ ధర్మకర్తలను, పొట్టి శ్రీరాములును కలిసాడు. 20వ తేదీన శ్రీరాములుకు గాంధీజీ ఇలా లేఖ వ్రాశాడు.

*ప్రియమైన రాములు,*

*మీ అందరికీ అర్థం కావాలనే ఉద్దేశ్యముతో నేను ఇంగ్లీషులో జాబు వ్రాస్తున్నా. మీ స్థితిని తెలుపుతూ గోపరాజు రామచంద్రరావు వ్రాసిన లేఖ అందింది. నీ నిరాహారదీక్ష శ్లాఘనీయము. నీ బాధ నాకు తెలుసు. ఉన్నతాదర్శాల కోసం శ్రమించడం మంచిదే. నీవు చేపట్టిన సమస్య పరిష్కారం కోసం నేనుసైతం కృషి చేస్తున్నాను. నిద్రాణంగా వున్న అంతరాత్మను నీ దీక్ష మేలుకొలుపగలదని ఆశ. రామచంద్రరావు గారు వ్రాసినట్లుగా హరిజనుల దేవాలయ ప్రవేశానికి రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం అవసరమైతే అందుకు ధర్మకర్తలు నిజాయితీగా కృషిచేస్తే తాత్కాలికంగా నీవు దీక్షను విరమణ చేయడం సమంజసమే.*

*ఈ జాబు వ్రాస్తుండగానే దీక్ష విరమించినట్లు నీవు పంపిన టెలిగ్రాం అందింది. అందువల్ల హరిజనుల దేవాలయ ప్రవేశ విషయములో నీ కృషి ఫలించిందని భావిస్తున్నాను.*

*నీ*

*బాపు*

1946 మార్చి 31వ తేదీన పొట్టి శ్రీరాములు నిరాహారదీక్షా ప్రాముఖ్యాన్ని వివరిస్తూ కాంగ్రెస్ నాయకుల కర్తవ్యాన్ని గుర్తుచేస్తూ గాంధీజీ ఒక సుదీర్ఘమైన పత్రికా ప్రకటన చేశాడు. దాని సారాంశమిది.

**"పొట్టి శ్రీరాముల వంటి నిస్వార్థపరులు చేపట్టిన సమాజ సేవా కార్యక్రమాలపట్ల కాంగ్రెస్ కార్యకర్తలు నిర్లక్ష్య వైఖరి నవలంభించడం దురదృష్టం. ఇది కాంగ్రెస్ సంస్థకే గొడ్డలిపెట్టు. కాంగ్రెస్ దేశవ్యాప్తంగా విస్తరించి ప్రజాస్వామ్య పంథాలో కొనసాగే మిక్కిలి పెద్ద పార్టీ అయినా సిద్ధాంతానికి వ్యతిరేకంగా ప్రవర్తించరాదు. అస్పృశ్యతా నివారణ పార్టీ సిద్ధాంతానికి అనువైంది. గనుక దాన్ని నిర్లక్ష్యం చేయకూడదు.**

1915లో నేను స్వదేశానికి వచ్చినప్పటి నుండీ కాంగ్రెస్ పార్టీతో అతి సన్నిహిత సంబంధం ఏర్పడింది. స్వానుభవంలో ఒక విషయాన్ని గుర్తించాను. అది ఏమిటంటే కాంగ్రెస్ తన సిద్ధాంతాలకు ఎంతవరకు ఎక్కువ కట్టుబడి పనిచేస్తే అంత ఎక్కువ జనాదరణ లభిస్తుంది. ఎన్ని కష్టాలెదురైనా ఒక ప్రజాస్వామ్య వ్యవస్థ సరియైన పంథానవలంబించి ధైర్యంగా ముందుకు సాగాలి. ప్రజల్లో వున్న బలహీనతను ఆధారంగా చేసికొని ప్రయోజనం పొందాలని భావించే వ్యక్తి తాను పతనం చెందడమేగాక ప్రజల్నికూడా అధోగతిపాలుచేస్తాడు. అందువల్ల ఏర్పడేది. అరాచమేగాని ప్రజాస్వామ్యంకాదు. ప్రజాస్వామ్యానికీ అరాచకానికీ మధ్యవున్న భేదం అతి స్వల్పమయినా అది ఉక్కుకంటే గట్టిదని చెప్పవచ్చు. ఈ రెండింటితో ప్రజాస్వామ్యం మానవ వికాసానికి తోడ్పడగా అరాచకత్వం మానవ వినాశనానికి దారి తీస్తుంది. అందువల్ల బాహ్య సిద్దుల ప్రభావం కంటే అంతర్గత బలహీనతలే మన పతనానికి కారణమవుతాయి. మనమంతా ఎటువంటి అనుమానాలకూ ప్రలోభాలకు తావీయకుండా కలిసికట్టుగా వ్యవహరించగలిగితే ప్రపంచ రాజ్యాలన్నీ ఏకమైనా మనను ఏమి చేయలేవు. ఇది కొందరికి అవాస్తవికంగా కనిపించవచ్చు. కానీ ఇందులోని వాస్తవాన్ని గ్రహించగావారు. సిద్ధాంతాలకు కట్టుబడి వుండడం ప్రధానంకాని ఎన్నికలలో గెలవడం ప్రధానంకాదు. ఈ సత్యాన్ని గుర్తిస్తే ఏ ఎన్నికలలోనైనా గెలుపు లభిస్తుంది. ఉదాహరణకు 1920లో రూపొందించబడిన తన సిద్ధాంతాలను కాంగ్రెస్ పార్టీ ఏమేరకు కట్టుబడి వ్యవహరించిందో ఆ మేరకు మాత్రమే తరువాత కాలంలో విజయము సాధించింది. అంటరానితనాన్ని సమూలంగా నిర్మూలించడం అవసరం. కనుక ఇట్టి లక్ష్యసాధనకు అంకితమైన పొట్టి శ్రీరాముల పట్ల అలక్ష్యంచూపడం ఎంతో బాధాకరమైన విషయము.

శ్రీరాములు నిరాహారదీక్ష సఫలం కావడంలో హిందూ సంఘ సంస్కరణ సమితి సభ్యులతో ఉత్సాహం రేకెత్తింది. అందుచేత ఆ సమితి అనేక సంఘ సేవా కార్యక్రమాలను చేపట్టింది. వాటిలో భాగంగా నెల్లూరులోని కటారుపాలెం, రాయపాలెం, మూలపేటలో హరిజనుల కోసం ప్రత్యేకంగా మూడు రాత్రి పాఠశాలలు నెలకొల్పబడ్డాయి. అలాగే హరిజనుల్లోని రెండు వర్గాలైన ఆది ఆంధ్రులు, అరుంధతీయుల మధ్య పంక్తి భోజనాలు ఏర్పాటుచేసి ఆ రెండు

తెగల మధ్య సామరస్యాన్నికలిగించే కృషిచేసింది. ఇలాంటి ప్రయత్నము గత చరిత్రలో జరుగలేదు. హిందూ సంఘ సంస్కరణ సమితి ఆధ్వర్యంలో కుక్కలగుంట గ్రామములో మూడు బావులు, కృష్ణ మందిరం బజారులో ఒక నీటి కుళాయి ఏర్పాటు చేయబడ్డాయి.

పొట్టి శ్రీరాములు హరిజన దేవాలయ ప్రవేశ విషయమైతగిన కృషి చేస్తూనే వున్నాడు. నాటి దేవాదాయ శాఖమాత్యులు కె. కోటిరెడ్డి, ప్రముఖ కాంగ్రెస్ నాయకులు యన్. జి. రంగా, టి. ప్రకాశం గార్లను ఈ విషయమై శ్రద్ధ వహించవలసిందిగా విజ్ఞప్తులు పంపాడు. 1946 మే 18వ తేదీన దేవాదాయ శాఖ మంత్రి కోటిరెడ్డి హిందూ సంఘ సంస్కరణ సమితి సభ్యుడు ప్రొఫెసర్ పి.పి. రెడ్డి ఇలా వ్రాశాడు.

"హరిజనులకు దేవాలయ ప్రవేశము కల్పించే విషయములో మంత్రిమండలి పరిశీలనలో వుంది. ఈ విషయమై అతి త్వరలో ఒక నిర్ణయాన్ని తీసుకొంటుందని భావిస్తున్నాను. ఈ లోగా ప్రజాభిప్రాయ సేకరణ కూడా జరుగవలసి వుంది. ఇందుకు ప్రజాభిమతం వ్యతిరేకం కాదని నా నమ్మకం. కనుక మంత్రిమండలి నిర్ణయము తీసుకునేవరకు నేనేమీ చెప్పలేను".

హరిజన దేవాలయ ప్రవేశ విషయము ప్రభుత్వం ఏదో విధంగా కాలయాపన చేస్తూనే వుంది. ఈ విషయాన్ని శ్రీరాములు సహించలేక పోయాడు. ఈ విషయములో దేవాలయ ట్రస్టీలపై తీవ్రమైన ఒత్తిడి తీసుకువచ్చాడు. వారికి గత్యంతరంలేక 1946మే 25న హరిజనులను దేవాలయములోనికి ప్రవేశ పెట్టాలని నిర్ణయించారు. తమ నిర్ణయాన్ని ఆమోదిస్తూ వెంటనే ఉత్తర్వులు పంపవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని అర్థించారు. దీనికి సమాధానంగా దేవాదాయ శాఖ మంత్రి 1946 జూన్ 8న ట్రస్టుబోర్డు సభ్యులకు లేఖ వ్రాశాడు. అందులో హరిజనులను దేవాలయములోనికి ప్రవేశపెట్టే విషయములో తన సంపూర్ణ సహకార ముంటుందని వ్రాశాడు. కానీ అందుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను జారీ చేయలేదు. ప్రభుత్వము తన ఓర్పును పరీక్షిస్తున్నది శ్రీరాములు భావించాడు. రాష్ట్ర ప్రభుత్వము ఆగష్టు 9వ తేదీలోగా ఉత్తర్వులు జారీ చేయనట్టయితే తాను తిరిగి నిరసన వ్రతం చేయవలసి వస్తుందని ప్రకటించాడు. శ్రీరాములు పట్టుదల యింతకుముందే తెలిసిన ప్రభుత్వము ఆ విషయములో

జాప్యం చేయడము సమంజసము కాదని హరిజనులకు చట్టరీత్యా ప్రవేశాన్ని కల్పిస్తూ ఆ దేవాలయ ధర్మకర్తలకు 11-8- 1946నాడు అప్పటి అసెంబ్లీ స్పీకరైన షణ్ముగం పిళ్లైగారి ఆధ్వర్యములో అచ్చట హరిజనులకు దేవాలయ ప్రవేశము జరిగింది. ఈ విషయము మహాత్మా గాంధీజీ తెలియచేయబడింది.

ఈ విధంగా వేణుగోపాల స్వామి దేవాలయములో హరిజనులను ప్రవేశ పెట్టడంలో శ్రీరాములు కృతకృతుడయ్యాడు. ఇంతటితో ఆయన ఆగక రాష్ట్రంలోని ఇతర దేవాలయాలలోకి కూడా హరిజనులను ప్రవేశపెట్టే కార్యక్రమాన్ని అమలు జరపాలని సంకల్పించాడు. మొదటి మెట్టుగా నెల్లూరు పట్టణంలోని మూలస్థానేశ్వర దేవాలయం, మల్లేశ్వరస్వామి ఆలయము, తల్పగిరి రంగనాథాలయము ట్రస్టీలకు, జిల్లాలోని ఇతర దేవాలయాల ట్రస్టీలకూ విజ్ఞప్తి చేస్తూ హరిజనులకు దేవాలయ ప్రవేశాన్ని కల్పించవలసిందిగా అర్థించాడు. రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో వుంది. కనుక హరిజను దేవాలయ ప్రవేశం అంతర్భాగమే. ఈ కార్యక్రమము సమాజాన్ని తీర్చిదిద్దడానికి ఉద్దేశించబడింది. కనుక కాంగ్రెస్ కార్యకర్తలతో పాటు ఇతర శ్రేయోభిలాషులు కూడా ఈ కార్యక్రమం, రాజకీయ కార్యక్రమం, సత్యాగ్రహంతో ఆందోళనలు అనేవి కాంగ్రెస్ చేపట్టిన కార్యక్రమములోని మూడు ప్రధానాంశాలు. నిర్మాణాత్మకమైన కార్యక్రమం వీటిలో అతి ప్రధానమైంది. ఈ భావంతోనే శ్రీరాములు నిర్మాణ కార్యక్రమంలో ప్రధానాంశమైన హరిజనోద్ధరణకు తన జీవితాన్ని అంకితం చేశాడు. పొట్టి శ్రీరాముల ఆశయాలు గాంధీజీ ఆశయాలకు ప్రతిబింబాలు. హరిజనాభ్యుదయాన్ని గురించి బాపూజీ ఆంధ్రప్రాంత హరిజన సేవా సంఘ కార్యదర్శి టి. యన్. మూర్తితో ఇలా అన్నారు. “అన్ని విషయాలకన్నా హరిజనాభ్యుదయానికి నేను సిద్ధం. అయితే ఇందుకు భగవంతుని ఆజ్ఞ కావాలి. ఇతరులు కోరుతున్నారని నేను నిరసన వ్రతము పూనను”. హరిజనుల దేవాలయ ప్రవేశావశ్యకత గురించి గాంధీజీ తిరువాన్కూర్, మధుర, నళిని దేవాలయ పాలకవర్గ విచక్షణ చూపడం సమంజసం కాదు. అందువల్ల వాటి ఇబ్బందులను తొలగించాలి”. అవి మద్రాసు రాష్ట్ర ప్రభుత్వానికి శ్రీరాములు విజ్ఞప్తి చేశారు.

సర్వదా గాంధీ అడుగుజాడల్లో పయనించే శ్రీరాములు ఆంధ్రప్రాంత దేవాలయా లన్నింటిలో హరిజనులకు ప్రవేశం కల్పించాలని కృషి చేయసాగాడు.

గాంధీజీలాగా నెల్లూరు పురప్రముఖులు కూడా ఈ విషయములో శ్రీరాముల కార్యక్రమాలకు చేయూత నీయసాగిరి. ఈ కార్యక్రమంలో ఒక భాగంగా 1946 అక్టోబరు 29వ తేదీన నెల్లూరులో పెళ్లికూరు చంద్రశేఖరరెడ్డి అధ్యక్షతన ఒక బహిరంగసభ ఏర్పాటు చేయబడింది. ఆ సభలో పురప్రముఖులు హరిజన దేవాలయ ప్రవేశము యొక్క ఆవశ్యకతను గూర్చి తమ అభిప్రాయము వ్యక్తము చేశారు.

పొట్టి శ్రీరాములు చేపట్టిన హరిజనుల దేవాలయ ప్రవేశ ఉద్యమం నెల్లూరు చుట్టుప్రక్కల ప్రాంతాలకు కూడా ప్రాకింది. శ్రీకాళహస్తీశ్వరాలయంలో హరిజనులను అనుమతించవలసిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అదే విధంగా తిరుమల తిరుపతి దేవస్థానం కమీటీ సభ్యులు వారికి అవకాశం కల్పించాలని తీర్మానించారు. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రాంత హరిజన సేవా సంఘ కార్యదర్శి టి.యస్. మూర్తి హిందూ దేవాదాయ శాఖామంత్రికి ఇలా విజ్ఞప్తి చేశారు. "యూరోపియనులకు, ముస్లిములకు కూడా తిరుమల దేవస్థానంలోకి ప్రవేశం కల్పించబడగా హిందూ సమాజంలో ఒక భాగంగా ఉన్న హరిజనులకు దేవాలయ ప్రవేశం కల్పించకపోవడం దురదృష్టకరం. ప్రజాభిప్రాయం కూడా హరిజనుల దేవాలయ ప్రవేశానికి సుముఖంగా వుంది. ఈ విషయాన్ని 1946 అక్టోబరు 12వ తేదీన తిరుపతి స్వయంగా సందర్శించిన హరిజన దేవాలయ ప్రవేశ సంఘ సభ్యులైన సర్వశ్రీ అనంతశయనం అయ్యంగార్, కె. వరదాచారి, పొట్టి శ్రీరాములు ఆర్. రామకృష్ణ శాస్త్రి, శ్రీమతి డి.వి. సుబ్బమ్మ స్వయముగా పరిశీలించి నిర్ధారించారు. వారి సూచన ననుసరించే నేను వచ్చే వై కుంఠ ఏకాదశినాడు. (3-1-1947) అధికసంఖ్యలో హరిజనులను కొండపైకి తీసుకొనివెళ్లి శ్రీస్వామి వారి దర్శనం చేయించదలచాను.

రాష్ట్ర ప్రభుత్వం చేత హరిజన దేవాలయ ప్రవేశ బిల్లును ఆమోదింప జేయడానికి శ్రీరాములు తీవ్రమైన కృషిని ప్రారంభించాడు. తన కృషికి సహకారమందిచవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశాడు. ప్రభుత్వాధికారులపై ఒత్తిడి తెచ్చాడు. ఈ ఉద్దేశ్యంతోనే ఆంధ్ర ప్రాంత హరిజన 'సేవా సంఘ కార్యదర్శి బి.యన్. మూర్తి అక్టోబర్ 17, 21 తేదీల్లో నవంబర్ 9, 12, 17 తేదీల్లో వరుసగా లేఖలు వ్రాశాడు. అవసరమయితే ఈ విషయము పట్ల ప్రభుత్వ

దృష్టిని ఆకర్షించడానికి సత్యాగ్రహ దీక్షలు పూనవలసి వస్తుందని కూడా హెచ్చరించాడు.

నవంబర్ 21వ తేదీన దేవాలయ శాఖామాత్యులు కె. కోటిరెడ్డిగారికి వ్రాసిన జాబులో హరిజనులకు దేవాలయ ప్రవేశం కల్పించే బిల్లును తేవడంలో ఆలస్యం చేస్తున్నందుకు పొట్టి శ్రీరాములు తన ఆవేదనను, అసంతృప్తిని వ్యక్తం చేశాడు ఈ సందర్భంలో కేరళలోని గురవాయూర్ దేవాలయాన్ని గురించి గాంధీజీ చేసిన అభిప్రాయాలను ఉదహరించాడు. అదే రోజున (21 నవంబర్) గాంధీజీకి వ్రాసిన లేఖలో హరిజన దేవాలయ ప్రవేశం కోసం తాను చేసిన కృషిని అందుకు తగిన బిల్లును తేవలసిన అవశ్యకతను తెలిపాడు. ఆ విషయములో దేవాదాయ మంత్రి కోటిరెడ్డికి చేసిన విజ్ఞప్తులను అతని ఉదాసీన వైఖరిని గాంధీజీకి వివరించాడు.

దేవాదాయ మంత్రి చూపుతున్న నిర్లక్ష్య వైఖరిపట్ల తన అసంతృప్తిని వ్యక్తంచేస్తూ పొట్టి శ్రీరాములు నవంబర్ 23వ తేదీన వ్రాసిన లేఖలో యిలా హెచ్చరించాడు. హరిజన దేవాలయ ప్రవేశపు బిల్లుయొక్క అవసరాన్ని ప్రజలందరి దృష్టికి తెచ్చే ఉద్దేశ్యంతో 25 నవంబర్ 1946 సోమవారం పగలు 12 గంటల నుండి నేను నిరాహారదీక్ష ప్రారంభించడానికి నిర్ణయించుకున్నాను. శాసన మండలి తొలి సమావేశములో అలాంటి బిల్లును ప్రవేశపెట్టగలమని మీ మంత్రివర్గం నిర్ణయిస్తేనే నేను నా నిరాహారదీక్షను విరమిస్తాను. ఇదే సందర్భంలో నెల్లూరు పురప్రముఖులు ఒక కరపత్రాన్ని విడుదలచేశారు. శ్రీరాములు కోరినవిధంగా హరిజన దేవాలయ ప్రవేశ బిల్లును శాసనసభలో వెంటనే ప్రవేశపెట్టగలమని పత్రికా ప్రకటన చేయవలసిందిగా అప్పటి మద్రాసు ముఖ్యమంత్రి ప్రకాశం పంతులుగారిని కోరుతూ ఆ కరపత్రంలో విజ్ఞప్తి చేశారు. తన నిర్ణీత కార్యక్రమం ప్రకారం పొట్టి శ్రీరాములు నెల్లూరు ఆచార్యుల వీధిలో గల తన సోదరుని గృహంలో నిరాహారదీక్షను ప్రారంభించాడు.

1946 నవంబర్ 28వ తేదీన పొట్టి శ్రీరాములు గాంధీజీకి ఒక లేఖ వ్రాస్తూ కాంగ్రెస్ పాలనలో వున్న మద్రాస్ రాష్ట్ర ప్రభుత్వము యొక్క నిర్లక్ష్య వైఖరిని ఇలా విమర్శించాడు. "కాంగ్రెస్ ఇంత ఉన్నత స్థితికి ఎదగడానికి కారణం కాంగ్రెస్ కార్యకర్తలే. హరిజనులకు దేవాలయ ప్రవేశం కల్పించడానికి కాంగ్రెస్ ప్రభుత్వంలోనే సత్యాగ్రహాలకు పూనుకోవలసిన దుస్థితి సంభవించటం సిగ్గుచేటు.

తాము అధికారంలోకి వస్తే హరిజనులకు దేవాలయ ప్రవేశం కల్పిస్తామని లోగడ కాంగ్రెస్ నాయకులు వాగ్దానాలు చేయలేదా?" అదేరోజు తన దీక్షను బలపరచవలసిందిగా శ్రీరాములు కొండా వెంకటప్పయ్య గారికి, యన్. జి. రంగా గారికి బి. యస్. మూర్తిగారికి లేఖల ద్వారా విజ్ఞప్తి చేశారు. ఆంధ్ర ప్రాంత కాంగ్రెస్ కమిటి అధ్యక్షుడైన యన్. జి. రంగా పొట్టి శ్రీరాములు కోరినట్లు దేవాలయ ప్రవేశం కలిగించే బిల్లును వెంటనే ప్రవేశపెట్ట వలసిందింగా అప్పటి ముఖ్యమంత్రి ప్రకాశం పంతులుగారికి దేవాదాయ శాఖామంత్రి కోటిరెడ్డి గారికి టెలిగ్రాములు పంపాడు. దీనికి కోటిరెడ్డి ఇలా వ్రాశాడు. పొట్టి శ్రీరాములు నిరాహారదీక్ష లక్ష్యం హరిజనులకు దేవాలయ ప్రవేశం కల్పించడమా? లేక హరిజనులు పడుతున్న ఇబ్బందులన్నింటిని తొలగించడమా? అనే విషయం నాకు అర్థం కావడంలేదు. ఈ విషయములో మీరు నాకు సరియైన సమాచారం అందించగలరు. అప్పుడు రంగా రాయలసీమ పర్యటనలో ఉన్నాడు. అందుచేత ఈ విషయము శ్రీరాములుకు వెంటనే తెలుపలేకపోయాడు. పర్యటన ముగిసిన తరువాత శ్రీరాముల నిరసన వ్రతాన్ని అభినందిస్తూ లేఖ వ్రాశాడు. అందులో కోటిరెడ్డి సమాధానాన్ని తెలియజేశాడు. అంతేగాక హరిజనుల దేవాలయప్రవేశ విషయము కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా యోచిస్తున్నదనీ కనుక నిరసన వ్రతాన్ని విరమించుకోవలసిందనీ కోరాడు.

తన దీక్ష విషయమై కోటిరెడ్డిగారి సమాధానం శ్రీరాములుకు బాధ కలిగించింది. దేవాదాయ మంత్రిగారి ప్రవర్తన ఆయనకు ఆశ్చర్యాన్ని ఆవేదనను కలిగించింది. అయినా శ్రీరాములు నిగ్రహించాడు. మరలా తన దీక్షా లక్ష్యాన్ని వివరిస్తూ డిశెంబర్ 6వ తేదీన కోటిరెడ్డికి ఇలా లేఖ వ్రాశాడు.

**"నా నిరాహారదీక్షా లక్ష్యం హరిజనుల దేవాలయ ప్రవేశము మాత్రమే కాదు. హరిజనుల సర్వతోముఖాభివృద్ధి కూడా హరిజనుల దేవాలయ ప్రవేశం అందుకు మొదటి మెట్టు హరిజనులు హిందువులలో అంతర్భాగమని వివరించడమే నా లక్ష్యం. దేవాలయ ట్రస్టీలుగా, అర్చకులుగా హిందువుల తోపాటు హరిజనులను సమాజానికి దూరంగా వుంచడం పాతబడిన పద్ధతి ఇటువంటి పద్ధతులను నిర్మూలించాలి.**

ఇవి కొనసాగడం నాగరికులెవ్వరూ సహించరు. ప్రభుత్వ చొరవ తీసుకొని చట్టాలు చేసినప్పుడే ఇలాంటి దురాచారాలు రూపుమాసి పోతాయి. సాంఘిక దురాచార నిర్మూలనకు ఇంతకంటే వేరే మార్గం లేదు. హరిజనులను కలుపుకోవడం వల్ల మొత్తం హిందూ సమాజం బలపడుతుంది.

హరిజనులకు దేవాలయ ప్రవేశం కల్పించే చట్టాన్ని రూపొందించడంలో జరుగుతున్న జాప్యానికి మీరు చెబుతున్న కుంటి సాకులను నేను అంగీకరించను. హరిజనుల దేవాలయ ప్రవేశాన్ని ప్రజాబలం అంగీకరిస్తున్నదనే విషయము మీకు తెలిసిందే. కనుక ఈ అంశాన్ని వచ్చే శాసనసభలో బిల్లు రూపొందించ గలరని ఆశిస్తున్నాను. అలాగే తిరుపతి దేవాలయ సవరణ చట్టాన్ని కూడా ప్రవేశపెడతారని నమ్ముతున్నాను. ఈ విషయములో తగిన శ్రద్ధ తీసుకొనగలరు. అలాగయితే నా నిరసన వ్రత దీక్షను విరమిస్తాను.

1946 డిసెంబరు 8వ తేదీన యన్.జి. రంగాకు వ్రాసిన లేఖలో శ్రీరాములు తన నిరాహారదీక్ష రాజకీయ వర్గాల్లో కనీసం సంచలనమైన కలిగించనందుకు తన తీవ్రమైన అసంతృప్తిని తెలియజేశాడు. దేవాదాయ శాఖామంత్రి కె. కోటిరెడ్డి యింతవరకు తన విజ్ఞప్తులను ఏమాత్రం పట్టించుకొనకపోయినప్పటికీ ఇప్పుడైనా ఆ విషయాన్ని గురించి ఆలోచించడం సంతోషదాయకమని భావించాడు. ప్రకాశం పంతులు లాంటి అగ్రనాయకులు కూడా ఈ విషయములో నిర్లిప్తంగా ఉండడము వల్ల తనలాంటి సాధారణ వ్యక్తి కూడా నిరాహారదీక్ష పూనవలసివచ్చిందని అభిప్రాయపడ్డాడు. రాష్ట్ర కాంగ్రెస్ కమిటి హరిజన దేవాలయ ప్రవేశము బిల్లు విషయములో వెంటనే తగిన శ్రద్ధ తీసుకొనేటట్టయితే రంగా గారి సలహా ప్రకారం తన నిరాహారదీక్షను విరమించడానికి శ్రీరాములు తన సంసిద్ధతను వ్యక్తంచేశాడు. సరిగ్గా ఇదే సమయానికి దేవాలయ శాఖామంత్రి కోటిరెడ్డి శ్రీరాములు పట్టుదలను, నిరాహారదీక్ష ద్వారా ప్రజలను ప్రభావితము చేయగలిగిన అతని సామర్థ్యాన్ని గుర్తించగలిగాడు. అంతేగాక శ్రీరాములు సిసలైన గాంధేయవాది గనుక గాంధేయవాదులైన వారంతా శ్రీరాములు దీక్షను విరమింపచేసి తన రాజకీయ ప్రతిష్టను కాపాడుకోవడం మంచిదని కోటిరెడ్డి భావించాడు. కనుక శ్రీరాములు దీక్షపట్ల తన సంపూర్ణ సహకారాన్ని ప్రకటిస్తూ 1946 డిసెంబరు 10వ తేదీన శ్రీరాములుకు ఇలా ఉత్తరం వ్రాశాడు.

ప్రియమైన రాములూ!

మీరు వ్రాసిన జాబులన్నింటినీ శ్రద్ధగా పరిశీలించాను. హరిజనులకు దేవాలయ ప్రవేశం కల్పించవలసిన ఆవశ్యకత ప్రభుత్వానికి తెలియకపోలేదు. ఆ విషయములో నిరసన దీక్షద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తేనవసరం లేదు. వీలైనంత త్వరలో హరిజనులకు దేవాలయ ప్రవేశం కల్పించాలని మీలాగే ప్రభుత్వం ఆతృత పడుతున్నది. విధానంలోనే కాని లక్ష్యంలో మీకు, మాకు ఎలాంటి బేధంలేదు. ఇలాంటి విషయాల్లో ప్రభుత్వం ప్రజాభిప్రాయానుసారం నడుచుకోవాలి. ప్రభుత్వ నిర్ణయాన్ని బలవంతంగా ప్రజలపై రుద్దకూడదు. హరిజనుల దేవాలయ ప్రవేశానికి ప్రజలు సంతోషంగా ఒప్పుకొన్నట్లయితే ప్రభుత్వానికి ఎటువంటి అభ్యంతరమూలేదు. ఈ ధృక్పదంలో ప్రజాభీష్టం తెలిసిన ప్రతి దేవాలయములో మద్రాసు రాష్ట్ర దేవాలయ ప్రవేశ చట్టంలోని 3వ సెక్షనును అనుసరించి హరిజనులకు దేవాలయ ప్రవేశము కల్పిస్తూ అనుసరించడము జరుగుతున్నది. నెల్లూరులోని వేణుగోపాలస్వామి దేవాలయములో హరిజనుల ప్రవేశానికి అనుగుణంగా ప్రజాభిప్రాయాన్ని సేకరించడములో మీరు కూడా విశిష్ట పాత్రను నిర్వహించారుగదా! నెల్లూరు మూలస్థానేశ్వరస్వామి, రంగనాధస్వామి దేవాళయాల్లో కూడా హరిజనుల ప్రవేశానికి అనుమతి కల్పించడం జరిగింది. త్వరలో తిరువానూరు దేవాళయంలో కూడా ప్రవేశము కల్పించబడగలదని ఆశిస్తున్నాను. పై సందర్భాలలో దేవాలయ ట్రస్టు ప్రజల అనుమతితోనే హరిజనులకు ప్రవేశం లభించింది. ఇలాగే ధర్మకర్తలు ప్రజలు ఆసక్తి చూపిస్తే ఒక్క సంవత్సర కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా హరిజనులు దేవాలయ ప్రవేశం చేయగలరు. తరతరాల సాంఘిక కట్టుబాట్లను పరిశీలిస్తే ప్రస్తుతం జరుగుతున్న పురోభివృద్ధిని తక్కువ అంచనా వేయకూడదు. ప్రస్తుత చట్టాన్ని అనుసరించి ప్రజాభిప్రాయము అనుకూలంగా వున్నప్పటికి దేవాలయ ట్రస్టీలు ఈ విషయములో అధిక శ్రద్ధ చూపించాలి. ఈ విషయములో సహకరించే ట్రస్టీలు ఒకరిద్దరు మించి ఉండరు. ఇలాంటి సందర్భాల్లో కూడా ప్రజాభిప్రాయన్ని మన్నించడానికి ప్రస్తుతం అమల్లో వున్న చట్టంలో మార్పు తేవాలని ప్రభుత్వము

యోచిస్తున్నది. హరిజనులు దేవాలయ ప్రవేశానికి చట్టపరమైన ఇబ్బందులు తొలగించడానికి తప్పక ప్రయత్నిస్తాను. మీ వంటి సంస్కర్తలు తగిన ప్రచారం ద్వారా ప్రజలను ఉత్తేజపరిస్తే ఇందుకు దేవాలయ ప్రవేశం శీఘ్రగతిని సాధ్యమవుతుంది. ఇందుకు ప్రభుత్వం తగిన కృషి చేస్తుందని మీకు హామి ఇస్తున్నాను. కనుక మీరు నా విన్నపాన్ని మన్నించి నిరసన వ్రత దీక్ష విరమణ చేయగలరని ఆశిస్తున్నాను.

ఈ సమయములో రాష్ట్ర ప్రభుత్వం మాట నిలబెట్టుకోవడానికి కొంత వ్యవధి యివ్వాలని ప్రస్తుతానికి దీక్షను విరమించాలనీ గాంధీజీ శ్రీరాములుకు సలహానిస్తూ లేఖ వ్రాశాడు. ప్రముఖ గాంధేయవాదియైన అనంతశయనం అయ్యంగార్ కూడా గాంధీజీ సలహాను పాటించవలసినదని ఢిల్లీ నుంచి లేఖ వ్రాశాడు. ఆంధ్ర ప్రాంత హరిజన సేవా సంఘ కార్యదర్శి కూడా శ్రీరాములుకు తంతి పంపాడు. అందులో తాను నెల్లూరు జిల్లా హరిజన సేవా సంఘ అధ్యక్షుడు శేషారెడ్డి, నెల్లూరు గాంధీ ఆశ్రమవాసి మల్లికార్జున గుప్తగార్లు దేవాదాయ శాఖా మంత్రిని కలిశారనీ, శ్రీరాములు కోరిక ప్రకారం హరిజనుల దేవాలయ ప్రవేశపు బిల్లును రానున్న శాసన సభలో ప్రవేశ పెట్టడానికి అంగీకరించనందున శ్రీరాములు వెంటనే దీక్ష విరమించాలనీ తెలియచేయబడింది.

పొట్టి శ్రీరాములు ప్రతి విషయములోనూ దూరదృష్టిని, విజ్ఞతను, సమయస్ఫూర్తిని ప్రదర్శించేవాడు. ఆయన దేవాదాయ శాఖామంత్రి ఇచ్చిన హామీని ప్రముఖ కాంగ్రెస్ నాయకులు చెప్పిన మాటలను పురస్కరించుకొని కార్యచరణకై ప్రభుత్వానికి కొంత వ్యవధి యివ్వడం సమంజసమని భావించాడు. అందుచేత తాత్కాలికంగా తన దీక్ష విరమించాలని నిశ్చయించుకున్నాడు. దీక్ష ప్రారంభించిన 19వ రోజు కంటే 13-12-1946న టి. యస్. మూర్తి నెల్లూరు వెళ్లి శ్రీరాములుకు నిమ్మరసం యిచ్చి దీక్ష విరమింపచేశాడు. ఈ అంశాన్ని శ్రీరాములు గాంధీజీకి తెలియచేశాడు.

గాంధీజీలాగే పొట్టి శ్రీరాములు కూడా జాతి శ్రేయస్సుకు తన జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి. అందుకే ఆయన కుటుంబ సమస్యలకన్నా దీనజనోద్ధరణకే ప్రాముఖ్యత ఇచ్చాడు. శ్రీరాములు నిరాడంబరుడు. ఉన్నతాశయాలు గలవాడు.

ప్రజాసేవను పరమావధిగా భావించినవాడు. నూటికి నూరుపాళ్లు గాంధేయవాది. అందుచేత శ్రీరాములు స్వతంత్ర వ్యక్తిత్వం లేదనీ విచక్షణా జ్ఞాన రహితంగా గాంధీజీ చెప్పిన మాటలను వేదవాక్కుగా భావించేవాడనీ కొందరు విమర్శించారు. కానీ ఈ అభిప్రాయము సరైందికాదు. గాంధీజీ సిద్ధాంతాలను పాటించినంత మరణాంతరం పొట్టి శ్రీరాములు చేపట్టిన కార్యక్రయాలు, సాధించిన విజయాలు వ్యక్తంచేసిన భావాలు ఈ విషయాన్ని నిరూపించాయనడం చారిత్రక సత్యం.

* * *

## ఆరవ అధ్యాయం

# సంఘ సేవా కార్యం

"మానవ జీవితంలోని సమగ్రత్వాన్ని గాంధీజీ విశ్వసించాడు. ఆయన ఉద్దేశంలో మత, నైతిక, రాజకీయ, ఆర్థిక, సాంఘిక, వ్యక్తిగత సామూహిక దృక్పథాలన్నీ మానవ జీవితంలోని అంతర్భాగాలే. ఇవన్నీ పైకి వేరువేరుగా కనిపించినప్పటికీ పరస్పర సాన్నిహిత్యాన్ని కలిగి వుంటాయి. వీటి సాన్నిహిత్యాన్ని విడదీసి అంచనా వేయడం సాధ్యం కాదు. గాంధీజీ అడుగుజాడల్లో నడవడం తన జీవిత లక్ష్యంగా భావించిన పొట్టి శ్రీరాములు కూడా మానవ జీవిత సమగ్రత్వాన్ని గుర్తించాడు. లక్ష్య సాధనపట్ల తన అచంచల విశ్వాసాన్ని ప్రకటించాడు. ప్రతి వ్యక్తి ఉన్నతాదర్శాలు కలిగి ఉండాలి అని ఆయన ఉద్దేశం. ప్రతి వ్యక్తీ సమాజ సేవకు అంకితం కావాలనీ స్వార్థ చింతనను నిరసించాలనీ నైతిక, రాజకీయ, మత, సాంఘికాది రంగాలలో ప్రగతి సాధించడానికి కృషి చేయాలని ఆయన ఉద్దేశం. ఇలాంటి విశాల దృక్పథం వున్నందువల్లనే పొట్టి శ్రీరాములు ఒక్క హరిజన సేవకు మాత్రమే అంకితం కాలేదు. ఒకవైపు హరిజనోద్ధరణకు కృషి చేస్తూనే మరొకవైపు ఇతర సాంఘిక సేవా కార్యక్రమాల్ని చేపట్టాడు.

### ఖాదీ ప్రచారం :

నెల్లూరులో పొట్టి శ్రీరాములు ఖాదీ ప్రచారంతో తన సంఘ సేవను ప్రారంభించాడు. ప్రథమంగా నెల్లూరులో పైడా సుబ్బరామయ్యగారి కుటుంబంతో ఆయనకు పరిచయం కలిగింది. క్రమేణా పురప్రముఖులు దేవత చెంచు రాఘవయ్య, సి.యన్. గుప్తా, గొంట్ల శ్రీరాములుశెట్టి, గుజ్జుల వెంకట్రామయ్య, కాళహస్తి రామనాథం, శ్రీమతి అల్లాడి అన్నపూర్ణమ్మ మొదలైన వారితో పరిచయం ఏర్పడింది. పై వ్యక్తుల సహకారంతో ఖాదీ ప్రచారం నిర్విరామంగా కొనసాగింది. చాలా ఇళ్ళలో చరఖాలు ఏర్పాటు చేశాడు. చరఖాలు చెడిపోయినప్పుడు వాటిని స్వయంగా బాగుచేశాడు. ఇలా బాగుచేసే పనిముట్లున్న సంచీ ఎప్పుడూ ఆయన

వెంట వుంటుంది. పొట్టి శ్రీరాములు నిరాడంబరంగా వుండేవాడు. ఖద్దరు లుంగీ, మీద టవలు, తలపై గాంధీ టోపి మాత్రమే ధరించేవాడు. ఇల్లిల్లు తిరుగుతూ మధురమైన మాటలతో గృహిణులకు పిల్లలకూ చరఖాలు వడకడంపట్ల ఆసక్తి కలిగించేవాడు. వాళ్లకు చక్కని దేశభక్తి గీతాలు నేర్పుతూ వాళ్ల ఆదరణ చూరగొనేవాడు. సమయం దొరికినప్పుడు నెల్లూరు సమీప గ్రామాలకు వెళ్ళి ఖాదీ ప్రచారం కొనసాగించేవాడు.

ప్రభుత్వ విధానాలు అనుకూలంగా వున్నప్పుడే సంఘ సేవకులు కొనసాగించే కార్యక్రమాలకు బలం చేకూరుతుందని శ్రీరాములు విశ్వసించాడు. అందువల్లనే ఖాదీ ప్రచార విషయమై మద్రాసు ప్రభుత్వం విధించిన నిర్బంధ విధానాలను శ్రీరాములిలా విమర్శించాడు. "ఖాదీ గ్రామీణ పరిశ్రమలు విజయవంతం కావాలంటే నిర్బంధ విధానం పనికి రాదు. అలా వున్నప్పుడే ప్రైవేటు సంస్థలుగాని వ్యకులుగాని తమ ఇష్టం వచ్చిన స్థాయిలో తమకు తోచిన పద్ధతిలో ఖాదీ ఉద్యమానికి తోడ్పడగలరు.

ఈ ఉద్దేశ్యంతో పొట్టి శ్రీరాములు ఖాదీ ప్రచారావశ్యకతను వివరిస్తూ ఒక కరపత్రం ద్వారా మద్రాసు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాడు.

1. అఖిలభారత చేనేత సంఘాలు తయారు చేసిన ఖాదీ వస్త్రాలను అమ్మే దుకాణాల వాళ్ళు వినియోగదారుల నుండి వస్త్రాల ధరలో కొంత భాగం నూలు రూపంలో చెల్లించాలని అడుగుతున్నారు. ఖాదీ వస్త్రాల ఉత్పత్తి అమ్మకపు బాధ్యతలు నిర్వహించడం వల్ల ప్రభుత్వమే ఇందుకు తగిన చర్యలు తీసుకొని ఖాదీ పరిశ్రమను ప్రోత్సహించాలి.
2. ఖాదీ దుకాణాల వాళ్ళు వినియోగదార్ల నుండి నూలు సేకరించి దాన్ని టోకు అమ్మకపుదార్లకు అందజేయాలి. వారు దాన్ని చేనేత సహకార సంఘాల వారికి అందచేస్తారు.
3. ప్రభుత్వోద్యోగులు వారి నెలసరి వేతనాల్లో కొంత మొత్తాన్ని నూలు రూపంలో స్వీకరించాలి. తగినంత నూలు అందుబాటులో ఉండటం వల్ల అఖిల భారత చేనేత సంఘంతోపాటు ప్రైవేటు సంస్థలు కూడా ప్రభుత్వ సహాయం పొందకపోయినప్పటికి ఖాదీ ఉత్పత్తిని కొనసాగించగలవు.
4. ఈ పథకాన్ని ఆచరణయోగ్యం చేయడానికి ప్రభుత్వం చొరవచూపాలి.

రెండు మూడు నెలల లోపల ఇందుకు ఏర్పాట్లు చేయవలసిందిగా సంబంధిత అధికార్లను ఆదేశించాలి. వాళ్ళు ఖాదీ ఉత్పత్తి, వినియోగ విషయాల్లో శ్రద్ధ తీసుకొనేటట్లు చేయాలి. ఖాదీ ఉత్పత్తి బాగా పెరిగి తరువాత ప్రభుత్వం మిల్లు వస్త్రాల ఉత్పత్తిని తగ్గించే విషయాన్ని గాని నిషేదించే విషయాన్ని గాని ఆలోచించవచ్చు. అప్పుడు ఖాదీ వస్త్రాల పట్ల వ్యతిరేకత తగ్గుతుంది.

మహాత్మాగాంధిలాగే శ్రీరాములుకు కూడ మొదటినుంచీ ఖాదీ విషయంలో స్పష్టమైన అవగాహన ఉంది. ఖాదీ పరిశ్రమ లక్షలాది గ్రామాలకు ఉపాధి కల్పిస్తుంది. అనేక అనుబంధ పరిశ్రమలను ప్రోత్సాహిస్తుంది. ఖాదీ వస్త్రధారణ వ్యక్తి యొక్క త్యాగాన్ని, పవిత్రతను సూచిస్తుంది. సమాజంలోని బడుగు వర్గాల శ్రేయస్సుకు తోడ్పడే వ్యక్తి త్వాన్ని పెంపొందిస్తుంది. విలాస జీవితం పట్ల మోజు తొలగించి దీనజనోద్ధరణకు పురికొల్పుతుంది. సంతృప్తి కరమైన జీవితాన్ని ప్రసాదిస్తుంది. ఇలాంటి ప్రయోజనాలు ఉన్నందువల్లనే గాంధేయవాదులంతా ఖాదీ ప్రచారం పట్ల ఎంతో శ్రద్ధ చూపుతున్నారు.

స్వాతంత్రం లభించిన తరువాత ప్రజల్లోనేగాక గాందేయవాదుల్లో సహజంగా ఖాదీపట్ల శ్రద్ధ తగ్గిపోవడం పొట్టి శ్రీరాములుకు బాధ కలిగించింది. శ్రీరాములు తన బాధను ఇలా వ్యక్తం చేశాడు. ఇప్పుడు ప్రజలకు ఖాదీపట్ల సదభిప్రాయం లేదు. కారణం ఖద్దరు ముసుగులో పెద్ద పెద్ద నాయకులు పలురకాల అన్యాయాలకు, దుర్మార్గాలకు పాల్పడుతున్నారు. ఎంతోకాలంగా ఎంతో అభిమానంతో ఎన్నో ఇబ్బందులకు ఓర్చి ఖద్దరు ధరించిన వ్యక్తులే ఈనాడు దానిపట్ల శ్రద్ధ చూపటం లేదు. అందుచేత ఖద్దరు ప్రాముఖ్యాన్ని గుర్తించిన ప్రతి వ్యక్తీ దాని పవిత్రతను కాపాడడానికి కృషి చేయాలి. ఖాదీ గౌరవమునకు భంగం కలిగించే వ్యక్తుల చర్యలను అరికట్టాలి.

ఈనాడు ఎందరో గాంధీ అనుయాయులు అధికారంలో వున్నారు. వారందరికీ ఖాదీ పట్ల నిజంగా శ్రద్ధ వుంటే నూలు వడకడం వారి దైనందిన జీవితంలో ఒక కార్యక్రమంగా పాటిస్తామని ప్రతిజ్ఞ చేయాలి. వాళ్లు తమ కుటుంబ సభ్యులను కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనేటట్లు చేయాలి. ఖద్దరులా చలామణి అయ్యే ఖాదీసిల్కును వ్యతిరేకించాలి. ఎందుకంటే ఖాదీలా ఖాదీ సిల్కు దరిద్ర

నారాయణుల ఉద్ధరణకు తోడ్పడదు. గాంధీజీలాగే ప్రభుత్వాధికారులు కూడా బహిరంగంగా నూలువడకడం ద్వారా తమ క్రింద ఉద్యోగుల్లోనూ ప్రజల్లోను ఖాదీ పట్ల ఆసక్తిని పెంపొందించాలి. ఈ విధంగా చేయడం వల్ల వారు ప్రజా హృదయాల్లో గాంధీజీ ఆశయాలపట్ల అచంచల విశ్వాసాన్ని కలిగించగలుగుతారు.

1949 ఆగష్టు 10వ తేదీన మద్రాసు ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఒక ఉత్తర్వు జారీ చేసింది. ఆ ఉత్తర్వు ద్వారా పంచాయితీ బోర్డులు, మునిసిపాలిటీలు మొదలైన స్థానిక సంస్థల్లో పని చేసే పాకీవాళ్లు వీధులూడ్చేవాళ్లు మొదలైన చిన్న ఉద్యోగులు తప్పని సరిగా ఖాదీ ధరించాలి. ఈ ఉత్తర్వును పొట్టి శ్రీరాములు హర్షించలేకపోయాడు. ఇలా చేయడం గాంధీజీ ఆశయాలపట్ల తమకు ప్రగాఢ విశ్వాసము వుందని ప్రచారము చేసుకోవడమేనని ఇది కేవలం రాజకీయ కుతంత్రం మాత్రమేనని పొట్టి శ్రీరాములు అభిప్రాయం. ఆంగ్ల ప్రభుత్వాధికారులు ఆదేశాల మేరకు స్థానిక సంస్థల వుద్యోగుల ఖద్దరు ధరించేవారు. కానీ స్వాతంత్ర్యానంతరం ఖాదీ ధారణ పట్ల పెంపొందవలసిన శ్రద్ధ స్థానిక సంస్థా నిర్వాహకుల్లో ఉద్యోగుల్లో తగ్గి వ్యతిరేకత ప్రబలింది. మిల్లు వస్త్రాలు ఎన్నో విధాల ధరించడంపట్ల ఆసక్తి పెరిగింది. ఖాదీ వస్త్రాలకన్నా మిల్లు వస్త్రాల ఎన్నో విధాల శ్రేష్ఠమైన వనడంలో సందేహంలేదు. మిల్లు వస్త్రాల కన్నా ఖాదీ ధర ఎక్కువ మన్నిక తక్కువ. ఉతకడం కష్టం. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వున్న స్థానిక సంస్థలకు ఖాదీ వస్త్రాల ఖర్చును భరించడం ఎంతో కష్టమవుతుంది. ఇన్ని ఇబ్బందులున్నప్పటికి గాంధీజీ జాతీయ సమైక్యతను సాధనంగా ఖాదీ ఉద్యమాన్ని నిర్వహిచాడు. ఈ లక్ష్యాన్ని గుర్తించినప్పుడు ఈనాటి ప్రభుత్వం ఉద్యోగుల చేత ఖాదీ వస్త్రాలను ధరింపజేయడానికి తగిన శ్రద్ధను ప్రదర్శించాలి. ఖాదీ వస్త్రాల ధరను తగ్గించాలి. ఖాదీ ప్రచార విషయంలో ఎలాంటి శ్రద్ధ వహించకపోగా ఇతర ప్రభుత్వోద్యోగులందర్నీ వదలివేసి స్థానిక సంస్థలలో ఆఖరు స్థాయి వుద్యోగులైన పాకీవాళ్ళను వీధులు ఊడ్చేవాళ్లకూ ఖాదీ వస్త్రధారణ నిర్బంధం చేయడం ఏవిధంగా చూసిన సమంజసం కాదు.

ఖాదీ పట్ల నేటి ప్రభుత్వాధినేతలకు నిజంగా విశ్వాసం వున్నట్లయితే పోలీసు ఉద్యోగులతో సహా ప్రభుత్యోద్యోగులందరికీ ఖాదీ వస్త్రధారణను నిర్బంధం చేయాలి. ఖద్దరు ఉత్పత్తి విషయంలోను, సరఫరా విషయంలోనూ ప్రభుత్వమే

పూర్తి బాధ్యత వహించాలి. ఇతర ఉద్యోగులను వదిలివేసి కేవలం ఒక్క స్థానిక సంస్థల్లోని చిన్నచిన్న ఉద్యోగులు మాత్రమే ఖాదీ వస్త్రాలను ధరించాలనడం ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించి పెత్తనం చెలాయించడం అవుతుంది. ఎక్కడా అమ్ముడుపోక మిగిలిపోయిన ఖాదీ వస్త్రాలను తెచ్చి ఇష్టంలేని చిన్న ఉద్యోగులు కొందరిచేత బలవంతంగా ధరింపచేయడం ఖాదీ ఉద్యమానికి అపకారం చేయడమే అవుతుంది. ఇది గాంధీజీ ఆశించిన విధానంకాదు. పెద్ద పెద్ద రాజకీయ నాయకులు, ఉన్నతోద్యోగులు తాము స్వయంగా ఖాదీ వస్త్రాలను ధరించడం ద్వారా ఇతర ఉద్యోగుల్లో ఖాదీ పట్ల గౌరవాభిమానాల్ని పెంపొందించాలి. తన అభిప్రాయంతో ఏకీభవించే వారందరు పై ఉత్తర్వును ఉపసహించు కోవలసిందిగా మద్రాసు ప్రభుతంపై ఒత్తిడి తేవలసిందని పొట్టి శ్రీరాములు విజ్ఞప్తి చేశాడు.

ఆశయాలకంటే ఆచరణకే ప్రాముఖ్యం ఇచ్చేవాడు శ్రీరాములు. ఖాదీ ప్రచారాన్ని తన దైనందిన కార్యక్రమంలో ఒక భాగంగా భావించాడు. అందువలన తన బంధుమిత్రాదులందరిలోను ఖాదీ పట్ల ఆసక్తి పెంపొందించగలిగాడు. ఎక్కడికి పోయినా అతడు ఖాదీ ప్రచారాన్ని మరచిపోయేవాడు కాదు. అతడు ఎరవాడ చరఖాను బహూకరించాడు.

నెల్లూరు జిల్లా కలెక్టరుగా పని చేసిన మలయప్పన్ దంపతులతో కూడా శ్రీరాములుకు పరిచయం ఏర్పడింది. క్రమేణా వారిద్దరికే ప్రతి రోజూ నూలు వడకడం పట్ల శ్రద్ధ కలిగించాడు. ఈ విషయాన్ని సబర్మతి ఆశ్రమం మాజీ కార్యదర్శి అయిన నారాయణదాస్ గాంధీజీ వ్రాసిన లేఖలో శ్రీరాములు ఇలా వ్రాశాడు “మలయప్పన్ గారు ఒక సాధారణ వ్యక్తి. వారు నన్నెంతో ఆదరించారు. క్రమేణా నేను వారిని వారి సతీమణిని ప్రతిరోజు నూలు వడకవలసిందిగా కోరాను. వారి సతీమణికి నేను నూలు వడకటం నేర్పుతున్నాను. మలయప్పన్ గారు కూడా నూలు వడకటం పట్ల ఆసక్తి చూపిస్తున్నారు. కాని వారికి తమ విధి నిర్వహణలో నిద్రపోవడానికి సమయం దొరకటంలేదు. ఐనప్పటికీ అవకాశం ఉన్నప్పుడు నూలు వడకటం నేర్చుకోవడంలో వారెంతో శ్రద్ధ కనబరుస్తున్నారు”

అబిద్ హసన్ సఫ్రానీ అనే ఒక మిత్రుడు ఖాదీ ప్రచారం విషయంలో పొట్టి శ్రీరాములు కనబరుసున్న ఆసక్తిని ప్రశంసించేవాడు. అతడు కెయిరో రాయబార కార్యాలయంలో నియమించబడిన తరువాత 1949 జూన్ 27వ

తేదీన పొట్టి శ్రీరాములుకు ఇలా లేఖ వ్రాశాడు. "నేను ఇక్కడికి వచ్చేముందు ఈజిప్టియన్ ప్రత్తితో ప్రతిదినం నూలు వడక వలసిందిగా మీరు సలహాయిచ్చారు. మీ సలహాపట్ల నాకెంతో గౌరవం వుంది. దురదృష్టవశాత్తు నాకు ఇంతవరకు నూలు వడకటానికి తీరిక లభించలేదు. వీడ్కోలు సమయంలో మీరు నాకు ఖాదీ వస్త్రాలను బహూకరించారు. అందుకు నా కృతజ్ఞతలు. నిజం చెప్పాలంటే ఇంతవరకు నేనా వస్త్రాన్ని ధరించలేదు. కానీ మీరిచ్చిన వస్త్రంపట్ల గౌరవభావంతో దాన్ని దిండుక్రింద భద్రపరచాను. ఇందువల్ల మీకూ నాకూ గల సాన్నిహిత్యం ప్రతి దినం గుర్తుకు వస్తుంది.

**గాంధీజీకి తగిన శిష్యుడైన పొట్టి శ్రీరాములు తప్పుచేసిన వ్యక్తి ఎంత ఉన్నత పదవిలో ఉన్నప్పటికీ అతణ్ణి విమర్శించడంలో వెనుకాడేవాడు. కాదు. అదే విధంగా తనతప్పు ఏదైనా వుంటే నిస్సంకోచంగా అంగీకరించేవాడు. ఒకసారి తన నిస్సహాయస్థితిని వ్యక్తం చూస్తూ నారాయణదాస్ గాంధీజీకి ఇలా లేఖ వ్రాశాడు. "... ఖాదీ ప్రచారం కోసం తగిన కృషి చేయలేక పోయాననే విషయం నాకు తెలుసు. ఆ చేసిన కొద్దిపాటి కృషి కూడా ఎంతో అసౌకర్యమైన పరిస్థితికి తట్టుకుంటూ చేయవలసివస్తుంది. ఖాదీ ప్రచారం సక్రమంగా జరగాలనే ఆ పేక్షతో చరఖాలు, ఏకులు నా భుజాలపై మోసుకొని వెళ్లి నూలు వడకటం పట్ల ఆసక్తి గల వారికి అందజేసేవాణ్ణి. నేను ఈ చిన్నచిన్న ఇబ్బందులకు ఏమి బాధ పడటం లేదు. ఖాదీ ప్రచారం కోసం అవసరమైతే నా ప్రాణాలను త్యాగం చేయదానికైనా సిద్ధమే.**

గాంధీజీ ఖాదీ పరిశ్రమను వికేంద్రీకరింప జేయాలని తద్వారా గ్రామీణ స్థాయిలోని పిల్లలకు సైతం తగిన ఉపాధి కల్పించాలని ఆశించాడు. కానీ మనకు స్వాతంత్ర్యం లభించిన తరువాత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లో గాంధీజీ అనుయాయులే అధికారంలో ఉన్నప్పటికీ వారు ఖాదీ పరిశ్రమ వికాశం పట్ల శ్రద్ధ చూపకపోవడం నారాయణదాస్ గాంధీకి వ్రాసిన లేఖలో కొన్ని ఉదాహరణ లిచ్చాడు". చరఖా సంఘం ఉన్నచోట్ల యితరులెవ్వరూ ఖాదీని ఉత్పత్తి చేయరాదు అమ్మరాదు. అనే నిబంధన విధించడం ద్వారా మద్రాసు ప్రభుత్వం ఖాదీ పరిశ్రమను క్షీణింపజేస్తుంది. ఇది సరియైన విధానం కాదు. దీనికి పరిష్కారంగా

నేను ఒక సూచన చేయదలచాను. చరఖా సంఘం వారి సహకారంతో ఖాదీ నేయడం పట్ల ఆసక్తి గలవారికి శుద్ధమైన ఖాదీ నూలు అందజేస్తే ఖాదీ పరిశ్రమ ప్రాముఖ్యం పెరగడమేగాక ఉత్తమ ఖాదీ వస్త్రం తగినంతగా తయారవుతుంది.

చర్ఖా సంఘం నిర్లక్ష్యం వల్ల ఖాదీ పరిశ్రమకు ఎలాంటి చిక్కులు ఏర్పడిందీ పై లేఖలో శ్రీరాములు ఇలా వివరించాడు.

"బలవంతునిదే' న్యాయం' అనే అనాగరిక సిద్ధాంతాన్ని పొట్టి శ్రీరాములు హర్షించలేకపోయాడు. ఒక ధనికుడు అనేక మంది పేదవాళ్ళను కొల్లగొట్టి మరింత ధనం సంపాదించవచ్చు. అదే విధంగా ఒక భారీ పరిశ్రమ అనేక చిన్న పరిశ్రమలను నామరూపాలు లేకుండా సర్వనాశనం చేయవచ్చు. ఇలాంటి పరిణామాన్ని నాగరిక చర్య లేదా అభివృద్ధి కార్యక్రమంగా వర్ణించడం సమంజసం కాదు.

ఈ కారణంగా పొట్టి శ్రీరాములు శాస్త్రీయ, సాంకేతిక పద్ధతుల ప్రాధాన్యతను విస్మరించాడనడానికి వీల్లేదు. ఉత్పత్తిని పెంచడంలో యంత్రాలను సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం మంచిదని ఆయన అభిప్రాయం. అయితే శాస్త్ర సాంకేతిక విజ్ఞానం కేవలం అధిక స్థాయిలో వస్తువులను ఉత్పత్తిచేసి కార్మికుల పనిని పోగొట్టి వాళ్లను పస్తులుంచడాన్ని ఆయన హర్షించలేక పోయాడు. సాంకేతిక పరిజ్ఞానం అందరికీ అందుబాటులోనికి వచ్చినప్పుడే దాని విశిష్టత గుర్తింపబడుతుంది.

## మునిసిపల్ కార్మికుల సమస్యలు

నెల్లూరులో వున్న కాలంలో మునిసిపల్ కార్మికుల పరిస్థితులను చక్కదిద్దడానికి పొట్టి శ్రీరాములు తీవ్రమైన కృషి చేశాడు. పాకీవాళ్లు మొదలైన చిన్న చిన్న ఉద్యోగుల స్థితిగతులను మెరుగుపరచడానికి తోడ్పడ్డాడు. దర్గా మిట్టలో ఉన్న పాకీవారు నివసించే యిండ్ల మధ్య నివసిస్తూ వారి సర్వతో ముఖాభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టాడు. వారికి నూలు వడకడం శిక్షణ యిచ్చాడు. వారి మధ్యగల తగాదాలను పరిష్కరించాడు. త్రాగుడు, కొట్లాటలు మొదలైన దుర్వసనాలను మాన్పించాడు. నిరక్షరాస్యులైన వయోజనులకు రాత్రిపూట పాఠశాలలు నిర్వహించాడు.

పొట్టి శ్రీరాములు ఆనాటి మద్రాసు రాష్ట్ర స్థానిక వ్యవహారాలశాఖ మంత్రి,

మునిసిపల్ అధ్యక్షుడు, కమీషనర్, ఇంజనీరు, హెల్త్ ఆఫీసర్, లేబర్ ఆఫీసరు మొదలగు అధికారులు దృష్టికి నెల్లూరు మునిసిపల్ కార్మికుల సమస్యలను తెచ్చి వాటిని పరిష్కరించ వలసిందిగా ఒత్తిడి చేయసాగాడు. ఈ సందర్భంగా 22-11-1946వ తేదీన నెల్లూరు మునిసిపల్ కమీషనరుకు ఈ విధంగా జాబు వ్రాశాడు. "ఈనాటికి మన మునిసిపాలిటీ పారిశుధ్యపు పనివాళ్లు వీధుల్లో పోగయిన చెత్తా చెదారాన్ని ఏలాంటి వాహనం లేకుండానే వారంతట వారే స్వయంగా మోసుకొని వెళ్లి ఊరివెలుపల పడవేస్తున్నారు. ఈ పద్ధతి ఏ మునిసిపాలిటీలోను లేదు. ఈ విషయాన్ని మేము మునిసిపల్ హైల్త్ ఆఫీసర్‌తో గూడా చర్చించడం జరిగింది. ఈ పనికి మునిసిపాలిటీవారు రెండు ట్రక్కులను సమకూర్చితే బాగుంటుంది. ట్రక్కులయితే సందు గొందుల్లోని చెత్తను కూడా తీసివేయడానికి వీలుంటుంది. అందువల్ల మీరు వెంటనే మా విజ్ఞప్తిని ఆమోదిస్తారని ఆశిస్తున్నాను..."

మునిసిపల్ అధికారులు తగిన చర్య తీసుకోనందువల్ల ఇదే విషయాన్ని 6-1-1947న పొట్టి శ్రీరాములు నెల్లూరు కలెక్టరు దృష్టికి తెచ్చాడు. ఆ లేఖలో చెత్త చెదారాన్ని తీసివేయడానికి ట్రక్కుల ఆవశ్యకతను నొక్కి చెప్పాడు. దర్గా మిట్టలోని మునిసిపల్ పాకీ పనివారి కాలనీలో వీధి దీపాలు సమకూర్చవలసిన అవసరాన్ని కూడా వివరించాడు. ఈ విషయమై మునిసిపాలిటీ కార్మికులు సమ్మెకు దిగాలని భావిస్తున్నందున పరిష్కరించడం మంచిదని భావిస్తున్నాను. నేను 22-11-1946వ నెల్లూరు మునిసిపాలిటీ కమీషనర్ గుర్తు చేస్తూ లేఖ వ్రాశాను. ఆ లేఖ ప్రతిని మీకు కూడా వ్రాశాను కానీ యింతవరకు ఆ విషయమై ఎలాంటి చర్య తీసుకొనబడలేదు. సుమారు సంవత్సరం నుండి ఎంతో ఓర్పుతో పాకీ పనివారు ఈ విషయమై విజ్ఞప్తి చేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వంవారు ఒక విధాన ప్రకటన చేస్తూ పురపాలక సంఘాల ప్రగతి అట్టడుగుస్థాయి ఉద్యోగుల ఉన్నతిపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. అలాంటప్పుడు వారి కనీసపు కోర్కెలను కూడా ఆమోదించకుండటం సమంజసంకాదు. పురపాలకశాఖా మంత్రి కె. కోటిరెడ్డి గారి సమక్షంలోనే 3-1-1947 తేదీన నేను ఈ విషయాన్ని మీతో ప్రస్తావించి ఉన్నాను. అందువల్ల ఈ విషయం పట్ల తగిన శ్రద్ధ తీసుకోగలరని ఆశిస్తున్నాను.

పొట్టి శ్రీరాములు గొప్ప పట్టుదల కలిగిన వ్యక్తి ఒక కార్యక్రమాన్ని చేపట్టినపుడు ఎన్ని ఆటంకాలు ఎదురు అయినా లక్ష్యాన్ని సాధించేవరకూ తన పట్టును వదలేవాడుకాదు. నెల్లూరు మునిసిపల్ పని వారి సమస్యలను కమీషనర్, జిల్లా కలెక్టరు మొదలైన అధికారుల దృష్టికి తెచ్చినప్పటికీ అవి పరిష్కరింపబడలేదు. అందువల్ల వారి సమస్యలను నేరుగా స్థానిక వ్యవహారాల మంత్రి దృష్టికి తెస్తూ 15-1-1947న వ్రాసిన లేఖలో ప్రస్తావించాడు.

నిజాయితీపరుల కృషి ఏనాటికైనా సఫలమై తీరుతుంది. మునిసిపల్ పనివారి సమస్యల విషయమై పొట్టి శ్రీరాములు వివిధ స్థాయిలలోని అధికారులతో ఉత్తర ప్రత్యుత్తరాలు, సంభాషణల ద్వారా చేసిన కృషి ఫలించింది. మునిసిపల్ కమీషనర్ శ్రీ శ్రీ పిచ్చిరెడ్డిగారు శ్రీరాములు చేసిన ప్రతిపాదనలకు అనుకూలంగా స్పందించారు.

పాకీ వాళ్లు, వీధులు ఊడ్చేవాళ్లు, మురికి కాలువలు శుభ్రం చేసేవాళ్లు, డ్రైవర్లు మొదలైన మునిసిపల్ ఉద్యోగుల స్థితిగతులు పెంచడానికి అహర్నిశలు కృషి చేస్తున్నప్పటికి గాంధేయవాదిగా, కాంగ్రెసును అనుచరునిగా శ్రీరాములు తన కర్తవ్యాన్ని ఏనాడూ విస్మరించలేదు. 4-6-1947న అప్పటి మద్రాసు రాష్ట్ర స్థానిక వ్యవహారాల మంత్రి శ్రీ కె. చంద్రమౌళిగారికి వ్రాసిన లేఖలో తన ఆవేదనను ఇలా వ్యక్తం చేశాడు. "గత సంవత్సరం ఆగష్టు నెలలో నెల్లూరు మునిసిపాలిటీ పనివారి సమ్మె జరిగినపుడు దాన్ని అవకాశంగా తీసుకొని కమ్యూనిష్టులు సమ్మెను బలపరచడం ద్వారా కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలని చూశారు. వారికి అలాంటి అవకాశం యివ్వకుండా కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజల సహకారంతో నగర పరిశుభ్రతను కాపాడటంలో ఎంతో కృషి చేశారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ వాదుల బలహీనతలను ఇలా పేర్కొన్నాడు. ఎన్నికల సమయంలో దాదాపు కాంగ్రెస్ వారంతా అక్రమ మార్గాలనే అనుసరిస్తున్నారు. డబ్బిచ్చి ఓట్లను కొనడం, బ్యాలెట్ పెట్టెలను తారుమారు చేయడం మొదలైన అవినీతి చర్యలను పాల్పడటంలో వెనకాడటం లేదు. ఎన్నికల అనంతరం దేశ శ్రేయస్సుకన్నా వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇలాంటి అవినీతి పద్ధతులను అనుసరించడం ద్వారా వారు కాంగ్రెస్ సంస్థ

యొక్క పవిత్రతనే చెడగొడుతున్నారు. గాంధీజీతోసహా కాంగ్రెస్ అగ్ర నాయకులంతా కాంగ్రెస్ పార్టీని స్థాపించడంలో గల ప్రధాన లక్ష్యం దేశానికి స్వాతంత్ర్యం సాధించడమేగాని అధికారం చేపట్టి వ్యక్తిగత ప్రయోజనాలు పొందడం కాదనే విషయాన్ని అనేక మార్లు గుర్తుచేశారు. కాబట్టి కాంగ్రెస్ కార్యకర్తలంతా జిల్లా బోర్డులు, మునిసిపాలిటీలు మొదలైన స్థానిక సంస్థల ఎన్నికల్లో పాల్గొనడం మానుకొని గాంధీజీ ఆదేశించిన నిర్మాణాత్మక కార్యక్రమాల్లో పాల్గొనడం మంచింది. కొందరు కాంగ్రెస్ వాదులు ఎన్నికల్లో పోటీ చేసినప్పటికి యోగ్యులైన అభ్యర్థుల్ని మాత్రమే కాంగ్రెస్ కమిటీలో ఎన్నిక చేయాలి. అంతేకాని సంకుచిత రాజకీయాల ఆధారంగా అసమర్థుల్ని, అవినీతిపరులను ఎన్నికచేసి వారిని గుడ్డిగా బలపరచమని వివిధ స్థాయిలలోని కాంగ్రెస్ విభాగాలపై వత్తిడి చేయడం సమంజసం కాదు. ఇలాంటి పద్ధతులను అనుసరించినపుడు రాజకీయాలలో ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుంది.

పొట్టి శ్రీరాములు ఎంత పట్టుదలగల వ్యక్తి అయినప్పటికీ కాలానుగుణంగా వ్యవహరించేవాడు. ఏ విషయంలోను మొండి వైఖరి అవలంబించేవాడు కాదు. నెల్లూరు మునిసిపల్ కార్మికుల సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వాధికారులు మొండి వైఖరి ప్రదర్శించారు. అందుచేత ఆయన నిరసనవ్రతం (07.07.1947) ప్రారంభించ వలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. కొన్ని అనివార్య కారణాలవల్ల ఆయన తన నిరాహార దీక్షను వాయిదా వేసుకోవలసి వచ్చింది. ఈ విషయాలన్నీ వివరిస్తూ 21-7-1947వ తేదీన గాంధీ గారికిలా లేఖ వ్రాశాడు.

“పరమ పూజనీయ బాపూజీ! నమస్తే! మీ అమూల్య సమయాన్ని వృధాచేసి మిమ్మల్ని యిబ్బంది పెట్టడం నాకిష్టం లేదు. అయినా కొన్ని అనివార్య పరిస్థితుల వల్ల ఈ విషయాన్ని మీ దృష్టికి తేవలసి వచ్చింది.

9 నెలలో నెల్లూరు మునిసిపల్ పాకీ పనివారి సమ్మె జరిగింది. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలనే ఉద్దేశంతో కమ్యూనిష్టు వర్గాల వారి సమ్మెకు ప్రోత్సహించారు. అందుచేత నాలాంటి కాంగ్రెస్ కార్యకర్తలంతా కలసి పట్టణ పారిశుద్ధ్యాన్ని కాపాడటంలో అధికారులకు తోడ్పడ్డాము. సమ్మె విజయవంతంగా ముగిసింది. మునిసిపల్ ఉద్యోగులందరికీ 25% మూలవేతనం పెంచబడింది. ఒక్కొక్కరికి నెలకు ఒక రూపాయి ప్రకారం ప్రావిడెంటుఫండు

మంజూరు చేయబడింది. 213 మంది ఉద్యోగులకు 1-8-1946 నుండి ఈ ప్రయోజనాలు అమలు చేయబడ్డాయి. కానీ 31 మంది పాకీవాళ్లకు, కాలువలూడ్చేవాళ్లకూ కొన్ని కుంటి సాకులతో ఈ ప్రయోజనాలను నిరాకరించారు. ఈ అంశాన్ని గురించి ప్రభుత్వాధికారులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. ఆఖరుకు ఆ నిర్భాగ్యులకు ఆ ప్రయోజనాలు ఇవ్వడానికి ప్రభుత్వం నిరాకరించింది.

ఈ సమస్య పరిష్కరించబడడానికి రెండే రెండు మార్గాలు కనబడుతున్నాయి. మొదటిది సంబంధిత ఉద్యోగులు సమ్మెకు దిగడం. రెండవది. నాలాంటి వ్యక్తి ఒక్కడే అన్ని కష్టాలు భరించి ఆందోళన కొనసాగించడం. రెండవ మార్గాన్ని నేను ఎన్నుకొన్నాను. అందువల్ల 7-7-1947 నుండి నేను నిరాహారదీక్షకు పూనుకొనవలసి వస్తుందని సంబంధిత ఉన్నతోద్యోగులందరికీ తెలిపాడు. ముగ్గురు రాష్ట్ర మంత్రులను స్వయంగా కలిశాను. అయినప్పటికీ ఇంతవరకూ వారినుండి ఎలాంటి సమాధానమూ లేదు.

నేను నిర్ణీత కార్యక్రమం ప్రకారం ఈ రోజు (7-7-1947) నుండి నిరాహారదీక్ష కొనసాగించవలసి వుంది అయితే నెల్లూరు పట్టణంలో మతకలహాల వల్ల ప్రస్తుతం ఉద్రిక్త వాతావరణం నెలకొని వుంది. నేను నిరాహారదీక్ష ప్రారంభిస్తే వాతావరణం ఇంకా కలుషిత మవుతుందని కొందరు మిత్రులు సలహా ఇచ్చారు. కనుక 21-7-1947వ తేదీన నా దీక్షను వాయిదా వేసుకున్నాను. ఏ మాత్రం అవకాశం వున్నా నిరాహారదీక్ష లేకుండానే సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తాను. అధికారంలో వున్న కాంగ్రెస్ వాదులు, సమర్థులైన కాంగ్రెస్ కమిటీ సభ్యులు ఇలాంటి విషయాల్లో శ్రద్ధ చూపనపుడు నాలాంటి సామాన్య కార్యకర్తకు, నిరాహారదీక్ష తప్ప గత్యంతరం లేదు. ఈ విషయాన్ని మీరు సహృదయంతో గమనిస్తారని ఆశిస్తున్నాను.

ఇట్లు
మీ విధేయుడు
పొట్టి శ్రీరాములు

లోగడ 1946లో నెల్లూరులోని వేణుగోపాలస్వామి వారి దేవాలయంలో హరిజనులకు ప్రవేశం కల్పించవలసిందిగా పొట్టి శ్రీరాములు నిరాహారదీక్ష చేసినప్పుడు గాంధీజీ ఆయన చర్యను సమర్థించారు. ఆ విషయాన్ని ఈనాటికీ

పురప్రముఖులు, పత్రికావిలేఖరులు, రాజకీయవేత్తలు, ప్రభుత్వాధికారులు మరచిపోలేదు. అందుచేత శ్రీరాములు మళ్ళీ దీక్ష ప్రారంభిస్తే గాంధీజీ ఈ విషయంలో తప్పక ఆసక్తి చూపిస్తాడు. ఇలా జరగకముందే పరిష్కరించడం మంచిదని అధికారులు భావించారు. అందువలన శ్రీరాములును దీక్ష విరమించవలసినిందిగా ప్రాధేయపడ్డారు. ఈ విషయాన్ని పరిష్కరించవలసిందని స్థానిక వ్యవహారాల మంత్రి పై కూడా ఒత్తిడి తెచ్చారు. దీని ఫలితంగా 31 నుండి మునిసిపల్ పాకీ పనివారి సమస్యను పరిష్కరించడం జరిగింది. తన కృషి ఫలితంగా విషయాన్ని తెలుపుతూ 8-7-1947వ తేదీన గాంధీజీకి ఇలా లేఖ వ్రాశాడు.

"పరమ పూజ్యనీయ బాపూజీ! నమస్తే

నిన్న మీకు నేను ఒక లేఖ వ్రాశాను. అదే అంశాన్ని గురించి మళ్ళీ జాబు వ్రాయవలసి వచ్చింది. మద్రాసు రాష్ట్ర ఆరోగ్యశాఖామాత్యులైన ఎ.బి. శెట్టిగారి. కృషివల్ల నెల్లూరులోని 31 మంది పాకీ పనవారికి న్యాయం జరిగింది. వారికి ఈ రోజు నుండి 25% మూల వేతనము పెంచుతూ ఒక్కొక్కరికి నెలకు ఒక రూపాయి చొప్పున ప్రావిడెంటు ఫండు మంజూరుచేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిది. అందువల్ల నేను నిరాహారదీక్ష ప్రారంభించవలసిన అవసరము లేకుండా పోయింది. నెల్లూరు మునిసిపల్ కమీషనర్, పురప్రముఖులు, రాష్ట్ర ఆరోగ్య మంత్రి మొదలైన వారి కృషి ఫలితంగా ఈ విజయం సాధించగలిగారు.

1946 జనవరి నెలలో నేను మిమ్మల్ని మద్రాసులో కలిసినప్పుడు పాకీ పనివాళ్ల గృహాల్లో నివసిస్తూ వారి మధ్య ఒక పనివానిగా జీవించడమే నా లక్ష్యమని మీకు మనవి చేశాను. అలాగే నేను వారితో గత రెండు సంవత్సరాలుగా కలిసిమెలసి జీవిస్తున్నాను. భారతదేశంలో అంటరాని తనాన్ని నిర్మూలించటానికి ఇంతకన్నా వేరే మార్గం లేదు. కుల ప్రాతిపదికగా హెచ్చుతగ్గు లున్నంతకాలం భారతదేశంలో సమసమాజ వ్యవస్థ సాధ్యం కాదుగదాబీ హిందూ ముస్లిం తగాదాలు తగ్గి మతకలహాలు శాంతించినప్పుడే భారతదేశ సమైక్యత వర్ధిల్లుతుంది.

ఇట్లు

మీ విశ్వాసపాత్రుడు

పొట్టి శ్రీరాములు

## మద్యపాన నిషేదం

గాంధీజీలాగే పొట్టి శ్రీరాములు కూడా దేశప్రజలంతా ఆరోగ్య సౌభాగ్యాలతో జీవించాలని కోరేవాడు. ఆరోగ్య జీవితానికి భంగకరంగా ఉన్న మత్తు పదార్థాలలో త్రాగుడు మొదలైన దురభ్యాసాల నుండి ప్రజలు విముక్తులు కావాలని ఆశించాడు. త్రాగుడు లాంటి దురలవాట్లకు మనిషి ఒకసారి బానిసైతే వాటి నుండి విముక్తి పొందడం దుర్లభం. ముఖ్యంగా కష్ట జీవులైన పేదవారు త్రాగుడుద్వారా తమ బాధల్ని మరచిపోవాలని కోరుకుంటారు. అలాంటప్పుడు వారు తాగుడు మానివేయడం కష్టమవుతుంది. ఎప్పుడు చేతిలో డబ్బుంటే అప్పుడు వారికి యింటి కన్నా సారాయి దుకాణాలే గుర్తుకు వస్తాయి. దీని ఫలితంగా ఆ కుటుంబం దుర్భర దారిద్ర్యానికి గురి అవుతుంది. త్రాగుడుకు బానిసయిన వ్యక్తి తన విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయి పశు ప్రాయుడవుతాడు.

ప్రజల వ్యక్తిగత జీవితంలో జోక్యం చేసుకొనే అధికారం ప్రభుత్వానికి లేదనే వాదనతో శ్రీరాములు ఏకీభవించేవాడు కాదు. సమాజ శ్రేయస్సుకు భిన్నంగా ఏ వ్యక్తికీ స్వేచ్ఛగాని హక్కులుగాని ఉండటం సమంజసం కాదు. ఈ సందర్భములో గాంధీజీ అభిప్రాయాలను ఆయన స్మరించేవాడు. “వ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని గురించి మాట్లడేవారికి భారతదేశ స్వరూప స్వభావాలు తెలియవు. త్రాగుడు అనేది. తన వ్యక్తిగత హక్కని వాదించడంలో తప్పు లేకపోతే తమ కామహంఛ తీరడం కోసం ప్రభుత్వమే స్త్రీలను సమకూర్చాలని కోరడం కూడా తప్పుకాదు”.

మద్రాసు ప్రభుత్వం మద్యపానాన్ని నిషేదించినందుకు శ్రీరాములు సంతోషించాడు. ఈ చర్యవల్ల ప్రభుత్వానికి 17 కోట్లు రూపాయల వార్షిక ఆదాయం పడిపోతుంది. ఈ విధానాన్ని అమలు చేయడానికి కూడా ప్రభుత్వానికి ఖర్చు అవుతుంది. ఈ పథకాన్ని విజయవంతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం 442 మంది గాంధేయులను ప్రచారకులుగా నియమించాలని నిర్ణయించింది. మద్యపాన నిషేద కార్యక్రమంలో మునిగి వున్న శ్రీరాములు ఈ నిర్ణయంపట్ల హర్షాన్ని వ్యక్తం చేశాడు. మద్యపాన నిషేధ చట్టం అమలు వలన కలిగిన పరిస్థితిని అంచనా వేయడానికి శ్రీరాములు స్వయంగా అనేక గ్రామాల్లో పర్యటించాడు. మద్యపాన నిషేదానికి ముందు గ్రామానికి ఒక సారాయి దుకాణం

వుండేది. నిషేధం తరువాత ప్రతి ఇంటికీ ఒక సారాయి దుకాణం వెలిసింది. ఈ అంశం ఆయనకు దిగ్భ్రాంతిని కలిగించింది. ప్రభుత్వ విధానంలోనే ఏదో లోపముందని ఆయన భావించాడు. ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ నిర్మాణ కార్యక్రమ నిర్వాహకునిగా శ్రీరాములు మద్యపాన నిషేధాన్ని సక్రమంగా అమలు పరచడానికి నియమించబడిన ప్రచారకులకు ప్రభుత్వ అధికారులకు ఎన్నో సలహాలిచ్చాడు.

నిజాయితీ పరులైన పొట్టి శ్రీరాములు తప్పు చేసిన ప్రభుత్వోద్యోగులు ఎంత హెూదా కలవారయినప్పటికి విమర్శించడానికి వెనుకాడేవాడు కాదు. మద్యపాన నిషేదాన్ని అమలు చేయడానికి అవసరమైన ఉద్యోగుల ప్రభుత్వ యంత్రాంగంలో ఉన్నప్పుడు దాన్ని ప్రచారం చేయడానికి ఎంతో ధనాన్ని దుర్వినియోగం చెయ్యడం ఆయనకిష్టంలేదు. ధనికులకు మద్యపానాన్ని అమ్మే లై సెన్సు జారీ చేసి వారిని ఇంకా ధనవంతులుగా చేయడం సమంజసమేనా? అలాంటి వారిని ప్రచారం ద్వారా అజమాయిషీ చేయడం సాధ్యమేనా? అని ఆయన ప్రభుత్వాధికారులను ప్రశ్నించేవాడు. మద్యపాన నిషేదాన్ని అమలు చేయడంలో ప్రచారకులకన్నా డాక్టర్లు, స్త్రీలు, విద్యార్థులు, కాంగ్రెస్ పెద్దలు ఎక్కువ సేవ అందిస్తారని శ్రీరాములు తరుచుగా చెప్పేవాడు.

నెల్లూరు జిల్లా కలెక్టరయిన మలయప్పన్ మద్యపానాన్ని సేవించే దురలవాటును నిర్మూలించడంలో నిర్విరామంగా కృషిచేసి జిల్లా అంతటా పేరుపొందాడు. ఆయన కాలంలో జరిగిన ఒక సంఘటనను పొట్టి శ్రీరాములిలా ఉదహరించాడు. నెల్లూరుకు సమీపంలో కటారి పాలెం అనే గ్రామం వుంది. అక్కడ హరిజనుల సంఖ్యా ఎక్కువ. సారాయి దుకాణాలకు ఆ గ్రామం ప్రసిద్ధి పొందింది. ప్రొహిబిషన్ చట్టం అమల్లో వున్నా అక్కడి ప్రజలు నిర్భయంగా కల్లుసారా దుకాణాలను నడుపుతూండేవారు. పొట్టి శ్రీరాములు ఇతర కార్యకర్తల ప్రోత్సాహంతో కలెక్టర్ 1949 ఏప్రిల్ మొదటివారంలో ఆకస్మికంగా కటారిపాలెం వెళ్లాడు. అపరాధులంతా పట్టుబడి తీవ్ర శిక్షలకు గురి అయ్యారు. కలెక్టరు తీసుకున్న ఈ చర్యవల్ల సంఘసేవా కార్యకర్తల్లో నూతనోత్తేజం కలిగింది. ఉత్సాహంతో వారు ప్రతీ గ్రామానికీ వెళ్లి రహస్యంగా దాచబడ్డ కల్లు కుండలను ఇతర ముడి పదార్థలను బైటికి లాగసాగారు. ఈ చర్యవల్ల మద్య విక్రయానికి చెందిన ఏ బేరమూ జరగలేదు. ఈ చర్య అంతా అహింసా పద్ధతిలోనే జరిగింది.

పొట్టి శ్రీరాములు మనస్సుకు అప్పుడిలా స్ఫురించింది. ఒక కలెక్టరు పట్టుదలతో కృషిచేసి ఇంతటి ఫలితం సాధించాడు. మంత్రులు, కాంగ్రెస్ నాయకులు, ప్రభుత్వాధికారులు అంతా ఏకమయితే ఇంకా ఎంతో గొప్ప ఫలితాలను సాధించవచ్చు! వీళ్లంతా గాంధీజీ సిద్ధాంతాలను మాటిమాటికి వల్లిస్తూ మద్యపాన నిషేధం పై ఎందుకు ఆసక్తిని ప్రదర్శించరు? అధికారుల మద్యపాన విక్రయశాలలపై దాడులు చేసే వార్తలు దినపత్రికల ద్వారా ఎందుకు రావడం లేదు? ఈ విషయంలో మంత్రులు, నాయకులు, అధికారులు శ్రద్ధ వహించి నాయకత్వం వహిస్తే ఈ ఉత్తమాశయసాధనకై తనలాంటివారు ప్రాణాలను అర్పించడానికి అయినా సిద్ధంగా వున్నారు. నెల్లూరులో వున్న కాలంలో శ్రీరాములు కొందరు తాగుబోతులను సంస్కరించడానికి స్వయంగా పూనుకొన్నాడు. అనేకసార్లు తాగుబోతులపై కేసులు పెట్టబడ్డాయి. మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచబడ్డారు కూడ. అయితే శ్రీరాములు వారికి శిక్ష పడకుండా ఆదుకున్నాడు. ఆ తర్వాత వారి ప్రవర్తనలో మార్పు వచ్చింది.

**గాంధీజీలాగే పొట్టి శ్రీరాములు సంపద ఏ ఒక్కరిసొత్తు కాదనీ సంఘానికి సంబంధించిదేనని విశ్వసించాడు. ఈ దేశంలో లక్షలాది ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువన నివసిస్తున్నారు. కనుక ఇక్కడికి ధనవంతులకు విలాసంగా జీవించే హక్కు లేదని భావించాడు. అందుచేత భాగ్యవంతులు మద్యపానానికి దాసులు కాక ఆదర్శవంతంగా జీవించాలని కోరాడు. తాను జీవించి ఉన్నంత కాలం పొట్టి శ్రీరాములు మద్యపాన దురాచారాన్ని నిర్మూలించడానికి కృషి చేశాడు.**

## బొంబాయి దురంతాలు :-

"ముస్లిం లీగ్ కౌన్సిల్ 29-7-1946 నాడు సమావేశమై పాకిస్తాన్ను సాధించడానికి ప్రత్యక్ష చర్య తీసుకోవాలని అవసరమైతే తమ ఆందోళనలో దేశంలోని ముస్లిం నందరిని పాల్గొనేలా చేయాలి నిశ్చయించింది. ఆగష్టు 16న ప్రత్యక్ష చర్య ప్రారంభించాలని నిశ్చయించింది. అనుకొన్న విధంగా ఆగష్టు 16వ తేదీ ఉదయం ప్రసిద్ధమైన కలకత్తాలో మారణహెూమం జరిగింది. ఈ దురంతంలో

5 వేల మంది స్త్రీ, పురుషులు, బాలురు బలి అయ్యారు. 15 వేల మంది గాయపడ్డారని అంచనా వేయబడింది. కలకత్తా వీధులు రోజులతరబడి దిక్కులేని శవాలతో నిండిపోయాయి. ఎన్నో శవాలు భూగర్భంలోని మురికి కాలువలలోనికి నెట్టబడ్డాయి. దావానలం మాదిరిగా ఈ దురంతాలు నౌకాలి, పాట్నా, బొంబాయి విస్తరించాయి. మహాత్మాగాంధీ, జవహర్లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్, రాజేంద్రప్రసాద్, ఆచార్య కృపలానీ మొదలైన ప్రసిద్ధ నాయకులంతా ఈ విపత్తును ఎదుర్కొని హిందూ మహమ్మదీయ సఖ్యత నెలకొల్పడంలో నిమగ్నులయ్యారు.

రామాయణ గాథలో శ్రీరాములు వారధి కట్టినప్పుడు ఒక ఉడుత సహకరించినట్లు హిందూ మహమ్మదీయ ఘర్షణను నివారించడానికి శ్రీరాములు తోడ్పడ్డాడు.

బొంబాయిలోని ఘర్షణను అణచడానికి అక్కడే వున్నాడు. 20-9-1946న ఆయన గాంధీ గారికి వ్రాసిన లేఖలో ఇలా సూచించాడు. "ఒక్కొక్క నిరాయుధుడు అమాయకుడైన మహమ్మదీయుడు నిర్హేతుకంగా చంపబడ్డందుకు పరిహారంగా ఒక్కొక్క హిందువు ఆమరణ నిరాహారదీక్షతో జీవితాన్ని స్వచ్ఛందంగా అంతం చేసుకోవడం మంచిది కాదా?" ఈ ఉద్దేశాన్ని బాపూజీ అంగీకరించలేదని ఆయన తరపున జాబు వ్రాసిన కుమారి అమృతకౌర్ తెలియజేసింది. శ్రీరాములు కొన్ని నెలలు సహనంతో కాలం గడిపాడు. కానీ బొంబాయిలో మతకలహాలు కొనసాగుతున్నందుకు సహించలేకపోయాడు. "బొంబాయిలో హత్యాకాండ ఎలా ఆపాలి" అనే శీర్షికతో తన భావాలను ఇలా వ్యక్తపరచాడు. ఒకవారం రోజుల పాటు నినాదాలు వ్రాయబడ్డ అట్టముక్కలను మెడకు తగిలించుకొని కరపత్రాలను పంచుతూ బొంబాయి నగర వీధుల్లో తిరగాలనుకొంటున్నారు. ఆ తరువాత దురంతాలు ఆగేవరకూ నిరశన దీక్ష కొనసాగుతుంది. ఒక్క వారం రోజులపాటు ఎక్కాడా కత్తిపోటు సంఘటనలు జరగనట్లయితే నాదీక్ష విరమిస్తాను. నేను విరమించిన వారం రోజుల్లో మళ్లీ కత్తిపోటు సంఘటనలు జరిగితే, ఏ హిందువు నా కార్యభారాన్ని పంచుకోవడానికి ముందుకు రాకపోతే నేను మరలా నిరాహారదీక్ష ప్రారంభిస్తాను. బొంబాయిలోని అమాయకులైన మహమ్మదీయులను హిందువులు ఆపేవరకూ నా దీక్ష సాగుతూనే వుంటుంది. నాలో ఎంత ఆసక్తి వున్నప్పటికీ ఈ విషయంలో మీ అభిప్రాయం కోసం ఎదురుచూస్తుంటాను.

ఇందుకు డబ్బు, సహాయం కూడా కావాలి. ఈ హత్యలు ఆగిపోవడానికి కొంత కృషి చెయ్యాలి. హిందువులే ఇందుకు పూనుకోవాలి. బెంగాలులో శ్రీరాములు చేసిన కృషిపట్ల బాపూజీ ఎంతో ఆసక్తిని చూపారు.

బొంబాయి దురంతాలకు హిందువులే ప్రధానంగా బాధ్యులన్న శ్రీరాములు అభిప్రాయంతో ఎవ్వరూ ఏకీభవించక పోవచ్చు. అయితే బొంబాయి మత కలహాలను నివారించడానికి అతడు చూపిన ధైర్యసాహసాలు, శ్రద్ధాసక్తులతో చేసిన కృషి ప్రశంసనీయమని చెప్పక తప్పదు.

## బిక్షక సమస్య

భారతదేశంలోని బిక్షుక సమస్యను గూర్చి పొట్టి శ్రీరాములుకు ఒక స్పష్టమైన అవగాహన వుంది. 'దీనబంధు' పత్రికకు (14-4-1943) 'నవయుగ' పత్రికకు (5- 6-1949) "బిక్షుకులను రక్షించండి" అనే శీర్షికతో ఆయన వ్రాసిన వ్యాసాల్లో వివరిస్తూ ఇలా సలహాలనిచ్చాడు.

"బిచ్చగాడు మన వాకిలి ముందు బిచ్చం అడిగితే ధర్మం పేరుతో అతనికి బిచ్చం వేస్తాం. ఇందువల్ల మనకు కలిగేది పుణ్యమా? పాపమా? పనీపాటా లేకుండా బతుకులవల్ల మనం అసౌకర్యం పొందడంలేదా? తమకు రోగాలు నయమైతే బిచ్చం దొరకదేమోనని నిరతరం వ్యాధులను మోస్తున్న బిచ్చగాళ్లు ఎంత మంది లేరు? ఇందువల్ల మనం దొంగతనాన్ని, వ్యభిచారాన్ని, అంటువ్యాధులను ప్రోత్సహించడం లేదా? బిక్షకులు పిల్లలను కుంటివారుగా, గుడ్డివారుగా మార్చడానికి మనం బాధ్యులంకాదా? కుంటి, గుడ్డివారిని సైతం బాగుచేసి దేశానికి పనికివచ్చే పౌరులుగా తీర్చిదిద్దడం సాధ్యం కాదా? బిక్షకుడు తనకున్న ఓటు హక్కుతో ఏం చేస్తాడు? బిచ్చగాళ్ల మనుగడ సాగనీయడం స్వతంత్ర్య భారతానికి మచ్చగాదా? ప్రజలూ ప్రభుత్వం కలిసి పరిష్కరించవలసిని సమస్యల్లో బిక్షక సమస్య ప్రధానమైంది. ఈ సమస్యను ప్రభుత్వం సవ్యంగా పరిష్కరించి నైతిక బలాన్ని పెంపొందించుకోలేదా? మానసిక, ఆర్థిక సమస్యలు వచ్చిన ప్రజలు ఇల్లు వదిలి బిక్షకులుగా మారుతున్నారు. క్రమంగా సోమరిపోతులై పోతున్నారు. ఈ వృత్తిని నిర్మూలించడానికి ఎన్నో సంస్థలు కంకణం కట్టుకొన్నాయి. ఇలాంటి జనాన్ని ఆదుకోవడానికి పురపాలక సంఘు నిబంధనల్లో

కూడా అవకాశం వుంది. కానీ బిచ్చగాళ్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవడానికి అంగీకరించరు. కారణం ప్రజలు ఉదారంగా బిక్ష వేయడమే.

ప్రభుత్వానికి ప్రజా సహకారం తోడయితే బిక్షక సమస్యను నిర్మూలించవచ్చు. ప్రభుత్వం ఏదో ఒక రాష్ట్రం లోనైనా బిక్షక వృత్తిని నిలిపే ప్రయత్నాలు చెయ్యాలి. ఏదో ఒక పట్టణంలో బిచ్చగాళ్లను అరెస్టు చేసినందువల్ల ప్రయోజనం శూన్యం. పంచాయతీలు, మునిసిపాలిటీలు బిచ్చగాళ్లకు ఆశ్రయమిచ్చి పోషించాలి. వారిని వారి స్వగ్రామాలకు పంపాలి. ప్రజలు ఆశక్తులైన వారికి బిచ్చం వెయ్యడం మానాలి.

ప్రజలంతా దేహదారుఢ్యంగల బిచ్చగాళ్లకు బిచ్చం వేయడం మానితే గత్యంతరలేక ఏదో వృత్తిని ఆశ్రయించి బిచ్చగాళ్లు మాయమవుతారు. ప్రజాభిమానం గల ప్రభుత్వం ఏదోవిధంగా ఈ సమస్యను పరిష్కరించడానికి ఉద్యుక్తమవుతుంది. ఇందుకు ప్రజా సహకారం కావాలి. పంచాయితీ రాజ్యంవల్ల ఇది సాధ్యంకావాలి. పంచాయితీ అనే పదంలోనే పెద్ద కుటుంబం అనే అర్థంవుంది. ఒక కుటుంబంలోని వ్యక్తి ఆశక్తుడయితే కుటుంబసభ్యులెలా కాపాడతారో అలాగే ఆశక్తులైన బిచ్చగాళ్లను పంచాయితీ ఆదుకొంటుంది.

ప్రాపంచిక సుఖాలను వదిలి జీవితమంతా ధ్యానంలోనూ, సంఘసేవలోనూ స్వచ్ఛందంగా లభించే బిక్షపై ఆధారపడి జీవించే సన్యాసులకు నిత్యం గృహస్థులను బిక్షపై నిర్బంధించే సోమరిపోతు యాచకులకు గల తారతమ్యాన్ని శ్రీరాములు బాగా గమనించాడు. బిక్షక వృత్తిని నిషేదించే చట్టం బిచ్చమడగదాన్ని వృత్తిగా కలవారికే వర్తిస్తుంది. స్వచ్ఛంద బిక్షాన్ని సన్యాసులకు వర్తింపదు. విశాఖలోని ప్రేమ సమాజం మరియు రాజమండ్రిలోని జీవకారుణ్య సంఘం బిక్షక వృత్తి నిర్మూలించడం ప్రతి భారతీయుని విధ్యుక్తధర్మం.

## జైళ్ల సంస్కరణలు

పొట్టి శ్రీరాములు ఎరేన్ని సుబ్రహ్మణ్యం (గాంధీ ఆశ్రమం, అంగలూరు) మొదలైన కార్యకర్తలతో ప్రభుత్వ రేషనింగు విధానాన్ని నిరసిస్తూ 1947 అక్టోబరులో గుడివాడలో ప్రదర్శన జరిపాడు. అందుకు ప్రభుత్వం వాళ్లందరినీ జైళ్లలో పెట్టింది. శ్రీరాములు ఆ జైళ్లలో నీతి మాలిన పరిస్థితులు చూసి

విచారించాడు. జైళ్ల పరిస్థితులు చక్కబడడానికి మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే చర్య తీసుకోవాలని డిమాండ్ చేశాడు. ముఖ్యమంత్రికి శ్రీరాములు 14-11-1947న ఇలా వ్రాశాడు. "స్వతంత్రభారతంలో అహింసపై విశ్వాసంగల సత్యాగ్రహ ఖైదీగా సబ్ జైళ్ల గదుల్లోని పరిస్థితులను అక్కడ ఉంటున్న ఖైదీల ఇబ్బందులను ముఖ్యంగా సత్యాగ్రహం చేసి జైలు శిక్ష అనుభవిస్తున్న వారి పరిస్థితిని మీ దృష్టికి తెస్తున్నాను. మీకు కూడా ఈ విషయాలన్నీ తెలిసే వుంటాయి. ఆంగ్ల ప్రభుత్వం ఖైదీలపట్ల అమానుషంగా ప్రవర్తించింది. రాజకీయ ఖైదీల ఆత్మవిశ్వాసాన్ని చెదరగొట్టడానికి అమానుషంగా హింసించింది. శారీరకంగా వారిని బాధించినప్పటికి వాళ్ల ఆత్మశక్తిని జయించలేక పోయింది. ఈ విధానం నేటి ప్రజాస్వామిక ప్రభుత్వానికి తగినది కాదని విశ్వసిస్తున్నాను.

త్వరలో తన కోర్కెలు నెరవేరకపోతే,4 జైళ్ళ సమస్యలు తీర్చకపోయినట్లవుతే మొదట లాంఛనప్రాయంగా నిరాహార దీక్షను పూనుకుంటానని అవసరమైతే కోరికలను ప్రభుత్వం తీర్చేవరకూ ఆమరణ నిరాహార దీక్షను జరపుతానని పొట్టి శ్రీరాములు మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రికి అల్టిమేటం ఇచ్చాడు. ఈ మేరకు శ్రీరాములు మూడు రోజులు నిరసనదీక్ష సాగించాడు. కానీ ఎర్నేని సుబ్రహ్మణ్యం, ప్రభుత్వాధికారుల సలహాను అనుసరించి, త్వరలో అనుకూలమైన ఉత్తరువులు రావచ్చుననే నమ్మకంతో శ్రీరాములు దీక్ష విరమించాడు. తానీమారు జైలుకు వెళ్ళితే మరల నిరసనవ్రతం చేస్తానని ప్రకటించాడు. తన కోర్కెలకు అనుకూలమైన ఉత్తరువులు రాష్ట్రమంతటికీ వర్తింపజేయాలని ముఖ్యమంత్రికి లేఖ వ్రాశాడు.

## ఇతర కార్యక్రమాలు

**శ్రీరాములు నిర్వహించిన వివిధ సేవా కార్యక్రమాలన్నింటినీ వరుస క్రమంలో చెప్పడం కష్టతరం. రాజకీయ, మత, ఆర్థిక సాంఘిక విషయాలలో వ్యక్తిగతంగా కానీ సామూహికంగా కానీ ఎప్పుడైనా ఎక్కడైనా సమస్య తలఎత్తితే శ్రీరాములు వెంటనే కార్యభారాన్నంతా తనమీద వేసుకొనేవాడు. చేపట్టిన విషయంలో విజయం సాధిస్తానా లేదా అన్నది అతని సమస్యకాదు. ఇందు ఉదాహరణలు చాలా వున్నాయి.**

నెల్లూరులోవున్న సంజీవశెట్టి వైశ్యా హాస్టల్లో శ్రీరాములు గౌరవ వార్డెన్ వున్నాడు. అప్పుడు గాంధేయమార్గంలో విద్యార్థులను తీర్చిదిద్దడానికి ప్రయత్నించాడు. ఉదయాన్నే నిద్రలేవడం, ప్రార్థనాది నిత్యకృత్యాల్లో పాల్గొనడం, సమయపాలన, సత్యవాక్యపాలన, క్రమశిక్షణ మున్నగు విషయాలను విద్యార్థులకు అలవాటు చేశాడు. ఎవరైనా విద్యార్థి తప్పుచేస్తే ఆ విద్యార్థి తన తప్పు తెలిసికొనేలా శ్రీరాములు బోధించేవాడు. భోజనశాలల్లో ఏ విద్యార్థి అయినా చెడ్డగా ప్రవర్తిస్తే శ్రీరాములు ఆరోజంతా ఉపవాసం చేసేవాడు. దోషియైన విద్యార్థి బ్రతిమిలాడేవరకూ ఆయన దీక్ష కొనసాగేది. హాస్టలు విద్యార్థులు ప్రతి ఆదివారం మొదటి సినిమాకు వెళ్లవచ్చు. నియమానికి విరుద్ధంగా ఎవరైనా వెళితే ఉదయం నిద్రలేచేసరికి అతని ముఖాన తిలకం బొట్టు కనపడేది. ఆ విద్యార్థి నియమోల్లంఘనాన్ని వార్డెన్ గుర్తించినట్లు అదిగుర్తు. ఇంత చిన్న తప్పుకు కూడా విద్యార్థి పశ్చాత్తాపం పొందేవాడు. నిబంధనల విషయంలో ఇంత కఠినంగా వ్యవహరించినా శ్రీరాములు విద్యార్థులపట్ల ప్రేమను ప్రదర్శించేవాడు. బలహీన, వ్యాధిగ్రస్త, నిరుపేద విద్యార్థులకు అనేక విధాల సహాయపడేవాడు.

హాస్టల్ మేనేజ్‌మెంట్ వారి విషయంలో కూడా ఏ పొరపాటు జరిగినా శ్రీరాములు. సహించేవాడు కాదు. ఒక పర్యాయం హాస్టల్ పాలకవర్గంవారు జరుపుతున్న అక్రమ చర్యలను వసతిగృహదాత సంజీవశెట్టిగారికి తెలియజేశాడు. హాస్టల్ ధనాన్ని కొంత సంజీవశెట్టి బంధవు ఒకరు దుర్వినియోగం చేశారు. దీన్ని సవరించడం కష్టమైనా, తుదకు తన ఉద్యోగానికి ముప్పని తెలిసినా శ్రీరాములు ఊరకుండలేదు. విషయాన్ని సంజీవశెట్టి గారికి తెలిపాడు. ఆయన మాములుగా విని ఇంటికి వెళ్లాడు. బహుశ ఇంటి దగ్గర అతని బంధువు చేసిన దుర్బోధల ఫలితం కావచ్చు. రాత్రి పది గంటలకు సంజీవశెట్టి శ్రీరాములుని కొట్టడానికి కర్ర తీసుకొని వచ్చాడు. అతణ్ణి చూసి శ్రీరాములు చలించలేదు. మాములుగా చరఖాపై నూలు వడుకుతూ చిరునవ్వులు చిందిస్తూ కూర్చున్నాడు. శ్రీరాములును సంజీవశెట్టి వెంటనే హాస్టలు నుండి వెళ్లగొట్టాడు, ఆ రాత్రికి రాత్రి శ్రీరాములు మొగుళ్లపల్లి సత్రానికి బస మార్చాడు. తరువాత శ్రీరాముల తప్పులేదని తానే తొందరపడ్డానని సంజీవశెట్టి గ్రహించాడు.

పొట్టి శ్రీరాములు నెల్లూరులో హిందూ సంఘ సంస్కరణ సమితిని

ప్రారంభించాడు. దానిద్వారా రజస్వలానంతర వివాహాలు, విధవ వివాహాలు, కులాంతర, మతాంతర వివాహాలు, దిక్కులేనివారి దహన, ఖనన సంస్కారాలు మున్నగు కార్యక్రమాల నిర్వహించాడు.

నెల్లూరులో ఒక అనాధ ఆశ్రమం వుంది. దానికి నిధుల లోటు వుందని శ్రీరాములు గ్రహించాడు. వెంటనే శ్రీరాములు నాటి జిల్లా కలెక్టరు జోసఫ్‌రెడ్డి గారిని కలుసుకొని ఆ ఆశ్రమానికి కావలసిన శాశ్వితనిధులు సమకూరేలా ఏదైనా ఏర్పాటు చేయమని కోరాడు. అందుకు కలెక్టరు అంగీకరించాడు. శ్రీరాములును విశాఖపట్నం వెళ్లి అక్కడి ప్రేమ సమాజ కార్యక్రమాలను పరిశీలించి రమ్మని కలెక్టర్ పంపాడు. శ్రీరాములు వెళ్లి ఆ సమాజ కార్యక్రమాలను పరిశీలించి ముగ్ధుడయ్యాడు.

వీటిలో అనాధ ప్రేత సంస్కారాం అనేది పొట్టి శ్రీరాములును మిక్కిలిగా ఆకర్షించింది. విశాఖ నుంచి తిరిగి వచ్చిన శ్రీరాములు పై అంశాన్ని తమ సమితి లక్ష్యాల్లో ప్రధానంగా చేర్చాడు. అంతేగాక మరొక్క అడుగు ముందుకు వేశాడు. అనాధ ప్రేతాలను మోసుకొని వెళ్లడానికి బండిని ఏర్పాటు చేశాడు. ప్రేమసమాజం వారు ఈ అంశాన్ని మెచ్చుకొని, తాముకూడా అనుసరించారు. ఇంతకు పూర్వం అద్దె బండ్లను ఉపయోగించేవారు.

సంఘసేవకు అంకితం కావాలని శ్రీరాములు యువకులకు బోధించాడు. యువజనులంగీకరించి రక్తదానాది కార్యక్రమాల్లో సహకరించారు.

వివాహ సంస్కరణ విషయంలో పొట్టి శ్రీరాములు అమూల్యమైన సేవ చేశాడు. తన మిత్రుడైప డా॥ సుబ్బారావుకు వ్రాసిన లేఖలో ఇలా అన్నాడు. "డాక్టరుగా పని చేస్తున్న ఒక అందమైన యువతి ఉంది. ఆమె మధుర కంఠ స్వరంలో ప్రేమగా ఆకర్షణీయంగా మాట్లాడుతుంది. ఆమెకు ఒక సంబంధాన్ని చూడగోరుతాను. కులం సంగతి వదిలివెయ్యి. మన భాషను అర్థంచేసుకోవడానికి ఎలాంటి ఇబ్బంది లేదు".

పొట్టి శ్రీరాములు చేసిన మరొక వర్ణాంతర వివాహం చిరస్మరణీయమైంది. విశాఖ పట్టణంలోని ప్రేమ సమాజ సభ్యుడు చిప్పాడ సూర్యనారాయణ మూర్తి వరుడు, అనాధయైన మైత్రేయివధువు, ఆమె వ్యాధిగ్రస్తురాలు. ఎక్కువకాలం జీవించదని డాక్టర్లు చెప్పారు. వివాహం చేసుకొని ముత్తయిదువుగా కన్ను

మూయాలని తన కోరికగా ఆమె చెప్పింది. ఆ పరిస్థితుల్లో ఆమెను వివాహమాడటానికి ఎవ్వరూ ముందుకు రాలేదు. శ్రీరాములు ప్రోత్సాహంతో సూర్యనారాయణమూర్తి ఆమెను వివాహం చేసుకున్నారు. విధి విలాసం అనూహ్యమైంది. ప్రకృతి చికిత్సతో ఆమె కోలుకొన్నది. చాలాకాలం వైవాహిక జీవితాన్ని గడిపింది. తుదకు భర్త బిడ్డల ఎదుట అంతిమ శ్వాస వదిలింది. సూర్యనారాయణమూర్తి హైదరాబాదులో హైకో ఫ్యాబ్రిక్స్‌లో సెక్రటరీగా పని చేస్తున్నాడు. తన జీవిత విశేషాలను ప్రముఖ తెలుగు నవలా రచయిత్రి ముపాళ్ల రంగనాయకమ్మకు చెప్పి నవల వ్రాయమన్నాడు. ఆమె నవల వ్రాయడమేగాక చలనచిత్ర నిర్మాణానికి హక్కులు ఇచ్చింది. సినిమాలో కొన్ని విషయాలు వదిలి వేయబడ్డాయని హైకోర్టులో దావా వేశాడు. పొట్టి శ్రీరాములును గురించి ప్రకృతి చికిత్సను గురించి వదిలివేశారని ఆయన వాదించాడు. సూర్యనారాయణమూర్తికి నామమాత్రంగా పరిహారం చెల్లించాలని కోర్టు తీర్పునిచ్చింది.

* * *

# ఏడవ అధ్యాయము

# గాంధీజీ సేవాకార్యం

1947 ఆగస్టు 15న భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. వచ్చిన కొద్ది రోజుల్లోనే మహాత్మా గాంధీ, గాడ్సే చేత హత్య గావింపబడ్డాడు. (మహాత్ముని మరణానంతరం అతని సందేశాలను ఆచరిస్తున్నంత కాలము శాశ్వతంగా నిలిచిపోతాయి. పొట్టి శ్రీరాములు మహాత్ముని స్మారక చిహ్నంగా ఒక ప్రణాళికను అమలు పరిచే పనిలో నిలిచిపోయారు. హరిజన దేవాలయ ప్రవేశ విషయమై రాష్ట్ర ప్రభుత్వం చేసిన రెండు చట్టాల వల్ల శ్రీరాములు ఆశయాలు నెరవేరాయి. శ్రీరాములు మరొక ప్రజాసేవా కార్యక్రమాన్ని చేపట్టారు. 16-2-1948న ప్రొ.రంగా అధ్యక్షతన ఆంధ్ర రాష్ట్ర వర్కింగ్ కమిటీ ఈ తీర్మానాన్ని చేసింది. “మహాత్ముని స్మారక చిహ్నంగా మద్రాసు ప్రభుత్వం ప్రతి నెల 30వ తేదీన పీడిత సేవాదినంగా ప్రకటించి బాపూజీ ఆశయాలు కొనసాగేటట్లు చేయాలి. మంత్రులు, అధికారులు, నాయకులు అందరూ ఈ సేవా కార్యక్రమంలో పాల్గొనాలి’. జిల్లా సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు విజయవాడలో సంయుక్తంగా సమావేశమై తీర్మానాన్ని బలపరుస్తూ సంఘసేవా దినోత్సవం జరిపి కొన్ని సూచనలు చేశారు. ఈ సమావేశాలు మరల ఏప్రిల్ 7, 8, 9వ తేదీలలో పశ్చిమ గోదావరి జిల్లాలోని జోగన్న పాలెంలో జరిగినాయి. కమిటీ నిర్వాహకుడుగా పొట్టి శ్రీరాములు ప్రముఖ పాత్ర వహించారు. శ్రీరాములు సమస్యలను ఎదుర్కొనడంలో ఆకస్మిక ప్రతిచర్యలు చేస్తారు. గెలిచినా ఓడినా సమబుద్ధిని చూపేవారు. సమాజంలోని అత్యవసర సమస్యల విషయమై స్వీయ అభిప్రాయములను తెలుపుతూ రాష్ట్ర ముఖ్యమంత్రికి విజ్ఞాపన పూర్వకంగా లేఖ వ్రాశారు. “హరిజన్ టెంపుల్ ఎంట్రీ యాక్టు, హరిజన సివిల్స్ ఎబిలిటీస్ బిల్లు చట్టంగా రూపొందడానికి తాను 19 దినాలు నిరసన వ్రతం చేయడం వల్ల మంచి ఫలితాలు సాధించ బడ్డాయని, కాని ఈ పనికి సమర్థులైన కాంగ్రెస్ కమిటీవారు ఉత్సాహం చూపలేదని ఈ లేఖ సారాంశం.

శ్రీరాములు కాంగ్రెస్ వర్కింగ్ కమిటి సంఘ సంచాలకుడుగా 1947 డిసెంబరు నుండి ఆంధ్ర జిల్లాలో పర్యటించి ప్రభుత్వ చట్టాలు సరిగా గౌరవింపబడటం లేదని గ్రహించారు. చట్టం అమలు పరిచే ప్రయత్నంలో అగ్రవర్ణాల వారు ఇతరులను కొడుతున్నా ప్రభుత్వం పట్టనట్లుగా ఉండేది. దీనిని గూర్చి శ్రీరాములు రాష్ట్ర ముఖ్యమంత్రికి ఈ విధంగా తెలియపరిచారు "వార పత్రికలలోను, వ్యవసాయ పత్రికలలోను హరిజనులపై అత్యాచారాలు అన్న విషయాలు ప్రచురింపబడుతున్నాయి. కాని దానికి పరిష్కారము కనుగొనబడటం లేదు. పోలీసు వారు చర్య తీసుకోవడం లేదు. ఇప్పటికీ హరిజనులు బహిరంగ స్థలాలలో వెలివేయబడుతున్నారు. ఇక్కడ హరిజనుల్ని వెలివేస్తూ దక్షిణాఫ్రికాలో భారతీయుల్ని వెలివేస్తున్నారని నేరారోపణ చేసే హక్కు మనకు లేదు. శ్రీరాములు ఏ దశలో కూడా క్రియా శూన్య పరిస్థితిని సహించలేక పోయారు. గాఢ నిద్రలో ఉన్న అధికారులను మేల్కొలిపినారు. ఆంధ్రరాష్ట్ర గాంగ్రెస్ కమిటీ గాంధీ నిర్యాణ దినాన్ని సంఘసేవా దినంగా పరిగణించాలని కోరింది. తీర్మానం చేసినంత మాత్రమున మన బాధ్యత తీరదు. అని శ్రీరాములు ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. పొట్టి శ్రీరాములు గాంధేయ మార్గానికి విరుద్ధంగా ప్రవర్తించే మంత్రులను కూడా విమర్శించేవారు. శంఖుస్థాపన, సభలకు అధ్యక్షత వహించేటప్పుడు గాంధీ పేరును జపించే మంత్రులు ఆయాసందర్భాలలో హరిజనులకు జరుగుతున్న ఘోరాలను ఎందుకు పట్టించుకోరు? అని ఆలోచించి ప్రభుత్వం పట్టించుకుంటే గాని హరిజనుల సమస్యలు పరిష్కారం కావని శ్రీరాములు స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వం అలక్ష్యం చేస్తే విభిన్న పక్షాల తెగలు బలపడతాయనే అంశాన్ని స్పష్టం చేశారు. మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రికి వ్రాసిన లేఖలో ఈ విషయాన్ని స్పష్ట పరిచారు శ్రీరాములు. 30వ తేదీని సేవాదినంగా పాటింప చేయటం ప్రభుత్వానికి దుస్సాధ్యం కాదు. కాంగ్రెస్, ప్రభుత్వం యొక్క ప్రతిష్ఠ దీని వలన ఇనుమడిస్తుంది. ఈ విషయమై నిర్ణయం తీసుకొనక పోయినట్లయితే తాను నిరాహార దీక్షకు పూనుకొంటానని స్పష్టం చేశారు.

గాంధీ మెమోరియల్ స్కీమును గూర్చి తన అభిప్రాయాలను సమర్థించమని గాంధీజీ అనుచరులైన ఎ.వి. ధక్కర్, డా॥ రాజేంద్రప్రసాద్, కె.జి. మష్రూవాలా, ఆచార్య వినోభాబావే, నారాయణ్‌దాస్ గాంధీ, యన్.జి. రంగా. యన్.ఆర్.

గుప్తా మొదలగు వారిని సంప్రదించినారు గాంధీజీ అనుచరులలో చాలా మంది శ్రీరాములు అభిప్రాయాలను బలపరుస్తూ ఆయనను విమర్శించారు.

కిషోర్‌లాల్ మష్రూవాలాకు ఎ.వి. ధక్కర్ వ్రాసిన లేఖలో ఈ విధంగా తెలియపరిచారు. శ్రీరాములు వ్యక్తిత్వాన్ని ప్రశంసిస్తూ "ప్రతి నెల 30వ తేదీన సేవాదినంగా పాటింప చేయడం మద్రాసు ప్రభుత్వం శక్తికి మించిన పని అవుతుంది. కనుక శ్రీరాములుకు దీనికై నిరసన దీక్ష చేసే అవసరాన్ని కల్పించకూడదు. అందువల్ల వచ్చే జనవరి 30ను సక్రమంగా సంఘ సేవాదినాన్ని జరిపే ఆలోచన చేయండి" శ్రీరాములకు మష్రువాలాకు రాసిన లేఖలో మద్రాసు ప్రభుత్వం త్వరగా మీ సూచనలను అమలు జరుపక పోయినట్లయితే నిరాహార దీక్ష చేయవలసి వస్తుందని హెచ్చరించడం అంత ప్రయోజనకారి కాదు. అంటరానితనాన్ని నిర్మూలించడానికి వ్యతిరేకిస్తూ, కులతత్వాన్ని ప్రభుత్వం బలపరచినపుడు మాత్రమే నిరాహార దీక్ష చేయడం అవసరం. అని తెలిపారు. శ్రీరాములు మష్రూవాలాకు 'సంఘం సంస్కరణ చేయడం ప్రభుత్వ విధి. ప్రభుత్వంలో ఉన్నవారు దీనిని స్వప్రయోజనాలకై చేస్తారు. దీనికై సంఘ సేవకులు సకాలంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినపుడే సాధ్యమవుతుంది. కేవలం చట్టం చేయడం వలన ప్రయోజనం లేదు. వానిని ఆచరణలో పెట్టాలి' అని జవాబు వ్రాశారు. గాంధీజీ అనుచరులుగా ఉన్నవారు ఎవరూ కూడా తనను అర్థం చేసుకోవడం లేదని శ్రీరాములు భావిస్తు గాంధీజీ మెమోరియల్ స్కీమును మద్రాసు ప్రభుత్వాన్ని అమలు జరిపేటట్లు చూడమని, అట్లు కాని పక్షంలో తాను ఉపవాస దీక్ష చేయడం తప్పదని మష్రూవాలాకు శ్రీరాములు వ్రాసిన లేఖలో స్పష్టపరిచారు.

అస్పృశ్యత మొదలగు సాంఘిక దురాచారాలు నిర్మూలించడానికి శ్రీరాములు చేపట్టిన కార్యక్రమాలు జాతీయ స్థాయిలో ఖ్యాతిని పొందినాయి. అతని మనోధైర్యాన్ని నాయకులు గుర్తించారు. కాని నాయకులు రాష్ట్రమంతా కాకుండా సంస్కరణ ఉద్యమాన్ని ఏదో ఒక గ్రామం నుండి ప్రారంభించమని, కార్యోత్సాహం ఉన్నాకాని అందుకు ప్రభుత్వం సరియైన సహకారాన్ని ఇవ్వలేదని. కాబట్టి మద్రాసు ముఖ్యమంత్రికి తెలిపినా ప్రయోజనం ఉండదని, తొందరగా నిరాహర దీక్ష ప్రారంభించవద్దని తెలుపుతూ ఉత్తరాలు రాశారు. ప్రముఖ గాంధేయవాదులతో

ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడం వల్ల సమస్య మరింత కష్టతరమైనదని శ్రీరాములు భావించినారు. ప్రతికూల వాతావరణం ఉన్నప్పటికీ తాను నమ్మిన ధ్యేయం కోసం ఏకాకిగా పోరాడటానికి నిశ్చయించినారు. 25-7-1948 మద్రాసు ముఖ్యమంత్రికి. తాను ఉపవాస దీక్ష ప్రారంభించనున్నట్లు లేఖ వ్రాశారు. తన ఆశయాలకు చేయూత నీయవలసిందిగా ప్రముఖ గాంధేయ వాదులందరినీ అర్థించినారు. అందరూ శ్రీరాములు లక్ష్యం పవిత్రమైనది కాని మార్గం మాత్రం అపవిత్రము అనే భావనను వ్యక్తీకరించినారు. నిరాహార దీక్ష ప్రారంభించిన తరువాత చేయూత నిస్తామనిన వాళ్ళెవరూ ముందుకు రాలేదు. హరిజన శాసన సభ్యులు కూడా ఇందుకు తోడ్పడలేదు. చివరకు శ్రీరాములును న్యూసెన్సు కేసు క్రింద అరెస్టు చేసినారు. జైల్లో కూడా వారం రోజులు దీక్ష కొనసాగించగా పరిస్థితులు విషమించిన సమయంలో అన్నం తినమని నిర్బంధించినారు. దీక్ష విరమించడమే మంచిదని ఆ పరిస్థితిలో దీక్ష విరమించినారు. అనుకూలమైన పరిస్థితులలో ఈ విషయంపై ప్రభుత్వం పై ఒత్తిడి తేవడానికి శ్రీరాములు సిద్ధపడ్డారు. శ్రీరాములు దృష్టిలో జయాపజయాలు సమానము. శ్రీరాములు చిమన్లాల్ మొదలైన సేవాగ్రామం ఆశ్రమ వాసులకు తన కార్యక్రమాల పట్ల కలిగిన అపోహలను తొలగించడానికి ప్రయత్నించినారు. తన లక్ష్యసాధనకై తగిన మార్గం సూచించ కుండా తనను విమర్శిస్తున్నందుకు బాధపడినారు. నాయకులందరు సహకరిస్తే నిరాహార దీక్షతో పనిలేదని, రాజేంద్ర బాబును పదవీకాలం ముగియక ముందే సంప్రదించవలసిందని చిమన్‌లాల్ రాసిన లేఖలో శ్రీరాములు తెలిపారు. శ్రీరాములు సహజంగా ధైర్యోత్సాహాలు కలవారు. శ్రీరాములు జైలు నుండి విడుదలైన తరువాత రెండు మాసాలు నెల్లూరులో ఉన్నారు. ఈ కాలంలో ప్రముఖ రాజకీయ నాయకులందరితో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపారు. ప్రయత్నాలు ఫలించకపోవటంతో లక్ష్యాన్ని సాధించడమో లేక మరణించడమో అనే నిర్ణయానికి వచ్చారు. ఉపవాస దీక్షకు ఆశ్రమాన్ని ఎంచుకున్నారు. దృఢ సంకల్పంతో 12-1-1949 నుండి దీక్ష ప్రారంభిస్తున్నట్లు ప్రకటించినారు. రాజేంద్రప్రసాద్ శ్రీరాములు పై కనికరం కలిగి మద్రాసు ముఖ్యమంత్రికి లేఖ వ్రాశారు. హరిజనులకు దేవాలయాలలో ప్రవేశం కల్పిస్తూ ప్రభుత్వం చేసిన చట్టాలను ఆచరణలో పెట్టవలసిందని శ్రీరాములు కోరుతున్నట్లు,

దానికి సహకరించమని లేఖలో పేర్కొన్నారు. ఉపవాస దీక్షను మానమని లేకపోతే వినోభా అనుమతితో చేయమని రాజేంద్ర ప్రసాద్ సూచించారు. వ్యర్థమైన సలహాల నిస్తున్నందుకు శ్రీరాములు ఆశ్రమ వాసుల ధోరణికి విసుగు చెందినారు. తుదివరకు ఆశయసాధనకై ఆత్మార్పణకు కూడా సిద్ధమని చిమన్‌లాల్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఆశ్రమ వాసులు ఉదాసీన భావంతో ఉంటే తన దీక్షకు చిక్కులు కలుగుతాయని భావించి శ్రీరాములు తన లక్ష్యసాధనకై దేనికైనా సిద్ధపడినారు. నిర్ణయించిన పథకం ప్రకారం శ్రీరాములు సేవాగ్రాం ఆశ్రమ ప్రాంగణంలో 12-1-1949న దీక్ష ప్రారంభించవలసి ఉంది. కాని యాజమాన్యం వారు సహకరించనందువల్ల దీక్షవహించలేదు. స్థితప్రజ్ఞా సిద్ధాంతాన్ని జీర్ణించుకొన్న పొట్టి శ్రీరాములు తన ఆశయాలను. మేనల్లుడికి రాసిన లేఖలో స్పష్టం చేశారు. తాను నిరసన దీక్ష ప్రారంభించదలచినట్లు తన ఆశయాలు తన జీవిత కాలంలో నెరవేరకపోవచ్చని అయినప్పటికి తన ప్రయత్నం అమూల్యమైనదని తెలిపారు. ప్రజలకు సంబంధించిన విషయంలో ఫలితమనేది. కృషిని సాగించే వ్యక్తిపై అతని సామర్థ్యంపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. గాంధీజీకి ఎంతో ఇష్టమైన ఈ కార్యక్రమం ఎవరి అనుకూలతలకు లోను కానవసరం లేదని భావించినారు. 11-1-1949న పొట్టి శ్రీరాములు దీక్షకు అనుమతించవలసిందని ఆశ్రమ యాజమాన్యాన్ని కోరినారు దీక్షకు విజయం లభించకపోయినా ఆవేశానికి లోను కావద్దని సలహా ఇచ్చినారు.

సేవాగ్రాం ఆశ్రమ ప్రాంగణంలో 12-1-1949 మధ్యాహ్నం 12 గంటలకు శ్రీరాములు తన దీక్షను ప్రారంభించారు. తన దీక్ష్యా లక్ష్యాన్ని "అంటరాని తనాన్ని తొలగించడానికి ప్రభుత్వము ప్రజలు కలసి కృషి చేయాలి హరిజనులు బహిరంగ స్థలాలను వాడుకునేటట్లు చేయాలి." అని ప్రకటించినారు. శ్రీరాముల మేనల్లుడు యన్.ఆర్. గుప్త జనవరి ఒకటి పదహారు తేదీలలో శ్రీరాములుకు రాసిన లేఖల్లో ఆయన ఉత్తమ లక్ష్యాన్ని ప్రశంసించినారు. పొట్టి శ్రీరాములకు ఆశలు ఉన్నా భ్రాంతి లేదు పరిస్థితులకు అనుగుణంగా నడిచేవారు. అతని కృషి రాజకీయ రంగంలో సంచలనాన్ని రేపింది. శ్రీరాములు తలపెట్టిన ఉద్యమం సరైనదని దానికి తన సహకారం ముఖ్యమని మష్రూవాలా భావించి మద్రాసు ముఖ్యమంత్రితో ఉత్తర ప్రత్యుత్తరాలు ప్రారంభించాడు. హరిజనోద్ధరణ

విషయంలో మద్రాసు ప్రభుత్వం ఒక పథకాన్ని రూపొందించి దానికి ఒక సంఘాన్ని నియమించిన అది నిలిచిపోయిందని ఆ సంఘపు సిఫార్సులనే కార్యరూపంలో పెటాల్టని శ్రీరాములు కోరుతున్నారని ప్రస్తుతం ముఖ్యమంత్రి కాని దీనికి చెందిన మంత్రి కాని శ్రీరాములు దీక్ష విరమించాలని వార్త పంపాలని అతను కోరిన కార్యాన్ని అమలుపరుస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినట్లయితే దీక్ష విరమింపచేసే ప్రయత్నం తాను చేస్తానని మష్రూవాలా ముఖ్యమంత్రికి వ్రాసిన లేఖలో తెలిపారు. శ్రీరాములు ప్రతీకార వాంఛలేనివారు. ప్రముఖ హరిజన సేవాకార్యకర్త రాజకీయాలకు అతీతులు శ్రీరాములు ఆచార్య రంగాకు రాసిన లేఖలో తాను దీక్షకు పూనుకొన్న స్థితులు వివరించినారు పౌరులుగా హరిజనులకు కల హక్కులను అమలుపరిచే విషయంలో ప్రభుత్వం చేత సరైన చట్టాలు చేయబడలేదు వారికి జరిగే అన్యాయాలను చూస్తూ జీవించడం కన్న వారికి న్యాయం జరిగేటట్లయితే దానికై తాను ఆత్మార్పణకు సిద్ధ పడతానని అభిప్రాయ పడినారు. శ్రీరాములు లక్ష్యం నెరవేరనిదే తృప్తి పడేవారు కాదు. 4-2-1949న మష్రూవాలాకు రాసిన లేఖకు ప్రభుత్వం శ్రీరాములు కోరికలను ఆమోదిస్తామని తెలిపింది. ముఖ్యమంత్రి కూడా పొట్టి శ్రీరాములు జీవితం కాపాడాలంటే అతని కోరికను అంగీకరించడం మంచిదని భావించినారు. అతని కోరికలను ఆమోదిస్తున్నట్లు ముఖ్యమంత్రి మష్రూవాలాకు టెలిగ్రాం పంపించినారు. దానికి ఆనందించి కృతజ్ఞతలు తెలుపుతూ శ్రీరాములు దీక్షను వినోభా ఎదుట విరమించినట్లు ఒ.పి.ఆర్. రెడ్డియార్‌కు తెలిపినారు. తన లక్ష్యం నెరవేరినందుకు శ్రీరాములు ఆనందాన్ని పొందినారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ ఈ విధంగా జాబు వ్రాసినారు. "మద్రాసు రాష్ట్రంలో ప్రతి గ్రామంలో కూడా వచ్చే గాంధీ వర్ధంతి నాటికి అస్పృశ్యత అంతరించిపోతుందని భావిస్తున్నాను. దీనికి కార్యకర్తలు, ప్రజలు, కమిటీలు పరస్పరం సహకరించు కోవాలి". హరిజన పత్రిక సంపాదకుడు మష్రూవాలా 20-2-1949 సంచికలో సంతోషకరమైన దీక్షా విరమణ అనే శీర్షికతో రాసిన వ్యాసంలో ఈ అంశాలు ఉన్నాయి.

ఉపవాస బాధ తగ్గి శక్తిని పొందడానికి తేనె స్వీకరించమని శ్రీరాములును ఆశ్రమవాసులు బలవంతం చేశారు. తేనె స్వీకరించడంతో ఆయన దీక్ష

ముగిసింది. శ్రీరాములు సాధించిన లక్ష్యం వెనుక మష్రూవాలా ముఖ్యమంత్రి మొదలగు ప్రముఖులతో జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలే ప్రధాన కారణమని చెప్పవచ్చు. ఈ విజయం గూర్చి సంఘసేవకులకు తెలియ చేస్తూ మష్రూవాలా వారి సహకారాన్ని అర్థించినారు.

"శ్రీరాములు లక్ష్యం ప్రకారం ప్రభుత్వం చేపట్టిన సంఘ సేవా కార్యక్రమానికి పూర్తి సహకారమివ్వాలి. ఈ పని ఒక సం॥లో జరిగినట్లయితే హరిజనుల ప్రస్తుత సమస్యలన్నీ అంతరిస్తాయి. తరువాత సాంఘిక సేవావసరం ఉండదు. అపుడు హరిజనులు భారత దేశంలో వెనుక బడిన పేదరికం అనుభవిస్తున్న జాతులలో ఒక జాతిగా ఉంటారు'.

పొటి శ్రీరాములు దీక్ష విజయవంతంగా ముగిసింది. మద్రాసు ప్రభుత్వం ప్రతి నెల 30వ తేదీ హరిజన సేవాదినంగా ప్రకటిస్తు ఉత్తర్వులు జారీ చేసింది.

* * *

## ఎనిమిదవ అధ్యాయం

# నిర్మాణాత్మక సేవాకార్యం

గాంధీజీ సిద్ధాంతాలు సంఘ సంస్కరణ ఉత్సాహాన్ని కలిగించేవిగా ఉన్నాయి, తన సిద్ధాంతాలను పొందుపరుస్తూ నిర్మాణాత్మక కార్యక్రమాన్ని రూపొందించినారు. గాంధీజీ మార్గదర్శక సూత్రాలుగా 18 అంశాలు తెలిపినారు. 1944 నుండి గాంధీజీ సిద్ధాంతాలను అనుసరిస్తున్న శ్రీరాములు నిర్మాణాత్మక కార్యక్రమాన్ని అమలుపరచడానికి ఏకాకిగా పోరాటాన్ని సాగించసాగినారు. శ్రీరాములు నిరాహార దీక్షను సాగించి సాధించిన విజయాలను చూచి గాంధేయవాదులు అతని మనోధైర్యాన్ని గుర్తించినారు. 1947 నవంబర్‌లో ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ నిర్మాణ కార్యక్రమ సంచాలకుడుగా నియమించబడినారు. పదవీ కాలంలో ఆంధ్ర రాష్ట్ర జిల్లాల నన్నింటినీ పర్యటించినారు. 48లో అనేక దేవాలయాలలో హరిజనులను ప్రవేశ పెట్టినారు. శ్రీరాములు 18-4-1948 ఉదయం పెద్ద చెరుకూరు గ్రామంలోని చంద్రశేఖరాలయానికి కొందరు ప్రముఖ కార్యకర్తలు, హరిజన నాయకులతో వెళ్ళినారు. గుడి తలుపులు మూయడం వల్ల బయట కూర్చున్నారు. ఆలయ ధర్మకర్త, గ్రామస్థులు శ్రీరాములును చుట్టుముట్టి అసభ్య పదజాలంతో నిందించినారు. హరిజనులను చంద్రమౌళీశ్వర స్వామి సన్నిధికి చేర్చి పూజకు అనుమతించమని ధర్మకర్తను కోరినారు. ధర్మకర్త తిరస్కరించి గ్రామస్థులను శ్రీరాములపై దాడికి పంపినారు. హరిజనులకు దేవాలయ ప్రవేశం లభింపలేదు. శ్రీరాములు నెల్లూరు సర్కిల్‌కు ఈ విధంగా అభియోగం పంపినారు. "నేరస్థులపై కఠిన చర్య తీసుకోవాలని చంద్రమౌళీశ్వర ఆలయంలో హరిజనులు పూజలు జరిపే కార్యక్రమానికి నాయకత్వం వహించుటకు తగిన బందోబస్తు కల్పించవలసింది".

ప్రభుత్వం ప్రతి నెల 30వ తేదీని హరిజన సేవాదినంగా ప్రకటించినందుకు శ్రీరాములుకు నూతనోత్సాహం కలిగింది. శ్రీరాములు కనుపూరు ఫిర్కాలో హరిజనోద్ధరణ కార్యక్రమంలో సంచారం చేస్తున్నపుడు తగిన సహకారం

ఇవ్వవలసిందని కలెక్టరు మలయప్పన్ సంబంధిత అధికారులకు ఉత్తర్వులు జారీ చేయించినాడు. ఫిర్కాలో జరిపిన ఈ సంచార కార్యక్రమం పది గ్రామాలకు పరిమితమై ఏప్రిల్ 5, 7 తేదీలలో ముగిసింది. తాము ఏప్రిల్ 7వ తేదీ కనుపూరు గ్రామాన్ని సందర్శించిన సమయంలో సవర్ణ హిందువులు ఆ ఊరి వారు తమకు సహకరించలేదని శ్రీరాములు బృందం నెల్లూరు అసిస్టెంటు కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. పొట్టి శ్రీరాములు మునుముందు జరుపబోయే పర్యటనలకు ఆటంకాలు లేకుండా కలెక్టరు ఏప్రిల్ 15 వరకు పోలీసు రక్షణ కల్పిస్తూ ఆదేశాలు జారీ చేశారు. 13-4-1949 నాటి ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలో సవర్ణ హిందువులు ప్రతిఘటన ఫలితంగా శ్రీరాములు అతని సభ్యులు కనుపూరు ఫిర్కాలో హరిజన దేవాలయ ప్రవేశ కార్యక్రమాన్ని విరమించుకొన్నట్లు తెలుస్తున్నది అనే అసత్యపు వార్త ప్రకటించబడింది. వెంటనే పొట్టి శ్రీరాములు ఈ వార్తను ఖండిస్తూ పత్రికా సంపాదకునికి లేఖ వ్రాశారు. ఫిర్కాలో మేము చేపట్టిన హరిజన దేవాలయ ప్రవేశ కార్యక్రమం విజయవంతమైంది. కనుపూరులో మాత్రము కొందరు వ్యతిరేకుల వల్ల కొంత కాలయాపన జరిగింది. పవిత్రలక్ష్యం కోసం చేపట్టే ఈ కార్యక్రమం మధ్యలో వదలివేసే ఉద్దేశం లేదు. సత్యమైన ఈ సమాచారాన్ని ప్రచురించవలసింది" శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టరకు తన పర్యటనను గూర్చి నివేదికను ఈ విధంగా తెలియపరచినారు. "మా సంచార కార్యక్రమము విజయవంతంగా ముగిసింది. సంచరించిన ప్రదేశాలలో హరిజనులు దేవాలయ ప్రవేశం చేశారు. కాని కొన్ని గ్రామాలలో సవర్ణులను చూచి హరిజనులు భయపడుతున్నారు. గ్రామాధికారుల సహకారం లేకపోవడం వల్ల కనుపూరులో ఇబ్బంది కలిగింది. ఫిర్కా డెవలప్‌మెంట్ ఆఫీసరు, విలేజీ డెవలప్‌మెంటు ఆఫీసరు, ఈ ఉద్యమానికి వ్యతిరేకంగా ఉన్నారు." చాలా మంది గ్రామాధికారుల సహకారం లభించలేదు ఉత్సాహాన్ని పెంపొందించి ఫిర్కాలు అభివృద్ధిపరిచే విషయమై శ్రద్ధ వహించవలసిందిగా కోరుతున్నాను."

ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం మొదటి హరిజన సేవాదినం 1949 మార్చి 30న జరిగింది. ప్రభుత్వ ఉత్తర్వు శ్రీరాములు పథకాన్ని అనుసరించి నెల్లూరు కలెక్టర్ మలయప్పన్ శ్రీరాములు బృందం ఫిర్కాలో పర్యటించడానికి విస్తృత కార్యక్రమం ఏర్పాటు చేశాడు నిర్మాణాత్మక కార్యక్రమ సంచాలకుడుగా శ్రీరాములు

సేవాదినాన్ని విజయవంతం చేసే ఉత్సాహంలో ఉన్నారు. రాష్ట్రీయ ఫిర్కా డెవలప్‌మెంట్ ఆఫీసరుకు తన పర్యటన కార్యక్రమ నివేదికను పంపుతూ కార్యక్రమాన్ని మరింత శక్తివంతం చేయడానికి తగిన సూచనలను ఇచ్చినారు. మార్చి 30వ తేదీ హరిజన దినం శ్రద్ధాసక్తులతో మలయప్పన్ గారి కృషివల్ల సంపూర్ణ విజయాన్ని సాధించింది. అని శ్రీరాములు అభిప్రాయపడినారు. ఆంధ్రా ప్రొవెన్షియల్ బోర్డు హరిజన సేవా సంఘానికి అధ్యక్షుడైన బి.యస్. మూర్తికి 27-4-1949న లేఖ వ్రాస్తూ రాష్ట్ర వివిధ ప్రాంతాలలో హరిజనులు పడుతున్న కష్టాలను తెలిపినారు.

కులాంతర విందులను నిర్వహించడానికి భాధ్యతగల ఏదైన ఒక సంఘం పూనుకోవాలి. అందుకు తగిన ఏర్పాట్లు చేసే ఆ కలెక్టర్‌కు తృప్తి కలిగించాలి. విందుకు కావలసిన ఆహార పదార్థాలను విందులో పాల్గొనే సభ్యుల నుండి సేకరించాలి. మిగిలిన పదార్థాల కొనుగోలుకు కలెక్టరు నుండి పర్మిషన్ పొందాలి. కనుపూరులో శ్రీరాములు జరిపిన హరిజనోద్ధరణ కార్యక్రమం తరువాత 27-5-1949న నెల్లూరు కలెక్టరు ఆఫీసులో హరిజన దినం ఉప సంఘంవారి సమావేశం జరిగింది. ఉప సంఘ సభ్యులు కొన్ని వర్గాలుగా ఏర్పడి హరిజనోద్ధరణ నాయకులతో కలిసి తరచుగా దేవాలయాలను సందర్శిస్తు హరిజనులకు దైవ దర్శనం కలిగించాలని ఆ సమావేశంలో నిర్ణయించబడింది. వివాదాస్పదంగా ఉన్న దేవాలయాన్ని 30-5-49న హరిజనులు పూజ చేసుకోవడానికి వీలుగా తలుపులు తెరచి ఉంచే ఏర్పాట్లు చేయాలని కలెక్టరు అసిస్టెంటు కమీషనరును ఆదేశించాడు. ఆ రోజు హరిజనులు ఎలాంటి ఆటంకం లేకుండా పూజలు జరుపుకోవడానికి ఆయా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వబడినాయి. 26-6-49న నెల్లూరు కలెక్టరు ఆఫీసులో హరిజన దినోత్సవ సంఘం సమావేశమై ప్రతి నెల జరుపబోయే హరిజన దినోత్సవంపై కొన్ని తీర్మానాలను ఆమోదించింది. హరిజన్ దినం నాడు దేవాలయాలనన్నింటిని ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు తెరచి ఉంచాలని, దైవ దర్శనానికి వచ్చే హరిజనులకు స్వాగతమివ్వాలని ధర్మ కర్తలను జిల్లా కలెక్టరు కోరారు. సంఘసేవా కార్యకర్తల వెంట ఉండి తగిన సహకారమివ్వవలసిందిగా ఆయా ప్రాంతాలలోని ఉపాధ్యాయులను విద్యాశాఖాధికారి కోరినారు. రోజులు గడచిన కొద్దీ శ్రీరాములు

చేసిన కృషి అధికార వర్గాలలో, అనధికార వర్గాలలో అద్వితీయమైనదిగా గుర్తించబడింది. హరిజనులకు ఎక్కువ సౌకర్యాలను కలిగిస్తూ ప్రభుత్వం దేవాలయ చట్టాన్ని సవరించింది. మద్రాసు శాసనసభ చివరి సమావేశంలో ఆమోదించిన పశ్చిమ గోదావరి జిల్లా చట్టం కూడా గవర్నర్ జనరల్ ఆమోదాన్ని పొంది 1-7-1949 నుండి అమలులోకి వస్తుందని నిర్ణయింపబడింది.

శ్రీరాములుతో అలోచించి నెల్లూరు విద్యాధికారి వయోజన విద్యా ప్రచార గోష్ఠిని నెల్లూరులో ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులకు తగిన శిక్షణా తరగతులు కూడా నిర్వహించారు. నిర్మాణాత్మక కార్యక్రమ సంచాలకుడుగా శ్రీరాములు ఈ విజయాన్ని దేశం మొత్తం మీద సాధించాలని కోరినారు. కాని సంఘసేవా కార్యకర్తలు మౌనంగా ఉండిపోయినారు. 21-7-1949న రాష్ట్ర హరిజనోద్ధరణ మంత్రి శ్రీ బి. పరమేశ్వరన్కు ఇలా లేఖ వ్రాశారు.

మద్యపాన నిషేదం, హరిజనులు అసౌకర్యాలను తొలగించుటకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టింది. నెల్లూరులో ఈ కార్యక్రమం కలెక్టరు మొదలగువారి సహకారంతో అద్భుత ప్రగతిని సాధించింది. మీ సహకారం ఉన్నట్లయితే 2-10-1949ని గాంధీ జయంతిని అఖిల భారత హరిజన పాటింపచేయుటకు పూనుకుంటామని తెలుపుతున్నాము.” హరిజన దిన కార్యక్రమాలలో పాల్గొంటూ శ్రీరాములు విశ్రాంతి లభించినపుడు వివిధ నిర్మాణాత్మక కార్యక్రమాలను నిర్వహించేవారు.

21-9-1949 నెల్లూరులోని ప్రముఖ వ్యాపారి కన్నయ్య శెట్టి హరిజన పాలెంలో బావి త్రవ్విస్తానని వాగ్దానం చేశాడు. ఇనుము, సిమెంటులకు పర్మిట్లు దొరకలేదన్న మిషతో పని చేయడంలో ఆలస్యం చేయసాగాడు. పొట్టి శ్రీరాములు తహసిల్దారుతో సంప్రదించి పర్మిట్లు మంజూరైనట్లు తెలుసుకొని కన్నయ్య శెట్టిని హెచ్చరిస్తూ హరిజనులకు అన్యాయం జరిగితే తాను సహించనని చెప్పారు.

సబర్మతి ఆశ్రమం మాజీ కార్యదర్శి అయిన నారాయణదాసు గాంధీకి ఖాదీ ఉద్యమంలో గల లోపాలను సవరించడానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసారు. డా. రాజేంద్రప్రసాద్ గారికి అతని ఆశీస్సుల వల్ల రాష్ట్ర ప్రభుత్వం - ప్రతి నెల 30వ తేదీ హరిజన దినంగా పాటింపచేయుటకు తాను చేసిన కృషిని సాధించిన విజయాలను వివరంగా వెల్లడించినారు. హరిజనోత్సవ కార్యక్రమాలను

వివరిస్తూ భారత రాష్ట్రపతికి పొట్టి శ్రీరాములు లేఖ వ్రాసారు. ప్రభుత్వాధికారుల సాంఘిక సేవా కార్యక్రమాలలో మామూలుగా పాల్గొంటున్నారు గాని చిత్తశుద్ధితో పని చేయటం లేదన్న విషయాన్ని గమనించి ఇలా ఆలోచించినారు.

ప్రస్తుతం భారతదేశ స్థాయిలో ఎన్నో కార్యక్రమాలు జరపబడుతున్నా ఈ కార్యక్రమాన్నింటిని ప్రభుత్వ అధికారులే నిర్వహించాలి. కాని వాళ్ళు ఈ విషయాలను పట్టించుకోరు. అన్ని కార్యక్రమాలను కలిపి సర్వోదయదినం జరిపినట్లయితే ఎక్కువ ప్రయోజనం చేకూరుతుంది. ప్రతి రంగానికి చెందిన నిర్మాణాత్మక కార్యక్రమాలను ఆ రోజు ప్రారంభించాలని ఇట్లు చేసినట్లయితే అందరూ కలసి కొంత నిజమైన కృషి చేసే అవకాశం ఉంటుంది. సేవాగ్రాం ఆశ్రమంలో ధనరూపేణ కానుకలను స్వీకరించటం అవి ప్రజలు రోజు ఐదు నిమిషాలు నూలు వడకి ఇచ్చిన దారాన్ని మాత్రమే కానుకలుగా స్వీకరించాలని నారాయణదాస్ చెప్పిన సూచన చాలా శక్తివంతమైనదని శ్రీరాములు భావించినారు. ఈ సూచన క్రియాశూన్యంగా వ్యవహరించే వారికి ఒక అగ్ని పరీక్ష అయింది. నెల్లూరు కలెక్టరు మలయప్పన్ చాలా నిజాయితీపరుడు. అతడు కూడా రోజు నూలు వడుకుతాడు. జాతిపిత గాంధీజీ దీనిని పవిత్రకార్యంగా ఉద్దేశించారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిరోజు 5 నిమిషాలు ప్రభుత్వ కార్యాలయంలో ప్రవేశ పెట్టాలి. ఎవరినీ బలవంతం చేయకుండా ఎవరికి వారే ఈ కార్యక్రమానికి పూనుకొనేటట్లు చేయాలి. పండిత నెహ్రూ మార్గదర్శకులుగా ఉంటే ప్రతి ఇంట్లో కూడా ఈ కార్యక్రమం అమలు జరుగుతుంది. "ప్రతి నెల జరిగే సర్వోదయ దినోత్సవ కార్యక్రమ అంశాలలో దీనిని కూడా ప్రవేశ పెట్టాలని శ్రీరాములు కోరినారు. నిర్మాణాత్మక కార్యక్రమ సంచాలకుడుగా వ్యక్తిగతంగా ఎక్కువ అనుభవం గడించిన శ్రీరాములు సర్వోదయదినం నాడు పాటించవలసిన సూచనలను 1 అస్పృశ్యత నిర్మూలన, 2. సూత్రయజ్ఞం, 3. వినోద కార్యక్రమాలు, 4. బహిరంగ సభలు మొదలగునవిగా చేసినారు. శ్రీరాములు రాష్ట్రపతికి ప్రతినెల 30వ తేదీన అఖిలభారత సర్వోదయ దినంగా ప్రకటించడం మీకు సాధ్యమేనని భావిస్తున్నాను. ఆనాటి ఉత్సవ కార్యక్రమంలో ప్రభుత్వంలోని వివిధ శాఖాధిపతులను నిర్బంధంగా పల్గొనేటట్లు చేసి కొంత యదార్థ శక్తిని కొనసాగించేటట్లు చేయవలసింది' అని విజ్ఞప్తి చేశారు.

## గాంధీ స్మారక నిధి సంచాలకుడు

బాపూజీ తెలిపిన నిర్మాణ కార్యక్రమాన్ని అన్నిచోట్ల విస్తరింపచేయడానికి గాంధీ స్మారక నిధి పేరుతో ధనాన్ని సేకరించాలని భారత రిపబ్లిక్ జాతీయ నాయకులంతా నిర్ణయించారు. ఫలితంగా జి.వి. మేలంకర్ అధ్యక్షుడిగా ట్రస్టు బోర్డు ఏర్పడింది. దేశ వ్యాప్తంగా ధనాన్ని సేకరించడం అసాధారణ విషయం కనుక ప్రతి రాష్ట్రంలో సంఘ సేవకులను సంచాలకులుగా నియమించారు. ఆంధ్ర రాష్ట్రానికి చెందిన గాంధీ స్మారక నిధి సంఘానకు ప్రొ. రంగా చైర్మన్‌గా నియమితులయ్యారు. స్మారక నిధి కేంద్ర కార్యాలయం వారు ఈ ప్రణాళికలో నిర్వహించవలసిన కార్యక్రమాలను వాటికి ఖర్చు చేసే విధానాలను గూర్చి కొన్ని మార్గదర్శక సూత్రాలను సూచించారు. ఈ సూత్రాల పరిస్థితికి లోబడి సంచాలకులు తమ పథకాలను, బడ్జెటులను తయారు చేసుకోవాలి. సంచాలకుడుగా పదవిని స్వీకరించిన పొట్టి శ్రీరాములు తన పనులను కొనసాగించారు. నిర్మాణ కార్యక్రమ సంచాలకుని హోదాలో రాష్ట్రమంతా సంచరించిన అనుభవం అతనికి ఉపయోగపడింది. శ్రీరాములు నిస్వార్థపరులు. అవకాశం ఉన్నా ఒక పేదవానిగా మాత్రమే జీవించారు. పొదుపును పాటించారు. సంచాలకుడుగా శ్రీరాములుకు 150రూ. జీతం ఉన్నా అతడు తనకు కావలసినంత వరకే తీసుకునేవారు. ఒక పూట భోజనం, ఖాదీ లుంగీ, టవల్, మూడవ తరగతి ప్రయాణ ఖర్చులు. ఇవి మాత్రమే అతని అత్యవసరాలు అవసరానికి మించిన ధనాన్ని శ్రీరాములు తిరస్కరించేవారు. ఒకసారి నెల్లూరు జిల్లా కరపూరు ఫిర్కాలోని ఒక గ్రామంలో ఒక వెల్ఫేర్ కమిటీ సమావేశానికి సభ్యుడుగా హాజరయినందుకు అతని ప్రయాణపు ఖర్చు కోసం 16-8-0 రూ॥ మంజూరు కాగా అతనికి వాస్తవంగా ఖర్చు అయినది 1-8-0 మాత్రమేనని అంతే పంపవలసిదిగా శ్రీరాములు కలెక్టరుకు లేఖ వ్రాశారు. నిస్వార్థమూర్తి అయిన శ్రీరాములును అతని అనుచరులు కూడా అనుమానించారు. ఒక రిస్టువాచీ కొన్నపుడు జీతం తీసుకోని వ్యక్తి వాచీ ఎలా కొనగలిగారని మిత్రులు అనుమానించారు. పొట్టి శ్రీరాములు గాంధీ స్మారక నిధి కార్యకలాపాలు కొనసాగిస్తూ చురుకైన సేవకులతో రెండేళ్ళ కాల పరిమితి ఉన్న ఒక శిక్షణా శిబిరాన్ని నడపడానికి ఒక కార్యక్రమాన్ని తయారుచేశారు. శిక్షణ పొందే వ్యక్తులు

గాంధేయులై ఆదర్శ జీవనాన్ని గడపగలుగుతారు. స్మారక నిధి కేంద్ర కార్యాలయం వారితో కూడా శ్రీరాములు సత్సంబంధాలు కలిగి ఉండేవారు. వారికి అనేక సూచనలను కూడా చేసేవారు.

గాంధీ సిద్ధాంతాలపై నడిచే ధార్మిక సంస్థలకు ఆర్థిక సహాయం చేయుటకు వాటిని సందర్శించి సలహాలనిచ్చుటకు శ్రీరాములు పూనుకొన్నారు. ఆర్థిక సహాయం పొందుటకు నిర్ణీత పద్ధతిలో తనకు దరఖాస్తులు పంపుకోమని చాలా ప్రదేశాల నుండి దరఖాస్తులు అందాయి. ఆయా సంస్థలు అందించిన సమాచారం సత్యమో, అసత్యమో తెలుసుకోవడానికి శ్రీరాములు ముందు జాగ్రత్త తీసుకున్నారు. ఆయా ప్రాంతాల అనుచరుల సహాయాన్ని పొందినారు. కుష్ఠురోగ నిపుణుడైన డా॥ టి.జె. గంగరాజు యోగ్యత లేని వైద్యుడని తెనాలిలోని వెంపటి సూర్యనారాయణ గారికి ఉత్తరం వ్రాసి తెలుసుకున్నారు. మైదుకూరు ఆశ్రమంలో ఎక్కువ మంది జీవిస్తున్నారు వారు ఎవరూ నిర్మాణాత్మక కృషిలో శిక్షణ పొందలేదు. గాంధీ సిద్ధాంతాలను ఈ ఆశ్రమం వారు ఆచరణలో పెట్టడం లేదని తెలుకున్నారు. శ్రీరాములు అర్హత కలిగిన సంస్థలకు ఆర్థిక సహాయాన్ని కలిగించి అపోహలను తొలగించడానికి పత్రికా ప్రకటనలు కూడా చేశారు. సం॥ల తరబడి అవిశ్రాంతంగా శ్రమించినప్పటికీ నిర్మాణాత్మక కార్యక్రమాలలో శ్రీరాములు ప్రగతిని సాధించలేక పోయినారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం లేకపోకటం వల్లనే వారికి ఈ కార్యక్రమాల పట్ల ఆసక్తి లేదని గ్రహించినారు.

**వినోభాజీ భూదాన యజ్ఞం ఆంధ్రలో సంతృప్తికరంగా సాగక పోవటానికి, గాంధీ, కస్తూర్భా ట్రస్టులు ఆంధ్రలో మందకొడిగా సాగటానికి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం లేకపోవటమేనని గ్రహించారు. అందువల్ల శ్రీరాములు సంచాలక పదవి నుండి విరమించి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర స్థాపన కోసం పోరాడాలనే నిర్ణయానికి వచ్చారు.**

గాంధీ స్మారక నిధి అకౌంట్స్ ఇన్‌స్పెక్టరు శ్రీ యస్.యస్. యాజీకి పదవీ బాధ్యతలు అప్పగించి పోరాటం సాగించాలని నిర్ణయించుకొన్నారు.

* * *

## తొమ్మిదవ అధ్యాయం

# ప్రత్యేకాంధ్ర సేవాకార్యం

ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రోద్యమం కొత్త విషయం కాదు. 1912 మే నెల చివరి వారంలో 21వ కృష్ణా, గుంటూరు జిల్లా మహాసభ నిడదవోలులో జరిగింది. ఈ సభలో తెలుగు మాట్లాడే ఒక ప్రత్యేక రాష్ట్రం కావాలని కొంత చర్చ జరిగి ఎటూ తేలకుండా ముగిసింది. ఈ సభ ముగిసిన వెంటనే గుంటూరుకు చెందిన కొందరు యువకులు ఉన్నవ లక్ష్మీనారాయణ, చల్లా శేషగిరిరావు, జొన్నవిత్తుల గురునాథం, బయ్యా నరసింహేశ్వరశర్మ, వేమవరపు రామదాసుపంతులు, ముట్నూరి కృష్ణారావు, కొండా వెంకటప్పయ్య మొదలైనవాళ్లు మద్రాసు రాష్ట్రం నుండి తెలుగు జిల్లాలను విడదీసి ప్రత్యేకమైన హైకోర్టు, రెవిన్యూబోర్డు మొదలైన వాటితో ఒక ప్రత్యేక రాష్ట్రం ఏర్పడవలసిన అవసరాన్నిగూర్చి తీవ్రంగా చర్చించారు. అందుకోసం ఆందోళన ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ కార్యభారాన్ని నిర్వహించవలసిందిగా కొండా వెంకటప్పయ్యను కోరారు.

1913లో మే నెల 20వ తేదీ బాపట్లలో ఆంధ్ర మహాసభ అనే పేరుతో సమావేశమయింది. రాష్ట్రంలోని తెలుగు జిల్లాల నుండి రెండు వేల మంది ప్రేక్షకులు, 800 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఆ సభకు మద్రాసు రాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడైన బి.యన్. శర్మ అధ్యక్షత వహించాడు. అందరూ దేశాభివృద్ధికి పాటుపడాలని మొదట భారతీయులనే అంశం గుర్తుంచుకొని పిదవ తెలుగు బిడ్డలుగా చెప్పుకోవాలని సభలో ప్రసంగించాడు. సభ విజయవంతం అయింది. దీనితో ఆంధ్ర రాష్ట్రోద్యమానికి ప్రోత్సాహం కలిగింది.

ఆంధ్ర మహాసభ ప్రారంభ దశ నుండే ప్రత్యేక రాష్ట్ర సంబంధ విషయాలందించే ఏకైక సంస్థగా రూపొందింది. ఆ సభ నిర్వహించిన వివిధ సమావేశాల్లో ఇది రుజువైంది. తరువాత సభలు బెజవాడ (1914 మే), విశాఖపట్నం / (1915 మే), కాకినాడ (1916 మే), నెల్లూరు (1917 మే)లలో జరిగాయి.

ఆంధ్ర రాష్ట్ర సమస్య విషయం 1920, 27 సంవత్సరముల మధ్య మద్రాసు ప్రభుత్వం ఎటూ తేల్చి చెప్పలేదు. అప్పుడు అధికారంలో వున్న జస్టిస్ పార్టీ మంత్రులు తెలుగు వారయినప్పటికి ఆంధ్ర రాష్ట్రోద్యమాన్ని సమర్ధించలేదు. లెజిస్లేటివ్ కౌన్సిల్ గడువు ముగిసేవరకూ తెలుగు జిల్లాలతో ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పరిచే ప్రతిపాదన ఏదీ పరిశీలనలో లేదని 1921 మార్చిలో మద్రాసు ప్రభుత్వం లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు తెలిపింది.

రౌండు టేబుల్ సమావేశం జరిగేటప్పుడు కూడా ప్రత్యేక రాష్ట్ర కోరిక వినిపించలేదు. రౌండ్ టేబుల్ సమావేశ సభ్యుడు డా॥ షాఫాత్ అహమ్మద్ ఖాన్ ఇలా తెలిపాడు.

"భారతదేశంలోని వివిధ సంస్థలు రాష్ట్ర పునర్నిర్మాణం జరగాలని కోరుతుంది. కానీ ఆంధ్రులు ఉద్యమాన్ని విడిచిపెట్టారు. కొనసాగించి వుంటే భారతదేశంలోనూ, లండన్లోనూ చాలా మంది ప్రజలు సహకారాన్ని పొంది వుండేవారు'

ఆంధ్ర రాష్ట్ర విషయమై రాయలసీమ సర్కారుల మధ్యవున్న తగాదా అగ్నికి ఆజ్యం పోసినట్లు చేసింది. రాయలసీమ నుండి మొదటి నుండి వ్యతిరేకభావం లేకపోయినప్పటికీ 1933, 34 నుండి నానాటికీ ప్రబలిపోతూ ఉండడం గమనించవచ్చు. మద్రాసు రాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిల్లో ఆంధ్ర రాష్ట్ర నిర్మాణాన్ని అనుకూలంగా చేయబడిన తీర్మానాలు చర్చించబోతుండగా కొందరు రాయలసీమ నాయకులు వ్యతిరేకించి ప్రకటనలు కూడా చేశారు. 1933 జూలై 26, 29, 31 తేదీల్లో ఆగష్టు రెండవ తేదీన హిందూ పత్రికకు యస్.యన్. నరసింహారావు, సి.యస్. సుబ్రమణ్యం మున్నగు ప్రముఖులు వ్రాసిన లేఖల్లో ఈ అంశం వుంది. దీని పర్యవసానంగా 1934లో రాయలసీమ మహాసభ స్థాపించబడింది.

1937 అక్టోబరు చివరలో ఆంధ్ర మహాసభ రజతోత్సవ సభ బెజవాడలో నిర్వహించబడింది. ఆ సభలో రాయలసీమ నాయకులు తమకు రక్షణలు కావాలని కోరుతూ వాటిని ప్రత్యేక రాష్ట్ర సాధన కార్యక్రమంలో చేర్చాలని పట్టుపట్టారు. వారి కోరికలిలా వున్నాయి.

1. మద్రాసులో కానీ రాయలసీమ ప్రాంతంలో కానీ రాష్ట్ర రాజధానిని నెలకొల్పాలి.

2. మంత్రివర్గ సభ్యుల్లో సర్కారు వారితో సమాన ప్రాతినిధ్యం రాయలసీమ వారికివ్వాలి.
3. రాయలసీమ ఆర్థికంగా వెనుకబడింది గనుక తక్షణమే తుంగభద్ర, మగరి వంటి ప్రాజెక్టులను చేపట్టాలి.
4. శాసనసభ్యుల్లో రాయలసీమ వారికి సమాన ప్రాతినిధ్యం ఇవ్వాలి.
5. రాయలసీమ సర్కారు ప్రాంతాలకు సమాన నిష్పత్తిలో ఖర్చు చేయాలి.

బెజవాడ సభకు హాజరైన ప్రతినింధులంతా మరలా 15-11-1937 న మద్రాసులోని కాశీనాధుని నాగేశ్వరరావుగారిల్లు, 'శ్రీబాగ్'లో సమావేశమై ఒక నిర్ణయానికి వచ్చారు. దీన్నే శ్రీబాగ్ ఒడంబడిక అని పిలుస్తారు. ఈ ఒడంబడిక వల్లనే ప్రప్రధమంగా కర్నూలుగా రాజధానిగా చేయడం జరిగింది. మద్రాసులో 14-7-1937న కాంగ్రెస్ మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేయగానే ప్రత్యేకాంధ్ర రాష్ట్ర ఉద్యమం పేరులోనికి వచ్చింది. ప్రముఖులైన కాంగ్రెస్ నాయకులు, ప్రముఖ సంస్థలు, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రోద్యమానికి చేసిన ప్రయాత్నాలను సంక్షిప్తంగా ఇలా చెప్పవచ్చు.

1. 3-6-1938న ఎ.పి.సి.సి. (ఆంధ్ర ప్రొవిన్షియల్ కాంగ్రెస్ కమిటీ కార్యవర్గం చేసిన తీర్మానాన్ని అమలు పరచడానికి పట్టాభి సీతారామయ్య ఆంధ్ర జిల్లాలోని శాసన సభ్యులకు, మునిసిపల్ కౌన్సిలర్లకు, జిల్లాలోని బోర్డు మెంబర్లకు, బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీలు మున్నగు వాటికి మొత్తం 600 సర్క్యులర్లు పంపాడు అందులో మాతృభాషలోనే వారివారి వ్యవహారాలను కొనసాగించాలని కోరింది. అందువల్ల భాషా ప్రాంతాల ప్రసక్తి మరింత ముందుకు రాగలదని ఆంధ్ర రాష్ట్ర సాధన అందువల్ల మిక్కిలి త్వరితం కాగలదని ఆశించాడు.
2. 1939 ఆగష్టు చివరి వారంలో గుంటూరులో జరిగిన ఆంధ్ర మహాసభ సమావేశానికి 1600 మంది ప్రతినిధులు (అప్పట్లో అతి పెద్ద సంఖ్య) హాజరయ్యారు. ఆంధ్ర రాష్ట్ర ఏర్పడకపోతే బ్రిటిష్ వస్తువుల వినియోగాన్ని నిషేధించాలని ఆంధ్ర జిల్లాలన్నింటిలో ప్రభుత్వ కార్యకలాపాలను ఆటంకపరచాలని ఆ సమావేశం సూచించింది.
3. 1940 జూలై మద్రాసు ప్రభుత్వ సలహాదారుడు టి.సి. రూథర్‌పుర్డ్‌కు

సత్వర ఆంధ్ర రాష్ట్ర నిర్మాణం కోసం జి.వి. సుబ్బారావు అనే రాష్ట్రోద్యమ కార్యకర్త ఒక విజ్ఞప్తి పత్రాన్ని అందించాడు. మరలా ఇతడు 1941 నవంబరులో విశాఖపట్నంలో ఆంధ్ర మహాసభ సమావేశాన్ని ఏర్పాటు చేశాడు. ఈ సభలో ప్రముఖ వ్యక్తి అయిన సర్ విజయానంద్ (విజయనగర రాజవంశీయుడు). ప్రత్యేక రాష్ట్ర వాంఛను సమర్థించాడు.

4. ఆంధ్ర మహాసభ బళ్లారి సమావేశంలో (అక్టోబరు 1943) సభాధ్యక్షుడైన సర్ విజయ్ ఎవరైతే మన సమస్యలను పరిష్కరిస్తామని ప్రతిజ్ఞ చేస్తారో వారిని శాసన సభకు సభ్యులుగా ఎన్నుకోవడానికి దీక్ష వహించాలని ఉద్ఘాటించాడు.
5. 2-9-1946న మధ్యంతర ప్రభుత్వం ఏర్పడింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శంకరరావ్ పి.సి.సి. లకు ఒక సర్క్యులర్ జారీ చేస్తూ ఎ.పి.సి.సి. కమిటీల భాషా ప్రయుక్త రాష్ట్రాల విషయమై శ్రద్ధ వహించాలని సూచించాడు. పట్టాభి సీతారామయ్య తదితరులు ఈ అభిప్రాయాన్ని బలపరుస్తూ సంతకాలు చేశారు.
6. 1947 ఏప్రిల్ నెల్లో మద్రాసు రాష్ట్ర శాసనసభ నూతన రాజ్యాంగం క్రింద తమిళనాడు, కేరళ, కర్నాటక, ఆంధ్ర రాష్ట్రాలను వేర్వురు రాష్ట్రాలుగా ఏర్పాటు చేయాలని ఇందుకోసమై ఒక సరిహద్దు సంఘాన్ని, కార్యనిర్వహక సంఘాన్ని తగిన యంత్రాంగాన్నీ వెంటనే చేయాలని సిఫార్సు చేసింది.
7. ఉయ్యూరు కుమార్ రాజా, రాజా రంగయ్య, అప్పారావు అధ్యక్షతన ఆంధ్ర మహాసభ ప్రత్యేక సమావేశం జరిగింది. సభ ప్రారంభకుడుగా టి. ప్రకాశం ఆహ్వానించబడ్డాడు. ఈ సమావేశం ఆంధ్ర రాష్ట్రావతరణకై తగిన చర్యలు తీసుకోవాలని రాజ్యంగ సభను కోరింది.

27-11-1947 ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కావాలనే కోరిక పూర్తిగా న్యాయబద్ధమేనని పండిత్ నెహ్రూ రాజ్యాంగ సభలో ప్రకటించాడు. అందుకు సంబంధించిన కొన్ని ఇబ్బందులు కూడా ఏర్పడ్డాయి. 1935 భారత ప్రభుత్వ చట్టం క్రింద ఒరిస్సా, సింధు రాష్ట్రాలు ఏర్పడిన విధంగా రాజ్యంగంలోని రాష్ట్రాల్లో ఆంధ్ర రాష్ట్ర పేరును కూడా చేర్చాలా? లేక రాజ్యాంగ ఏర్పడిన తరువాత నిర్ణయించాలా అనేది సమస్యగా తయారైంది. (3) 17-6-1948న రాజ్యాంగ

సభ అధ్యక్షునితో భాషా రాష్ట్రాల సంఘం నియమించబడింది. ఈ సంఘానికి అలహాబాద్ హైకోర్టు రిటైర్డు జడ్జి యస్.కె. దార్ చైర్మన్‌గా వ్యవహరిస్తాడు. డాక్టర్ పన్నాలాల్ (ఐ.పి.యస్. రిటైర్డు), జగత్ నారాయణలాల్ (రాజ్యాంగ సభ సభ్యుడు) సభ్యులుగా వుంటారు. దీనినే దార్ కమీషన్ అంటారు.

దార్ కమీషనర్ 1000 వ్రాత పూర్వకమైన దరఖాస్తులను స్వీకరించింది. 6,700 మంది సాక్షులను విచారించింది. ఈ కమీషన్ ఏకగ్రీవంగా తయారు కాబడింది. ఈ సంఘం రాష్ట్రాలతో భాషా సంబంధంగా జరుగుతున్న కొట్లాటలు, తగాదాలు, ఇబ్బందుల అన్నింటిని గుర్తించింది. అయితే భాషా రాష్ట్రాల అవతరణకు వ్యతిరేకంగా సిఫార్సు చేసింది. భాషా రాష్ట్రాలు ఏర్పడటం అవసరమేనని తొందరగా ఏర్పడకపోతే ప్రజల్లో ఎక్కువ అసంతృప్తి ఏర్పడుతుందనీ ధార్ సంఘము సూచించింది. అయితే ఇందువల్ల భారతదేశ మంతటా ఒక జాతిగా భావించే ఉద్దేశ్యానికి భంగం కలుగుతుందనీ ప్రాంతీయ భావాలు ప్రబలి పోతాయనీ అభిప్రాయ పడింది. భాషా రాష్ట్రాలు ఏర్పడితే బొంబాయి మద్రాసు వంటి నగరాలను ఏ రాష్ట్రంలోనూ చేర్చకుండా పార్టు సి రాష్ట్రలుగా పరిపాలన కొనసాగించాలని కూడా ఈ సంఘం సిఫార్సు చేసింది.

దార్ కమీషన్ సమర్పించిన నివేదికకు ప్రభుత్వం కానీ, కాంగ్రెస్ నాయకులు గానీ తగినంత ప్రాధాన్యం ఈయలేదు. కమిషన్ సంగతి పట్టించుకోకుండానే ప్రజల ఆందోళనను పురస్కరించుకొని భాషా ప్రయుక్త రాష్ట్రాలను గురించి విచారించడానికి కాంగ్రెస్ ముగ్గురు సభ్యులతో ఒక సంఘాన్ని నియమించింది. ఇందులో జవహర్లాల్, వల్లభాయ్ పటేల్, పట్టాభి సీతారామయ్య, సభ్యులు (ఈ సంఘాన్ని జె.వి.పి. అనే పేరుతో పిలువబడింది).

1949 ఏప్రిల్ మాసంలో జె.వి.పి. కమిటీ తన నివేదికను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీకి సమర్పించింది. ఈ కమిటీలోని ముగ్గురు సభ్యుల్లో ఇద్దరు ప్రధానమంత్రి, ఉప ప్రధానమంత్రిగా వున్నందువల్ల వీరు సమర్పించిన నివేదిక ప్రభుత్వాదేశాన్ని తెలిపింది. కొన్ని సంవత్సరాల వరకు భాషా రాష్ట్రాలను ఏర్పరచడానికి వాయిదా వేయాలని ఈ సంఘం సూచించింది. ఈ సంఘం ఆంధ్ర రాష్ట్ర సమస్యను ప్రత్యేకంగా పరిశీలించి అందుకుగాని కొన్ని షరతులు పెట్టింది. ఈ షరతుల ప్రకారం ఆంధ్ర రాష్ట్రం ఏర్పడాలంటే ఆంధ్రులు మద్రాసు నగరం మీద వాళ్లకు

గల హక్కులను వదలుకొని తీరాలి. కేవలం వివాదగ్రస్తంగాని సరిహద్దు ప్రాంతాలతో మాత్రమే అది ఏర్పడుతుంది. మద్రాసు రాష్ట్రంలోని ఆంధ్రేతర ప్రాంతాలవారి సుహృద్భావంతోనే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడవలసి వుంటుంది. మొదటి నుంచీ పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం కోసం ఆందోళన జరుగుతున్న తీరును గమనిస్తూ వచ్చాడు. నవంబరు 14వ తేది నాటికి జె.వి.పి. రిపోర్టును అంగీకరిస్తున్నామని ఆంధ్ర నాయకులు తెలిపినట్లయితే ఆంధ్ర రాష్ట్రావతరణను సూత్ర ప్రాయంగా అంగీకరిస్తున్నామని అక్టోబరు 1949లో సమావేశమైన అఖిల భారత కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తెలియజేసింది. వెంటనే పొట్టి శ్రీరాములు ఆచార్య రంగాకు, ప్రకాశం పంతులుకు తన అభిప్రాయాన్ని ఇలా వ్యక్తం చేశాడు.

"ఆంధ్ర నాయకుల్లో భేదభావాలు ప్రబలిపోయాయి. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ కూడా పక్షపాతంతో వ్యవహరిస్తున్నది. మద్రాసు నగరం విషయమై దార్ కమిటీ చేసిన ప్రతిపాదనను అమలుపరచడానికి అది ఎందుకు అంగీకరించలేదో కారణాన్ని ఇంతవరకూ తెలుపలేదు. కాంగ్రెస్ కార్యవర్గం జె.వి.పి. రిపోర్టును సమర్థించడమేకాదు అమలుపరచాలనే ఆతృతతో కూడా వుంది. ఇందుకు ప్రత్యామ్నాయం లేదా? భాషా రాష్ట్రాలు అనైకమత్యానికి దారితీస్తాయని ఒకవంక అగ్రనాయకులు చెబుతూనే మరొకవంక మద్రాసు నగరంకోసం పట్టుదలతో వున్న తమిళులను సమర్థిస్తున్నారు. తమిళ, ఆంధ్ర రాష్ట్రాలు రెండూ "సి" స్టేటు ప్రాంతాలుగా ఉండవలసివస్తే ఆ సమస్య విషయం తాను నిరాహారదీక్షకు పూను కుంటానని ఆచార్య రంగా రావు గారు పరిహాసంగా అన్నారు. నేను అందుకు సిద్ధంగా వున్నాను. కాని అందుకు నేను అర్హుణికానని నా ఉద్దేశ్యం. ప్రకాశం, రంగాగార్లు ఈ విషయమై నిరశనవ్రతం పూనాలి. ఇంతకుమించి వేరే పరిష్కారమార్గం కనిపించడంలేదు. శ్రీ రాములు ప్రత్యేక రాష్ట్రం కోసం ఆంధ్రులలో పెల్లుబికుతున్న ఆకాంక్షను అగ్ర నాయకుల నిర్లక్ష్య ధోరణిని గమనించాడు.

## ఆంధ్ర ప్రజలకు జరుగుతున్న కొన్ని అన్యాయాలు

1) మాంట్‌ఫర్డ్ సంస్కరణలు 1921లో ప్రవేశ పెట్టబడ్డాయి. తరువాత మద్రాసు రాష్ట్రంలో మొత్తం 9,82,000 ఎకరాలకు నీటి పారుదల సౌకర్యం కల్పించబడింది. అందులో కేవలం 40,000 ఎకరాలకు మాత్రమే నీటి

పారుదల సౌకర్యం ఆంధ్ర ప్రాంతంలో కల్పించబడింది.

2) విద్యుచ్ఛక్తి మేజరు ఇరిగేషన్ వర్క్స్‌లాంటి ముఖ్యమైన పోర్టుఫోలియోలు 1921 నుండి 1936 వరకు ఎగ్జిక్యూటివ్ కౌన్సిలర్ల అధికారంలో ఉండేవి. అప్పుడు ముఖ్యమంత్రులుగా ఒక్క డా॥ సుబ్బారాయన్ తప్ప అంతా తెలుగు వారే ఉండేవారు. సర్ సి.పి. రామస్వామి అయ్యర్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిలర్‌గా ఉంటూ మిక్కిలి కృషి చేసి మెట్టూరు ప్రాజెక్టును సాధించాడు. ఎగ్జిక్యూటివ్ కౌన్సిలర్‌గా మొదట 1934లో మాత్రమే ఆంధ్రుని నియామకం జరిగింది.

3) 1947 నుండి కేంద్ర ప్రభుత్వంగాని, రాష్ట్ర ప్రభుత్వాలుగాని రామపాద సాగర్ ప్రాజెక్టు విషయమై శ్రద్ధ కనపరచలేదు. ఈ ప్రాజెక్టు చాల ధనవ్యయంతో కూడినదైనప్పటికీ ఆంధ్ర ప్రాంతంలోని డెల్టా జిల్లాలకు మిక్కిలి ప్రయోజనకారిగా భావింపబడింది.

4) 1949 డిసెంబరు చివరి నాటికి విద్యచ్ఛక్తి ప్రణాళికలకు గాను మొత్తం రూ. 17,8,507 లక్షలు ఖర్చు చేయవలసి వుండగా కేవలం రూ.285-50 లక్షలు (16%) మాత్రమే ఆంధ్ర జిల్లాలకు ఖర్చు పెట్టడం జరిగింది. ఇలాగే పారిశ్రామికభివృద్ధికి గాను రూ. 205-85 లక్షలు ఖర్చు పెట్టవలసి వుండగా దానిలో 12% మాత్రమే ఆంధ్ర జిల్లాలకు ఖర్చు పెట్టబడింది. తమిళనాడుకు 632 యూనిట్లు విద్యుచ్ఛక్తి మంజూరు కాగా ఆంధ్రకు 42 మిలియన్ యూనిట్లు మాత్రమే మంజూరయింది.

5) ప్రభుత్వ సర్వీసుల్లో కూడా యిదేవిధంగా పక్షపాత వైఖరి కొనసాగింది.

## స్వామి సీతారాం నిరాహారదీక్ష విఫలం కావడం

**ప్రత్యేకాంధ్ర రాష్ట్రం కావాలని కోరుతూ స్వామి సీతారాం రెండుసార్లు మొత్తం 55 రోజులు నిరాహారదీక్ష చేశాడు. చివరకు వినోబాభావే విజ్ఞప్తి పురస్కరించుకొని దీక్ష విరమించాడు. కానీ నెహ్రూ నిర్లక్ష్య ధోరణివల్ల వినోబాభావే వాగ్దానం భంగమైంది. నెహ్రూ నిరాహార దీక్ష వద్దతిని నిరసించాడు. ఒప్పందాల వల్ల సమస్య పరిష్కరింపబడుతుందని పునరుద్ఘాటించాడు.**

స్వామి సీతారాం కృషిని టి. ప్రకాశం, కళా వెంకట్రావు, గోపాలరెడ్డి, సంజీవరెడ్డి, రంగా మొదలైన అగ్రనాయకులు సమర్థించారు. ఎ.ఐ.సి.సి. ఆంధ్రప్రదేశ్ కమిటీ 7-6-1952న కాకినాడలో సమావేశమై ఆంధ్ర రాష్ట్ర నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని తీర్మానాలు చేసింది. జూన్ 15వ తేదీ స్వామీజీ తన రెండవ దీక్షను విరమించాడు.

## ఎన్నికల ద్వారా వ్యక్తమైన ఆంధ్రుల అసంతృప్తి

మద్రాసు రాష్ట్ర శాసనసభకు 1952 జనవరి మొదటి వారంలో ఎన్నికలు ప్రారంభమయ్యాయి. మొత్తం 375 సీట్లకుగాను కాంగ్రెస్ 367 సీట్లకు పోటీచేసింది. కానీ 152 సీట్లు మాత్రమే దక్కించుకొన్నది. ఆంధ్ర, ఆంధ్రేతర ప్రాంతంలోని ప్రముఖ నాయకులంతా ఓడిపోయారు. ఆంధ్ర కాంగ్రెస్ నాయకుల్లో సంజీవరెడ్డి, గోపాలరెడ్డి, కళా వెంకట్రావు ముఖ్యులు. మొత్తం 12 తెలుగు జిల్లాల్లో వివిధ పార్టీల ఫలితాలిలా వున్నాయి. కాంగ్రెస్-43, కమ్యూనిష్టు-42, ప్రజా పార్టీ-20, కృషిక్ పార్టీ-15, సోషలిష్టు-7, ఇతర పార్టీలు-1, స్వతంత్రులు-18 (మొత్తం 145).

ఎన్నికల అనంతరం ప్రకాశం నాయకత్వంలో వున్న కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టి కమ్యూనిస్టు పార్టీల మధ్య యునైటెడ్ ఫ్రంటును ఏర్పరచే విషయమై చర్చలు జరిగాయి. 1952 మార్చినెల చివరి డెమోక్రటిక్ ఫ్రంట్ ఏర్పడింది. నిశ్చితమైన దాని కార్యక్రమంలో ముఖ్యాంశంగా భాషాప్రయుక్త రాష్ట్ర విభజన చేర్చబడింది. మార్చి 29వ తేదిన యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ నాయకుడుగా ప్రకాశం పంతులు ఎన్నికయ్యాడు. అందలి సభ్యుల సంఖ్య 164 అయితే మార్చి 31వ తేదీన కాంగ్రెస్ పార్టీ నాయకత్వం వహించవలసిందని చక్రవర్తి రాజగోపాలచారిని ఆహ్వానించినట్లు తెలుపబడింది. గవర్నర్ అతణ్ణి మంత్రివర్గాన్ని ఏర్పరచవలసిందిగా కోరాడు. 1952లో రాజాజీ పార్టీ నాయకుడైన వెంటనే పొట్టి శ్రీరాములే ఆంధ్రుల ఇబ్బందులను తొలగించగల పథకాన్ని సూచించాడు.

పొట్టి శ్రీరాములు 1949లో రంగాకు, ప్రకాశానికి 1952లో రాజాజీకి చేసిన విజ్ఞప్తుల పరంపరకు సమాధానం లభించలేదు. ఆంధ్ర రాష్ట్రం అవతరించనిదే ఇక ముందు నిర్మాణాత్మక కృషి జరగదని శ్రీ రాములు

విశ్వసించాడు. లక్ష్యసాధనకు ఎవరో ఒకరు ఆత్మార్పణ చేయందే లాభం లేదని గ్రహించాడు. 1951-52 సంవత్సరాల్లో ఆంధ్ర రాష్ట్ర ఏర్పడటానికి అన్ని రాజ్యాంగ పద్ధతులు ఆలోచించబడ్డాయని ఆయన గ్రహించాడు. ఆంధ్ర రాష్ట్ర ఏర్పడటం ఆవశ్యకమని భావించాడు. గాంధేయ పద్ధతుల ద్వారా లక్ష్యాన్ని సాధించాలని నిర్ణయించుకొన్నాడు.

పొట్టి శ్రీరాములు నిరశన వ్రతం పూనడానికి నిశ్చయించుకొన్న తరువాత పెద్దలతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాడు. పత్రికా ప్రకటనలు కూడా చేశాడు. మద్రాసుకు చెందిన న్యాయవాది బి. లక్ష్మీనారాయణకు లేఖ వ్రాస్తూ "ప్రత్యేక రాష్ట్రాన్ని గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నాను. దీని విషయమై పెద్దలు కృషి చేస్తారన్న నమ్మకంలేదు. ఏ రాజకీయ పార్టీ చేతుల్లో కీలుబొమ్మగా మారటం నాకిష్టంలేదు. ఇంతకు ముందు ఎన్నో పరిష్కార దీక్షలు చేసి విజయం సాధించాను. ఈ సమస్య పరిష్కారానికి కూడ నేనే నిరాహారదీక్ష వహిస్తాను. అధికారుల మనస్సు మార్చటం సులభం కాదు. నేను కనుగొన్న మార్గం ఒక్కటే. ఆత్మార్పణ చేయడమే. దానికి నేను సిద్ధమయ్యాను. ఎక్కడ దీక్ష వహించాలని ఆలోచిస్తున్నాను. మద్రాసులో చేస్తే తగాదాలకు దారితీసినట్లవుతుంది. ఆ భయం లేకపోతే ఇందుకు మద్రాసు మించిన స్థలం లేదు. ఈ అభిప్రాయం స్వామి సీతారాం గారికి నచ్చకపోవచ్చు. నీవు ఆయనకు తక్కిన వారికి తెలియజేయాలని ప్రకటన చిత్తు ప్రతిని నీకు పంపుతున్నాను". అని రాశాడు. ఆ చిత్తు ప్రతి సారాంశం ఇలా వుంది.

"మధ్యవర్తి తీర్పుకుగాను మద్రాసు నగరాన్ని వదులుకోవలసి వుంటుందని స్వామి సీతారాం చెబుతున్నాడు. మద్రాసులేని ఆంధ్ర రాష్ట్రాన్ని నాయకులు అంగీకరించడంలేదు. విశాఖాంధ్ర కోసం ఉద్యమించాలని ఉన్నవ లక్ష్మీనారాయణ విశ్వసిస్తున్నాడు. ఆంధ్ర రాష్ట్రం వస్తే చాలనుకొనేవాళ్లు లేకపోలేదు. ప్రత్యేక రాష్ట్రపు కోరికను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలంగీకరించాయి. అయినా అడగడానికి ఎవ్వరికీ ధైర్యం లేదు. ముందడుగు వేయడానికి భయపడుతున్నారు. ఫలితంగా ప్రజలు అంతర్గతంగా సంఘర్షణ పడుతున్నారు. ఈ సమస్య రాష్ట్రంలోని ప్రతి మేధావికీ ఆందోళన కలిగిస్తున్నది. ఈ విషయంలో కృషి చేయడానికి ఎవరూ పూనుకోవడం లేదు. దీనికి పరిష్కారమార్గం లేదా?

నేడు ప్రత్యేక రాష్ట్రావసరాన్ని ప్రతివారూ గుర్తించారు. ఈ విషయంలో ప్రజలకూ, ప్రభుత్వానికీ ఏకాభిప్రాయం కుదిరింది. రాష్ట్రవతరణకై అంతా ఎదురు చూస్తున్నారు. జాతీయ భావంతో వృద్ధి చెందాలంటే మద్రాసు, బొంబాయి వంటి నగరాలు ఏ రాష్ట్రానికీ చెందకూడదు. కేంద్ర ప్రభుత్వ పాలనలోవుండాలి. ఈ నగరాల ఆర్థిక వ్యవస్థలో మార్పు వస్తే యివి కేవలం వస్తుప్రదర్శనశాలలుగా రూపొందుతాయి. ప్రాముఖ్యాన్ని కోల్పోతాయి. అంతవరకు ప్రతి ఒక్కరూ నగరాల్లో ఉండటానికి సిద్ధపడతారు. ప్రతి పట్టణం ఏదో ఒక విధండా నగరాలపై ఆధారపడక తప్పదు. అందువల్ల నగరాల్లో ఉండడానికి ఏ ఒక్కరిపైనా నిషేధం కూడదు. ప్రస్తుతం ఆంధ్ర రాష్ట్ర సమస్య మద్రాసు నగర భవితవ్యానికి ముడిపెట్టబడి వుంది. మద్రాసు భవిష్యత్తు తేలిపోతే దీనితో ఇతర నగరాల సమస్య తేలిపోతుంది. ఇప్పటినుంచే మనం హైదరాబాదును గురించి ఆలోచించకూడదు. అందువల్ల మనం మద్రాసు నగరం మీద హక్కును కోల్పోతాము. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తరువాత విశాలాంధ్రను గురించి ఆలోచించవచ్చు. ఏ రాష్ట్రంలోనయినా ప్రభుత్వం ప్రజల అభిరుచులు, క్షేమాలను దృష్టిలో వుంచుకొని పనిచేయాలి. అది రాజకీయవేత్తలు, అధికారులు, వ్యాపారులు బాగుపడటానికీ ఆడుకునే ఆటస్థలం కాదు.

## లక్ష్యసాధనకు వివిధ మార్గాలు :-

1. ఏ పార్టీ అధికారంలో ఉన్నా లెక్కచేయకుండా విమర్శించడం, ప్రజల్లో అసంతృప్తిని రేకెత్తించడం, పన్నులు ఎగవేయడం లాఠీచార్జీ అవకాశాలను కల్పించడం.
2. తమలో తాము పోట్లాడుకొనేటట్లు రాజకీయ నాయకులను పురికొల్పి వారి పలుకుబడిలో నూతన రాష్ట్రాన్ని సాధించడం.
3. నిస్వార్థంగా ఎవరో ఆత్మబలిదానం చేయడం.

రాష్ట్ర సిద్ధికోసం మూడు ప్రత్యామ్నాయ మార్గాలను సూచించి శ్రీరాములు గాంధేయవాదిగా మూడవ పద్ధతికి ప్రాముఖ్యాన్ని ఇచ్చాడు. గాంధేయులే అధికారులు గనుక తన సంకల్పాన్ని అర్థం చేసికోగలరని ఆశించాడు.

మద్రాసు రాష్ట్ర ఆర్థిక మంత్రి సి. సుబ్రమణ్యం మద్రాసు నగరం తమిళు

లదేనని భారత పర్వదినాన చేసిన ప్రసంగం అంతకు ముందే రాజాజీ చేత చేయబడిన - అలాంటి ప్రసంగం, వాటిపై తెలుగు మంత్రులు వ్యాఖ్యానం చేయకపోవడం పొట్టి శ్రీ శ్రీరాములు సెప్టెంబరు 14వ తేదీన ఆలోచించి ఒక నిర్ణయం తీసుకొనేటట్లు చేసింది.

నిర్ణయానికి వచ్చిన వెంటనే శ్రీరాములు తగిన సన్నాహాలు ప్రారంభించాడు. ప్రథమంగా స్వామి సీతారాం అనుజ్ఞ తీసుకోవాలను కొన్నాడు. అప్పుడా స్వామి ఆంధ్ర రాష్ట్రం కోసం ఢిల్లీ వెళ్లి తన అనుచరులతో సామూహిక సత్యాగ్రహాన్ని తలపెట్టాడు. పొట్టి శ్రీరాములు అతనికి ఆటంకం కాదలచుకోలేదు. అప్పటికే ప్రజలు నిరాహారదీక్షలంటే విసిగిపోయారు. వాటిని వ్యర్థమైన పద్ధతులని పరిహాసం చేస్తున్నారని గ్రహించాడు. కనుక తాను నామమాత్రంగా నిరాహారదీక్ష పూనదలచుకోలేదు. అప్పుడు ఆయనకు రెండే మార్గాలు కనిపించాయి. ఒకటి స్వామి ఆందోళనను బలపరచడం. రెండు తానే స్వయంగా దీక్ష ప్రారంభించడం.

19-10-1952 (హిందువుల బలిపూజాదినం నాడు నిరాహారదీక్ష ప్రారంభించడం అన్ని విధాలా శ్రేయస్కరమైనదని, మద్రాసులోని తన యింటిలోనే శ్రీరాములు దీక్ష ప్రారంభించవచ్చుననీ బులుసు సాంబమూర్తి అంగీకరించినట్లు బి. లక్ష్మీనారాయణ తెలిపాడు. అందుకు శ్రీరాములు అమితానందం చెందాడు.

19-10-1952 నాడు పొట్టి శ్రీరాములు తన ఆమరణ నిరాహారదీక్షను ప్రారంభించాడు. స్వామి సీతారాం ఆశీర్వదించాడు. రాష్ట్రంలోని వివిధ ఆందోళనలు నిలిపి వేయబడ్డాయి.

ఆంధ్రోద్యమాన్ని గురించి మద్రాసు నగర భవితవ్యాన్ని గురించి తన నిరాహారదీక్ష యొక్క లక్ష్యాలను గురించి క్లుప్తంగా వివరిస్తూ శ్రీరాములు దీక్షకు కూర్చొనబోయే ముందు మద్రాసు నగర పౌరులకు ఇతరులకు విజ్ఞప్తి చేశాడు.

## సర్వోత్తమమైన నిరాహారదీక్ష

**పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహారదీక్ష సర్వోత్తమమైన ఆత్మ బలిదానానికి ఉదాహరణంగా చెప్పవచ్చు. అది ప్రపంచంలోనే సాటిలేనిది. ప్రపంచంలో ఇద్దరు వ్యక్తులు మాత్రమే ఆమరణ నిరాహారదీక్ష చేశారు.**

**ఒకరు ఐర్లండుకు చెందిన మేక్స్విని. అయితే అతని ఆరోగ్యానికి సంబంధించిన చికిత్సాలయపు రికార్డు ఏదీ లేదు. రెండవవారు పంజాబు రాష్ట్రానికి చెందిన శ్రీ జితేంద్రదాస్ మరణ పర్యంతం నిరాహారదీక్ష కొనసాగించాడు. కానీ జైలు అధికారులు అతనికి బలవంతంగా కృత్రిమ భోజనం ఇచ్చినట్లు తెలుస్తుంది.**

చికిత్సాలయపు రికార్డు ఉన్నా అది పాడుచేయబడింది. అయితే శ్రీరాములు చేసిన నిరాహారదీక్ష చాలామందిని ఆలోచింపచేసింది. ప్రజలందరికీ ఆసక్తి కలిగించే లక్ష్యంతో అది ముడివడివుంది. కనుక అది వైజ్ఞానికంగా, వైద్యశాస్త్ర పరంగా, మానసికశాస్త్ర పరంగా, ఆధ్యాత్మికంగా, మతపరంగా, సామాజికంగా ప్రసిద్ధిగాంచింది. ఆయన దీక్ష వహించిన సమయంలో పర్యవేక్షించడానికి డా॥ కస్తూరి నారాయణమూర్తి, యం.డి., కొ. కల్నల్. టి.యస్. శాస్త్రి, ఐ. యం. యస్. (రిటైర్డ్), డా॥ యస్.యల్. కాంతరావు, యం.బి.బి.యస్., డా॥ ఎ.వి. అవధాని, (యల్. యం.పి) మున్నగువారొక సంఘంగా ఏర్పడ్డారు. భీమవరం ప్రకృతి ఆశ్రమ వైద్యుడు డా॥ వి. కృష్ణంరాజు, డా॥ యం. బాలసుందరం, పాథాలజిస్ట్, ఎబ్రిల్స్ లాబరేటరీస్ మైలాపూర్, డా॥ కె.ఆర్. దొరైస్వామి, రేడియోలజిస్ట్, మైలాపూర్ మొదలైనవారు పై డాక్టర్లు సంఘానికి సహకరించారు.

1952 అక్టోబరు 19వ తేదీ ఉదయం 10 గంటలకు మద్రాస్ మైలాపూర్ బులుసు సాంబమూర్తి ఇంట్లో శ్రీరాముల నిరాహారదీక్ష ప్రారంభమైంది. దీక్షా



సమయంలో అతని దైనందిన కార్యక్రమం హిందువుల ఉపవాస దీక్షలా నియమ బద్ధంగా సమయపాలనతో నిర్వహించబడింది. పొట్టి శ్రీరాములు దైనందిన కార్యక్రమం ఇలా జరిగింది.

| | | |
|---|---|---|
| ఉ॥ 5 | గంటలకు– | మట్టి పట్టి (మెత్తని బండలిమట్టి అప్పుడే తాజాగా తెచ్చిన దానిని పదిహేను నిమిషాలు పొత్తికడుపుకు పూసికొనుట.) గంటలకు |
| ఉ॥ 6 | గంటలకు– | ముఖం కడుక్కోవడం– ఒక గ్లాసు నిండా నిమ్మకాయ రసం (మద్రాసు మార్కెటెలో దొరికే సన్న నిమ్మకాయలు) |
| ఉ॥ 7 | గంటలకు– | కొబ్బరి నూనెతో శరీరమంతా తోముకోవడం తరువాత 10 నుంచి 15 నిమిషాలు ఎండలో వుండటం. |
| ఉ॥ 8 | గంటలకు– | 12 ఔన్సుల నీటితో కొంచెం నిమ్మకాయ రసాన్ని కలిపి ఎనిమా చేసుకోవడం. |
| ఉ॥ 9 | గంటలకు– | చల్లనీళ్ల స్నానం– తేనె, నీరు, కొంచెం సోడా ఉప్పు కలిపిన ద్రవాన్ని సేకరించడం |
| ఉ॥ 10–30 | గంటలకు– | మంచినీళ్లు త్రాగడం. |
| మ॥ 12 | గంటలకు – | మట్టి పట్టి వేసుకోవడం. |
| మ॥ 1–30 | గంటలకు– | నిమ్మకాయ రసం, తేనె సేవించడం. |
| సా॥ 3 | గంటలకు– | మంచినీళ్లు త్రాగడం. |
| మ॥ 3–30 | గంటలకు– | మట్టి పట్టీ వేసుకోవడం. |
| సా॥ 4 | గంటలకు– | ఎండలో ఉండటం, టేబుల్ సాల్ట్ కలిపిన నిమ్మకాయ ముక్కలు చప్పరించుట. |
| సా॥ 4–30 | గంటలకు– | చన్నీటి స్నానం. |
| సా॥ 7 | గంటలకు– | నీరు 1/2 ఔన్సు తేనె కలిపిన నిమ్మకాయ రసాన్ని సేవించడం. |

రా॥ 7–30 నుండి 9 గంటల వరకు – మంచినీళ్లు త్రాగడం

రా॥ 10 గంటల నుండి ఉదయం 5 గంటల వరకు నిద్రించడం.

(చాలా రోజులు రాత్రిపూట ఏమీ తీసుకోలేదు).

రోజుకు 4 నిమ్మకాయలు, 4 చెంచాల టేబుల్ సాల్ట్, 3 చెంచాల సోడా వుప్పు, 2 ఔన్సుల తేనె (మైసూరుది సకాలంలో సేకరించబడింది), 2 ఎనిమాలు (ఉదయం, సాయంత్రం) రెండుమార్లు ఉదయం, సాయంత్రం ఎండలో వుండటం, రెండుమార్లు చన్నీటి స్నానం, రెండుసార్లు మట్టిపట్టీలు పొట్టి శ్రీరాములు నిరాహార దీక్షలో దైనందిన కార్యక్రమాలుగా ప్రాముఖ్యం వహించాయి.

దీక్ష ప్రారంభించిన మొదటి రోజు వైద్యులు తెలిపిన ఆతని అబ్జర్వేషన్ రికార్డు ఇలా వుంది. వయస్సు 51 సంవత్సరాలు, నల్లని శరీరం, ఎత్తు 5-2 1/2, బరువు 119 యల్.బి.యస్. చిరునవ్వుతో ఆనందంగా ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతున్నాడు. చూడవచ్చిన వారిని, వైద్యులను చిరునవ్వుతో ఉత్సాహంగా ఆహ్వానించారు.

పొట్టి శ్రీరాములు దీక్ష ప్రారంభించిన ఏడవ రోజు (25-10-1952) ఒంటి గంటకు వైద్యులచే ప్రకటించబడ్డ మొదటివారపు అబ్జర్వేషన్ రికార్డు ఇలా వుంది. బరువు 110 యల్.బి.యస్., రక్త ప్రసరణ వేగం 110/75 బ్లడ్ ప్రెషర్ను సూచిస్తున్నది 94/70

శీతోష్ణ పరిమాణం $97.4^0$ యఫ్. సాధారణ పరిస్థితి బాగావున్నది. ఆరోజు సాయంత్రం 7-15 నిమిషములకు నాడి 72, రక్తప్రసరణ 85/60 క్షీణస్వరంతో కంఠధ్వని తగ్గుతున్నది. వైద్య పరీక్ష వివరాలు తెలుపుతూ ఐదవ వారపు ప్రకటనా పత్రిక శ్రీరాములు దీక్ష ప్రారంభించిన 37వ రోజు (24-11-1952) న వెలువడింది.

ఆయన 70 ఔన్సుల మరగబెట్టిన చల్లని నీటిని, 4 నిమ్మకాయల రసం, 1/2 ఔన్సు తేనెతో కలిపి రోజుకు నాలుగుసార్లు తీసుకుంటున్నాడు. అలాగే రోజుకు 3 చెంచాల సోడావుప్పు, 1/2 చెంచా మమూలు వుప్పు కూడా సేవిస్తున్నాడు. నిమ్మరసం, రక్తాన్ని లవణసారంగా మార్చటానికి తేనె, వాంతులను అరికట్టడానికి సోడా వుప్పు ఏసి డోసిస్ ను అరికట్టడానికి మామూలు వుప్పును (రక్తంలో ప్రతిఘాత శక్తిని పెంపొందింప జేయడానికి) ఉపయోగించాడు. 1948 లో సేవాగ్రాం ఆశ్రమంలో పొట్టి శ్రీరాములు తన 28 రోజుల నిరాహార దీక్షను కొనసాగించినప్పుడు నిమ్మరసాన్ని తీసుకోవడం వల్ల వాంతులయ్యాయి. ప్రతిదినం

నియమబద్ధంగా నిమ్మరసాన్ని తేనెతో కలిపి మొదటిరోజు నుండి సేవించడంవల్ల అతనికి వాంతులురాలేదు. ఒక నిమ్మకాయరసం. రెండు పింటుల (పింటు 12 ఔన్సులు) నీళ్లతో కలిపి రెండు చంచాల ఉప్పు వేసుకొని రోజు మార్చి రోజు తాగవలసిందని ఎనిమా తీసుకోవలసిందని వైద్యులు అతనికి సలహా యిచ్చారు.

పొట్టి శ్రీరాములు నిరాహారదీక్ష ప్రారంభించిన 45వ రోజు 2-12-1952 అతని ఆరోగ్యములో తీవ్ర పరిమాణం సంభవించినట్లు వైద్యులు ప్రకటించారు. వైద్యుల పరిశీలన ఇలా వుంది.

ఉదయం 5-30 నిమిషములకు ఎక్కువ మొత్తం తెమడ, పిత్తరసంతో కలిసి చెడు వాసన వేస్తూ మలవిసర్జన అయింది. సూక్ష్మదర్శినితో పరిశీలించగా పుప్పొడితో కూడిన గింజలు కనపడ్డాయి. ఇవి సహజంగా తేనెలో కనబడతాయి. మలం నల్లగా వుంది. రక్తంలో ఓవాలేదు. కాస్ట్స్ లేవు.

నాడి కొట్టుకోవడం 82, రక్త ప్రసరణ వేగం 90/60 10 యం.యం. వరకు డైస్టాలిక్ వత్తిడి చాలా లోతుగా వినపడుతున్నది. అలసట, బలహీనత, మూర్ఛకలిగించే విధంగా వున్నాయి. నిద్ర బాగా పట్టింది. అప్పుడప్పుడు ఎక్కిళ్లు వస్తున్నాయి. నీళ్లతో కూడిన వాంతులు, డోకులూ ఇంకా వస్తూనే వున్నాయి. ఉమ్మినీరు అధికంగా కనబడుతుంది. మూత్రం స్వచ్ఛంగా లేదు. ఆల్బ్యూమినలేదు. షుగర్ లేదు. కీట్రోనాబాడీస్ లేవు. మూత్ర పరిమాణం 4602కు 24 గంటల్లో తగ్గింది. ఉప్పునీరు వెలువడటం ఇబ్బంది కలిగించే విధంగా వుంది. ఉమ్మినీరు పరిమాణం మొత్తం 32.2 ఉమ్మినీటి గ్రంధులు విస్తరించలేదు. వాంతిని మైక్రోస్కోపుతో ముఖ్యంగా ఫోరల్ ఎలిమెంట్ తేనెలో కనబడే పుప్పొడి గింజలు కనిపిస్తున్నాయి. ఎనిమా ఉపయోగింపగా నల్లని రంగుగల పదార్థం కనబడింది. ఎనిమాలోని ద్రవం పసుపుపచ్చని రంగుతో వుంది. పొత్తికడుపులో బాధలేదు. కళ్లు గుంటలుపడ్డాయి. శరీరం ఎండిపోయింది. దగ్గు విపరీతంగా వుంది. ఏదైనా ఆధారం లేకుండా కదలలేక పోతున్నాడు.

### మధ్యాహ్నం 3 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు :-


వాంతులు, నీరు నిలవడంలేదు. ఉమ్మినీరు ఇంకా వెలువడుతునే వుంది. ఒంటిగంటకు మలంలో నల్లని మ్యూకాయిడ్ పదార్థం వెలువడింది. మళ్లీ రాత్రి

7-45 నిమిషములకు వెలువడింది. రాత్రి 8 గంటలకు పేగులు కదులుతున్న శబ్దం. అలసటతో కూడిన చూపులు నాడి కొట్టుకోవడం 78. రక్తప్రసరణ వేగం 90/70 సానుభూతి చేప్పదగ్గ ఉద్రిక్తత. నీరు తీసుకుంటే వాంతి అవుతుంది. తీసుకోకపోతే ఎక్కిళ్లు వస్తాయి. రెండూ అలసట పెడుతూన్నాయి. తలనొప్పి లేదు. త్రేపులు లేవు. ఒక డ్రాచన్ కూలిన్, ఒక చిటికెడు పొడి సిట్రాస్ ఇవ్వబడ్డాయి.

మంచినీరు, నిమ్మకాయ రసం సేవించడంతో వాంతులు అయిష్టత వృద్ధి పొందిన తరువాత శ్రీరాములు తీవ్రంగా డోకులు వచ్చాయి. అప్పుడు లేత కొబ్బరినీరు దీక్ష ప్రారంభించిన 46వ రోజు నుండి అతని దైనందిన కార్యక్రమంలో చేర్చబడింది. కష్టంతో బులుసు సాంబమూర్తి పొట్టి శ్రీరాములును బలవంతంచేసి కొబ్బరి నీళ్లు తాగించాడు.

**పొట్టి శ్రీరాములు దీక్ష ప్రారంభించిన 45వ రోజు వరకు పత్రికలుగానీ, రాజకీయ నాయకులు గాని అంతగా ప్రాధాన్యత నీయలేదు. 45వ రోజు (2-12-1952) వైద్యుల ప్రకటనా పత్రం పత్రికలలో ప్రచురింపబడి అతని పరిస్థితి విషమంగా వుందని తెలిసింది తరువాతనే కొంచెం అలజడి బయలుదేరింది.**

1952వ సంవత్సరం డిసెంబరు 3వ తేదీన ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక, "పొట్టి శ్రీరాముల ఆరోగ్య పరిస్థితి క్షీణించుచున్నది" అనే శీర్షికతో ఒక వార్తను ప్రచురించింది. (46వ రోజు) 1952వ సంవత్సరం డిసెంబరు 4వ తేదీన అదే పత్రిక క్షీణిస్తున్న శ్రీరాములు ఆరోగ్య విషయమై ఆతృత కనబరుస్తూ గతరాత్రి శ్రీ శంకర్రావ్‌దేవ్‌ను పొట్టి శ్రీరాములు పిలిపించాడని తెలిసింది. కేంద్ర శాసన సభ స్పీకర్ జి. మౌలాంకార్ నుండి డిప్యూటి స్పీకర్ అనంతశయనం అయ్యంగార్ నుండి శ్రీరాములుకు సానుభూతి లేఖలు వచ్చాయి. సత్వర ఆంధ్ర రాష్ట్ర నిర్మాణం కోసం తాము చేయవలసిందంతా చేశామని, లక్ష్యం త్వరలో నెరవేరబోతుందని కనుక దీక్ష విరమించాలనీ ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటి అధ్యక్షుడైన నీలం సంజీవరెడ్డి, యస్.శంబు ప్రసాద్ ఢిల్లీ నుంచి పొట్టి శ్రీరాములుకు తంతివార్త పంపించారు. నిరాహార దీక్షవల్ల తాను ఆశించిన ప్రయోజనం ఇంకా చేకూరలేదు. కనుక శ్రీరాములు వారికి సమాధానం



ఇవ్వలేదు. దీక్షనూ విరమించలేదు.

1952వ సంవత్సరం డిసెంబర్ 5,6,7 (నిరాహారదీక్ష పూనిన 48-49-50 రోజులు) తేదీల్లో దినపత్రికలన్నీ అతని నిరాహార దీక్షకు ప్రాముఖ్యమిస్తూ అతని ఆరోగ్య పరిస్థితి దిగజారడంపై తమ తీవ్రసంతాపాన్ని వ్యక్తంచేశాయి 6-12-1952 నాటి ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పొట్టి శ్రీరాములు జీవితాన్ని రక్షించడం కోసం తక్షణం జోక్యం చేసుకొవాలని రాజేంద్రప్రసాద్‌కు, నెహ్రూకు కాకినాడ పురపాలక సంఘ చైర్మన్ శాసన సభ్యుడైన సి.వి.కె. రావు టెలిగ్రాములు పంపాడనే వార్త ప్రకటించింది.

**8-12-1952న నిరాహార దీక్ష ప్రారంబించి 50 రోజులు అయిన తువాత భారత ప్రధాని నెహ్రూ దానిని విమర్శించాడు. మద్రాసు నగరం లేకుండా మద్రాసు రాష్ట్రంలోని వివాదగ్రస్తంకాని తెలుగు ప్రదేశాలతో సత్వరమే ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడానికి భారత ప్రభుత్వం నిశ్చయించిందని అందుకు అనుగుణంగా వారు ఒక సాధారణమైన ఒప్పందానికి రావలసి వుంటుందని ఆ మరునాడు నెహ్రూ రాజ్యసభలో ప్రకటించాడు.**

అది లోగడ ఆయన చేసిన ప్రకటనలను పునరుద్ఘాటన చేయటమే. మద్రాసు నగరానికి సంబంధించి ఎలాంటి వివాదం ఉండకూడదని, సాధారణ ఒప్పందం అంటే నూటికి నూరుపాళ్లు రాయలసీమ, ఆంధ్ర జిల్లాల వారి మధ్య అంగీకారం కుదరాలని సి. రాజగోపాలచారి ఆ ప్రకటనను వ్యాఖ్యానించాడు. నెహ్రూ

ప్రకటనపై దీక్ష విరమించాలని పొట్టి శ్రీరాములుకు చేసిన విజ్ఞప్తులన్నీ వ్యర్థమయ్యాయి. స్వామి సీతారాం నిరాహారదీక్ష చేసినప్పుడు నెహ్రూ తాను చేసిన ప్రకటనల ప్రకారం నడుచుకోలేదు. కాబట్టి ఆ విషయాన్ని గుర్తుంచుకొన్న శ్రీరాములు దీక్ష విరమించలేదు.

పొట్టి శ్రీరాములు మేనల్లుడు యన్.ఆర్. గుప్తా నెహ్రూ ప్రకటనను చదివి వినిపించాడు. శ్రీరాములు నెహ్రూ మనలను తెలివితేటలు లేనివారుగా చేస్తున్నాడు అని ప్రకటించాడు. ఆ సమయంలో ఆంధ్ర దేశంలో అక్కడక్కడా ఆందోళనలు ప్రారంభమయ్యాయి. హర్తాళులు కూడా జరిగాయి. డిసెంబరు 12, 13,14 తేదీల్లో (నిరాహారదీక్ష బూనిన 55,56,57 దినాలు) పొట్టి శ్రీరాములు పరిస్థితి పూర్తిగా దిగజారిపోయింది.


11-12-1952 (54 రోజులు) డా॥ కస్తూరి నారాయణమూర్తి రాత్రి 11 గంటలకు పొట్టి శ్రీరాములుకు వైద్యపరీక్ష జరిపాడు. 13వ తేదీ రాత్రి జరుగబోయే మెడికల్ బోర్డు సమావేశానికి ఆయన హాజరు కావలసివుంది. ఆయన స్పృహ తప్పినపుడు బి. కాంప్లెక్ ఇంజక్షన్ ఇవ్వాలనే ప్రసక్తి కూడా వచ్చింది. అప్పుడు శ్రీరాములు నారాయణమూర్తితో తన ఉపవాస నియమాలయిన ఈ క్రింది నాల్గింటిని మెడికల్ బోర్డు సభ్యులకు, సాంబమూర్తి గారికి తెలియజేయ వలసిందిగా కోరాడు.

**మొదటి నియమం - నిరాహారదీక్ష యొక్క పవిత్రతకు భంగం కలిగించే పనిని మీలో ఎవ్వరూ చేయరాదు. రెండవది - ఏదైనా చికిత్స చేయడం అవసరమనిపిస్తే భీమవరం ఆశ్రమంలో వున్న డాక్టర్ కృష్ణంరాజుతో సంప్రదించి వారేమన్నది నాకు తెలియజేయాలి. నా అనుమతిలేనిదే ఏ చికిత్సా చేయరాదు. మూడవ నియమం - నేను స్పృహ తప్పిన సందర్భంలో నా నిరాహార దీక్షకు కళంకం కలిగించే ఎలాంటి పనిని ఎవ్వరూ చెయ్యరాదు. నాలుగవ నియమం- దేశంలో అక్కడక్కడ హింసా ప్రవృత్తి చెలరేగుతున్నట్లు తెలిసింది. మహాత్మాగాంధీ సహచరునిగా నేను ప్రతి ఒక్కరినీ అహింసా సిద్ధాంతాన్ని పాటించవలసిందిగా కోరుతున్నాను.**

ఆ మరునాడే ఈ నియమాలు సాంబమూర్తి గారికి, వైద్య బృందానికి తెలియజేయబడ్డాయి.

1952 డిసెంబరు 14వ తేదీ (57వ రోజు) నాడు వైద్య పరీక్ష ముగించిన తరువాత ప్రజలంతా మీ ఆరోగ్యాన్ని మనఃపూర్వకంగా కోరుకుంటున్నారు. వారి కోరిక మేరకు దీక్ష విరమించవలసిందని డాక్టర్ నారాయణమూర్తి కొంత స్వతంత్ర్యం తీసుకొని శ్రీరాములును కోరాడు. అందుకు శ్రీరాములు తన అసమ్మతిని తెలిపాడు. మౌనం వహించి నోటిపై వేలేసుకొన్నాడు. నిశ్శబ్దంగా అతడు కళ్లు మూసాడు. ముఖ కళవళకల్లో నిరాహారదీక్షను కొనసాగించాలనే దృఢ నిశ్చయం కనిపించింది.

రేడియోలజిస్ట్ అయిన డా॥ దొరైస్వామి అతని గుండెను ఎక్స్రే ఎలక్ట్రో కార్డియోగ్రాములను తీశాడు. హృదయ సాంద్రత తగ్గినట్లు మరింత తక్కువ రూపంలో వున్నట్లు ఎక్స్రే రిపోర్టు తెలిసింది. పక్క ఎముకలు, కావికల్ వెన్నుపూసలను పరిశీలిస్తే కాల్షియం లోపించినట్లు తెలిసింది. ఇ.సి.సి. లీడ్ 1, లీడ్ 2, పిక్యు. ఆర్.యస్. కాంప్లెక్సును చూపింది. టి. తరంగాలులో ఓల్టేజిలో వున్నాయి.



పొట్టి శ్రీరాములు దీక్ష ప్రారంభించిన 58వ రోజు (15-12-1952) ఆయన వైద్యులు, శ్రేయోభిలాషులు అతడు జీవిస్తాడనే ఆశను వదులుకొన్నారు.

అతను ఆరోజు చనిపోయే వరకు కూడా నమోదు చేయబడ్డ వైద్య పరీక్ష విశేషాలిలా వున్నాయి.

ఉదయం 8-30 అతనికి విశ్రాంతి లేదు. బాగా నిద్రపోలేదు. బరువు తూచబడింది. దీక్షా ప్రారంభపు సమయంలో అతని బరువు 119 యల్.బి.యస్. (పౌండ్లు), 30-11-1952న అతని బరువు 94 యల్.బి.యస్. (పౌండ్లు) వుంది. అప్పటికే 25 యల్.బి.యస్. కోల్పోయాడు. ఇప్పటి అతని బరువు 84 యల్.బి.యస్. అంటే ఈనాటికి 35 యల్.బి.యస్. బరువు ఈ నిరాహార దీక్ష వహించిన రోజుల్లో కోల్పోయాడు. నాడి కొట్టుకోవడం నిమిషానికి 104. కంఠధ్వని పరిణామం మిక్కిలి . హీనస్థాయిన వుంది. శబ్దజ్ఞానం లోపించలేదు. శ్వాస నిమిషానికి 28 మార్లు ఉంది. రొమ్ము పడిసెంతో గాలి పీల్చడం వినిపిస్తుంది. ఉష్ణోగ్రత $97.8^0$ యఫ్.

వాంతులు తగ్గాయి. ఎక్కిళ్లు ఉమ్మినీరు అధికం కావడం తగ్గింది. నోరు తెరవలేక పోతున్నాడు. గొంతువాచి ఎర్రబడింది. అతికష్టంమీద కొంచెం కొంచెం నీరుత్రాగుతున్నాడు. నోటినుండి దుర్వాసన ప్రారంభమయింది.

16 గంటల నుండి మలమూత్ర విసర్జన జరగలేదు. ఇబ్బందిగా వుంది. మలమూత్ర విసర్జన చేసే ఉద్దేశాన్ని ప్రకటించాడు. బలవంతంగా చుక్కలు చుక్కలుగా మూత్ర విసర్జన చేశాడు. ఉదయం 2.2 మూత్రాన్ని విసర్జించాడు. 24 గంటల్లో విసర్జించిన మూత్రం 602 యస్.పి. గ్రాలిటే 10.22 ఆల్కొలైన్, అల్యామిన్ సుగర్ కనిపించడంలేదు. ఫాస్పేట్ బాగావుంది. రూసిబోన్ లేదు. వేడి వేడి ఎనిమా ఇవ్వబడింది. నిద్రలేదు. తరుచుగా స్పృహ తప్పినట్లు కనిపిస్తున్నాడు. మైకంలో తల తిప్పసాగింది. క్రమంగా పరిస్థితి విషమించింది. హఠాత్తుగా అపాయకరమైన పరిణామం తోచింది. శ్రీరాములు మనస్సు ప్రజల రహస్యపు మాటలు కూడా విని భరింపజాలని స్థితికి వచ్చింది. అతడిని చూడటానికి వచ్చే జనం లోపలకు రాకుండా శ్రీరామదేశికన్ ఆదేశించాడు.

ఆరోజు సాయంత్రం నాలుగు గంటలకు డా॥ కృష్ణంరాజు సతీ సమేతంగా వచ్చి శ్రీరాములును చూసి వెళ్లాడు. అప్పుడు ఆయన ప్రశాంతంగా వున్నాడు. సాయంత్రం 7-15కు నాడి వేగంగా కొట్టుకోసాగింది. హృదయ స్పందన బలహీనమైంది. నిమిషానికి 32 సార్లు శ్వాస ఆడసాగింది. పొత్తికడుపు స్థితి

అస్తవ్యస్తమైంది. ఎనిమా చేస్తే నీరు వెలుపలికి రాలేదు. ఆరోగ్య పరిస్థితి పూర్తిగా విషమించింది.

రాత్రి 9-45 నిమిషాములకు శీతలం పెరిగింది. హృదయ స్పందనం వినిపించడంలేదు. కల్నల్ టి.యస్. శాస్త్రి చికిత్స చేసేటప్పుడు శ్రీరాములు స్పృహ కోల్పోయాడు. వెంటనే బులుసు సాంబమూర్తి డాక్టర్లనందరినీ సమావేశపరచాడు.

ఆనాటి శ్రీరాములు ఆరోగ్యపరిస్థితి ప్రకటింపబడింది.

**శ్రీరాములు అంతిమదశ సమీపిస్తుంది. కాబట్టి రాత్రి 10 గంటలకు ప్రకటించబోయే ప్రకటన మాత్రమే చివరిది కాగలదని వైద్యులు నిశ్చయించారు. శ్రీరాములు శ్వాసలో ఎగుడు దిగుడు ప్రారంభమైంది. శ్వాసనాళంలో ఘర్షణ ప్రారంభమైంది. నాడి రెండు చేతుల్లో కూడ అందడం లేదు. ఉన్నట్లుండి శ్వాస ఆగిపోయింది. రాత్రి 11-20 నిమిషములకు గుండె ఆగిపోయింది.**

శ్వాసకు సంబంధించి సహకరించే చిన్నచిన్న నరాలన్నీ మొండాన్ని చుట్టుకొని పని చేయసాగాయి. గుండె ఆగిన 3 సెకండ్లకు శ్రీరాములు తుది శ్వాస విడిచాడు. సరిగ్గా 11 గంటల 23 నిమిషములకు పరమపదించాడు.

అప్పుడు సాంబమూర్తి, ఇంట్లో వున్న అందరు, శ్రేయోభిలాషులు ప్రేమ, విశ్వాసాలతో అతని పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని 25 నిమిషాలపాటు



రామధున్ పాడారు. అక్కడ బులుసు సాంబమూర్తి, స్వామి సీతారాం, శ్రీరామదేశికన్, యన్.ఆర్. గుప్తా (శ్రీరాములు మేనల్లుడు), డా॥ రంగయ్య (శ్రీరాములు సోదరుడు), మోతె నారాయణరావు, భాగవతుల లక్ష్మీనారామణ, డా॥ కృష్ణంరాజు, ఇ. సుబ్రమణ్యం మున్నగువారు.

1952 డిసెంబరు 16 ఉదయం దావాగ్నిలా శ్రీరాములు మరణవార్త దేశమంతటా వ్యాపించింది. దేశం నలు తెరల నుండి శ్రీరాములు అంతిమ దర్శనం కోసం జనప్రవాహం మద్రాసు నగరానికి సాగింది.


ప్రజలందరికి కడసారి అందడానికి శ్రీరాములు భౌతిక కాయాన్ని రోడ్డు మధ్యలో కూర్చున్న పద్ధతిలో ఉంచారు. ఆంధ్ర మహిళాసభ సభ్యురాండ్రు, వివిధ సంస్థల సభ్యులు సామూహికంగా అవిరాళంగా రామనామాన్ని గానం చేశారు. అనేక మంది సాంబమూర్తి ఇంటికి వచ్చి శ్రీరాములు భౌతికకాయాన్ని నమస్కరించి వెళ్లారు. వారిలో స్వామి వెంకటాచలం సెట్టి, బి. గోపాలరెడ్డి, టి. విశ్వనాథం, టి. నాగిరెడ్డి, కె. రాజగోపాలరెడ్డి, యస్. వెంకట్రాం, జి. సీతాపతి, వి. సత్యనారాయణ, వి.యల్. శాస్త్రి, బి. లక్ష్మీనారాయణ, యస్.టి.పి. పట్టాభి రామారావు (గ్రామీణాభివృద్ధి మంత్రి), డి.సంజీవయ్య (సహకారశాఖామాత్యులు) ముఖ్యులు.

## పొట్టి శ్రీరాములు అంతిమ యాత్ర

మధ్యహ్నాం రెండు గంటలకు పొట్టి శ్రీరాముల శవయాత్ర బులుసు సాంబమూర్తి గారి ఇంటి నుండి ప్రారంభమయింది. అలంకరింపబడిన ఒక రథం మీద భౌతిక కాయం ఉంచబడింది. ఆ రథాన్ని మద్రాసు పట్టణంలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు లాగారు.

ఊరేగింపు ముందుకు సాగుతుంది. దిక్కులు పిక్కటిల్లేటట్లు "మాకు ఆంధ్ర రాష్ట్రం కావాలి" అనే నినాదాలు మిన్నుమట్టాయి. ఆంధ్ర శాసనసభ్యులంతా తమతమ పదవులకు రాజీనామ చేయాలని కోరుతూ అక్కడ సమావేశమైన ఆంధ్ర విద్యార్థులంతా కరతాళధ్వనులు చేశారు. ఆంధ్ర రాష్ట్ర ప్రాచీన వైభవాన్ని తెలిపే పాటలు పాడుతూ సినీ కళాకారులు మోపరుదాసు ముందు నడుస్తుండగా శవయాత్ర ప్రారంభమైంది. రామధున్ ఘంటశాల మరియు బృందగానం

కొనసాగుతూనే ఉంది. ఇసుకవేస్తే రాలనంతటి జనం, రక్షక భటుల విధులను సులభతరం చేస్తూ క్రమశిక్షణగా ముందుకు సాగుతున్నారు. రాయపేట హైరోడ్డు వెంబడి గల ట్రాంరోడ్డు మీద ఊరేగింపు కొనసాగుతున్నప్పుడు రాకపోకలలో కొంత ఇరకాటం ఏర్పడింది, ఆంధ్ర దేశభక్తుడైన శ్రీరాముల మరణానికి విచారిస్తు నల్ల బాడ్జీలు ధరించారు. అతని శరీరంపై పూలదండలు, గులాబీలు వర్షించాయి.



శకటం మీద బులుసు సాంబమూర్తి, డా॥ కృష్ణంరాజు మోతె నారాయణ రావు, యన్.ఆర్. గుప్తా ఆయన బిడ్డలు, రంగయ్య గుప్తా, శ్రీమతి సుభద్రమ్మ కొమరవోలు), ఎర్నేని సుబ్రహ్మణ్యం, యస్. యస్. దేశికన్, శ్రీ ఘంటశాల వెంకటేశ్వరరావు, బి.యస్. శర్మ గార్లు ఆసీనులై యున్నారు.

ఊరేగింపు వెనుక భాగంలో రామకృష్ణ రాజు (మద్రాసు రాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిల్ మాజీ చైర్మన్), యం.ఆర్. అప్పారావు (కాంగ్రెస్ శాసనసభ్యులు), కార్యదర్శి, ఎ. చెన్నఘంటమ్మ, సంయుక్త కార్యదర్శి శ్రీమతి యమునాబాయి నాయకత్వంలో ఆంధ్ర మహిళా సభ్యురాంద్రు అందరూ ఉన్నారు. ఊరేగింపు రాయపేట పోలీసు స్టేషన్ దగ్గర కొంతసేపు ఆగింది. అక్కడ మోపర్రుదాసు "ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించేవరకూ ఆంధ్రుడయిన పసిబిడ్డ సహితం విశ్రమింప రాదు" అనే పాట ఆవేశంగా పాడాడు. ఊరేగింపు గోవిందప్ప నాయకర్ స్ట్రీట్ చేరింది. అక్కడ నుండి అడియప్పనాయకర్ స్ట్రీట్ గుండా పొట్టి శ్రీరాములు 2) 1952 డిసెంబర్ 17వ తేదీ నాటి ఇండియన్ ఎక్స్‌ప్రెస్ దినపత్రిక సమాచారం జన్మించిన నెం. 163 అన్నాపిళ్లై వీధి చేరింది. అక్కడ కొన్ని నిమిషాలు ఊరేగింపు నిలిచిపోయింది. అక్కడి నుండి ఊరేగింపు "ది ఎలిఫంటేట్" జిమెల్లోస్ రోడ్డు, ఉప్పుకొటర్లు, అన్నారి

స్ట్రీటు గుండా స్మశానవాటికకు చేరింది. ఆ రోజు సాయంత్రం 4–55 నిమిషములకు విజయవాడ నుండి కారులో మద్రాసు చేరిన టి. ప్రకాశం పంతులు, విజయవాడ మునిసిపల్ చైర్మన్ టి.వి.యస్. చలపతిరావు మెమోరియల్ హాల్ ఎదుట శవయాత్రలో కలిశారు. ఈ యాత్ర 4 1/2 గంటల్లో 8 మైళ్లు కొనసాగి తుదకు స్మశానవాటిక చేరింది. సాయంత్రం 7–15 నిమిషములకు చితిదగ్గరకు తీసుకొనిరాబడింది. అక్కడ గంధపు చెక్కలు కుప్పలుగా అమర్చబడ్డాయి. అర్థగంట సేపు వేదమంత్ర పఠనం జరిగింది. అతని శవాన్ని చితిపై ఉంచారు. అతని సోదరుడు రంగయ్యగుప్తా చితికి నిప్పంటించాడు.

## అంత్యక్రియల సందర్భంగా జరిగిన ఉపన్యాసాలు

స్మశానానికి చేరిన ఆంధ్ర నాయకులు అక్కడవున్న ఒక వరండాలో చేరి అంత్య కియల సందర్భంగా ప్రసంగించారు. ఘంటసాల వెంకటేశ్వరరావు ఒక ప్రార్థనా గీతాన్ని పాడారు.

టంగుటూరు ప్రకాశం ఇలా ప్రసంగించాడు

**"పొట్టి శ్రీరాములు సత్యం కోసం, అహింస కోసం, ఆత్మత్యాగం చేశాడు. మనమందరం వ్యర్థమైన రాజకీయ జగడాలలో మునిగివుంటే ఆయన ఎంతో కొంత నిజమైన గొప్పతనాన్ని సాధించాడు. సత్యం, అహింసల ఆధారంగా ఆంధ్ర రాష్ట్రావతరణ కోసం అతడు పోరాడాడు. కానీ ప్రధాని దానిని లెక్క చేయలేదు. నిరాహారదీక్షతో నమ్మకంలేని వాళ్లలో నేనొకణ్ణి. అయితే శ్రీరాములు చేసిన ఈ ఆత్మ బలీదానంవల్ల నిరాహారదీక్ష యొక్క మహత్తరమైన శక్తిని మనందరికి అర్థమయ్యేటట్లు చేశాడు.**

అతడు మనకు, భగవంతుని మార్గాన్ని చూపించాడు. ఎవరైతే పొట్టి శ్రీరాములును దీక్ష విరమించవలసిందిగా కోరారో వారంతా తమ స్వప్రయోజనాలను కాంక్షించారే కాని అతడు వివరించిన గొప్ప సిద్ధాంతాల విలువలను గుర్తించలేదు. శ్రీరాములు బలిదానం వల్ల మనం తెలుసుకోవలసింది చాలా వుంది. అతని సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకొని మనం జీవించాలి. గాంధీజీ తుపాకీ గుండుకు బలిఅయ్యాడు. పొట్టి శ్రీరాములు గాంధీజీ

సిద్ధాంతాలను ప్రచారం చేస్తూ మరణించాడు. అతడు సరియైన మార్గంలోనే నడిచాడు. కానీ నెహ్రూ అతనికి సరైనా సమాధానం ఇవ్వలేదు. అతని మరణంవల్ల కలిగిన పరిస్థితిని అసరా చేసేకొని కొందరు దుర్మార్గులు దౌర్జన్యాలకు కడుతున్నారు. అందుకు మనం సమ్మతించలేదు. నెహ్రూ తన మనస్సు మార్చుకొనేదీ తెలియాలంటే. లేనిదీ కొద్దిరోజులు ఓపికపట్టి మనం వేచిచూడాలి. అతనిలో మార్పు రానట్లయితే  మనమంతా తప్పక ఒక కార్యక్రమాన్ని నిర్ణయించుకొందాం, దాన్ని ప్రజలంతా – అధిక సంఖ్యలో ఆమోదించగలరని విశ్వసిస్తున్నాను". ఆ సమావేశం ప్రార్థనతో ముగిసింది.

**చితాభస్మం :**

17-12-1952న పొట్టి శ్రీరాముల భౌతికాయం బూడిద అయింది. ఒక పెద్ద పాత్రలో బూడిద సేకరించబడింది. అతని చితాభస్మం / భారతదేశంలో గల సముద్రాలు, పవిత్ర నదుల, సరస్సులలో చల్లడానికి మద్రాసు, నెల్లూరు, విజయవాడ, రాజమండ్రి, కాశీ, రామేశ్వరం మొదలైన నగరాలకు చేర్చబడింది. దేశభక్తుడైన శ్రీరాములు శరీరం, ఆత్మ, భారతదేశంలోని గాలి, నీరు, నేల అంతటా నిండిపోయాయి. ఆంధ్ర, ఆంధ్రేతర ప్రజలు పొట్టి శ్రీరాములు మరణంపట్ల తమతమ ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు.

**కొన్ని సంతాప సందేశాలు :**

"గాంధీ కుటుంబంలోని ఒక సభ్యుణ్ణి మనం కోల్పోయాము"
–వినోబాభావే

"ఇది సర్వోత్తమమైన త్యాగానికి ఉదాహరణం"
–మద్రాసు గవర్నర్

"అతడు గాంధీజీ శిష్యుడు సన్నిహితమైన అనుచరుడు"
–బులుసు సాంబమూర్తి

"సిద్ధాంతం ఆచరణరీత్యా అతడు నిజమైన సత్యాగ్రహి అని నిరూపించుకొన్నాడు" –స్వామి సీతారాం

"అతడు గొప్ప సంఘసేవకుడు, గొప్ప త్యాగి"
– విద్వాన్ జి. సత్యనారాయణ గుప్త

## వైజ్ఞానిక ధృక్కోణంలో శ్రీరాముల నిరాహారదీక్ష

మెడికల్ రిపోర్టు సంపాదకుడైన డాక్టర్ కస్తూరి నారాయణమూర్తి పొట్టి శ్రీరాముల దీక్షలు గురించి వైజ్ఞానికి దృక్కోణంలో ఈ క్రింది పరిశీలనాంశాలను తెలిపాడు.

విధి కబంధ హస్తాల్లో పడి మానవుడు మృత్యువును సమీపిస్తాడు. శ్రీరాములు బాహ్మ శరీరానికి సంబంధించిన అవలక్షణలు, వాంతులు మొదలైనవి అతని చరమావస్థను తెలిపాయి. కానీ ఒక అజ్ఞాత ప్రేరణ అతనిలో పొడ చూపింది. శారీరక యాంత్రిక జీవన క్రియలను పరీక్షించింది.

దీక్ష వహించిన 50వ రోజు వరకు శ్రీరాములు తన పనులు తానే చేసుకోగలిగాడు. చివరి మూడు రోజులు డాక్టర్ల సలహామేరకు పక్కమీద వున్నాడు. ఇతరులపై ఆధారపడ్డాడు. దీర్ఘకాలం పస్తులున్న వ్యక్తుల్లో సాధారణంగా నరాలు పనిచేసే పద్ధతి లోపభూయిష్టం వుంటుంది. కానీ శ్రీరాములు నరాల సహకారం ఉత్తమస్థితిలో వుంది.

గుండె పరిస్థితి బాగులేదు. నాడి మాములుగా కొట్టుకుంటూనే వుంటుంది. మెదడు, నరాలు బాగానే పనిచేస్తున్నాయి. జ్ఞాపకశక్తి, తెలివి, ఆలోచన చనిపోయేదాక బాగానే వున్నాయి.

అతని తల వెంట్రుకలు ఎండి మొద్దుబారాయి. ప్రతి రోజు గడ్డం గీయబడడం వల్ల గడ్డం వెంట్రుకలలో పై పరిస్థితి కనిపించలేదు.

అతని కళ్లు కాంతివంతంగా వున్నాయి. కాని ముడుచుకొని పోయాయి. చూపు కొంచెం తగ్గింది. చివరి కొద్ది రోజుల్లో వినికిడిశక్తి బాగానేవుంది. అందుకే చిన్న శబ్దాన్ని కూడా సహించలేకపోయాడు. శరీరం లోలోపల నుండి పోతుండడం వల్ల బాక్టీరియా పెరగలేదు. బహుశా శరీరంలో శాల్షిలిక్ ఆమ్లం తగినంతగా లేదు కాబోలు.

**శ్రీరాములు సంతోషంగా కనిపించేవాడు. తన బాధపట్ల ఉదాసీనంగా ఉండేవాడు. సదా ఉత్సాహంగా ఉండేవాడు. తనకు సంబంధించని చర్చలలో పాల్గొనేవాడు కాదు. అతని మనస్సుకు శరీరం ఎక్కువ అదుపున్నట్లు కనిపిస్తుంది. టెలిగ్రాంలు, జాబులు, దౌత్యవర్గాలు, సన్నిహితుల వేడుకోలు ఏవి అతని దీక్షను విరమింపచేయలేకపోయాయి. తుదకు తన ముద్దుల మనమరాలు బాలబాలికలతో కలిసి చేసిన విజ్ఞప్తి కూడా అతని నిశ్చయాన్ని మార్చలేక పోయింది. ఇలాంటి చారిత్రాత్మకమైన నిరాహారదీక్షవల్ల ఎవరు ఏమనుకొన్నప్పటికీ ఒక ఉత్తమ లక్ష్యం కోసం పాటుపడ్డాననే సంతృప్తి మాత్రం పొట్టి శ్రీరాములకు మిగిలింది.**


తమిళులు, ఆంధ్రులు సుహృద్భావంతో సోదరుల్లా కలిసి మెలసి జీవించడానికి నిరాకరిస్తే, శ్రీరాములు బలిదానం ప్రాముఖ్యాన్ని కోల్పోతుంది. పరిశీలించినట్లయితే జీవాత్మ అనెడి రాజ్యంలో పరమాత్మతో శరీరంలో గల చైతన్య శక్తిని గూర్చి పరిశోధించడానికి మార్గదర్శకంగా ఉంటుందని భావించ వచ్చు.

* * *

## పదవ అధ్యాయం

# ఆంధ్రరాష్ట్ర అవతరణ

పొట్టి శ్రీరాములు ఆత్మబలిదానం తదనంతరం తీవ్ర పరిణామాలు సత్వర ప్రత్యేకాంధ్ర రాష్ట్ర నిర్మాణానికి దారి తీసాయనటంలో సందేహం లేదు. ఆ త్యాగ పురుషుడు మరణించాడనే వార్త అంతటా దావానలంలా వ్యాపించింది. ఆ దుర్వార్త ప్రజలందర్నీ విభ్రాంతుల్ని చేసింది. అతని మరణానికి రెండు మూడు రోజులముందే రాష్ట్రంలో అక్కడక్కడ తలయెత్తిన దౌర్జన్య సంఘటనలు 16-12-1952 నాటికి పతాక స్థాయిని చేరుకున్నాయి. విజయవాడ రైల్వే స్టేషను అల్లరిమూకల దాడికి గురయింది. గూడ్సుపెట్టెలలోని సరుకులు దోపిడి చేయబడ్డాయి. రైళ్లు నిలిపివేయబడ్డాయి. నెల్లూరు మొదలైన పట్టణాల్లో కూడా



ఇదే పద్ధతి కొనసిగింది. ఆంధ్రరాష్ట్ర మంతటా హర్తాళులు, పికెటింగులు, ఊరేగింపులు, సంతాపసభలు, ఆవేశపూరితమైన ఉపన్యాసాలు జరిగాయి. ప్రత్యేకించి పెద్ద పట్టణాలైన విజయవాడ, నెల్లూరు, తిరుపతి, బళ్లారి మొదలైన చోట్ల పోలీసులు లాఠీచార్జీలను, బాష్పవాయు ప్రయోగాలను, తుపాకీ కాల్పులను కూడ లెక్కచేయకుండా ప్రజలు ఆందోళనలు చేశారు. రైల్వే ఆస్తులకు వాటిల్లిన నష్టం రూ. 59 లక్షలని ప్రభుత్వం అంచనాలవల్ల తెలిసింది. రాష్ట్రంలో వేరువేరు ప్రదేశాల్లో జరిగిన ఆమరణ నిరాహారదీక్ష ఆంధ్రులందర్నీ ఐకమత్యంగా ఉండేటట్లు ప్రోత్సాహించింది. ఇంతటి ఐకమత్యం ఆంధ్రుల్లో గత కొన్ని శతాబ్దాల నుండి లేదు. ఆంధ్రులంతా ఏకకంఠంగా సత్వరమే ఆంధ్రరాష్ట్ర నిర్మాణం జరగాలని ఘోషించారు. అప్పటి ముఖ్యమంత్రి సి. రాజగోపాలాచారి కుంభ కోణంలో చేసిన వ్యతిరేక వ్యాఖ్యానాలవల్ల ఆంధ్రులలో తీవ్రమైన కోపాగ్ని ప్రజ్వరిల్లింది. శ్రీరాములు ఆత్మాహుతి చేశాడన్న వార్త అగ్నికి ఆజ్యం పోసినట్లయింది.

డిసెంబరు 19వ తేదీనాటికి ఆంధ్ర జిల్లా లన్నింటిలో ప్రశాంత పరిస్థితి నెలకొల్పబడింది. భారత ప్రభుత్వం అప్పటి మద్రాసు రాష్ట్రంలో మద్రాసు నగరాన్ని మినహాయించి తెలుగు భాష మాట్లాడే ప్రాంతాలతో ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పాటు చేయడానికి నిశ్చయించిందని అందుకయ్యే ఆర్థిక విషయాలను అమలు పరచడంలో గల సాధన బాధకాలను పరిశీలించి నివేదిక సమర్పించడానికి రాజస్థాన్ హైకోర్టు ముఖ్య న్యాయాధిపతి జస్టిస్ కె. యన్. వాంచూ అధ్యక్షతన ఒక సంఘాన్ని నియమించిందని భారత ప్రధాని నెహ్రూ ప్రకటించాడు.

ఎన్నో ప్రశ్నలు ఇక్కడ తలెత్తాయి. 1952 డిసెంబరు 19వ తేదీనాడు ఆంధ్ర రాష్ట్రాన్ని భారత ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని నెహ్రూ ఎందువల్ల ప్రకటించాడు? ఈ ప్రకటననే కొద్ది రోజుల క్రిందటే చేసినట్లయితే పొట్టి శ్రీరాములు జీవితం రక్షింపబడి వుండేదికదా! తన నిశ్చయాన్ని నెహ్రూ ఎందువల్ల ఆలస్యంగా ప్రకటించాడు? తక్షణమే అతణ్ణి చర్య తీసుకునేందుకు ఏ శక్తి పురిగొల్పింది. 16-12-1952 నాడు దేశంలో చెలరేగిన హింసాపూరితమైన ఆందోళన 19వరకు చల్లారకపోవడం నెహ్రూను ప్రకటనచేసేటట్లు పురిగొల్పింది. పొట్టి శ్రీరాములు ఆత్మశక్తి, దృఢ సంకల్పం, ఆత్మబలిదానం కారణంగా నెహ్రూ

ప్రకటించి వుంటాడు. స్వామి సీతారాం రెండు పర్యాయాలు మొత్తం 55 రోజులు లోగడ నిరాహారదీక్ష చేసిన సందర్భంలో నెహ్రూ వాగ్దానాలతో దీక్ష విరమింప చేశాడు. అలాగే శ్రీరాములు దీక్షను కూడా విరమింపచేయాలని నెహ్రూ యత్నించాడు. శ్రీరాములు ఆత్మబలిదానం చేస్తాడని నెహ్రూ అనుకోలేదు. కానీ పొట్టి శ్రీరాములు తన ప్రాణాలను అర్పించి అమరజీవి అయ్యాడు.

ఈ విషయంలో గమనించదగిన ముఖ్యాంశం ఏమిటంటే నిరాహారదీక్షలు, సత్యాగ్రహాల ద్వారా రాజకీయ ఆందోళనలు జరగడం ఎంతవరకు సమంజసం? బహుశా నెహ్రూకు నిరాహారదీక్ష శక్తివంతమైందనే నమ్మకం లేకపోవచ్చు. అందువల్ల అతడు తన గౌరవం కోసం లొంగకూడదని నిశ్చయించుకొనే వుంటాడు. అయితే నెహ్రూ గాంధీజీ సిద్ధాంతాలను సమర్థించేవాడు. అందువల్ల జాతిపిత అయిన గాంధీజీ రాజకీయ లక్ష్యాలను సాధించటానికి అనుసరించిన అలాంటి పద్ధతులను నెహ్రూ తిరస్కరింపజాలడు. తన ఉన్నత లక్ష్యాన్ని సాధించడానికి గాంధీజీ దూతయైన పొట్టి శ్రీరాములు అలాంటి పద్ధతులను సహజంగానే అనుసరించాడు. భారత ప్రభుత్వం చాలాకాలం నుండి అనుసరిస్తున్న సందిగ్ధమైన పద్ధతికి అసంతృప్తి చెంది పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహారదీక్షకు పూనుకొన్నాడని మనం గ్రహించవలసింది.

ఆంధ్ర రాష్ట్రం ఏర్పరచడానికి ఆర్థిక, ఇతర సమస్యలను సరిశీలించి నివేదిక పంపటానికి నియమించబడిన జస్టిస్ కె. వాంచూ 1953 జనవరిలో ఆంధ్ర దేశంలోని ముఖ్యమైన పట్టణాలను సందర్శించాడు. అతడు ఐదువేల విజ్ఞప్తులను ఆంధ్ర ప్రజల నుండి స్వీకరించాడు. చాలామందితో ఇంటర్వ్యూలు చేశాడు. అతడు తన నివేదికను ప్రభుత్వానికి 7-2-1953 నాడు సమర్పించాడు. భారత ప్రభుత్వం ఆ నివేదికను 45 రోజులు పరిశీలించింది. తరువాత వెంటనే 25-3-1953 న నెహ్రూ ప్రకటన చేశాడు. ప్రకటన వెలువడటానికి ముందుగానే ఆంధ్ర రాజధాని నగరం తాత్కాలికంగా మద్రాసు నగరంలోనే ఉండాలన్న సూచన వెలువడింది. కొత్తగా ఏర్పడబోయే ఆంధ్రరాష్ట్రనికి రాజధానిని తాత్కాలికంగా 3 నుండి 5 సంవత్సరాలవరకు మద్రాసు నగరంలోనే వుంచాలని ఆ నివేదికలో వెలువడింది.

ఆంధ్ర రాష్ట్రపు తాత్కాలికంగా రాజధానిని మద్రాసులోనే ఉంచాలన్న

వాంచూ కమిటీ సూచనకు (ఇది కార్యరూపం ధరించలేదు) కాంగ్రెస్ పార్టీ ప్రముఖులతో కలిసి తమిళులు జరిపిన ప్రతీకారచర్యలు ఆంధ్రుల యెడల తమిళులు సవతితల్లి ప్రేమను చూపిస్తున్నారని పొట్టి శ్రీరాములు మరణించకముందు ప్రకటించిన అనుమానాన్ని బలపరచాయి. 1953 మార్చిలో 32 మంది ఆంధ్రేతరులైన పార్లమెంటు సభ్యులు మద్రాసు నగరంలో తాత్కాలిక ఆంధ్ర రాజధానిని గాని, ఆంధ్ర హై కోర్టునుగాని, ఏర్పరచటం తగదని నెహ్రూకు విజ్ఞప్తులు పంపించారు. అందులో వారు ఆంధ్ర రాజధానిని తాత్కాలికంగా మద్రాసులో వుంచటం జరిగినట్లయితే మద్రాసు నగరం ఒక రణరంగంగా తయారుకాగలదని అందువల్ల తమిళ ప్రాంతాలలో, తమిళులతో సోదరభావంగా వుంటున్న వేలాది ఆంధ్రుల మనుగడకు ముప్పువాటిల్లగలదని వారు హెచ్చరించారు. ఆంధ్రేతరులైన 153 మంది మద్రాసు శాసనసభ్యులు దీన్ని బలపరచారు.

మద్రాసులో తాత్కాలిక ఆంధ్ర రాజధానిని నెలకొల్పిన పక్షంలో నగర భవిష్యత్తు విషయమై ఎలాంటి ఆందోళనలు చెలరేగకుండా తాము చూడగలమని భారత ఉపరాష్ట్రపతి డా॥ రాధాకృష్ణన్, కేంద్ర కార్మికమంత్రి వి.వి. గిరి గార్లు ఇచ్చిన సలహాలను అంగీకరించడంవల్ల నెహ్రూ వాంఛూ కమీషన్ చేసిన ప్రతిపాదనకు సుముఖంగా వున్నట్లు కనపడింది. అయితే భారత ప్రభుత్వం వాంఛూ కమీషన్ సిఫార్సులను ఆమోదించిన పక్షంలో తాను తన పదవికి రాజీనామా చేస్తానని సి. రాజగోపాలాచారి బెదిరింపులకు దిగడంవల్ల మెలిక ఏర్పడి కథ అడ్డం తిరిగింది.

**25-3-1953 నాడు శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాలతో బళ్లారి జిల్లాలోని ఆలూరు, ఆదోని, రాయదుర్గ తాలూకాలతో కలిసి ఆంధ్రరాష్ట్రం ఏర్పడబోతున్నదని నెహ్రూ లోక్‌సభలో ప్రకటన చేశాడు. అయితే తాత్కాలిక రాజధానిని ఎక్కడ నెలకొల్పాలన్న విషయాన్ని మద్రాసు శాసనసభలో ఆంధ్ర శాసన సభ్యులు సమావేశమై నిర్ణయిస్తారని ఆ ప్రకటనలో వివరించాడు.**

ఆంధ్రరాష్ట్రానికి తాత్కాలిక రాజధానిని నిర్ణయించడం ఆంధ్ర శాసనసభ్యుల తొలి కార్యక్రమమయింది. ప్రధానమైన ఈ సమస్యలో కూడా ప్రముఖ రాజకీయ నాయకుల సిద్ధాంతపరంగా విభిన్నమైన అభిప్రాయాలను వ్యక్తంచేశారు. తిరుపతిలో రాజధానిని ఏర్పాటుచేయాలని కృషిక్ లోక్ పార్టీ సూచించింది. కమ్యూనిష్టులు తమ కంచుకోట అయిన విజయవాడను రాజధానిగా చేయాలని శాసన సభ్యుల సమావేశంలో తీర్మానం ప్రవేశపెట్టారు. శ్రీబాగ్ ఒడంబడికల ప్రకారం రాజధానిని రాయలసీమలోనే వుంచాలని రాయలసీమ శాసన సభ్యులు చాలామంది కోరారు. మద్రాసు రాష్ట్ర శాసనసభలోని ఆంధ్ర శాసనసభ్యులు 1953 జూన్ మొదటి వారంలో ఐదు రోజులపాటు సమావేశమై తుంగభద్రా నదీతీరంలో మారుమూల గల కర్నూలు నగరాన్ని తాత్కాలికంగా రాజధానిగా నిర్ణయించాడు. ఒకే ఒక్క ఓటు తేడాతో గుంటూరు, విజయవాడల మధ్య రాజధానిని ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన వీగిపోయింది.

ముఖ్యమంత్రిగా ఎవరిని ఎన్నుకోవాలన్నది కూడా ఒక విషమ సమస్య అయింది. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్ ఆంధ్ర ప్రాంతపు కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నాయకుడైన సంజీవరెడ్డి తొలి ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి కాగలడని తలచబడింది. అయితే కాంగ్రెస్ అధిష్టానవర్గం తొలి ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రిగా టి. ప్రకాశంను బలపరిచింది. తత్ఫలితంగా ప్రకాశం పంతులు తొలి ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా, నీలం సంజీవరెడ్డి ఉప ముఖ్యమంత్రిగా ఎన్నుకోబడ్డారు. భారత ప్రధాని నెహ్రూ 1953 అక్టోబరు 1వ తేదీన ఆంధ్ర రాష్ట్రావతరణకు ప్రారంభోత్సవం చేశాడు.

నూతన ఆంధ్ర రాష్ట్రం ఆంధ్ర దేశానికి సంబంధించి 40 సంవత్సరాల కాలం కొనసాగిన ఆందోళనకు ఫలితమని 58 రోజుల పాటు సాగిన పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహారదీక్షచే ఉన్నత స్థితి చెందిందని ప్రముఖ ఆంధ్ర రాజకీయనాయకుడు శ్రీ తెన్నేటి విశ్వనాథం చక్కగా వివరించాడు. మొట్ట మొదటినుంచీ ఆంధ్రోద్యమానికి సన్నిహితుడైన అయ్యదేవర కాళేశ్వరరావు ఇలా చెప్పాడు. “15-12-1952 నాడు జరిగిన పొట్టి శ్రీరాములు ఆత్మ బలిదానం ఫలితంగా మనం ఆందోళన జరిపి తుది విజయాన్ని సాధించాము. ఈ ఉద్యమం దేశం మొత్తాన్ని స్తంభింపజేయడమేకాక ఆంధ్రులపట్ల గల బాధ్యతను

గుర్తింపచేసి ప్రభుత్వాన్ని మేల్కొలిపింది. ప్రముఖ తెలుగు జర్నలిష్టు డి. ఆంజనేయులు ఇలా అభిప్రాయపడ్డాడు. "గాంధీజీ సిద్ధాంతాలననుసరించి నిరాహార దీక్షను రాజకీయ పద్ధతిని ఎవరైనా ఆమోదించినప్పటికీ, ఆమోదించక పోయినప్పటికీ ప్రజల్లో పెరుగుతున్న ఒక బలీయమైన కోర్కెను సాధించడానికి పొట్టి శ్రీరాములు ఆత్మ శక్తిని ఎవ్వరూ ప్రశంసించకుండా ఉండలేరు. ఫిల్మిండియా సంపాదకుడు, తరువాత పార్లమెంటు సభ్యుడుగా ఎన్నికైన బాబూరావు పటేల్ శ్రీరాములు మరణాన్ని గురించి తన సంతాపాన్ని ఇలా వ్యక్తం చేశాడు. స్వాతంత్ర్య పోరాటంలో పొట్టి శ్రీరాములు గాంధీజీకి విశ్వాస పాత్రుడైన సేనాధిపతి. అందువల్లనే అతడు తన నాయకునితో చాలాకాలం అత్యంత సన్నిహితంగా నిష్కపటంగా ఉత్సాహంగా ప్రవర్తించగలిగాడు. పొట్టి శ్రీరాములు గాంధేయ ప్రవర్తన లక్షణాలను పుణికి పుచ్చుకొన్నవాడు కనుక నిరాహారదీక్షను బాగా ఆలోచించే ప్రారభించాడు. గాంధీజీలాగే పొట్టి శ్రీరాములు కూడా నిరాహారదీక్షలో అనుభవం కలవాడే. లోగడ ఆయన మూడుసార్లు ఉపవాసదీక్ష చేశాడు. ఆంధ్రులకు న్యాయం చేకూర్చడానిక ఆఖరికి అసువులర్పించి అమరజీవి అయ్యాడు.

## శ్రీరాములు జీవితం - ఉద్దేశాల సారాంశం

1. భారతదేశంలో 1930వ సంవత్సరానికి ప్రాముఖ్యం వుంది. స్వతంత్రోద్యమంలో అది ముఖ్య ఘట్టం. గాంధీజీ ఈ సంవత్సరంలోనే సహాయ నిరాకరణోద్యమాన్ని ప్రారంభించాడు లక్షలాది భారతీయుల మనోభావాలకు గాంధీ ప్రారంభించిన ఉద్యమం ఉత్తేజం కలిగించింది. ఆ సందర్భంలోనే పొట్టి శ్రీరాములు స్వార్థంతో దుర్మార్గుడైన ఒక అధికారిని సేవించడమా లేక ప్రభుత్వ సేవను వదులుకొని నిస్వార్థంగా దేశసేవ చేయడమా? అని ఆలోచించాడు. ఆయన తన జీవిత ప్రారంభ దశలోనే అహంకారాన్ని వదిలివేశాడు.
2. గాంధీజీ చూపిన ఋషి నీడలో ఆయన సబర్మతీ ఆశ్రమ వాసిగా మూడు సంవత్సరాలు గడిపాడు. నూటికి నూరుపాళ్లు గాంధేయుడై ఆయన విశ్వాసపాత్రుడయ్యాడు.

3. 1934వ సంవత్సరం జనవరి 15వ తేదీన ఉత్తర బీహారు ప్రాంతంలో భయంకర భూకంపం సంభవించగా బాధితులకు ఎంతో సేవచేశాడు.
4. నియమబద్ధంగా జీవించాలనే కోరికతో ఆయన సత్యాగ్రహ ఆశ్రమంలో చేరాడు. పటేల్ స్థాపించిన శ్రమజీవి సంఘంలో చేరాడు. "కాయ కష్టం చేసి జీవించడంలోనే పరమార్థం వుంది" అనేది పై ఆశ్రమ సిద్ధాంతం. ఎర్నేని సుబ్రహ్మణ్యం కృష్ణా జిల్లాలో నడుపుతున్న గాంధీ ఆశ్రమంలో కూడా కొంతకాల పని చేశాడు.
5. క్విట్ ఇండియా ఉద్యమం జరుగుతున్న సమయంలో పొట్టి శ్రీరాములు స్వాతంత్రదినం (26-1-1943) నాడు జాతీయ జెండాను గుడివాడలో ఎగురవేసి బ్రిటిష్ పాలనపై తనకుగల ద్వేషభావాన్ని ప్రకటిస్తూ నినాదాలు చేశాడు. తత్ఫలితంగా ఆరు నెలలు జైలు శిక్ష పొందాడు. అక్కడి నుండి రాజమండ్రి సెంట్రల్ జైలుకు, అక్కడి నుండి బళ్లారి సెంట్రల్ జైలుకు పంపబడ్డాడు.
6. 1944 సంవత్సరము నుండి శ్రీరాములు గాంధీజీ అడుగుజాడల్లో స్వయంగా కృషి చేశాడు. 2-10-1944 గాంధీ జన్మదినోత్సవం నాడు అస్పృశ్యతకు వ్యతిరేకంగా కావలిలో ప్రచారం ప్రారంభించాడు.
7. సవర్ణ హిందువులు విమర్శించినా ఆయన నెల్లూరులో భంగీ కాలనీలో నివసించాడు. కులాంతర విందుల నిర్వహణకోసం వీధుల్లో తిరిగి బిచ్చమెత్తి బియ్యం సేకరించాడు. సేకరించిన పదార్థాలతో 24-6-1943న, 15-7-1945న కులాంతర విందు భోజనాలను ఏర్పాటు చేశాడు.
8. సంఘ పునర్నిర్మాణంకోసం శ్రీరాములు ఆర్యసమాజం, హిందూ మహాసభకు చెందిన ప్రముఖులతో చర్చించి, నెల్లూరులో హిందూ సంఘసంస్కరణ సమితి అనే ధార్మిక సంఘాన్ని స్థాపించాడు.
9. 7-3-1946 నుండి 19 రోజులు నిరాహారదీక్ష చేసి నెల్లూరు వేణుగోపాల స్వామి ఆలయంలోనికి హరిజనులను ప్రవేశపెట్టి లక్ష్యాన్ని సాధించాడు.
10. రాష్ట్రంలోని దేవాలయలన్నింటిలో హరిజనులకు ప్రవేశం కలిగించే బిల్లును ఆమోదింపజేయడానికి 25-11-1946 నుండి 19 రోజుల నిరాహారదీక్ష చేశాడు.

11. హరిజనోద్ధరణకు పాటుపడుతూనూ ఇతర స్థానిక సమస్యల పరిష్కారానికి పూనుకొన్నాడు. ఖాదీ ప్రచారం, నెల్లూరు మునిసిపల్ పనివారి సమస్యలు, మద్యపాన నిషేదం, బొంబాయి దురంతాలు, బిక్షకసమస్య, జైళ్ల సంస్కరణలు, వివాహ సంస్కరణలు మొదలైనవాటి పరిష్కారానికి కృషి చేశాడు.
12. గాంధేయుడైన శ్రీరాములు జాతిపిత మరణానంతరం ఆయన స్మృతికై ఒక ప్రణాళికను సిద్ధంచేశాడు. కానీ అతని ప్రతిపాదనలను మద్రాసు ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. తత్ఫలితంగా ఆయన 25-7-1948 నుండి మద్రాసు ప్రభుత్వ ముఖ్యమంత్రి భవనం ముందు నిరాహారదీక్ష ప్రారంభించి న్యూసెన్స్ ఆక్టుక్రింద ఒక నెలరోజులు జైలుశిక్ష అనుభవించాడు.
13. నెలకొకరోజు గాంధీ స్మారకదిన కార్యక్రమాన్ని అమలుపరచాలని కోరుతూ 12-1-1949 నుండి సేవాగ్రాం ఆశ్రమంలో దీక్ష ప్రారంభించి 28 రోజుల నిరాహార దీక్ష చేశాడు. అప్పటి ప్రధాని గాంధీ స్మారక దినోత్సవం జరపడానికి అంగీకరించాడు.
14. ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ నిర్మాణ కార్యక్రమ సంచాలకుడుగా పొట్టి శ్రీరాములు చాలా గడ్డు సమస్యలను ఎదుర్కొని విజయం సాధించాడు.
15. ఆంధ్ర రాష్ట్ర గాంధీ స్మారకనిధి సంచాలకుడుగా శ్రీరాములు విధి నిర్వహించి పొదుపు పాటించి అనేక కార్యక్రమాలు నిర్వహించాడు.
16. ఎంత కృషిచేసినా ఎన్ని ఇబ్బందులు అనుభవించినా తాను తలపెట్టిన నిర్మాణ కార్యక్రమాలు విజయవంతం కాకపోవడానికి కారణం ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం లేకపోవడమేనని గ్రహించాడు.
17. నిరాహారదీక్ష చేసేటప్పుడు తన వ్రతాన్ని భంగం చేయవద్దని, అతని నిరాహారదీక్ష అపస్మారకస్థితిలో కూడ తనకు కృతిమంగా ఆహారం ఇవ్వవద్దని కోరాడు. అంతటి పవిత్రమూర్తి శ్రీరాములు.

## పొట్టి శ్రీరాములు ముఖ్య లక్ష్యాలు ఇతడు సాధించిన కార్యాలు

**పొట్టి శ్రీరాములు విజ్ఞానఖని, పండితుడు, వేదాంతీ కాదు. ఆయనకు లభించిన విజ్ఞానం పుస్తకాలు నేర్పిందికాదు. బాపూజీ సాహచర్యంవల్ల, జీవితానుభవం వల్ల జ్ఞానాన్ని సాధించాడు. సామాన్యులకు విజ్ఞానాన్ని అందించి ప్రజల మనిషి అయ్యాడు. అందరికీ అర్థమయ్యేలాగా సరళభాషలో మాట్లాడేవాడు. ఏ విషయంలోనూ అనవసర వాదనలకు దిగడం అతనికి నచ్చదు. ప్రసంగాల్లో ప్రామాణిక వాక్యాలను అరుదుగా ప్రయోగిస్తాడు. ఈయనకు కలిగిన ఉత్తమాశయాన్ని అమలులో పెట్టడానికి ప్రయత్నించే వాడు.**

ఇలా చేయాలని ఇతరులని కూడా ప్రోత్సాహించేవాడు. తన పథకాలను ఉద్దేశ్యాలను క్లుప్తంగా
వివరించేవాడు.

సంఘ సంస్కర్తగా శ్రీరాములు అనేక సమస్యలతో సంబంధం పెట్టుకొన్నాడు. ఒక్కొక్కసారి. ఒక్కొక్క సమస్యకు ప్రాధాన్యం ఇచ్చాడు. శ్రీరాములు జీవితంలోని భౌతిక, ఆధ్యాత్మిక రూపాలను, వైయక్తిక సామూహిక రూపాలను సమన్వయం చేసుకున్నాడు. అందుచేత అతనికి రెండు మార్గాలతో సంబంధం వుంది. సత్యాహింసలతో కూడుకొన్న అతని రాజకీయార్థిక సిద్ధాంతాలు గందరగోళంగా ఉంటాయని సోషలిస్టులు, కమ్యూనిష్టులు, కాంగ్రెస్‌వారు కూడా విమర్శిస్తారు. ప్రజలను రాజకీయార్థిక దాస్యాలనుండి విముక్తిలను చేయాలిగాని నైతికాధ్యాత్మిక విషయముల వల్ల లాభంలేదని వారి నమ్మకం. కానీ నిజమైన గాంధేయుడైన శ్రీరాములు దేశ రాజకీయ మూల భౌతిక సిద్ధాంతాలకు, నైతిక సిద్ధాంతాలకూ స్వాభావికమైన సంఘర్షణ లేదనీ అభిప్రాయపడ్డాడు. సహజంగా ఆయన రాజకీయాలను ఆధ్యాత్మిక పరంగా ఆలోచించాడు. చివరకు తన జీవితాన్ని అర్పించి రాజకీయ సమస్యకు నైతిక పరిష్కార మార్గాన్ని కనుగొన్నాడు.

శ్రీరాములు ఆత్మత్యాగానికి ప్రాముఖ్యమిచ్చి రాజకీయ సమస్య పరిష్కారానికి ఆధ్యాతిక మార్గాన్ని అనుసరించాడనడం సమంజసం కాదు. ఈ వాదం చారిత్రకంగా నిలిచేదికాదు. ఉదాహరణకు భారత జాతీయోద్యమంలో ఎంతో

మంది ఆధ్యాత్మిక పద్ధతులనే అవలంభించారు. మహాత్ముని జీవితాన్ని ప్రధాన తార్కాణంగా పేర్కోనవచ్చు. ఇతర నాయకులు ఐచ్ఛికంగా ఉరికంబా లెక్కారు. ప్రజల్లో నైతికంగా పతనావస్థ సంభవించినప్పుడు గాంధీ వంటి మహాత్ములను అనుసరించే రాజకీయ నాయకులు కూడా ఏ త్యాగమూ చేయకుండా, బాధలు పడకుండా ఆ అవకాశాల ద్వారా ప్రయోజనాలను సాధించాలని ప్రయత్నించారు. అలాంటి పరిస్థితుల్లో శ్రీరాములు వంటి నిష్కళంక దేశభక్తులు పరిస్థితులను మార్చడానికి ఆధ్యాత్మిక ఆత్మత్యాగ పద్ధతులు అనుసరించాలని విమర్శించడం విజ్ఞత కాదు.

ఇక ముగింపు విషయానికొస్తే ఇటీవల భారతదేశంలో పేరు ప్రఖ్యాతులు గాంచిన దేశ నాయకులవలె శ్రీరాములు కూడా బాపూజీ నడిపిన స్వతంత్ర సంగ్రామంలో ప్రముఖ పాత్ర వహించాడు. బాపూజీ ఒక ప్రవక్త అయితే శ్రీరాములు అతని సిద్ధాంతాలను ప్రచారం చేసిన దూతగా చెప్పవచ్చు. గాంధీజీ సిద్ధాంతాలను కట్టుబడి శ్రీరాములు సిద్ధాంతాలనూ, కార్యక్రమాలనూ రూపొందించుకొన్నాడు. గాంధేయ మార్గంలో నిరశన వ్రతాన్ని చేశాడు. గాంధీజీలో దోషంవుంటే శ్రీరాములలో కూడా దోషం ఉన్నట్లే. అలాగయితే ప్రత్యేకాంధ్రరాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్షకు పూనుకొవడంలో శ్రీరాములు దోషం లేదు.

## ఉపసంహారం

ఆంధ్ర రాష్ట్రం అవతరించడానికి తదుపరి భారతదేశంలో భాషా ప్రయుక్త రాష్ట్ర ఏర్పడటానికి ప్రధాన కారకుడైన పొట్టి శ్రీరాములును భారతీయులంతా విశేషించి ఆంధ్ర, కర్నాటక, మళయాళ, మహారాష్ట్ర ప్రజలు మిక్కిలి ప్రశంసిస్తారు. శ్రీరాములు పవిత్ర జీవితంతో ప్రభావితులైన ప్రజలు అతని జ్ఞాపక చిహ్నంగా సేవా కార్యాలను చేపట్టారు. ఇందుకు ప్రథమంగా ఆంధ్రులే నాయకత్వం వహించారు. ఇతరులు అనుసరించారు. తమకు గల అభిమానాన్ని అనేక మార్గాలలో వ్యక్తపరచారు. ఆంధ్రదేశంలోని నలుమూలల్లోనే గాక ఇరుగుపోరుగు రాష్ట్రాలయిన తమిళనాడు, కర్ణాటకలలో కూడా వందలు వేలాదిగా అతని నిలువెత్తు శిలావిగ్రహాలు ప్రతిష్టించబడ్డాయి. అతని పవిత్ర స్మారక చిహ్నాలుగా

ఎన్నో పాఠశాలలు, కళాశాలలు, గ్రంథాలయాలు, అనుపత్రులు, అనాథాశ్రమాలు మొదలైన విద్యాధార్మిక సంస్థలు దేశంలో అనేక చోట్ల నెలకొల్ప బడ్డాయి. తోటి ప్రజల్లో సోదరభావం మాతృదేశ సేవాభావం పెంపొందింప




జేయడానికి అతని మహోన్నత కార్యాలు, జీవిత సంఘటనలు ప్రభుత్వం వారిచే విద్యార్థుల పాఠ్యాంశంలో భాగాలుగా చేర్చబడ్డాయి. ఆంధ్ర ప్రభుత్వం వారు శాసనసభా భవనంలో ఈతని ఛాయచిత్రపటాన్ని నెలకొల్పారు. అలాంటి ఛాయచిత్రాలను ముద్రించి అతని అభిమానులైన వారికి అందించారు. ప్రతి సంవత్సరం ఆయన జయంతి, వర్ధంతి ఉత్సవాలు కొనసాగాయి. ఆ ఉత్సవాల్లో విద్యావంతులకు అతని యెదుట తమకుగల భక్తి శ్రద్ధలను వ్యక్తం చేసుకోవడానికి సామాన్యులకు ఆ మహానుభావుని జ్ఞాపకం చేసుకోవడానికి అవకాశం కల్పించబడింది.

బ్రిటిష్వారి నిరంకుశత్వానికి ఎదురుతిరిగి, సైమన్ కమీషన్ రాక సందర్భంలో జాతీయ జెండాను ఎగురవేసినవారిని కాల్చివేస్తామని ప్రకటించగా "నన్ను కాల్చండని ఛాతిచూపిన ప్రకాశం పంతులు ఆంధ్రకేసరిగా గణనకెక్కారు. ఆంధ్రులు గర్వించతగ్గ వ్యక్తి ఆంధ్రకేసరి. ఆయన జన్మస్థలమైన ఒంగోలు జిల్లాను ప్రకాశం జిల్లాగా మార్చి, ప్రభుత్వంవారు తగిన నివాళినర్పించింది. అదే పంథాలో తన కార్యస్థానానికి ప్రధాన కేంద్రమైన నెల్లూరును పొట్టి శ్రీరాములు జిల్లాగా మార్చాలని విజ్ఞులెందరో అభిలాశిస్తున్నారు. అనేక విజ్ఞప్తులు చేశారు. రాష్ట్ర ప్రభుత్వము ఈ విషయమును సహృదయంతో పరిశీలించి అనతికాలంలో ఈ నెల్లూరు జిల్లాను అమరజీవి జిల్లాగా మార్చి ప్రకాశం పంతులుగారి వలెనే త్యాగమూర్తి శ్రీరాములుకు తగిన నివాళి నర్పించగలదని హృదయ పూర్వకంగా ఆశిస్తున్నాను.

సమాప్తం

* * *



ఆంధ్రపత్రిక

# ఆంధ్రరాష్ట్ర సాధనకు శ్రీరాములుగారి ప్రాణార్పణ

## ప్రాయోపవేశం 58వ రోజు-రాత్రి 11-23 గంటలకు నిర్యాణం

## 'తమ నమ్మినదానికై పరమ పావనమైన త్యాగం చేశారు'

డాక్టర్ రాధాకృష్ణ ప్రశంస

## మంగళవారం చెన్నపురి లోనే అంత్యక్రియలు

పురవీధులలో ఊరేగింపు: ఆంధ్ర మహాజనుల భక్త్యంజలి

శ్రీరాములుగారి మరణమునకు ఆంధ్ర ప్రజసంతాపం: రాష్ట్రమంతటా హర్తాళ్లు

'శ్రీ రామ నిర్యాణం'

# ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వారికి విజ్ఞప్తి

1. పొట్టి శ్రీరాములు గారి స్వగృహమును రాష్ట్ర స్మారకముగా నిర్మించి, నిర్వహించి ముందు తరాల వారికి, వారి జీవిత కార్యమును తెలియ జేయాలి.
2. 16 మార్చి పొట్టి శ్రీరాములు పుట్టిన రోజును ప్రభుత్వము సెలవు దినముగా ప్రకటించాలి.
3. ప్రతి జిల్లా కేంద్రాలలో మరియ పట్టణాలలో పొట్టి శ్రీరాములు విగ్రహన్ని ప్రతిష్టించాలి.
4. ఒక్క వీధికైనా పొట్టి శ్రీరాములు వీధి అని పేరు పెట్టాలి.
5. పొట్టి శ్రీరాములు పేరు విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పాలి.
6. పొట్టి శ్రీరాములు అవార్డులను ప్రకటించి రాష్ట్రానికి వివిధ రంగాలలో కృషి చేసిన వారికి ఇవ్వాలి.
7. పొట్టి శ్రీరాములు చరిత్రను పాఠ్య పుస్తకాలలో చేర్చి విద్యార్థులకు తెలియునట్లు చేయాలి.
8. పొట్టి శ్రీరాములు చరిత్ర స్వల్ప ధరలకు వివిధ భాషలలో ప్రచురించి ప్రచారము చేయాలి.
9. జిల్లా కేంద్రాలలో పార్కులు మొదలగు వాటికి పొట్టి శ్రీరాములు పేరు పెట్టాలి.

**– డా. బాదం శ్రీరాములు**

# Karnatak University
## Dharwad

**We**, the Chancellor, Vice-Chancellor and Members of the Senate of the Karnatak University certify that

the Degree of

# Doctor of Philosophy

(Political Science)

has been conferred on the fifth day of the month of December in the year one thousand nine hundred and eightythree at Dharwad, on

...................................................................................................................

B. Sreeramulu ..................................................................... who has


been found duly qualified for the same.

**In Testimony** whereof are set the Seal of the said University and the Signature of the Chancellor.


[signature]

Chancellor


## అమరజీవి (పొట్టి శ్రీరాములు జీవిత చరిత్ర) డా. బాదం శ్రీరాములు




పొట్టి శ్రీరాములు వంటి నిస్వార్థపరులైన దేశభక్తులు పది పన్నెండు మంది నా అనుచరులుగా ఉంటే స్వరాజ్యాన్ని ఏనాడో సాధించి ఉండేవాణ్ణి **– గాంధీజీ**



గాంధీ కుటుంబంలోని ఒక సభ్యుణ్ణి మనం కోల్పోయాము
**-వినోబాభావే**



ఇది సర్వోత్తమమైన త్యాగానికి ఉదాహరణం
**-శ్రీ శ్రీ ప్రకాశ,**
మద్రాసు గవర్నర్



అతడు గాంధీజీ శిష్యుడు సన్నిహితమైన అనుచరుడు
**-బులుసు సాంబమూర్తి**



సిద్ధాంతం ఆచరణరీత్యా అతడు నిజమైన సత్యాగ్రహి అని నిరూపించుకొన్నాడు
**-స్వామి సీతారాం**



పొట్టి శ్రీరాములు గారు ఆంధ్రరాష్ట్రం కోసం, ఆంధ్రా నాయకుల సమైఖ్యం కోసం 58 రోజులు అమరణ దీక్షకు వుద్యమించి, 1952 డిసెంబర్ 15వ తేదీన అమరజీవి అయినారు! మహాత్మా గాంధీ భారత స్వాతంత్ర్యాన్ని సాధించితే, పొట్టి శ్రీరాములు గారు ఆంధ్రరాష్ట్రాన్ని సాధించారు. **– పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు**



ఈ పుస్తకం ద్వారా పొట్టి శ్రీరాములు గారి జీవితం, కృషి, మరియు త్యాగం గురించి తెలుసుకోవడం మనందరికీ ఒక ఆధ్యాత్మిక ప్రయాణం అవుతుందని ఆశిస్తున్నాను. ఆయన జీవితం మనకు స్ఫూర్తి పంచడమే కాకుండా, సమాజం పట్ల మన బాధ్యతలను గుర్తు చేస్తుంది. **– వి.వి. లక్ష్మీనారాయణ**



అమరజీవి పొట్టి శ్రీరాములు గారు ఆయన జీవితాన్ని ఎన్నో ఉన్నతాశయాలను మలచడానికి వెచ్చించారు. జాతీయోద్యమంలో కూడా పాల్గొన్నారు. ఆయన త్యాగం భారతీయ సంస్కృతి సమాజంలో సాహసానికి, అహింసా సిద్ధాంతానికి శాశ్వత గుర్తింపుగా నిలిచి ఉంది. **– ప్రొ. టి. రేవతి**